# శ్రీ విష్ణు సహస్రనామ స్తోత్రము

# వివరణ



## శ్రీ నరసింహన్ కృష్ణమాచారి ఆంగ్ల రచనకు

## తెలుగు అనువాదం – కాజ సుధాకర బాబు

## 1వ భాగము

**Sri Vishnu Sahasra Nama Stotram**

Annotated commentary by : Sri Narasimhan Krishnamachari

Telugu Translation by : Kaja Sudhakara Babu

Volume-1

**శ్రీ విష్ణు సహస్రనామ స్తోత్రము వివరణ**

శ్రీ నరసింహన్ కృష్ణమాచారి ఆంగ్ల రచనకు

తెలుగు అనువాదం – కాజ సుధాకర బాబు

**Sri Vishnu Sahasra Nama Stotram**

Annotated commentary by : Sri Narasimhan Krishnamachari

Telugu Translation by : Kaja Sudhakara Babu


This work is published under

**Creative Commons Non-Commercial License**

The above license applies only to my translation, which is done with permission from the original author, Sri N. Krishnamachari.

Excerpts from other works reproduced in this work are not covered in the above license. Main examples of such reproductions are

(a) Telugu Translation of Bhagavdgitha Slokas, which are taken from the publication of Gita Press, Gorakhpur

(b) Excerpts from book of Sri Pemmaraju Rajarao (Especially translation of Purva Peethika)

(c) Excerpts from the book of Dr. Krovi Partha Saradhi

(d) Excerpts from other works which are mentioned in appropriate places.

All Photographs and pictures are by me (Kaja Sudhakara Babu) or taken from free sources such as Wikipedia.


Cover Photo:

Sculpture at Dwaraka Thirumala, West Godavari District, Andhra Pradesh.

**శ్రియై నమః**

**ఓం నమో వేంకటేశాయ**

# శ్రీ విష్ణు సహస్రనామ స్తోత్రము - వివరణ

## ముందుమాట.

చదువరులకు నమస్కారము. శ్రీ విష్ణు సహస్రనామ స్తోత్రమునకు శ్రీ నరసింహన్ కృష్ణమాచారిగారు ఆంగ్లంలో వ్రాసిన వ్యాఖ్యను వారి అనుమతి తీసుకొని నేను తెలుగులో వ్రాశాను. 5 ఫిబ్రవరి 2005న ప్రారంభించిన ఈ వ్రాత కార్యక్రమాన్ని 17 సెప్టెంబర్ 2011న పూర్తి చేశాను. 6/10/2011 నుండి 19/9/2014 వరకు కంప్యూటరులో టైపు చేయడం పూర్తయ్యింది. ఇందులో నా పరిజ్ఞానం ఏమీ లేదు. ఇది ప్రధానంగా శ్రీ కృష్ణమాచారి ఆంగ్లరచనకు అనువాదం అయినా, ఇతర తెలుగు పుస్తకాలనుండి కొన్ని విషయాలు కాపీచేశాను. వానినన్నింటినీ ఆయా సందర్భాలలో పేర్కొన్నాను. ఇందుకు ఆ రచయితలనుండి నేను అనుమతి తీసుకొనలేదు. కాని ఇది వాణిజ్యప్రచురణ కాదు గనుక వారు మన్నిస్తారని ఆశిస్తున్నాను.

**నా పరిచయం**

నేను వృత్తిరీత్యా ఎలక్ట్రికల్ ఇంజినీరును. మా స్వగ్రామం పశ్చిమగోదావరి జిల్లా పెదవేగి. ప్రస్తుతం నేను ఉద్యోగరీత్యా ఒమన్ దేశంలో మస్కట్ నగరంలో ఉంటున్నాను. నా తల్లిదండ్రులు శ్రీయుతులు సరోజినీదేవి, రామానుజరావు గార్లు. సోదరులు శేషుబాబు, మురళీకృష్ణ. నా శ్రీమతి పేరు భూలక్ష్మి. పిల్లలు రవికిరణ్, అపర్ణ.

భగవన్నామస్మరణవలన శుభం కలుగుతుందనే భావంతో ఈ రచనను ప్రారంభించాను. నేను హైస్కూలువరకు తెలుగులో చదువుకొన్నాను. గురువులనాశ్రయించలేదు. సాధన చేయలేదు. పుణ్యకావ్యాలు చదువలేదు. సంప్రదాయం తెలియదు. కనుక నా రచనలలో ఉన్న అనేక దోషాలను విజ్ఞులు మన్నించాలని వేడుకొంటున్నాను.

ఈ ప్రతిని www.sadagopan.org వెబ్ సైటులో ప్రచురించడానికి సిద్ధం చేశాను. అందుకు అంగీకరించిన సైటువారికి ధన్యవాదములు.

**కాజ సుధాకర బాబు**

kajasb@gmail.com

మస్కట్, ఒమన్ - 8 డిసెంబరు 2014.

# శ్రీ విష్ణు సహస్ర నామములు - పరిచయము

## ఉపోద్ఘాతము

శ్రీ విష్ణు సహస్రనామ స్తోత్రము ఆవిర్భవించిన పరిస్థితులు పరిశీలిస్తే ఎంతో ఆసక్తికరంగా ఉంటాయి. కురుక్షేత్ర యుద్ధంలో వాటిల్లిన జనక్షయం, కష్టనష్టాలు, దుఃఖాలవలన పాండవాగ్రజుడైన యుధిష్ఠిరుడు క్రుంగిపోయి ఉన్నాడు. ఇంకా తన వంశోన్నతిని కోరిన ప్రియమైన తాత భీష్ముడు మరణశయ్యపై ఉన్నాడు. నీతి, ధర్మము, భక్తి తోడుగా సాగిన భీష్మాచార్యుని సుదీర్ఘ జీవనయాత్రలో అర్జించిన అనితర జ్ఞాన సంపద ఆయనతోనే అంతరించిపోనున్నది.

తన అన్ని సందేహాల నివృత్తి కొఱకై భీష్ముని ఆశ్రయించమని నీతి కోవిదుడు, ధర్మతత్పరుడు అయిన యుధిష్ఠిరుని వేదవ్యాస మహాముని, శ్రీకృష్ణ భగవానుడు ఆదేశించారు. వారి ఆదేశానుసారం భీష్మునికి, యుధిష్ఠిరునికి మధ్య ఎన్నో సంభాషణలు సాక్షాత్తు శ్రీకృష్ణపరమాత్ముని మరియు వేద వ్యాసాది మునుల సమక్షంలో సమక్షంలో జరిగాయి.

అటువంటి సంభాషణలో ఒకసారి – మానవులకు అన్ని బంధములనుండి, దుఃఖములనుండి విముక్తిని కలిగించి, తరగని శాంతిని, ఆనందమును ప్రసాదించే మార్గాన్ని ఉపదేశించమని యుధిష్ఠిరుడు భీష్ముని కోరాడు. ఈ ప్రశ్నయే శ్రీవిష్ణు సహస్రనామ స్తోత్ర మహామంత్రానికి నాంది. సకల జనుల సౌభాగ్యమే దీని లక్ష్యము. యుధిష్ఠిరుడు, భీష్ముడు కలిసి మనకు ప్రసాదించిన పెన్నిధి ఇది.

## స్తోత్ర ఆవిష్కరణ

పూర్వ పీఠికలోని ఈ శ్లోకము శ్రీ విష్ణు సహస్రనామ స్తోత్రములోని కొన్ని ముఖ్య అంశములను తెలియజేస్తుంది.

**ఋషిర్నామ్నాం సహస్రస్య వేదవ్యాసో మహామునిః |**

**ఛందోఽనుష్టుప్ తథా దేవో భగవాన్ దేవకీసుతః ||**

ఈ స్తోత్రానికి ఋషి వేదవ్యాసుడు – భీష్మ పితామహులు యుధిష్ఠిరునకు ఉపదేశించిన సహస్ర నామాలను ఆయన ఛందో బద్ధం చేశారన్నమాట. దీని ఛందస్సు 'అనుష్టుప్' (అర్ధ పాదానికి ఎనిమిదిమాత్రలు. పాదానికి 16 మాత్రలు.) దేవకీ సుతుడైన శ్రీకృష్ణుడే ఈ స్తోత్రము ద్వారా స్తుతింపబడిన దేవుడు.

వేదాలను విభజించిన శ్రీ వేదవ్యాసుని శ్రీమహాభారత పుణ్యగ్రంధములోని భాగాలే శ్రీ మద్భగవద్గీత మరియు శ్రీ విష్ణుసహస్రనామస్తోత్రము కూడాను. శ్రీ విష్ణు సహస్రనామ స్తోత్రానికి 40 పైగా వ్యాఖ్యలున్నాయి. శ్రీ ఆదిశంకరుల వ్యాఖ్య అన్నింటికంటే ఆద్యము. శ్రీభగవద్రామానుజుల శిష్యులైన శ్రీ పరాశర భట్టు గారు విస్తారమైన వ్యాఖ్యానాన్ని రచించారు. ద్వైత మార్గానువర్తియైన శ్రీ సత్యసంధ యతిరాజతీర్థులవారు మరొక ప్రముఖ వ్యాఖ్యానకర్త. శ్రీ శంకరులు రచించిన (భగవద్గీత, బ్రహ్మసూత్రములు వంటివాని) వ్యాఖ్యానాలలో శ్రీ విష్ణుసహస్రనామ స్తోత్ర వ్యాఖ్యానం మొట్టమొదటిది. "**గేయం గీతా నామసహస్రం**" అని, ఆయన భజగోవిందస్తోత్రంలో శ్రీ విష్ణు సహస్రనామ స్తోత్ర పారాయణామహాత్మ్యాన్ని తెలియజేశారు. ఈ స్తోత్ర ప్రశస్తిని గ్రహించడానికి ఆరు ముఖ్య కారణాలు చెప్పబడుతున్నాయి.

1) ఇది మహాభారత సారము
2) నారదాది మహాభాగవతులు, ఆళ్వారులు, త్యాగరాజాది గేయకారులు తమ భక్తికావ్యాదులలో మరల మరల శ్రీమహావిష్ణువుయొక్క సహస్రనామాలను ప్రస్తావించారు.
3) విష్ణుస్వరూపుడూ, వేదజ్ఞానానికి ఆద్యుడూ అయిన శ్రీ వేదవ్యాసుడే స్వయంగా ఈ స్తోత్రాన్ని ఛందోబద్ధం చేసి మనకందించాడు. (**వ్యాసాయ విష్ణురూపాయ, వ్యాసరూపాయ విష్ణవే నమో**...)
4) ఇది ధర్మములలోకెల్ల ఉత్తమమూ, సులభమూ, సకల కర్మబంధవిముక్తి సాధనమూ అని భీష్మపితామహులు సెలవిచ్చారు.
5) ఈ స్తోత్ర పారాయణము దుఃఖములను దూరం చేసి శాంతినీ, సంపదలనూ అందిస్తుందని విస్తృతమైన విశ్వాసము.
6) భగవద్గీత, నారాయణీయము వంటి పుణ్య గ్రంధాలలో చెప్పబడిన విషయాలు ఇందుకు అనుగుణంగాఉన్నాయి.

ఈ స్తోత్ర ఆవిష్కారానికి కారకులైన మహాత్ములను స్మరిస్తే ఈ కారణాల బలము మనకు మరింతగా అవగతమవుతుంది. ఎవరి కృప వలన శ్రీ విష్ణుసహస్రనామస్తోత్ర పారాయణాభాగ్యము మనకు లభించింది? అడిగినవాడు సామాన్యుడు కాడు. అడగమని చెప్పినవాడు సామాన్యుడు కాడు. అడిగినంతనే సెలవిచ్చినవాడు సామాన్యుడు కాడు.

గంగాసుతుడైన భీష్ముడు జితేంద్రియుడు. ప్రతిజ్ఞాపాలకుడు. శ్రీకృష్ణపరమాత్మ పట్ల అచంచలమైన భక్తిచే పునీతుడైనవాడు. ఇంక యుధిష్ఠిరుడు ధర్మనందనుడు. న్యాయ, ధర్మ, నీతి మార్గానువర్తి. వ్యాసుడు వేదవిద్యాపారంగతుడు. భుక్తికీ, ముక్తికీ సులభమూ, ఉత్తమమూ అయిన ఈ మహామంత్రోపదేశానికి సాక్షి సాక్షాత్తూ శ్రీమన్నారాయణుడైన శ్రీకృష్ణపరమాత్ముడే. ఇలా ఆవిర్భవించిన మహానిధియే శ్రీ విష్ణుసహస్రనామ స్తోత్రము. ఇది భీష్ముడూ, వ్యాసుడూ కలిసి శ్రీకృష్ణుని సమక్షంలో యుధిష్ఠిరుని ప్రార్థనకు సమాధానంగా మానవాళికి ప్రసాదించిన పెన్నిధి.

## స్తోత్రవిభాగము

పారాయణ చేయబడే శ్రీవిష్ణుసహస్రనామస్తోత్రంలో మూడు విభాగాలున్నాయి.

- పూర్వపీఠిక: మహానుభావుడు, ధర్మనిరతుడు అయిన యుధిష్ఠిరునికి భీష్మపితామహుడు సహస్రనామములను ఉపదేశించిన సందర్భ వివరణ
- శ్రీవిష్ణు సహస్ర నామములు: అనుష్టుప్ ఛందస్సులో 107 శ్లోకాలలో కూర్చబడిన స్తోత్రము. అనుష్టుప్ ఛందస్సులో ప్రతి శ్లోకానికి రెండు పాదములు (పంక్తులు), ప్రతి పాదానికి రెండు అర్థపాదములు, ప్రతి అర్థపాదానికి 8 మాత్రలు ఉంటాయి.
- ఫలశ్రుతి: ఈ స్తోత్రపారాయణ వలన కలిగే శుభఫలితాల వివరణ

చాలా స్తోత్రాలు ఇదే విధంగా అమర్చబడి ఉంటాయి.

## పూర్వపీఠిక

శ్రీవిష్ణుసహస్రనామస్తోత్రము పూర్వపీఠికలో యుధిష్ఠిరుడు, మానవులకు సకల శుభాలను ప్రసాదించేదానిని గురించి భీష్ముని ఆరు ప్రశ్నలు అడిగాడు. ఈ ప్రశ్నలు **"కిమేకం దైవతం లోకే...."** తో మొదలైన రెండు శ్లోకాలలో ఉన్నాయి. ఆ ప్రశ్నలు ఏమంటే

1) ఈ లోకంలో ఒక్కడే అయిన దేవుడు (పరమాత్ముడు) ఎవరు?
2) జీవితానికి పరమపదమైన గమ్యము ఏది?

3) ఏ దేవుని మంగళకర గుణములను ప్రస్తుతించడం ద్వారా మానవుడు ఈ లోకంలో సకల సౌభాగ్యాలను, తదనంతరం ముక్తిని పొందగలడు?
4) ఏ దేవుని ధ్యానించుటవలన మానవుడు ఈ లోకంలో సకల సౌభాగ్యాలను, తదనంతరం ముక్తిని పొందగలడు?
5) ఏ మంత్రమును జపించుటవలన మానవుడు జననమరణ చక్రబంధమునుండి విముక్తుడు కావచ్చును?
6) ఈ మూడు మార్గాలలో (మంత్రజపము, అర్చన, స్తుతిధ్యానము) ఏది భగవదనుగ్రహము పొందడానికి ఉత్తమమని అనుభవజ్ఞులు, జ్ఞానులు అయిన తమ అభిప్రాయము?

ఈ ప్రశ్నలకు భీష్మపితామహుల పవిత్రోత్తరము తరువాతి పదిశ్లోకాలలో చెప్పబడినది. అది ఏమంటే ...

జగత్ప్రభుని, దేవదేవుని, అనంతుని, పురుషోత్తముని యొక్క సహస్రనామములను అచంచలమైన భక్తితో స్మరించుట వలనను, ఆరాధించుటవలనను, ధ్యానించుటవలనను, కీర్తించుట వలనను, ప్రణామములు చేయుటవలనను మానవుడు సకల దుఃఖములనుండి విముక్తుడు కావచ్చును. ("**ధ్యాయన్, స్తువన్, నమస్యంచ, యజమానస్ తమేవచ**")

ఇంకా, కమలాక్షుడైన కృష్ణుని నిష్కామముగా అర్చించుట, స్తుతించుట అన్ని ధర్మములలోను ఉత్తమము.

ఇక్కడ మనం ఒక ముఖ్యవిషయాన్ని గ్రహించాలి. స్తోత్రము చేయుట బహుసులభమైన మార్గము. ఇందుకు శ్రమలేదు, ఖర్చు కాదు, ఇతరుల సహాయం అవుసరంలేదు. వేరేవారిపై ఆధారపడనక్కరలేదు. పురోహితుడు, పూజాద్రవ్యాలు చూసుకోనవసరంలేదు. వేదవిధులను నిర్వహించడానికి నిర్ణీతమైన ఆశ్రమనియమాలు స్తోత్రపారాయణకు వర్తించవు. కాల, దేశ, స్థితి నిబంధనలు లేవు. నిర్మలమైన మనసు, స్థిరమైన భక్తి ఉంటే చాలును. భక్తసులభుడైన భగవంతుని కటాక్షానికి ఇది సుగమమైన మార్గము.

క్లుప్తంగా చెప్పాలంటే ..

- యుధిష్ఠిరుడు ఇలా అడిగాడు – దుఃఖముతో క్రుంగి ఉన్న నాకు తక్కువ శ్రమతో ఎక్కువ ప్రయోజనము, ఉపశమనము లభించే ఉపాయాన్ని సెలవివ్వండి.
- భీష్ముడు ఇలా చెప్పాడు – భక్తితో సహస్రనామాలను స్తోత్రం చేయి. ఇందుకు శ్రద్ధ తప్ప శ్రమ అవసరం లేదు. అన్ని దుఃఖాలు, పాపాలు, పీడలనుండి దూరంగా ఉండడానికి ఇదే దగ్గఱ దారి.

## వేయి నామములు

స్తోత్రంలోని సహస్ర అన్న పదానికి 'వేయి' అని అర్థము. శ్రీవిష్ణు సహస్రనామ స్తోత్రంలోని ప్రధానభాగంలో 107 శ్లోకాలలో శ్రీమహా విష్ణువుయొక్క వేయి నామములు పొందుపరపబడి ఉన్నాయి. వీనిలో ప్రతి ఒక్క నామము పరమ విశిష్టమైనది. పరమాత్మయొక్క ప్రత్యేక లక్షణము, గుణము, స్వభావము లేదా రూపము ఒక్కోనామంలో సూచింపబడినాయి (**'యాని నామాని గౌణాని..'** - ఒక్కొక్క నామము విష్ణువు యొక్క ఒక్కొక్క గుణమును ప్రధానంగా తెలియజేస్తున్నది)

ఈ వేయి నామములను ఎందుకు ఎన్నుకొన్నారు? ఈ వేయి నామములతో పరమపురుషుని సంపూర్ణంగా నిర్వచించడం సాధ్యమా? అనే ప్రశ్నను ఇక్కడ అడుగవచ్చును. ఇందుకు స్పష్టమైన సమాధానం ఏమంటే – భగవంతుడు అనంతుడు. వర్ణనకు అందనివాడు. జ్ఞానంవల్ల కొద్దిగా అనుభవరూపంలో తెలిసికొనవచ్చునేమో? కాని మాటలరూపంలో తెలుపరానివాడు. (అవాఙ్మానస గోచరుడు). మనసుకు, మాటలకు అందరానివాడని వేదములు చెబుతున్నాయి (**యతో వాచో నివర్తంతే అప్రాప్య మనసా సహ** - తైత్తరీయోపనిషత్తు). జీవితమంతా ప్రయత్నించినా, మనసు అన్నింటికంటే వడిగలదైనా (**అనేజాదేకమ్ మనసో జవియో...**), పరమాత్మ గురించి అవగతం కావడం ఈ మనసుకు సాధ్యం కాదని ఈశావాస్యోపనిషత్తులో చెప్పారు. అందువలన, ఏ భౌతిక సూత్రాలకూ కట్టుబడని అనంతపరమాత్మను స్తుతించడానికి వేదపురాణేతిహాస సాహిత్యంలో బహుళముగా ప్రస్తావింపబడినవీ, మహాభక్తులైన మునులచే గానం చేయబడినవీ అయిన ఈ వేయి నామాలను గ్రహించడం జరిగింది. ఇవి శ్రీమన్నారాయణుని వేయి ముఖ్యగుణములను సూచించే పుణ్యశబ్దాలు. అనంతగుణసంపన్నుని వేయి గుణాలను ప్రస్తుతించే సాధనాలు.

శ్రీ వేదవ్యాస భగవానునిచే ఛందోబద్ధం చేయబడిన ఈ వేయి నామాలను ఎందరో మహానుభావులైన ఆచార్యులు వివరించారు. పూజ్యులైన ఈ భాగవతుల వేయి నామాల పట్టికలను చూస్తే ఒక్కొక్క పట్టికకు కొంచెం కొంచెం భేదాలున్నాయి. ఇవి ఆ మహానుభావులుపదేశించిన తత్వమార్గ విభేదాలననుసరించీ, పరమపురుషుని అనంత వైభవములను వారు వేరు వేరుగా అనుభవించ గలగడం వలనా ఈ స్వల్పమైన తేడాలు వచ్చాయి.

ఈ వేయి నామాలలో కొన్ని నామాలు స్తోత్రంలో మరల మరల చెప్పబడినట్లనిపిస్తాయి. శ్రీపరాశరభట్టుల వ్యాఖ్యానాన్ని అనుసరించి రెండు నామములు 4 మారులు, 12 నామములు మూడు మారులు, 82 నామములు రెండుమార్లు వస్తాయి. ఏదయినా నామము ఇంకోమారు వచ్చినప్పుడు సందర్భానుసారంగా ఆ నామముయొక్క మరో అర్థాన్ని విశదీకరించారు. పూజనీయులైన ఈ వ్యాఖ్యానకర్తలు అందుకు స్మృతులనుండి విపులంగా ఆధారాలు కూడా తెలియజేశారు. ఈ విధంగా స్తోత్రంలో పునరుక్తి దోషం లేదని నిరూపించారు.

## ఫలశ్రుతి

చాలా సంప్రదాయస్తోత్రాలలాగానే శ్రీవిష్ణుసహస్రనామస్తోత్రం కూడా ఫలశ్రుతితో ముగుస్తుంది. ఇందులో ఈ స్తోత్రపారాయణం వలన కలిగే శుభఫలితాలగురించి చెప్పారు.

ఆరోగ్యం కోసమూ, పరిశుద్ధత కోసమూ శరీరాన్ని శుభ్రం చేసుకోవలసిన అవుసరం అందరికీ తెలుసు. అయితే మనసును శుభ్రపరచుకోవలసిన అవుసరం గురించి అంతగా అవగతం కాకపోవచ్చును. ఎందుకంటే శరీరంలాగా మనసు కనిపించదు గనుక. కాని శుభ్రపరచని మనసు క్రమంగా మురికిపట్టి వ్యాధిగ్రస్తమవుతుంది. భక్తిశ్రద్ధలతో చేసే ప్రార్ధనలు మనసును శుభ్రపరచుకోవడానికి ఒక విధానము. ఈ ప్రయోజనము అన్ని ప్రార్ధనలవల్లనూ సమకూరుతుంది.

ఇక శ్రీవిష్ణుసహస్రనామస్తోత్రం ప్రాముఖ్యత ఏమిటంటే – ఇక్కడ అర్చింపబడే భగవంతుడు సాక్షాత్తు వాసుదేవుడే (**శ్రీమహావిష్ణుః పరమాత్మా శ్రీమన్నారాయణో దేవతా; శక్తిః దేవకీనందనః; ఇతీదం కీర్తనీయస్య కేశవస్య మహాత్మనః నామ్నామ్ సహస్రమ్ దివ్యానామ్ అశేషేణ ప్రకీర్తితమ్; సహస్రమ్ వాసుదేవస్య నామ్నామ్ ఏతత్ ప్రకీర్తయేత్** .....). వాసుదేవుని ప్రభావం వల్లనే సూర్యచంద్రులు, నక్షత్రములు, భూమి, సాగరములు నియంత్రింపబడుతున్నాయని వేదవ్యాసులు చెప్పారు (**సచంద్రార్క నక్షత్ర ఖం దిశో భూర్మహోదధిః వాసుదేవస్య వీర్యేణ విధృతాని మహాత్మనః**). దేవతలు, దానవులు, గంధర్వులు తదాది సమస్త ప్రాణులు శ్రీకృష్ణ భగవానుని ఆదేశానుసారమే నడచుకొంటాయి (**ససురాసుర గంధర్వమ్ సయక్షోరగరాక్షసమ్..**). పరమ జ్ఞానియైన భీష్మాచార్యులు ఉపదేశించినదేమంటే – భక్తి శ్రద్ధలతో వాసుదేవుని నామమును జపిస్తే, అన్ని దుఃఖములనుండి, అన్ని బంధములనుండి విముక్తి లభిస్తుంది. సంక్షిప్తంగా ఇదే శ్రీ విష్ణుసహస్రనామ స్తోత్ర పారాయణ పలము.

ఫలశ్రుతిని పారాయణ చేయవలసిన అవుసరం లేదనీ, అసలు పారాయణం చేయకూడదనీ కొందరి అభిప్రాయం. అలా పఠించడం కోరికలకు దర్పణమని వారి వాదన. అయితే పూర్వీకులనుండి వస్తున్న సంప్రదాయానికి అనుగుణంగా ఈ అభిప్రాయం లేదనిపిస్తుంది. భక్తిశ్రద్ధలతో చేసిన ప్రార్ధనలవలన కోరికలు సిద్ధిస్తాయని ఫలశ్రుతి చెబుతున్నది. నిజమే. కాని పతనానికి దారి తీసే కోర్కెలను దూరంగా ఉంచి, ఔన్నత్యాన్ని, ముక్తిని ప్రసాదించే కోర్కెలు కోరడం ప్రార్ధన చేసేవారి విధి. ప్రార్ధన, తపస్సులచే పరమేశ్వరుని ప్రసన్నం చేసుకొని, సాటిలేని బలసంపత్తులను వరంగా పొందిన రావణాసురుడు ఆ శక్తులను దుర్వినియోగం చేసుకొని ప్రాణాలతో సహా సమస్తాన్ని పోగొట్టుకొన్నాడు.

శ్రీ విష్ణుసహస్రనామ స్తోత్రములోని ఫలశ్రుతి, దీనికి జనాదరణ కల్పించడానికై ఎవరో తరువాత జోడించినది కాదు. ఆదినుండీ మహాభారత కావ్యంలో ఈ స్తోత్రంతోపాటు కలిసిఉన్న అంతర్భాగము. శ్రీ శంకరులూ, శ్రీ పరాశరభట్టులూ తమతమ వ్యాఖ్యానాలలో ఫలశ్రుతిలోని శ్లోకాలనుగురించి కూడా వ్యాఖ్యానించారు.

అంటే ఈ ఫలశృతిలోని విస్తారమైన ప్రయోజనాలను గురించి వివరించవలసిన అవుసరాన్ని ఆ పూజనీయులు గుర్తించారు. ఇదే శ్రీ విష్ణుసహస్రనామ స్తోత్ర ఫలశృతిలో చెప్పబడిన శుభఫలాలకు సాధికారమైన ప్రమాణము. నిస్సంశయంగా దానిని స్వీకరింపవచ్చునని తెలిపే ఋజువు.

భక్తిశ్రద్ధలతో ఈ స్తోత్రపారాయణం చేయడంవలన లభించే ఒక ముఖ్యమైన ప్రయోజనం – మనస్సును అన్ని చెడు ఆలోచనలనుంచి దూరముగా, శుభ్రముగా ఉంచడం. నిర్మలమైన సంతోషానికి, శాశ్వతమైన ఆనందానికి ఇది మొదటి మెట్టు. భక్తితో, తపనతో ఈ స్తోత్రాన్ని పఠించేవారికి ఇంకా మనోదారుఢ్యము, మంచి జ్ఞాపకశక్తి, మనశ్శాంతి లభిస్తాయి. వారినుండి కోపము, అసూయ, దురాశ దూరంగా ఉంటాయి. నిజాయితీ కలిగిన భక్తి శ్రద్ధలే దీనికి అతిముఖ్యమైన అర్హతలు.

ఈ స్తోత్రం చదివినవారికే ఈ ప్రయోజనాలు పరిమితం కావు. ఏ కారణంవలన గాని పారాయణ చేయలేకపోయినవారికి విన్నంతనే ఈ ప్రయోజనాలు సిద్ధిస్తాయి.

## పారాయణము యొక్క ప్రాముఖ్యత

కొంతమంది తమకు ఈ శ్లోకాలకు అర్థం తెలియదనీ, సరయిన ఉచ్చారణ రాదనీ భావించి పారాయణ చేయడానికి సంశయింపవచ్చును.

ఒక ఉపన్యాసంలో శ్రీ చంద్రశేఖరేంద్రసరస్వతిగారు మొదటి సందేహానికి (అర్థం తెలియకపోవడాన్ని గురించి) ఇలా వివరించారు. అర్థం తెలియకుండా ప్రార్థనలు వల్లించడం కూడా ఫలదాయకమే. అది తాళం చెవి లేకుండా ఒక నిధిని కనుగొనడం వంటిది. తరువాత తాళంచెవి దొరికినపుడ ఆ నిధిని తెరుచుకొనవచ్చును. అంతవరకు ఆ నిధి మనదగ్గరే ఉంటుంది.

సరైన ఉచ్చారణ రాదని వెనుకాడేవారికి సమాధానం శ్రీ హెచ్.జె. ఆచార్ గారి గ్రంథం "Sri Vishnu Sahasra Nama – A study" (Sharada press, Mangalore) లో ఉన్నది. నారింజపండు కావాలనుకొనే చిన్న పిల్లవాడు తల్లిని 'నాంజి' అని అడుగుతాడు. సరిగా పలుకలేదనే కారణంతో ఆ తల్లి వాని కోరిక తీర్చకపోదు. మనసులో ఉన్న భావం ముఖ్యం. భక్తి శ్రద్ధలతో కోరినట్లయితే అందరికీ తల్లీ, తండ్రీ అయిన భగవంతుడు సరిగా పలుకలేదనో, అర్థం తెలియదనో వంటి విషయాలను పట్టించుకొనడు.

ఈ స్తోత్రాన్ని ముగిస్తూ శ్రీవేదవ్యాసముని ఇలా నొక్కి చెప్పాడు. ఒకసారి కాదు, రెండుమారులు – **విష్ణుభక్తునికి పరాభవము జరుగదు. పరాభవము జరుగదు.** (నతేయాంతి పరాభవమ్, నతేయాంతి పరాభవమ్ ఓం నమ ఇతి). ఇంత తక్కువ శ్రమతో, ఇంత తక్కువ ఖర్చుతో, కేవలం భక్తి శ్రద్ధలతో శ్రీవిష్ణుసహస్రనామస్తోత్రాన్ని పారాయణం చేయడం వలన ఇంత ప్రయోజనం సమకూరుతుంటే, ఇంతకంటే లాభసాటి ప్రయత్నం ఇంకేముంటుంది?

ఇంకా ఆసక్తి ఉన్నవారు ఈ క్రింది గ్రంథాలను చదువవచ్చును.

"Sri Vishnu Sahasranama with the Bhashya of Sri Parasara Bhattar, with Translation in English", A. Srinivasa Raghavan, Sri Visishtadvaita Pracharini Sabha, Madras, 1983.

"Sri Vishnu Sahasranama Stotram", Keelathur Srinivasachariar, The Little Flower Co., Madras, Reprinted 1981.

"Sri Vishnu Sahasranama Stotram", C. V. Radhakrishna Sastri, C. Venkatarama Sastri Trust, 1986.

నరసింహన్ కృష్ణమాచారి.

---

**"గీతా సాహిత్య శిరోమణి" బిరుదాంకితులైన శ్రీ పండిత పెమ్మరాజు రాజారావుగారు రచించిన తెలుగు పుస్తకం "శ్రీ విష్ణు సహస్రనామ స్తోత్రము – సంగ్రహ తాత్పర్య వివరణ" పీఠికలో వ్రాసిన విషయాలు –**

శ్రీ విష్ణు సహస్రనామస్తోత్ర పారాయణ ఫలితములు అనంతములు. దీనివలన కలుగు లౌకిక ప్రయోజనములు అనేకములు. సకల మంగళములను ప్రసాదించు దివ్య స్తవమిది. అనుష్ఠానము చేసి దాని ఫలితములను పొంది ఆనందించమని కోరిక.

## సర్వరోగ నివారణము – సహస్ర పారాయణము

సంసార జీవితములో గల సకల బంధనాలను పోగొట్టు మహామంత్రము విష్ణుసహస్రము.... ఈ స్తవము సకల భయహరము. సంచిత, ప్రారబ్ధ, ఆగామి కర్మలయొక్క భయంకర రూపాలనన్నిటిని నాశనము చేయు దివ్యాస్త్రము – దివ్య మంత్రము – దివ్యౌషధము – దివ్యామృతము.

జ్యోతిశ్శాస్త్రరీత్యా – గ్రహగతులు సక్రమముగా లేనివారును, దుష్ట గ్రహ కూటమిచే వ్యథలు పొందువారును ప్రాయశ్చిత్తముగా విష్ణు సహస్రనామ స్తోత్రము పారాయణము చేయుదురు. సమస్త గ్రహ నక్షత్ర దోషాదులను శాంతింపజేసి సకల మంగళాలను వర్ధింపజేయు దివ్యనామఅమృత ప్రసాదమిది.

ధర్మార్థకామమోక్ష చతుర్విధ పురుషార్థాలను వర్ధింపజేయు స్తవమిది.

భగవన్నామ గానానికి విధినిషేధాదులు లేవు. ఎప్పుడైనను ఎక్కడైనను చేయవచ్చును. కాని నియమాలు, విధులు పారాయణము చేసిన దాని ప్రయోజనము మహోత్కృష్టము.

జన్మదినమందు, జన్మనక్షత్రమందు, ఏకాదశి, పూర్ణిమ, రవిసంక్రమణలందు విశేషముగ పారాయణము చేయుట మంచిది. రోజునకు పన్నెండు పర్యాయములు చొప్పున ప్రభాత పారాయణము సర్వ సిద్ధిప్రదమని చెప్పబడుచున్నది. సంధ్యాసమయమును శ్రేష్ఠమే.

"నిరంతరము నన్ను భక్తితో స్మరించువారికి ఆత్మ జ్ఞానమును నేనే ప్రసాదింతును" అని భగవానుడు గీతాచార్యులు ప్రతిజ్ఞ చేసెను. కనుక ఈ పారాయణము వలన ఐహిక ఫలములు మాత్రమే కాక శాశ్వత మోక్ష పదవియును లభించుననుట నిస్సందేహమే.

**ఇందలి నామములన్నియును బీజాక్షరములే.**

ఎంత మనోహర తరంగాలివి! అందువలననే వ్యాసదేవుడు ఉత్తర పీఠికలో "య ఇదం శృణుయాన్నిత్యం యశ్చాపి పరికీర్తయేత్ నా శుభం ప్రాప్నుయాత్ కించిత్" అనినాడు. ఈ శ్లోకాలు కీర్తన చేసిననే చాలు. సర్వ విధములగు అమంగళాలు తొలగును. సర్వ శుభాలు వర్షించును. అని వ్యాస వాణి.

విష్ణుసహస్రనామ జప, కీర్తన, శ్రవణమ్ సర్వరోగహరం, సర్వ పాపహరం, సర్వ శుభకరం, సర్వాభీష్టప్రదం, హరిః ఓమ్.

**భగవద్గీత – విష్ణు సహస్రనామ స్తోత్రము**

గీతాశాస్త్రమునకును, విష్ణు సహస్రనామస్తోత్రమునకును అవినాభావ సంబంధము గలదు. రెండును భారతాంర్గతములే. రెండింటి లక్ష్యమును ఒక్కటియే. గీత సర్వయోగ సమన్వయ శాస్త్రము (Yoga of Synthesis). విష్ణుసహస్రమును సర్వయోగ సమన్వయ శాస్త్రము.. ద్వైతాద్వైత సమన్వయము, సగుణ నిర్గుణ సమన్వయము, భక్తి జ్ఞాన కర్మల సమన్వయము రెండింటిలోను సమానముగానే గోచరించును. గీతలోని 10, 11 అధ్యాయములగు విభూతి, విశ్వరూప సందర్శన యోగములతో విష్ణుసహస్రము మరింత సన్నిహిత సంబంధము కలిగియున్నది.

గీతలోని పదవ అధ్యాయములో సుమారు ఎనుబది భగవద్విభూతులు గానము చేయబడియున్నవి. విభూతులన్నియును భగవన్నామములే యగుట చేత గీత పదవ అధ్యాయములోని నామములన్నియును నామసహస్రములో కానవచ్చును.

ఉదా: ఆదిత్యః, విష్ణుః, రవిః, జ్యోతిః, మరీచిః, మరుతః, నక్షత్రం, వేదః, సామః, దేవః, రుద్రః, వసుః, పావకః, స్కందః, మహర్షిః, యజ్ఞః, అశ్వత్థః, వృక్షః, సిద్ధః, కపిలః, అమృతః, నరః, ఆయుధం, సర్పః, వాసుకిః, అనంతః, వరుణః, యమః, కాలః, రామః, ధాతా, స్మృతిః, మేధా, క్షమః, ఋతుః, వ్యవసాయః, వాసుదేవః, ధనంజయః, వ్యాసః, కపిః, దండః - మున్నగు నామములన్నియును సహస్రనామములో గానవచ్చును.

ఇదియే రీతిని 11వ అధ్యాయములో విశ్వరూపములోగల ఎన్నియో నామములు సహస్రనామములో ప్రత్యక్షమగును

ఉదా: తత్పరః, అవ్యయః, పరమేశ్వరః, ప్రభుః, ఆదిత్యః, వసుః, రుద్రః, హరిః, పరమః, పురుషః, అనాదిః, అనంతబాహుః, అర్కః, ద్యుతిః, అప్రమేయః, శాశ్వతః, ధర్మః, సనాతనః, స్వక్షః, విష్ణుః, శర్మ, తేజః, కాలః, హృషీకేశః, ఆదిదేవః, వాయుః, యమః, వరుణః, అగ్నిః, శశాంకః, ప్రజాపతిః, పితామహః, విక్రమః, కృష్ణః, వేద్యః, చతుర్భుజః, విశ్వమూర్తిః – మున్నగు నామములన్నియును విష్ణుసహస్రనామ స్తోత్రములో పాఠకులు చూడగలరు. గీతలోని సారాంశమునంతయును చిన్నచిన్న నామావళిలో భీష్మపితామహుడు మరల గానము చేసినాడేమో అనిపించును.

ఇంకను పరిశీలించి చూడుడు. రెండవ అధ్యాయములోని స్థితప్రజ్ఞ లక్షణాలన్నియును చిన్నచిన్న నామాలలో సహస్రనామస్తోత్రములో చూడగలరు. 13వ అధ్యాయములోని అమానిత్వాది గుణములు, 14వ అధ్యాయములోని

త్రిగుణాతీతుని లక్షణాలు, 16వ అధ్యాయములోని దేవతాగుణగణాలు సహస్రనామాలలో సాక్షాత్కరించును. ... గీతాసారమే నామసహస్రము. రెండును భిన్నరూపాలుగల ఒక స్వరూపమే. కనుకనే "గేయం గీతా నామసహస్రం" అన్నారు శ్రీ శంకరులు.

---

**శ్రీ నరసింహన్ కృష్ణమాచారి రచన కొనసాగింపు.**

ఇంతకు పూర్వము, అర్ధం తెలియకపోయినాగాని, ఉచ్చారణ సరిగా లేకపోయినాగాని శ్రీవిష్ణుసహస్రనామస్తోత్ర జపము శుభఫలితాలనిస్తుందని విన్నవించుకొన్నాను. ఇప్పుడు శ్రీ మహావిష్ణువుయొక్క వేయి నామాలకు అర్ధాన్ని వివరించే ప్రయత్నం చేస్తున్నాను. మరి అర్ధం తెలుసుకోవలసిన అవుసరం ఏమిటని ఎవరైనా అడుగవచ్చును. నిజంగానే ఒక భక్తుడు ఈ-మెయిల్ ద్వారా ఈ సందేహాన్ని వెలిబుచ్చినాడు.

**"శ్రీరామ రామ రామేతి రమే రామే మనోరమే**
**సహస్రనామ తత్తుల్యం రామనామ వరాననే"**

అని ఫలశృతిలో పరమేశ్వరుడు పార్వతి అమ్మవారికి చెప్పినట్లుగా "రామ" నామము వేయి నామములకు సరి కదా? మరి వేయి నామములను జపించడం ఎందుకు?

శ్రీ పరాశరభట్టులవారు ఈ పుణ్యనామముల అర్ధవిశ్లేషణవలన సమకూరే అదనపు ప్రయోజనాలను గురించి చక్కని వివరణ ఇచ్చారు. – "అర్ధం తెలియకుండానే నామ జపం చేయడం ప్రయోజనకరమే (**ఉపకారిణామపి**), కాని పదవివరణ ద్వారా అంతరార్ధం తెలుసుకోవడం సత్వరమే మనకు ప్రసన్నత, పవిత్రత సిద్ధిస్తాయి (**మనః ప్రసన్నత్వమ్ పావనత్వమ్ చ**)

అంతే గాక నామముల అర్ధాన్ని తెలుసుకోవడం యొక్క ప్రాముఖ్యత గురించి మహాభారతంలోనుండి ఇలాఉదాహరించారు – **"నామ కర్మార్థవిత్ ప్రాప్నుయామ్ పురుషోత్తమమ్"** (ఉద్యోగ పర్వము – 59)

నాకు (కృష్ణమాచారికి) సంస్కృతభాషాజ్ఞానం అంతగా లేకపోయినప్పటికీ, ఈ పవిత్ర నామముల అర్ధాన్ని పరిశీలించడంవలనా, వ్యాకరణశబ్ద వివరణలను తెలుసుకొనే ప్రయత్నం వలనా నా మనస్సుకు ఎంతో ఉల్లాసం కలిగింది. ఎందుకంటే ఈ ప్రయత్నంలో శ్రీవిష్ణుభగవానుని గుణవైభవాలను విశేషంగా ధ్యానించే అవకాశం కలుగుతున్నది.

(ఇది శ్రీ కృష్ణమాచారి గారి ఆంగ్ల రచనకు అనువాదమని మరొక్కమారు గుర్తు చేస్తున్నాను. శ్రీకృష్ణమాచారి గారి సంస్కృత పాండిత్యం కొద్దిపాటి కావచ్చునేమో. నాకు, అంటే సుధాకరబాబుకు, సంస్కృతంలో కాని, తెలుగులో కాని పాండిత్యం ఏ మాత్రమూ లేదు – సుధాకర బాబు)

తమ "భగవద్గుణ దర్పణము" అనే గ్రంధంలో  శ్రీ భట్టులవారు శ్రీమహావిష్ణువుయొక్క మంగళకరమైనవేయి నామాలను అనేక ఆధారాలతో వివరించారు – వ్యాకరణ విశ్లేషణ, శబ్దార్ధ వ్యుత్పత్తి, మహామునుల ఉపదేశములు వగయిరాలతో. ప్రత్యేకించి ఆ నామములను సందర్భము, వైశిష్ట్యము, ఔచిత్యమును బట్టి కూడా వివరించారు. శబ్దార్ధ వ్యుత్పత్తి అంటే మూల ధాతువులనుండి ఒక పదమును విశ్లేషించడం అన్నమాట. అంతే గాకుండా ఒకటికంటె ఎక్కువమార్లు వచ్చిన నామములు సందర్భమును బట్టి వేర్వేరు అర్ధములు కలిగినవని కూడా శ్రీభట్టులు తమ ఉపోద్ఘాతంలో తెలియజేశారు. ఆ విధంగా శ్రీవిష్ణుసహస్రనామములలో పునరుక్తి లేదని వివరించారు.

శ్రీ భట్టులవారు తమ శ్రీ విష్ణుసహస్రనామ భాష్యంలో ఈ వేయి నామములు వచ్చే క్రమంలో చక్కని సూత్రప్రాయమైన సంబంధాన్ని అనుసరించారు. పాంచరాత్ర ఆగమ శాస్త్రాల ప్రకారం భగవానుడు పర, వ్యూహ, విభవ, అర్చ, అంతర్యామి అనే ఐదు అవతారాలు (విధాలు)గా మూర్తీభవించి ఉంటాడు. ఈ అయిదు స్వరూపముల గుణములను బట్టి ఈ వేయి నామములు ఒక క్రమవిధానంలో కూర్చబడినాయి. అంతేగాని ఈ వేయి నామములు ఊరికే కలగలిపి ప్రోగుచేసిన పదాలు కావు.

ఉదాహరణకు ఈ స్తోత్రంలో మొదటి 122 నామములు భగవంతుని పరవాసుదేవ స్వరూప లక్షణములను వర్ణిస్తాయి. తరువాతి నామములు వ్యూహస్వరూపము గుణములను కీర్తిస్తాయి. ఇలా శ్రీ భట్టులవారు తమ విశేష వ్యాఖ్యానంలో భగవంతుని స్వరూపములు (Manifestations)  అయిన 44 నామవర్గములను పేర్కొన్నారు. శ్రీ శ్రీనివాసాచారిగారు తమ శ్రీ విష్ణు సహస్రనామ స్తోత్ర వివరణ రచన (Lifco publications, 1967) సంపాదకీయంలో ఈ 44 వర్గాలున్న స్తోత్రాన్ని 44 పొరలున్న గులాబీ పూవుగాను, మోక్షమార్గంలో 44 మెట్లుగాను సుందరంగా వర్ణించారు. మన శ్రీ విష్ణు సహస్రనామ వివరణార్చనలో ముందుకు సాగుతూ సందర్భానుసారంగా ఆ 44 స్వరూపమూర్తులను స్మరించుదాము.

శ్రీ విష్ణు సహస్రనామ స్తోత్ర వివరణలో శ్రీ భట్టులవారు పేర్కొన్న 5 ప్రధాన స్వరూపములను (Manifestations)  గురించిన సంక్షిప్త వివరణ ఇక్కడ  వ్రాస్తున్నాను.

1) పర – షడ్గుణ పరిపూర్ణ స్వరూపములు
2) వ్యూహ – సృష్టి, స్థితి, లయలకు ఆధారమైన స్వరూపములు
3) విభవ – ముఖ్య, అనువర్తి అవతారములు
4) అర్చావతారములు
5) అంతర్యామి అవతారములు

**పర స్వరూపములో** భగవంతుడు షడ్గుణ పరిపూర్ణుడు. (జ్ఞాన, బల, ఐశ్వర్య, వీర్య, శక్తి, తేజో గుణములు సంపూర్ణముగా కలవాడు). అవధులు లేని మహాసాగరమువలె ఆయన సకల వైభవములతో విలసిల్లును

(Undifferentiated manifestation of the Lord in His complete glory, in which he has chosen not to be limited by anything). ఇది పరమాత్మ, పరబ్రహ్మ, పరంధాముని సంపూర్ణ స్వరూపము.

పర, వ్యూహ, విభవ స్వరూపములను వివరిస్తూ శ్రీ భట్టులవారు 'సాత్వత సంహిత' నుండి ప్రమాణములను ఉదాహరించారు.

**షడ్గుణ్య విగ్రహమ్ దేవమ్ భాస్వజ్జ్వలన తేజసమ్**
**సర్వతః పాణిపాదమ్ తత్ ఇతి ఉపక్రమ్య**
**పరమ్ ఏతత్ సమాఖ్యాతమ్ ఏకమ్ సర్వాశ్రయ విభుమ్**

"పర స్వరూపములో భగవంతుడు షడ్గుణ పరిపూర్ణుడు. అసమానమైన తేజస్సుతో ప్రకాశించుచుండును. అన్నియెడల కరములు, పాదములు కలిగియుండును. ఈ పర స్వరూపము అనితరము, అనంతము, సర్వమునకు ఆశ్రయము. ఏకైకము"

**భగవద్గీత – విశ్వరూపదర్శన యోగము (9-17)**

ఏవముక్త్వా తతో రాజన్మహాయోగేశ్వరో హరిః
దర్శయామాస పార్థాయ పరమం రూపమైశ్వరమ్

అనేకవక్త్రనయనమనేకాద్భుతదర్శనమ్
అనేకదివ్యాభరణం దివ్యానేకోద్యతాయుధమ్

దివ్యమాల్యామ్బరధరం దివ్యగన్ధానులేపనమ్
సర్వాశ్చర్యమయం దేవమనన్తం విశ్వతోముఖమ్

దివి సూర్యసహస్రస్య భవేద్యుగపదుత్థితా
యది భాః సదృశీ సా స్యాద్భాసస్తస్య మహాత్మనః

అనేకబాహూదరవక్త్రనేత్రం పశ్యామి త్వాం సర్వతోఽనన్తరూపమ్
నాన్తం న మధ్యం న పునస్తవాదిం పశ్యామి విశ్వేశ్వర విశ్వరూప

కిరీటినం గదినం చక్రిణం చ తేజోరాశిం సర్వతో దీప్తిమన్తమ్
పశ్యామి త్వాం దుర్నిరీక్ష్యం సమన్తాద్ దీప్తానలార్కద్యుతిమప్రమేయమ్

**వ్యూహ స్వరూపములలో** భగవంతుడు కార్యమున కనుగుణముగా ఈ షడ్గుణములలో కొన్ని గుణములను ప్రధానముగా కలిగిన రూపములను ధరించును. కనుక పర స్వరూపమునుండి కారణార్థమై ఉద్భవించినవిగా వ్యూహస్వరూపములను మనం అర్థం చేసుకొనవచ్చును. భగవద్గుణ దర్పణమును

అనువదించిన శ్రీ ఎ. శ్రీనివాసరాఘవన్ గారు 'emanations' (విభూతులు?) అనే పదాన్ని వాడారు. వీనిలో ఈ క్రింది వ్యూహస్వరూపాలు ముఖ్యమైనవి.

- ప్రద్యుమ్నుడు – ఐశ్వర్య, వీర్య గుణప్రధాన స్వరూపము – సృష్టి కార్యము
- అనిరుద్ధుడు – శక్తి, తేజో గుణప్రధాన స్వరూపము – స్థితి కార్యము
- సంకర్షణుడు – జ్ఞాన, బల గుణప్రధాన స్వరూపము – లయకార్యము

సాత్వత సంహితములో వ్యూహస్వరూపములను ఇలా వర్ణించారు.

**ఏతత్ పూర్వమ్ త్రయమ్ చ అన్యాత్ జ్ఞానాద్యైః భేదితమ్ గుణైః**
**విద్ధి ఏతత్ వ్యూహ సఞ్జితమ్ పై నిశ్రేయస ఫలప్రదమ్**

"ఈ పర స్వరూపమునుండి జ్ఞానము వంటి కొన్ని గుణములు ప్రధానముగా గల మూడు స్వరూపములు (ప్రద్యుమ్న, అనిరుద్ధ, సంకర్షణ స్వరూపములు) ఉద్భవించును. ఆ స్వరూప ధ్యానము వలన ఆయా స్వరూపములకు ముఖ్యమైన గుణములకనుగుణమైన ఫలములు భక్తులకు నిస్సంశయముగా లభించును"

**విభవ స్వరూపములు** – భగవంతుడు దేవ, మానవ, జంతువులవంటి రూపములలో అవతరించిన స్వరూపములు. అవి ముఖ్య, అనువృత్తి అని రెండు విధములు. వీనినే విభవ, విభవాంతర రూపములని కూడా అంటారు.

విభవ స్వరూపములు నాలుగు విధములు

1. మత్స్య, కూర్మ, వరాహములవంటి సంపూర్ణావతారములు
2. వేదవ్యాసునివంటి అంశావతారములు
3. ఒక్కొక్కమారు ఆయన తన శక్తిని కొంతకాలం మాత్రం వేరొకరిలో ప్రవేశపెట్టును (ఉదా: పురంజయుడు)
4. అర్చావతారములు – విగ్రహ స్వరూపములో అవతరించినవి

శ్రీ భట్టులవారు తమ వ్యాఖ్యానములో అర్చాస్వరూపమును విభవస్వరూపములలో ఒక వర్గముగా చెప్పినట్లు నాకు అనిపిస్తున్నది. నేను (కృష్ణమాచారి) సరిగా అర్థం చేసుకొని ఉండకపోతే గనుక భాగవతులు సరిచేయగలరు.

శ్రీ భట్టులవారు భగవంతుని విభవ స్వరూపములకూ, భగవంతునిచే సృష్టింపబడిన బ్రహ్మాది దేవతలకూ భేదాన్ని వివరిస్తూ పౌష్కర సంహితమునుండి ఇలా ఉదాహరించారు

**జ్ఞానోపదేష్టా భగవాన్ కపిలాక్షస్తు అధోక్షజః**

**విద్యామూర్తిః చతుర్వక్త్రో బ్రహ్మా వై లోకపూజితః**

**తదస్మా భూతో వై యస్య విశ్వ వ్యంజన లక్షణః**

అరుణ నేత్రుడైన అధోక్షజుడే అందరికీ జ్ఞానము ఉపదేశించే భగవానుడు. ఈ భగవానుని అంశయైన చతుర్ముఖ బ్రహ్మ విద్యామూర్తి, లోకపూజ్యుడు. భగవంతునినుండి లభించిన జ్ఞానమును ఆయన లోకములకందించును.

ఇక్కడ ప్రాదుర్భావ, ప్రాదుర్భావాంతర స్వరూపముల తేడాలు తెలుపబడినవి. అధోక్షజుడు ప్రాదుర్భావ స్వరూపము. చతుర్ముఖ బ్రహ్మ ప్రాదుర్భావాంతర స్వరూపము. భగవంతుని స్వరూపములైన పర, వ్యూహ, విభవ మూర్తులు వేరు. భగవంతునిచే సృష్టింపబడిన బ్రహ్మ, అగ్ని వంటి దైవములు వేరు అని మనం గ్రహించాలి. ఈ కారణం వల్లనే అచ్యుతుని ఆరాధించే దీక్ష పూనినవారు కేవలం అచ్యుతునే ఆరాధింపవలెను. అన్యదేవతారాధన వారికి నిషిద్ధము (**ప్రాదుర్భావానామ్ ఆరాధ్యత్వమ్ ప్రాదుర్భావాంతరాణామ్ ఆరాధన నిషేధశ్చ**)

ఈ ఉపోద్ఘాతముతో శ్రీ విష్ణుసహస్రనామ స్తోత్రములోని నామముల అర్థాన్ని పొందుపరచే ప్రయత్నం ఆరంభిస్తాను. ఇందుకు శ్రీ భట్టులవారి 'భగవద్గుణ దర్పణము' అనే గ్రంథాన్ని ప్రధాన ఆధారంగా తీసుకొంటున్నాను. శ్రీ శంకరుల వారి భాష్యాన్ని అదనపు ఆధారంగా ఉపయోగిస్తాను. (కృష్ణమాచారి).

ఈ నా (కృష్ణమాచారి) నేర్చుకొనే ప్రయత్నం వలన తెలుస్తున్నదేమంటే – ఆచార్యుల అనుగ్రహము, సహాయము లేకుండా కేవలం పుస్తకాలు చదివి జ్ఞానం పొందడం అసాధ్యం. కాని ఈ పరిస్థితిలో నాకు ఇంతమాత్రమే వీలుపడింది. ఈ రచనా ప్రయత్నంలో తప్పులు అనేకమని నాకు తెలుసు. చదువరులు నిస్సంకోచంగా, చొరవగా తమ సలహాలను, అభిప్రాయాలను చెప్పవలసిందని వినయంతో కోరుతూ, నాకు (కృష్ణమాచారికి) తెలియవచ్చినంతవరకూ ఈ వేయి పుణ్యనామముల అర్థాన్ని మీ ముందు ఉంచే ప్రయత్నం చేస్తున్నాను.

(అని శ్రీ కృష్ణమాచారిగారు వ్రాశారు. నా అనువాద ప్రయత్నంలో జరిగిన అదనపు దోషాలను మన్నించమని ప్రార్థన – కా.సు. బాబు)

---

**భాగవతాన్ని తెనిగిస్తూ బమ్మెర పోతనగారు ఇలా అన్నారు**

భాగవతము తెలిసి పలుకుట చిత్రంబు
శూలికైన తమ్మిచూలికైన
విబుధ జనులవలన విన్నంత కన్నంత
తెలియవచ్చినంత తేటపరతు

---

శ్రీ భట్టులవారు మొదటి 122 నామములనూ భగవంతుని 'పర' స్వరూపమును వర్ణించే నామములుగా వ్యాఖ్యానించారు. 'విశ్వం'తో మొదలై, 13వ శ్లోకంలోని 'వరారోహః' వరకు – ఇవి షడ్గుణైశ్వర్య పరిపూర్ణమైన, అవధులు లేని, అనంత పరబ్రహ్మస్వరూప వర్ణనలు గనుక స్తోత్రంలోని ఈ భాగం యుధిష్ఠిరుని మొదటి రెండుప్రశ్నలకు సమాధనంగా శ్రీ భట్టులు దర్శించారు.

1) కిం ఏకమ్ దైవతమ్ లోకే – ఈ లోకంలో ఒక్కడే ఐన పరమాత్ముడు ఎవ్వడు?

2) కిమ్ వాప్యేకమ్ పరాయణమ్ – పొందదగిన ఒకే ఒక గమ్యమేది?

---

శ్రీ నృసింహన్ కృష్ణమాచారి ఆంగ్ల రచనకు ఇది తెలుగు అనువాదము.

శ్రీ కృష్ణమాచారిగారు తమ రచనకు వ్రాసిన సంకల్పము.

http://kirtimukha.com/chinnamma/sahasra/sahasra.html

Introductory remarks by Shri Narasimhan Krishnamachari, the author of this commentary-series:

**Dear Devotees:**

**Some time back, a few friends including Sri M. Srinivasan and me from our group joined forces to write an article giving the background behind the origin of Sri VishNu Sahasra NAmam.**
**I am taking the liberty of submitting this article in two or three parts to the learned audience. The material is mostly from the book "Sri Vishnu Sahasranama with the Bhashya of Sri Parasara Bhattar, with Translation in English" by A. Srinivasa Raghavan, published by Sri Visishtadvaita Pracharnini Sabha, Madras, in1983. Any misinterpretation is completely mine.**

**I seek your forgiveness if I am misrepresenting the accepted and traditional concepts; I look forward to receiving any thoughts that you may have in correcting me or any other additional comments.**
**You may record your comments in the guest book placed above or email me at the address given below.**

**A list of the reference books may be seen HERE**

**http://kirtimukha.com/chinnamma/sahasra/sahasra.html**

**Dasan**
**Krishnamachari**
**champakam@yahoo.com**

**List of References:**

1. "SrI VishNu sahasranAma" With the Bhashya of SrI ParASara BhaTTar – With Translation in English; A. Srinivasa Raghavan; Published by SrI VisishTadvaita Pracharini Sabha, 1983.
2. "SrI VishNu sahasra nAmam – viLakka urai" – Based on the bhAshya of SrI Parasara Bhattar; V. V. Ramanujan, 1994.
3. "SrI VishNu sahasra nAma stotram" – With explanation in Tamizh; S. V. Radhakrishna Sastri, 1986.
4. "VishNu sahasra nAma stotram", With vyAkhyAnam in samskRt by Sataydevo VasishTha and translation in Hindi; Published by Munsiram Sastri; 1986.
5. "VishNu sahasra nAma with the Bhashya of SrI Samkaracarya", Translated into English by R. Anantakrishna Sastry; The Adyar Library and Research Centre; 1980.

6. "SrI VishNu sahasra nAma stotram" (along with the Commentary on it by SrI Adi Sankara Bhagavat Pada"; Compiler and Translator – T. S. Krishnamurthy; Karkotaka Vayalore Trust, 1995.
7. "SrI VishNu sahasra nAma stotram – with an English Translation of SrI Sankara Bhagavatpada's Commentary"; P. Sankaranarayanan; Published by Bharatiya Vidya Bhavan, 1996.
8. "SrI VishNu sahasra nAma urai" based on SrI Parasara Bhattar's vyAkhyAnam; SrI P. B. Annangaracharya, 1966.
9. "Thousand Ways to the Transcendental VishNu sahasra nAma"; Swami Chinmayananda; Central Chinmaya Mission Trust; Reprinted 1983.
10. "Kirita Bhashya on the VishNu sahasra nAma"; Krishna Datta Bharadvaj; Nag Publishers, 1998.
11. "Sakala kArya siddhida SrI VishNu sahasra nAma stotram"; Srinivasachariar; The Little Flower Company, 1981.
12. "SrI VishNu sahasra nAma BhAshyam" with Tamizh Commentary by M. V. Ramanujacharyar, and English Translation by V. N. Vedanta Desikan; SrI Visishtadvaita Research Center, 1997.
13. "SrI VishNu sahasra nAma stotram" with the original Commentary of SrI Parasara Bhattar in samskRt, and Commentary in Hindi by Sivaprasad Trivedi; Chaukamba Vidyabhavan; 1996.
14. The Dharma cakram, Monthly Periodical Published in tamizh by SrI Ramakrishna Tapovanam, Tirupparaitturai.
15. Amarakosa, Edited by A. A. Ramanathan; The Adyar Library and Research Center, 1971.

Five e-books of the commentary on Sri VishNu Sahsra Naamam by Sriman KrishNamAchari were released for publication on May 1, 2007 - SrI Nrusimha Jayanthi day, by Sriman Oppiliappan Koil Varadachari Sadagopan, with the following remarks:

It is with a great sense of Joy, adiyEn presents now the monumental work of the Commentaries on Sri VishNu Sahasra Naamams by Sriman Narasimhan KrishNamachary, Thiruvadi of SrimushNam Sriamth Andavan of Srirangam PeriyAsramam.

As the Chief Editor of the Sundarasimham and Ahobilavalli e-book series, it gives me great pleasure to release the five e-books on Sri VishNu Sahsra Naamams by Sriman KrishNamAchari . He has spent the last ten years to assemble content from a dozen commentators on Sri VishNu Sahasra Naamams, which is dear to all AchArya paramparais . He has focused on Swamy ParAsara Bhattar's and Aadhi Sankarar's commentaries for the 1000 NaamAs and Phala Sruthi slOkams. Swamy ParAsara Bhattatr's commentary known as Bhagavath GuNa DharpaNam approaches the commentary from Bhagavath GuNa Soulabhyam, whereas Aadhi Sankara approaches it from the Parathvam of VedAnthic Brahman. The conclusion that both come to following BhaishmA's counsel is: "na tE yaanthi parAbhaavm " (The reciters of Sri VishNu Sahasra Naamams will never meet any disgrace or dishonor) and will attain VishNu Paadham and be blessed to perform nithya Kaimkaryam).
Sriman Murali DesikAchAri and his Dharma Pathni, Srimathy Jayashree Desikachari have spent untold hours to format these 1479 pages of text and add appropriate and eye-filling divine images of the Lord created by our artist in residence, SoubhAgyavathi ChitralEkhA, Tanjore School of painters and Sri Nedumtheru Srinivasan Mukundan, the owner of Pbase Image archives. I am indebted to the Desikachari Dampathis for their enthusiastic and tireless support of the Kaimkaryam.
It is a red letter day in the annals of Sundarasimham and Ahobilavalli e-books kaimakryams.Thank you all, Team Members!

NamO SrI HayagrIvAya ,
Srimath Azhagiya Singar Thiruvadi ,
Daasan , Oppiliappan Koil Varadachari Sadagopan

These e-books can be directly viewed / downloaded from:
http://www.ahobilavalli.org/vishnu_sahasra_namam_vol1.pdf
http://www.ahobilavalli.org/vishnu_sahasra_namam_vol2.pdf
http://www.ahobilavalli.org/vishnu_sahasra_namam_vol3.pdf
http://www.ahobilavalli.org/vishnu_sahasra_namam_vol4.pdf
http://www.ahobilavalli.org/vishnu_sahasra_namam_vol5.pdf

OR from the mirror site at:

http://www.ibiblio.org/sadagopan/ahobilavalli/vishnu_sahasra_namam_vol1.pdf
http://www.ibiblio.org/sadagopan/ahobilavalli/vishnu_sahasra_namam_vol2.pdf
http://www.ibiblio.org/sadagopan/ahobilavalli/vishnu_sahasra_namam_vol3.pdf
http://www.ibiblio.org/sadagopan/ahobilavalli/vishnu_sahasra_namam_vol4.pdf
http://www.ibiblio.org/sadagopan/ahobilavalli/vishnu_sahasra_namam_vol5.pdf

## శ్రీ కృష్ణమాచారిగారి అనుమతి కొరకు నేను ఫిబ్రవరి 2005లో వ్రాసిన ఇ-మెయిల్

***k s babu <ksbabu@omantel.net.om>*** wrote:

Respected Sir,

I am an Electrical Engineer in Muscat, Oman.

By God's grace, I stumbled on your commentary on Sri Vishnu Sahasra NAma. I greatly respect your devotion in making these postings.

While reading, I felt it would be more enjoyable for some people like me if this is available in Telugu.

I am not a scholar nor a writer. Yet, as a student's exercise, I would like to attempt to translate your commentary in Telugu. I humbly beg your permission and blessings for my attempt.

Regards

K S BABU

ksbabu@omantel.net.om

kajasb@hotmail.com

## శ్రీ కృష్ణమాచారిగారి సమాధానము

6th February 2005

Respected SrI Babu:

If it benefits more people I have no problem.   I have not done a good job on the write-up of the first 500 nAma-s or wo, and might try to rewrite this segment once I complete my first pass on the complete set of nAma-s.  So the time you spend translating the first 500 nAma-s might be wasted, depending on whether I am able to get to rewrite the first set.  Please let me know what you decide.

Regards,

-Krishnamachari

**కా.సు. బాబు రచన గురించి-**

ఈ రచన అత్యధికంగా శ్రీ కృష్ణమాచారిగారి ఆంగ్ల రచనకు అనువాదం. అంతే కాకుండా నేను కొద్ది ఇతర తెలుగు రచనలను కూడా చదివి వానిలోని విషయాన్ని సందర్భానుసారంగా కలిపాను. అవి ముఖ్యంగా

1) గీతా సాహిత్య శిరోమణి **పండిత పెమ్మరాజు రాజారావు** రచన – శ్రీ విష్ణు సహస్ర నామ స్తోత్రము – సంగ్రహ తాత్పర్య వివరణ (గొల్లపూడి వీరాస్వామి సన్, రాజమండ్రి). ముఖ్యంగా పూర్వపీఠిక మరియు ఫలశ్రుతి లోని శ్లోకముల తాత్పర్యమును పూర్తిగా వీరి రచననుండి కాపీ చేశాను. ఇందుకువారి అనుమతి తీసుకోలేదు. కాని ఇది వ్యాపార ప్రచురణ కాదు గనుక వారు మన్నిస్తారని ఆశిస్తున్నాను.

2) శ్రీవిద్యా విశారద **డాక్టర్ క్రోవి పార్థసారథి** రచన – శ్రీ కైవల్య సారథి (శివకామేశ్వరి గ్రంథమాల, భ్రమరాంబాపురం, కృష్ణలంక, విజయవాడ) నుండి కొద్ది భాగాలు. ఇందుకువారి అనుమతి తీసుకోలేదు. కాని ఇది వ్యాపార ప్రచురణ కాదు గనుక వారు మన్నిస్తారని ఆశిస్తున్నాను.

3) **శ్రీ జయదయాల్ గోయందకా** – శ్రీ మద్భగవద్గీత – తత్వవివేచనీ హిందీ వ్యాఖ్యకు తెలుగు అనువాదము – అనువాదకులు: డా. ఎమ్. కృష్ణమాచార్యులు, డా. గోలి వెంకటరామయ్య (గీతాప్రెస్, గోరఖ్ పూర్ ప్రచురణ) – భగవద్గీత నుండి ఉదాహరించిన శ్లోకాలకు తెలుగు అనువాదం ఈ పుస్తకంనుండి యథాతథంగా వ్రాశాను. ఇందుకు కూడా అనుమతి తీసుకోలేదు. కాని ఇది వ్యాపార ప్రచురణ కాదు గనుక వారు మన్నిస్తారని ఆశిస్తున్నాను.

4) అన్నమయ్య కీర్తనల వంటివి, మరికొన్ని భాగాలను తెలుగు వికీపీడియా లేదా వికీసోర్స్ నుండి, ఇతర వెబ్ సైటులనుండి తీసికొన్నాను.

ఇతర రచనలను సందర్భానుసారం ఉదాహరించాను.

తెలుగులో టైపు చేయడానికి శ్రీ టి. దేశికాచారి గారి పోతన కీ-బోర్డు విధానాన్ని వాడాను

http://www.kavya-nandanam.com/.

అనేక తమిళ పాశురాలను, సంస్కృత శ్లోకాలను శ్రీ కృష్ణమాచారిగారి ఆంగ్ల లిపినుంచి తెలుగులో తిరగవ్రాశాను. ఇందులో అనేక దోషాలు ఉండవచ్చును. మన్నించ ప్రార్థన.

- కాజ సుధాకర బాబు



1870 కాలం నాటి చిత్రం. వికీపీడియానుండి.

# శ్రీలక్ష్మీ అష్టోత్తర శతనామ స్తోత్రము

ఓం శ్రీం శ్రియై నమః

దేవ్యువాచ:

దేవదేవ మహాదేవ త్రికాలజ్ఞ మహేశ్వర

కరుణాకర దేవేశ భక్తానుగ్రహకారక

అష్టోత్తరశతం లక్ష్మ్యా: శ్రోతుమిచ్ఛామి తత్త్వతః

ఈశ్వర ఉవాచ:

దేవి సాధు మహాభాగే మహాభాగ్య ప్రదాయకమ్

సర్వైశ్వర్యకరం పుణ్యం సర్వపాపప్రణాశనం

సర్వదారిద్ర్య శమనం శ్రవణాద్భుక్తిముక్తిదం

రాజవశ్యకరం దివ్యం గుహ్యాద్గుహ్యతరం పరం

దుర్లభం సర్వదేవానాం చతుష్షష్టి కళాస్పదం
పద్మాదీనాం వరాంతానాం నిధీనాం నిత్యదాయికం
సమస్త దేవ సంసేవ్యం అణిమాద్యష్ట సిద్ధిదమ్
కిమత్ర బహునోక్తేన దేవీ ప్రత్యక్షదాయకమ్
తవప్రీత్యాఽద్య వక్ష్యామి సమాహితమనాశ్శృణు
అష్టోత్తర శతస్యాస్య మహాలక్ష్మీ దేవతా

క్లీం బీజపదమిత్యుక్తం శక్తిస్తు భువనేశ్వరీ
అంగన్యాసః కరన్యాసః స ఇత్యాది ప్రకీర్తితః

ధ్యానం :-
వందే పద్మకరాం ప్రసన్నవదనాం సౌభాగ్యదాం భాగ్యదాం
హస్తాభ్యా మభయప్రదాం మణిగణై ర్నానావిధైర్భూషితామ్
భక్తాభీష్ట వరప్రదాం హరిహరబ్రహ్మాదిభిస్సేవితాం
పార్శ్వే పఙ్కజ శఙ్ఖపద్మనిధిభిర్యుక్తాం సదా శక్తిభిః

సరసిజనయనే సరోజహస్తే ధవళతరాంశుక గంధమాల్యశోభే
భగవతి హరివల్లభే మనోజ్ఞే త్రిభువన భూతికరి ప్రసీదమహ్యం

ప్రకృతిం వికృతిం విద్యాం సర్వభూత హితప్రదామ్
శ్రద్ధాం విభూతిం సురభిం నమామి పరమాత్మికామ్ 1

వాచం పద్మాలయాం పద్మాం శుచిం స్వాహాం స్వధాం సుధామ్
ధన్యాం హిరణ్మయీం లక్ష్మీం నిత్య పుష్టాం విభావరీమ్ 2

అదితిం చ దితిం దీప్తాం వసుధాం వసుధారిణీమ్
నమామి కమలాం కాంతాం క్షమాం క్షీరోదసంభవామ్ 3

అనుగ్రహప్రదాం బుద్ధి మనఘాం హరివల్లభామ్
అశోకా మమృతాం దీప్తాం లోకశోకవినాశినీమ్ 4

నమామి ధర్మ నిలయాం కరుణాం లోకమాతరమ్
పద్మప్రియాం పద్మహస్తాం పద్మాక్షీం పద్మసుందరీమ్ 5

పద్మోద్భవాం పద్మముఖీం పద్మనాభప్రియాం రమామ్
పద్మమాలాధరాం దేవీం పద్మినీం పద్మగంధినీమ్ 6

పుణ్యగంధాం సుప్రసన్నాం ప్రసాదాభిముఖీం ప్రభామ్
నమామి చంద్రవదనాం చంద్రాం చంద్రసహోదరీమ్ 7

చతుర్భుజాం చంద్రరూపామిందిరామిందుశీతలామ్
ఆహ్లాదజననీం పుష్టిం శివాం శివకరీం సతీమ్ 8

విమలాం విశ్వజననీం తుష్టిం దారిద్ర్యనాశినీమ్
ప్రీతిపుష్కరిణీం శాంతాం శుక్లమాల్యాంబరాం శ్రియమ్ 9

భాస్కరీం బిల్వనిలయాం వరారోహాం యశస్వినీమ్
వసుంధరా ముదారాంగాం హరిణీం హేమమాలినీమ్ 10

ధనధాన్యకరీం సిద్ధిం స్త్రైణసౌమ్యాం శుభప్రదామ్
నృపవేశ్మగతానందాం వరలక్ష్మీం వసుప్రదామ్ 11

శుభాం హిరణ్య ప్రాకారాం సముద్రతనయాం జయామ్
నమామి మంగళాం దేవీం విష్ణువక్షస్థలస్థితామ్ 12

విష్ణుపత్నీం ప్రసన్నాక్షీం నారాయణ సమాశ్రితామ్

దారిద్ర్యధ్వంసినీం దేవీం సర్వోపద్రవవారిణీం 13

నవదుర్గాం మహాకాళీం బ్రహ్మవిష్ణుశివాత్మికామ్
త్రికాలజ్ఞాన సంపన్నాం నమామి భువనేశ్వరీమ్ 14

లక్ష్మీం క్షీరసముద్రరాజతనయాం శ్రీరంగధామేశ్వరీం
దాసీభూత సమస్త దేవవనితాం లోకైక దీపాఙ్కురామ్
శ్రీమన్మంద కటాక్షలబ్ధవిభవత్ బ్రహ్మేంద్ర గంగాధరాం
త్వాం త్రైలోక్య కుటుంబినీం సరసిజాం వందే ముకుందప్రియామ్ 15

మాతర్నమామి కమలే కమలాయతాక్షి
శ్రీవిష్ణుహృత్కమలవాసిని విశ్వమాత
క్షీరోదజే కమలకోమలగర్భగౌరి
లక్ష్మి ప్రసీద సతతం నమతాం శరణ్యే 16

త్రికాలం యో జపేద్విదాన్ షణ్మాసం విజితేంద్రియః
దారిద్ర్యధ్వంసనం కృత్వా సర్వమాప్నోత్యయత్నతః
దేవీ నామసహస్రేషు పుణ్య మష్టోత్తరం శతం
యేన శ్రియమవాప్నోతి కోటిజన్మదరిద్రతః
భృగువారే శతం ధీమాన్ పఠే ద్వత్సరమాత్రకం
అష్టైశ్వర్య మవాప్నోతి కుబేర ఇవ భూతలే
దారిద్యమోచనం నామ స్తోత్రమంబాపరంశతం
యేన శ్రియమవాప్నోతి కోటిజన్మ దరిద్రతః
భుక్త్వాతు విపులాన్భోగానస్యాస్సాయుజ్యమాప్నుయాత్
ప్రాతఃకాలే పఠేన్నిత్యం సర్వదుఃఖోపశాంతయే
పఠంస్తు చింతయేద్దేవీం సర్వాభరణభూషితాం

ఇతి శ్రీలక్ష్మ్యష్టోత్తర శతనామ స్తోత్రం సమాప్తం

# శ్రీ విష్ణు సహస్రనామ స్తోత్రము

## ప్రార్థన

|| శ్రీ లక్ష్మీ నృసింహ ప్రసన్న ||

|| ఓం ||

శుక్లాంబరధరం విష్ణుం శశివర్ణం చతుర్భుజం |
ప్రసన్నవదనం ధ్యాయేత్ సర్వవిఘ్నోపశాంతయే ||

యస్యద్విరద వక్త్రాద్యాః పారిషద్యాః పరశ్శతమ్ |
విఘ్నం నిఘ్నన్తి సతతం విష్వక్సేనం తమాశ్రయే ||

వ్యాసం వసిష్ఠనప్తారం శక్తేః పౌత్రమకల్మషం |
పరాశరాత్మజం వందే శుకతాతం తపోనిధిం ||

వ్యాసాయ విష్ణురూపాయ వ్యాసరూపాయ విష్ణవే |
నమో వై బ్రహ్మనిధయే వాసిష్ఠాయ నమో నమః ||

అవికారాయ శుద్ధాయ నిత్యాయ పరమాత్మనే |
సదైకరూపరూపాయ విష్ణవే సర్వజిష్ణవే ||

యస్య స్మరణమాత్రేణ జన్మసంసారబంధనాత్ |
విముచ్యతే నమస్తస్మై విష్ణవే ప్రభవిష్ణవే ||
ఓం నమో విష్ణవే ప్రభవిష్ణవే

# పూర్వ పీఠిక

శ్రీ వైశంపాయన ఉవాచ
శృత్వా ధర్మానశేషేణ పావనాని చ సర్వశః |
యుధిష్ఠిరః శాంతనవం పునరేవాభ్యభాషత || (1)

శ్రీ యుధిష్ఠిర ఉవాచ
కిమేకం దైవతం లోకే కిం వాఽప్యేకం పరాయణం |
స్తువంతః కం కమర్చంతః ప్రాప్నుయుర్మానవాః శుభం || (2)

కో ధర్మస్సర్వధర్మాణాం భవతః పరమో మతః |
కిం జపన్ముచ్యతే జంతుర్జన్మసంసారబంధనాత్ || (3)

శ్రీ భీష్మ ఉవాచ
జగత్ప్రభుం దేవదేవమనంతం పురుషోత్తమం |
స్తువన్నామసహస్రేణ పురుషస్సతతోత్థితః || (4)

తమేవ చార్చయన్నిత్యం భక్త్యా పురుషమవ్యయం |
ధ్యాయన్ స్తువన్నమస్యంశ్చ యజమానస్తమేవ చ || (5)

అనాది నిధనం విష్ణుం సర్వలోక మహేశ్వరం |
లోకాధ్యక్షం స్తువన్నిత్యం సర్వదుఃఖాతిగో భవేత్ || (6)

బ్రహ్మణ్యం సర్వధర్మజ్ఞం లోకానాం కీర్తివర్ధనం |
లోకనాథం మహద్భూతం సర్వభూతభవోద్భవం || (7)

ఏష మే సర్వధర్మాణాం ధర్మోఽధికతమో మతః
యద్భక్త్యా పుండరీకాక్షం స్తవైరర్చేన్నరః సదా || (8)

పరమం యో మహత్తేజః పరమం యో మహత్తపః |
పరమం యో మహద్బ్రహ్మ పరమం యః పరాయణం || (9)

పవిత్రాణాం పవిత్రం యో మంగళానాం చ మంగళం |
దైవతం దేవతానాం చ భూతానాం యోఽవ్యయః పితా || (10)

యతః సర్వాణి భూతాని భవంత్యాదియుగాగమే |
యస్మింశ్చ ప్రళయం యాంతి పునరేవ యుగక్షయే || (11)

తస్య లోకప్రధానస్య జగన్నాథస్య భూపతే |
విష్ణోర్నామసహస్రం మే శ్రుణు పాపభయాపహం || (12)

యాని నామాని గౌణాని విఖ్యాతాని మహాత్మనః |
ఋషిభిః పరిగీతాని తాని వక్ష్యామి భూతయే || (13)

ఋషిర్నామ్నాం సహస్రస్య వేదవ్యాసో మహామునిః |
ఛందోఽనుష్టుప్ తథా దేవో భగవాన్ దేవకీసుతః || (14)

అమృతాంశూద్భవో బీజం శక్తిర్దేవకినందన: |
త్రిసామా హృదయం తస్య శాంత్యర్థే వినియుజ్యతే || (15)

విష్ణుం జిష్ణుం మహావిష్ణుం ప్రభవిష్ణుం మహేశ్వరం |
అనేకరూపదైత్యాంతం నమామి పురుషోత్తమం || (16)

## సంకల్పము

అస్య శ్రీ విష్ణోర్దివ్యసహస్రనామస్తోత్రమహామంత్రస్య |

శ్రీ వేదవ్యాసో భగవాన్ ఋషిః |

అనుష్టుప్ ఛందః |

శ్రీమహావిష్ణుః పరమాత్మా శ్రీమన్నారాయణో దేవతా |

అమృతాంశూద్భవో భానురితి బీజం |

దేవకీనందనః స్రష్టేతి శక్తిః |

ఉద్భవః క్షోభణో దేవ ఇతి పరమో మంత్రః |

శంఖభృన్నందకీ చక్రీతి కీలకం |

శార్ఙ్గధన్వా గదాధర ఇత్యస్త్రం |

రథాంగపాణిరక్షోభ్య ఇతి నేత్రం |

త్రిసామా సామగః సామేతి కవచం |

ఆనందం పరబ్రహ్మేతి యోనిః |

ఋతుస్సుదర్శనః కాల ఇతి దిగ్బంధః |

శ్రీ విశ్వరూప ఇతి ధ్యానం |

శ్రీమహావిష్ణుప్రీత్యర్థే సహస్రనామ జపే వినియోగః |

## ధ్యానం

క్షీరోదన్వత్ప్రదేశే శుచిమణివిలసత్ సైకతే మౌక్తికానాం

మాలాక్లుప్తాసనస్థః స్ఫటికమణినిభైర్మౌక్తికైర్మండితాంగః |

శుభ్రైరభ్రైరదభ్రైరుపరివిరచితైర్ముక్తపీయూషవర్షైః

ఆనందీ నః పునీయాదరినళిన గదా శంఖ పాణిర్ముకుందః ||

భూః పాదౌ యస్య నాభిర్వియదసురనిలశ్చంద్రసూర్యౌ చ నేత్రే

కర్ణావాశాః శిరో ద్యౌర్ముఖమపి దహనో యస్య వాస్తేయమబ్ధిః |

అంతఃస్థం యస్య విశ్వం సుర నర ఖగ గో భోగి గంధర్వ దైత్యైః

చిత్రం రం రమ్యతే తం త్రిభువనవపుషం విష్ణుమీశం నమామి ||

ఓం నమో భగవతే వాసుదేవాయ |

శాంతాకారం భుజగశయనం పద్మనాభం సురేశం
విశ్వాధారం గగనసదృశం మేఘవర్ణం శుభాంగం |
లక్ష్మీకాంతం కమలనయనం యోగిహృద్ధ్యానగమ్యం
వందే విష్ణుం భవభయహరం సర్వలోకైకనాథం ||

మేఘశ్యామం పీతకౌశేయవాసం
శ్రీవత్సాంకం కౌస్తుభోద్భాసితాంగం |
పుణ్యోపేతం పుండరీకాయతాక్షం
విష్ణుం వందే సర్వలోకైకనాథం ||

నమస్సమస్తభూతానామాదిభూతాయ భూభృతే |
అనేకరూపరూపాయ విష్ణవే ప్రభవిష్ణవే ||

సశంఖచక్రం సకిరీటకుండలం
సపీతవస్త్రం సరసీరుహేక్షణం |
సహారవక్షఃస్థలశోభికౌస్తుభం
నమామి విష్ణుం శిరసా చతుర్భుజం ||

ఛాయాయాం పారిజాతస్య హేమసింహాసనోపరి |
ఆసీనమంబుదశ్యామమాయతాక్షమలంకృతం ||
చంద్రాననం చతుర్బాహుం శ్రీవత్సాంకితవక్షసం |
రుక్మిణీసత్యభామాభ్యాం సహితం కృష్ణమాశ్రయే ||

## స్తోత్రము

|| హరిః ఓం ||

విశ్వం విష్ణుర్వషట్కారో భూతభవ్యభవత్ప్రభుః |
భూతకృద్భూతభృద్భావో భూతాత్మా భూతభావనః || (1)

పూతాత్మా పరమాత్మా చ ముక్తానాం పరమా గతిః |
అవ్యయః పురుషః సాక్షీ క్షేత్రజ్ఞోఽక్షర ఏవ చ || (2)

యోగో యోగవిదాం నేతా ప్రధానపురుషేశ్వరః |
నారసింహవపుః శ్రీమాన్ కేశవః పురుషోత్తమః || (3)

సర్వః శర్వః శివః స్థాణుర్భూతాదిర్నిధిరవ్యయః |
సంభవో భావనో భర్తా ప్రభవః ప్రభురీశ్వరః || (4)

స్వయంభూశ్శంభురాదిత్యః పుష్కరాక్షో మహాస్వనః |
అనాదినిధనో ధాతా విధాతా ధాతురుత్తమః || (5)

అప్రమేయో హృషీకేశః పద్మనాభోఽమరప్రభుః |
విశ్వకర్మా మనుస్త్వష్టా స్థవిష్ఠస్స్థవిరో ధ్రువః || (6)

అగ్రాహ్యః శాశ్వతః కృష్ణో లోహితాక్షః ప్రతర్దనః |
ప్రభూతస్త్రికకుబ్ధామ పవిత్రం మంగళం పరం || (7)

ఈశానః ప్రాణదః ప్రాణో జ్యేష్ఠః శ్రేష్ఠః ప్రజాపతిః |
హిరణ్యగర్భో భూగర్భో మాధవో మధుసూదనః || (8)

ఈశ్వరో విక్రమీ ధన్వీ మేధావీ విక్రమః క్రమః |
అనుత్తమో దురాధర్షః కృతజ్ఞః కృతిరాత్మవాన్ || (9)

సురేశః శరణం శర్మ విశ్వరేతాః ప్రజాభవః |
అహః సంవత్సరో వ్యాళః ప్రత్యయస్సర్వదర్శనః || (10)

అజః సర్వేశ్వరః సిద్ధః సిద్ధిః సర్వాదిరచ్యుతః |
వృషాకపిరమేయాత్మా సర్వయోగవినిస్సృతః || (11)

వసుర్వసుమనాః సత్యః సమాత్మా సంమితః సమః |

అమోఘః పుండరీకాక్షో వృషకర్మా వృషాకృతిః || (12)

రుద్రో బహుశిరా బభ్రుర్విశ్వయోనిః శుచిశ్రవాః |
అమృతః శాశ్వతః స్థాణుర్వరారోహో మహాతపాః || (13)

సర్వగః సర్వవిద్భానుర్విష్వక్సేనో జనార్దనః |
వేదో వేదవిదవ్యంగో వేదాంగో వేదవిత్కవిః || (14)

లోకాధ్యక్షః సురాధ్యక్షో ధర్మాధ్యక్షః కృతాకృతః |
చతురాత్మా చతుర్వ్యూహశ్చతుర్దంష్ట్రశ్చతుర్భుజః || (15)

భ్రాజిష్ణుర్భోజనం భోక్తా సహిష్ణుర్జగదాదిజః |
అనఘో విజయో జేతా విశ్వయోనిః పునర్వసుః || (16)

ఉపేంద్రో వామనః ప్రాంశురమోఘః శుచిరూర్జితః |
అతీంద్రః సంగ్రహః సర్గో ధృతాత్మా నియమో యమః || (17)

వేద్యో వైద్యః సదాయోగీ వీరహా మాధవో మధుః |
అతీంద్రియో మహామాయో మహోత్సాహో మహాబలః || (18)

మహాబుద్ధిర్మహావీర్యో మహాశక్తిర్మహాద్యుతిః |
అనిర్దేశ్యవపుః శ్రీమానమేయాత్మా మహాద్రిధృక్ || (19)

మహేష్వాసో మహీభర్తా శ్రీనివాసః సతాం గతిః |
అనిరుద్ధః సురానందో గోవిందో గోవిదాం పతిః || (20)

మరీచిర్దమనో హంసః సుపర్ణో భుజగోత్తమః |
హిరణ్యనాభః సుతపాః పద్మనాభః ప్రజాపతిః || (21)

అమృత్యుః సర్వదృక్సింహః సంధాతా సంధిమాన్ స్థిరః |
అజో దుర్మర్షణః శాస్తా విశ్రుతాత్మా సురారిహా || (22)

గురుర్గురుతమో ధామః సత్యః సత్యపరాక్రమః |
నిమిషోనిమిషః స్రగ్వీ వాచస్పతిరుదారధీః || (23)

అగ్రణీర్గ్రామణీః శ్రీమాన్ న్యాయో నేతా సమీరణః |
సహస్రమూర్ధా విశ్వాత్మా సహస్రాక్షః సహస్రపాత్ || (24)

ఆవర్తనో నివృత్తాత్మా సంవృతః సంప్రమర్దనః |
అహః సంవర్తకో వహ్నిరనిలో ధరణీధరః || (25)

సుప్రసాదః ప్రసన్నాత్మా విశ్వధృగ్విశ్వభుగ్విభుః |
సత్కర్తా సత్కృతః సాధుర్జహ్నుర్నారాయణో నరః || (26)

అసంఖ్యేయోఽప్రమేయాత్మా విశిష్టః శిష్టకృచ్ఛుచిః |
సిద్ధార్థః సిద్ధసంకల్పః సిద్ధిదః సిద్ధిసాధనః || (27)

వృషాహీ వృషభో విష్ణుర్వృషపర్వా వృషోదరః |
వర్ధనో వర్ధమానశ్చ వివిక్తః శ్రుతిసాగరః || (28)

సుభుజో దుర్ధరో వాగ్మీ మహేంద్రో వసుదో వసుః |
నైకరూపో బృహద్రూపః శిపివిష్టః ప్రకాశనః || (29)

ఓజస్తేజోద్యుతిధరః ప్రకాశాత్మా ప్రతాపనః |
ఋద్ధః స్పష్టాక్షరో మంత్రశ్చంద్రాంశుర్భాస్కరద్యుతిః || (30)

అమృతాంశూద్భవో భానుః శశబిందుః సురేశ్వరః |
ఔషధం జగతః సేతుః సత్యధర్మపరాక్రమః || (31)

భూతభవ్యభవన్నాథః పవనః పావనోనలః |
కామహా కామకృత్ కాంతః కామః కామప్రదః ప్రభుః || (32)

యుగాదికృద్యుగావర్తో నైకమాయో మహాశనః |

అదృశ్యోऽవ్యక్తరూపశ్చ సహస్రజిదనంతజిత్ || (33)

ఇష్టోऽవిశిష్టః శిష్టేష్టః శిఖండీ నహుషో వృషః |
క్రోధహా క్రోధకృత్కర్తా విశ్వబాహుర్మహీధరః || (34)

అచ్యుతః ప్రథితః ప్రాణః ప్రాణదో వాసవానుజః |
అపాం నిధిరధిష్ఠానమప్రమత్తః ప్రతిష్ఠితః || (35)

స్కందః స్కందధరో ధుర్యో వరదో వాయువాహనః |
వాసుదేవో బృహద్భానురాదిదేవః పురందరః || (36)

అశోకస్తారణస్తారః శూరః శౌరిర్జనేశ్వరః |
అనుకూలః శతావర్తః పద్మీ పద్మనిభేక్షణః || (37)

పద్మనాభోऽరవిందాక్షః పద్మగర్భః శరీరభృత్ |
మహర్ధిర్‌ఋద్ధో వృద్ధాత్మా మహాక్షో గరుడధ్వజః || (38)

అతులః శరభో భీమః సమయజ్ఞో హవిర్హరిః |
సర్వలక్షణలక్షణ్యో లక్ష్మీవాన్ సమితింజయః || (39)

విక్షరో రోహితో మార్గో హేతుర్దామోదరస్సహః |
మహీధరో మహాభాగో వేగవానమితాశనః || (40)

ఉద్భవః క్షోభణో దేవః శ్రీగర్భః పరమేశ్వరః |
కరణం కారణం కర్తా వికర్తా గహనో గుహః || (41)

వ్యవసాయో వ్యవస్థానః సంస్థానః స్థానదో ధ్రువః |
పరర్ధిః పరమస్పష్టస్తుష్టః పుష్టః శుభేక్షణః || (42)

రామో విరామో విరతో (విరజో) మార్గో నేయో నయోऽనయః |
వీరః శక్తిమతాం శ్రేష్ఠో ధర్మో ధర్మవిదుత్తమః || (43)

వైకుంఠః పురుషః ప్రాణః ప్రాణదః ప్రణవః పృథుః |
హిరణ్యగర్భః శత్రుఘ్నో వ్యాప్తో వాయురధోక్షజః || (44)

ఋతుః సుదర్శనః కాలః పరమేష్ఠీ పరిగ్రహః |
ఉగ్రః సంవత్సరో దక్షో విశ్రామో విశ్వదక్షిణః || (45)

విస్తారః స్థావరఃస్థాణుః ప్రమాణం బీజమవ్యయం |
అర్థోऽనర్థో మహాకోశో మహాభోగో మహాధనః || (46)

అనిర్విణ్ణః స్థవిష్ఠోభూర్ధర్మయూపో మహామఖః |
నక్షత్రనేమిర్నక్షత్రీ క్షమః క్షామః సమీహనః || (47)

యజ్ఞ ఇజ్యో మహేజ్యశ్చ క్రతుః సత్రం సతాం గతిః |
సర్వదర్శీ విముక్తాత్మా సర్వజ్ఞోజ్ఞానముత్తమం || (48)

సువ్రతః సుముఖః సూక్ష్మః సుఘోషః సుఖదః సుహృత్ |
మనోహరో జితక్రోధో వీరబాహుర్విదారణః || (49)

స్వాపనస్స్వవశో వ్యాపీ నైకాత్మా నైకకర్మకృత్ |
వత్సరో వత్సలో వత్సీ రత్నగర్భో ధనేశ్వరః || (50)

ధర్మగుబ్ధర్మకృద్ధర్మీ సదసత్క్షరమక్షరం |
అవిజ్ఞాతా సహస్రాంశుర్విధాతా కృతలక్షణః || (51)

గభస్తినేమిః సత్త్వస్థః సింహో భూతమహేశ్వరః |
ఆదిదేవో మహాదేవో దేవేశో దేవభృద్గురుః || (52)

ఉత్తరో గోపతిర్గోప్తా జ్ఞానగమ్యః పురాతనః |
శరీరభూతభృద్భోక్తా కపీంద్రో భూరిదక్షిణః || (53)

సోమపోऽమృతపః సోమః పురుజిత్ పురుసత్తమః |
వినయో జయః సత్యసంధో దాశార్హస్సాత్వతాం పతిః || (54)

జీవో వినయితాసాక్షీ ముకుందోऽమితవిక్రమః |
అంభోనిధిరనంతాత్మా మహోదధిశయోऽంతకః || (55)

అజో మహార్హః స్వాభావ్యో జితామిత్రః ప్రమోదనః |
ఆనందో నందనో నందః సత్యధర్మా త్రివిక్రమః || (56)

మహర్షిః కపిలాచార్యః కృతజ్ఞో మేదినీపతిః |
త్రిపదస్త్రిదశాధ్యక్షో మహాశృంగః కృతాంతకృత్ || (57)

మహావరాహో గోవిందః సుషేణః కనకాంగదీ |
గుహ్యో గభీరో గహనో గుప్తశ్చక్రగదాధరః || (58)

వేధాస్స్వాంగోऽజితః కృష్ణో దృఢస్సంకర్షణోచ్యుతః |
వరుణో వారుణో వృక్షః పుష్కరాక్షో మహామనాః || (59)

భగవాన్ భగహానందీ వనమాలీ హలాయుధః |
ఆదిత్యో జ్యోతిరాదిత్యః సహిష్ణుర్గతిసత్తమః || (60)

సుధన్వా ఖండపరశుర్దారుణో ద్రవిణప్రదః |
దివస్పృక్ సర్వదృగ్వ్యాసో వాచస్పతిరయోనిజః || (61)

త్రిసామా సామగః సామ నిర్వాణం భేషజం భిషక్ |
సంన్యాసకృచ్ఛమశ్శాంతో నిష్ఠా శాంతిః పరాయణం || (62)

శుభాంగః శాంతిదః స్రష్టా కుముదః కువలేశయః |
గోహితో గోపతిర్గోప్తా వృషభాక్షో వృషప్రియః || (63)

అనివర్తీ నివృత్తాత్మా సంక్షేప్తా క్షేమకృచ్ఛివః |
శ్రీవత్సవక్షాః శ్రీవాసః శ్రీపతిః శ్రీమతాం వరః || (64)

శ్రీదః శ్రీశః శ్రీనివాసః శ్రీనిధిః శ్రీవిభావనః |

శ్రీధరః శ్రీకరః శ్రేయః శ్రీమాన్ లోకత్రయాశ్రయః || (65)

స్వక్షః స్వంగః శతానందో నందిర్జ్యోతిర్గణేశ్వరః |
విజితాత్మా విధేయాత్మా సత్కీర్తిశ్ఛిన్నసంశయః || (66)

ఉదీర్ణః సర్వతశ్చక్షురనీశః శాశ్వతస్థిరః |
భూశయో భూషణో భూతిర్విశోకశ్శోకనాశనః || (67)

అర్చిష్మానర్చితః కుంభో విశుద్ధాత్మా విశోధనః |
అనిరుద్ధోఽప్రతిరథః ప్రద్యుమ్నోమితవిక్రమః || (68)

కాలనేమినిహా వీరః శౌరిః శూరజనేశ్వరః |
త్రిలోకాత్మా త్రిలోకేశః కేశవః కేశిహా హరిః || (69)

కామదేవః కామపాలః కామీ కాంతః కృతాగమః |
అనిర్దేశ్యవపుర్విష్ణుర్వీరోఽనంతో ధనంజయః || (70)

బ్రహ్మణ్యో బ్రహ్మకృద్బ్రహ్మ బ్రహ్మ బ్రహ్మవివర్ధనః |
బ్రహ్మవిద్బ్రాహ్మణో బ్రహ్మీ బ్రహ్మజ్ఞో బ్రాహ్మణప్రియః || (71)

మహాక్రమో మహాకర్మా మహాతేజా మహోరగః |
మహాక్రతుర్మహాయజ్వా మహాయజ్ఞో మహాహవిః || (72)

స్తవ్యః స్తవప్రియః స్తోత్రం స్తుతిః స్తోతా రణప్రియః |
పూర్ణః పూరయితా పుణ్యః పుణ్యకీర్తిరనామయః || (73)

మనోజవస్తీర్థకరో వసురేతా వసుప్రదః |
వసుప్రదో వాసుదేవో వసుర్వసుమనా హవిః || (74)

సద్గతిః సత్కృతిః సత్తా సద్భూతిః సత్పరాయణః |
శూరసేనో యదుశ్రేష్ఠః సన్నివాసః సుయామునః || (75)

భూతావాసో వాసుదేవస్సర్వాసునిలయోనలః |
దర్పహా దర్పదో దృప్తో దుర్ధరోథాఽపరాజితః || (76)

విశ్వమూర్తిర్మహామూర్తిర్దీప్తమూర్తిరమూర్తిమాన్ |
అనేకమూర్తిరవ్యక్తః శతమూర్తిః శతాననః || (77)

ఏకో నైకః సవః కః కిం యత్తత్పదమనుత్తమం |
లోకబంధుర్లోకనాథో మాధవో భక్తవత్సలః || (78)

సువర్ణవర్ణో హేమాంగో వరాంగశ్చందనాంగదీ |
వీరహా విషమః శూన్యో ఘృతాశీరచలశ్చలః || (79)

అమానీ మానదో మాన్యో లోకస్వామీ త్రిలోకధృత్ |
సుమేధా మేధజో ధన్యః సత్యమేధా ధరాధరః || (80)

తేజోవృషో ద్యుతిధరః సర్వశస్త్రభృతాం వరః |
ప్రగ్రహో నిగ్రహో వ్యగ్రో నైకశృంగో గదాగ్రజః || (81)

చతుర్మూర్తిశ్చతుర్బాహుశ్చతుర్వ్యూహశ్చతుర్గతిః |
చతురాత్మా చతుర్భావశ్చతుర్వేదవిదేకపాత్ || (82)

సమావర్తోనివృత్తాత్మా దుర్జయో దురతిక్రమః |
దుర్లభో దుర్గమో దుర్గో దురావాసో దురారిహా || (83)

శుభాంగో లోకసారంగః సుతంతుస్తంతువర్ధనః |
ఇంద్రకర్మా మహాకర్మా కృతకర్మా కృతాగమః || (84)

ఉద్భవః సుందరః సుందో రత్నానాభస్సులోచనః |
అర్కో వాజసనః శృంగీ జయంతః సర్వవిజ్జయీ || (85)

సువర్ణబిందురక్షోభ్యః సర్వవాగీశ్వరేశ్వరః |
మహాహ్రదో మహాగర్తో మహాభూతో మహానిధిః || (86)

కుముదః కుందరః కుందః పర్జన్యః పావనోఽనిలః
అమృతాంశోఽమృతవపుస్సర్వజ్ఞః సర్వతోముఖః || (87)

సులభః సువ్రతః సిద్ధః శత్రుజిచ్ఛత్రుతాపనః |
న్యగ్రోధోదుంబరోఽశ్వత్థశ్చాణూరాంధ్రనిషూదనః || (88)

సహస్రార్చిః సప్తజిహ్వః సప్తైధాః సప్తవాహనః |
అమూర్తిరనఘోఽచింత్యో భయకృద్భయనాశనః || (89)

అణుర్బృహత్కృశః స్థూలో గుణభృన్నిర్గుణో మహాన్ |
అధృతస్స్వధృతస్స్వాస్యః ప్రాగ్వంశో వంశవర్ధనః || (90)

భారభృత్ కథితో యోగీ యోగీశః సర్వకామదః |
ఆశ్రమః శ్రమణః క్షామః సుపర్ణో వాయువాహనః || (91)

ధనుర్ధరో ధనుర్వేదో దండో దమయితా దమః |
అపరాజితస్సర్వసహో నియంతా నియమో యమః || (92)

సత్త్వవాన్ సాత్త్వికః సత్యః సత్యధర్మపరాయణః |
అభిప్రాయః ప్రియార్హోఽర్హః ప్రియకృత్ ప్రీతివర్ధనః || (93)

విహాయసగతిర్జ్యోతిః సురుచిర్హుతభుగ్విభుః |
రవిర్విరోచనః సూర్యః సవితా రవిలోచనః || (94)

అనంతో హుతభుగ్భోక్తా సుఖదో నైకదోఽగ్రజః |
అనిర్విణ్ణః సదామర్షీ లోకాధిష్ఠానమద్భుతః || (95)

సనాత్సనాతనతమః కపిలః కపిరవ్యయః |
స్వస్తిదః స్వస్తికృత్ స్వస్తి స్వస్తిభుక్ స్వస్తిదక్షిణః || (96)

అరౌద్రః కుండలీ చక్రీ విక్రమ్యూర్జితశాసనః |

శబ్దాతిగః శబ్దసహః శిశిరః శర్వరీకరః || (97)

అక్రూరః పేశలో దక్షో దక్షిణః క్షమిణాం వరః |
విద్వత్తమో వీతభయః పుణ్యశ్రవణకీర్తనః || (98)

ఉత్తారణో దుష్కృతిహా పుణ్యో దుఃస్వప్ననాశనః |
వీరహా రక్షణస్సంతో జీవనః పర్యవస్థితః || (99)

అనంతరూపోऽనంతశ్రీర్జితమన్యుర్భయాపహః |
చతురశ్రో గభీరాత్మా విదిశో వ్యాదిశో దిశః || (100)

అనాదిర్భూర్భువో లక్ష్మీస్సువీరో రుచిరాంగదః |
జననో జనజన్మాదిర్భీమో భీమపరాక్రమః || (101)

ఆధారనిలయోధాతా పుష్పహాసః ప్రజాగరః |
ఊర్ధ్వగస్సత్పథాచారః ప్రాణదః ప్రణవః పణః || (102)

ప్రమాణం ప్రాణనిలయః ప్రాణభృత్ ప్రాణజీవనః |
తత్త్వం తత్త్వవిదేకాత్మా జన్మమృత్యుజరాతిగః || (103)

భూర్భువఃస్వస్తరుస్తారః సవితా ప్రపితామహః |
యజ్ఞో యజ్ఞపతిర్యజ్వా యజ్ఞాంగో యజ్ఞవాహనః || (104)

యజ్ఞభృద్యజ్ఞకృద్యజ్ఞీ యజ్ఞభుగ్యజ్ఞసాధనః |
యజ్ఞాంతకృద్యజ్ఞగుహ్యమన్నమన్నాద ఏవ చ || (105)

ఆత్మయోనిః స్వయంజాతో వైఖానః సామగాయనః |
దేవకీనందనః స్రష్టా క్షితీశః పాపనాశనః || (106)

శంఖభృన్నందకీ చక్రీ శార్ఙ్గధన్వా గదాధరః |
రథాంగపాణిరక్షోభ్యః సర్వప్రహరణాయుధః || (107)

|| శ్రీ సర్వప్రహరణాయుధ ఓం నమః ఇతి ||

వనమాలీ గదీ శార్ఙ్గీ శంఖీ చక్రీ చ నందకీ |
శ్రీమాన్ నారాయణో విష్ణుర్వాసుదేవోఽభిరక్షతు ||

వనమాలీ గదీ శార్ఙ్గీ శంఖీ చక్రీ చ నందకీ |
శ్రీమాన్ నారాయణో విష్ణుర్వాసుదేవోఽభిరక్షతు ||

వనమాలీ గదీ శార్ఙ్గీ శంఖీ చక్రీ చ నందకీ |
శ్రీమాన్ నారాయణో విష్ణుర్వాసుదేవోఽభిరక్షతు ||

||శ్రీ వాసుదేవోఽభిరక్షతు ఓం నమః ఇతి ||

## ఫలశ్రుతిః

ఇతీదం కీర్తనీయస్య కేశవస్య మహాత్మనః |
నామ్నాం సహస్రం దివ్యానామశేషేణ ప్రకీర్తితం || (1)

య ఇదం శృణుయాన్నిత్యం యశ్చాపి పరికీర్తయేత్ |
నాఽశుభం ప్రాప్నుయాత్ కించిత్ సోఽముత్రేహ చ మానవః || (2)

వేదాంతగో బ్రాహ్మణః స్యాత్ క్షత్రియో విజయీ భవేత్ |
వైశ్యో ధనసమృద్ధః స్యాత్ శూద్రస్సుఖమవాప్నుయాత్ || (3)

ధర్మార్థీ ప్రాప్నుయాద్ధర్మం అర్థార్థీ చార్థమాప్నుయాత్ |
కామానవాప్నుయాత్ కామీ ప్రజార్థీ చాప్నుయాత్ ప్రజాం || (4)

భక్తిమాన్ యః సదోత్థాయ శుచిస్తద్గతమానసః |
సహస్రం వాసుదేవస్య నామ్నామేతత్ ప్రకీర్తయేత్ || (5)

యశః ప్రాప్నోతి విపులం యాతి ప్రాధాన్యమేవ చ |
అచలాం శ్రియమాప్నోతి శ్రేయః ప్రాప్నోత్యనుత్తమం || (6)

న భయం క్వచిదాప్నోతి వీర్యం తేజశ్చ విందతి |
భవత్యరోగో ద్యుతిమాన్ బలరూపగుణాన్వితః || (7)

రోగార్తో ముచ్యతే రోగాద్బద్ధో ముచ్యేత బంధనాత్ |
భయాన్ముచ్యేత భీతస్తు ముచ్యేతాపన్న ఆపదః || (8)

దుర్గాణ్యతితరత్యాశు పురుషః పురుషోత్తమం |
స్తువన్నామసహస్రేణ నిత్యం భక్తిసమన్వితః || (9)

వాసుదేవాశ్రయో మర్త్యో వాసుదేవపరాయణః |
సర్వపాపవిశుద్ధాత్మా యాతి బ్రహ్మ సనాతనం || (10)

న వాసుదేవభక్తానామశుభం విద్యతే క్వచిత్ |
జన్మమృత్యుజరావ్యాధిభయం నైవోపజాయతే || (11)

ఇమం స్తవమధీయానః శ్రద్ధాభక్తిసమన్వితః |
యుజ్యేతాత్మాసుఖక్షాంతిశ్రీధృతిస్మృతికీర్తిభిః || (12)

న క్రోధో న చ మాత్సర్యం న లోభో నాశుభా మతిః |
భవంతి కృతపుణ్యానాం భక్తానాం పురుషోత్తమే || (13)

ద్యౌస్సచంద్రార్కనక్షత్రా ఖం దిశో భూర్మహోదధిః |
వాసుదేవస్య వీర్యేణ విధృతాని మహాత్మనః || (14)

ససురాసురగంధర్వం సయక్షోరగరాక్షసం |
జగద్వశే వర్తతేదం కృష్ణస్య సచరాచరం || (15)

ఇంద్రియాణి మనో బుద్ధిః సత్త్వం తేజో బలం ధృతిః |
వాసుదేవాత్మకాన్యాహుః క్షేత్రం క్షేత్రజ్ఞ ఏవ చ || (16)

సర్వాగమానామాచారః ప్రథమం పరికల్పతే |
ఆచారప్రభవో ధర్మో ధర్మస్య ప్రభురచ్యుతః || (17)

ఋషయః పితరో దేవా మహాభూతాని ధాతవః |
జంగమాజంగమం చేదం జగన్నారాయణోద్భవం || (18)

యోగో జ్ఞానం తథా సాంఖ్యం విద్యాః శిల్పాదికర్మ చ |
వేదాశ్శాస్త్రాణి విజ్ఞానమేతత్సర్వం జనార్దనాత్ || (19)

ఏకో విష్ణుర్మహద్భూతం పృథగ్భూతాన్యనేకశః |
త్రీన్‌లోకాన్వ్యాప్య భూతాత్మా భుంక్తే విశ్వభుగవ్యయః || (20)

ఇమం స్తవం భగవతో విష్ణోర్వ్యాసేన కీర్తితం |
పఠేద్య ఇచ్ఛేత్పురుషః శ్రేయః ప్రాప్తుం సుఖాని చ || (21)

విశ్వేశ్వరమజం దేవం జగతః ప్రభుమవ్యయం |
భజంతి యే పుష్కరాక్షం న తే యాంతి పరాభవం || (22)

|| న తే యాంతి పరాభవం ఓం నమ ఇతి ||

అర్జున ఉవాచ
పద్మపత్ర విశాలాక్ష పద్మనాభ సురోత్తమ |
భక్తానామనురక్తానాం త్రాతా భవ జనార్దన ||

శ్రీ భగవానువాచ
యో మాం నామసహస్రేణ స్తోతుమిచ్ఛతి పాండవ |
సోఽహమేకేన శ్లోకేన స్తుత ఏవ న సంశయః ||

|| స్తుత ఏవ న సంశయ ఓం నమ ఇతి ||

వ్యాస ఉవాచ

వాసనాద్వాసుదేవస్య వాసితం భువనత్రయం |
సర్వభూతనివాసోఽసి వాసుదేవ నమోస్తు తే ||

|| శ్రీవాసుదేవ నమోస్తుత ఓం నమ ఇతి ||

పార్వత్యువాచ
కేనోపాయేన లఘునా విష్ణోర్నామసహస్రకం |
పఠ్యతే పండితైర్నిత్యం శ్రోతుమిచ్ఛామ్యహం ప్రభో ||

ఈశ్వర ఉవాచ
శ్రీరామ రామ రామేతి రమే రామే మనోరమే |
సహస్రనామ తత్తుల్యం రామనామ వరాననే ||

శ్రీరామ రామ రామేతి రమే రామే మనోరమే |
సహస్రనామ తత్తుల్యం రామనామ వరాననే ||

శ్రీరామ రామ రామేతి రమే రామే మనోరమే |
సహస్రనామ తత్తుల్యం రామనామ వరాననే ||

|| శ్రీ రామనామ వరానన ఓం నమ ఇతి ||

బ్రహ్మోవాచ
నమోఽస్త్వనంతాయ సహస్రమూర్తయే
సహస్రపాదాక్షిశిరోరుబాహవే |
సహస్రనామ్నే పురుషాయ శాశ్వతే
సహస్రకోటియుగధారిణే నమః ||

|| సహస్రకోటియుగధారిణే నమ ఓం నమ ఇతి ||

సంజయ ఉవాచ
యత్ర యోగేశ్వరః కృష్ణో యత్ర పార్థో ధనుర్ధరః |

తత్ర శ్రీర్విజయో భూతిర్ధ్రువా నీతిర్మతిర్మమ ||

శ్రీభగవానువాచ

అనన్యాశ్చింతయంతో మాం యే జనాః పర్యుపాసతే |
తేషాం నిత్యాభియుక్తానాం యోగక్షేమం వహామ్యహం ||

పరిత్రాణాయ సాధూనాం వినాశాయ చ దుష్కృతాం |
ధర్మసంస్థాపనార్థాయ సంభవామి యుగే యుగే ||

ఆర్తా విషణ్ణాః శిథిలాశ్చ భీతాః
ఘోరేషు చ వ్యాధిషు వర్తమానాః |
సంకీర్త్య నారాయణశబ్దమాత్రం
విముక్తదుఃఖాః సుఖినో భవంతి ||

కాయేన వాచా మనసేంద్రియైర్వా
బుద్ధ్యాత్మనా వా ప్రకృతేః స్వభావాత్ |
కరోమి యద్యత్ సకలం పరస్మై
నారాయణాయేతి సమర్పయామి ||

|| ఓం శాంతిః శాంతిః శాంతిః ||

(తెలుగు వికీసోర్సు నుండి కాపీ చేయబడినది.)

# శ్రీ విష్ణు సహస్ర నామములు

## శ్రీ శంకరుల భాష్యానికీ, శ్రీ భట్టుల భాష్యానికీ పోలికలు, తేడాలు

ఈ భాగంలో, ఒక పది నామములను ఉదాహరణగా తీసికొని, శ్రీ విష్ణు సహస్రనామంపై శ్రీ ఆది శంకరాచార్యులూ, శ్రీ పరాశరభట్టులవారూ రచించిన భాష్యాలను పోల్చి చూద్దాము. ఈ ఉదాహరణలు శ్రీ విష్ణు సహస్రనామ స్తోత్రానికి శ్రీ పి.బి. అణ్ణాంగారాచార్య స్వామి గారి వ్యాఖ్యానము యొక్క ఉపోద్ఘాతమునుండి గ్రహింపబడ్డాయి. వేయి నామాలలో పదినామాలను మాత్రం తీసుకొని ఈ విధంగా విశ్లేషణ చేయడం అసంపూర్ణ ప్రయోగమే అవుతుంది. సునిశితమైన పరిశీలన ఒక బృహత్కార్యం. ముందు ముందు ఇది జరుగవచ్చును.

అన్నీ వివరంగా చదువడానికి ఆసక్తి లేనివారి కోసం – ఈ వ్యాసంలో అనుసరించిన ఆలోచనా ధోరణి క్లుప్తంగా ఇది. శ్రీ అణ్ణాంగారాచారిగారు స్పష్టంగా చెప్పినదేమంటే – శ్రీ భట్టులవారు తమ వ్యాఖ్యానంలో భక్తులపట్ల భగవంతుని సౌలభ్య, సౌశీల్య గుణాలను ప్రధానంగా ప్రస్తావించారు. శ్రీ శంకరులవారి భాష్యంలో పరబ్రహ్మముయొక్క పరత్వము ప్రధానంగా తెలియజెప్పబడింది.

శ్రీ పి. శంకరనారాయణ్ 'శ్రీ విష్ణు సహహస్రనామము' గ్రంథానికి పరిచయ వాక్యాలు వ్రాస్తూ శ్రీ ఎన్. రఘునాథన్ వెలిబుచ్చిన అభిప్రాయాన్ని నేను మరల మరల చెప్పడానికి ఇష్టపడతాను – మనకు వివిధ వ్యాఖ్యానాల ద్వారా వేరు వేరు భావార్థాలు లభించినప్పుడు, అవి ఒకదాని కొకటి తోడై ఈ జ్ఞానసంపదను ఎన్నోరెట్లు పెంచుతాయని గ్రహించాలి – ఈ వ్యాస పరంపరలో నేను (శ్రీ కృష్ణమాచారి) దాదాపు పది వ్యాఖ్యానాలనుండి విషయపరంపరను సేకరించాను. ప్రతి వ్యాఖ్యానములోను ఏదో ఒక ప్రత్యేకత కనుపిస్తుంది. ఇలా వేరువేరు రచయితల అనుభవ సంపదను వారి వ్యాఖ్యానాలనుండి ప్రోగు చేసుకోవడంమనకు బహుముఖంగా లభించే బహుమానాల వంటివి. (Multiple bonuses)

ఇప్పుడు కొన్ని వివరాలనులను పరిశీలిద్దాము. వారి వ్యాఖ్యానాలను పోల్చి చూసేటపుడు మనం గమనింపవలసిన విషయం –

శ్రీ శంకరులు సుప్రసిద్ధ అద్వైత వేదాంతి. అద్వైత వేదాంతికి నిర్గుణ పరబ్రహ్మమే పరమ సత్యము. ఆ సత్య శోధనామార్గంలో సగుణ బ్రహ్మోపాసన ఒక సాధనము. ఇందు వలన శ్రీ శంకరుల భాష్యములో శృతి, స్మృతుల ఆధారమునకు, శబ్దార్థ వివరణకు ఇచ్చిన ప్రాధాన్యత సగుణ బ్రహ్మముయొక్క గుణానుభవవములకు ఇచ్చినట్లుగా అనుపించదు. శ్రీ శంకరుల వివరణలు ముఖ్యంగా బ్రహ్మము యొక్క సర్వాధిక్యతను, సకల శక్తిత్వమును, బ్రహ్మజ్ఞానార్జనలోని క్లిష్టతను సూచించును.

శ్రీ పరాశర భట్టులు శ్రీ రంగనాథ స్వామి, శ్రీ రంగనాయకి అమ్మవార్ల పెంపుడు బిడ్డ. ఆయన తండ్రి శ్రీ కురత్తాళ్వాన్ విశిష్టాద్వైత సంప్రదాయ ప్రవీణులు మరియు శ్రీ భగవద్రామానుజుల శిష్యులు. శ్రీ భట్టుల వ్యాఖ్యానములో నామముల శబ్దార్థ వివరణ తరువాత ఆళ్వారుల ప్రేమ, భక్తి పూరిత అనుభూతుల ద్వారా ప్రకటితమైన 'ఎంపెరుమాన్' గుణానుభవముల గురించీ, ఆ సగుణ బ్రహ్మముయొక్క సౌశీల్యత, సౌలభ్యముల గురించీ విపులముగా తెలుపబడినది. ఇది విశిష్టాద్వైత వేదాంతములోని అంతర్గత భావము.

ఈ ఇరువురు మహాత్ముల వ్యాఖ్యానాలలో ఇది ముఖ్యమైన భేదమని అనిపిస్తుంది.

అత్యధిక నామముల విషయంలో శ్రీ శంకరులు, శ్రీ భట్టులు చెప్పిన భాషాపరమైన అర్థం ఒకటే. వేరు వేరు అర్థములు చెప్పబడిన కొద్ది నామముల విషయానికొస్తే, సంస్కృత భాషాపరంగా రెండూ సరైన అర్థాలే. తరువాత ఆయా అర్థాలను విపులీకరించే దశలో ఈ ఇద్దరి వ్యాఖ్యానాలలో భేదం కొంతగా కనుపిస్తుంది. శ్రీ శంకరులు శ్రుతులు, స్మృతులు ఆధారంగా, వేదాంతపరంగా తమ వివరణను

కొనసాగించారు. శ్రీ భట్టులు కూడా అవే శ్రుతులు, స్మృతులనుండి ఉదాహరించారు. అయితే ఆయన తెలియజేసే సందేశం భక్తిప్రపత్తులతో ఆళ్వారులు తమ దివ్యోపదేశములలో తెలిపిన సగుణ బ్రహ్మమును గురించియే. కాని శ్రీ భట్టులు ఆళ్వారుల రచనలనుండి ఉదాహరణలు చెప్పలేదు. శ్రీ రామానుజులు కూడా ఆళ్వారుల రచనలనుండి ఉదాహరణలు చెప్పలేదు. దీనికి కారణం ఇంతకుముందు ఇదే వేదికలో చర్చింపబడినది. (శ్రీ కృష్ణమాచారి గారు వ్రాసిన ఈ భాగాన్ని నేను చదువలేదు. కనుక ఈ కారణమేమిటో నాకు తెలియదు. – కా.సు. బాబు). ఈ ఆళ్వారుల జ్ఞానము అనుభవైకవేద్యము. భక్తి, ప్రేమల ద్వారానే సాధ్యము. భగవంతుని సౌశీల్యత, సౌలభ్యములను శ్రీ భట్టులు మరల మరల ప్రస్తావించారు. నిజమైన భక్తునికి భగవంతుడు అన్నియెడల అందుబాటులో ఉంటాడు. భక్తులతో కలిసి, భక్తుల పాపములను క్షమించి, వారి కష్టములను హరించి, కరుణతో చేయూతనందించుటకు సదా సన్నద్ధుడైన అనంత కృపామూర్తి ఆ భగవంతుడు.

శ్రీ అణ్ణాంగారాచార్యస్వామి చెప్పిన విధంగా – (ఎంపెరుమాన్) సర్వేశ్వరుని మాహాత్మ్యములో పరత్వమూ, సౌలభ్యమూ కూడా మనము స్వీకరించవలసిన ఉదాత్త విషయాలే. కాని ఈ రెండింటిలో పరత్వము నిలకడగా మనలను జ్ఞానోన్ముఖులను చేస్తుంది. సౌశీల్యము భక్తుని హృదయాన్ని కదలించి సర్వేశ్వరునియొక్క పాదదాసునిగా చేస్తుంది.

ఇందుకు ఉదాహరణగా శ్రీ నమ్మాళ్వార్వారు పెరుమాళ్ళను ధ్యానించిన విధాన్ని శ్రీ అణ్ణాంగారాచార్యస్వామి చెప్పారు. పెరుమాళ్ళ పరత్వమును నమ్మాళ్వారుగారు చక్కగా వర్ణించినపుడు ఆయనలో అంతగా భావోద్వేగం కనుపించదు. ఆ ఆళ్వారులే తరువాత అదే పెరుమాళ్ళ సౌశీల్యమును వర్ణిస్తూ ఆయన సౌశీల్యగుణాలను స్మరించి, పరవశించి, ఆరునెలలపాటు బాహ్యస్మృతి లేకుండా విష్ణుధ్యానంలో నిమగ్నులయ్యారట.

మళ్ళీ మనం గుర్తుంచుకోవలసిందేమంటే – సర్వేశ్వరుని సకల గుణములూ మంగళకరములే. సౌశీల్యమూ, సౌలభ్యమూ, పరత్వమూ – అన్ని గుణాలనూ ఆళ్వారులు కీర్తించారు. కాని ఆ నిత్యసూరులు, విశిష్టాద్వైతాచార్యులు ఆ తండ్రియొక్క సౌశీల్య, సౌలభ్య అనుభవములను తరచుగా కీర్తించి పరవశించారు. శ్రీ భట్టులవారి వ్యాఖ్యానంలో కూడా ఈ శైలి ప్రస్ఫుటంగా కనుపిస్తుంది.

ఒక్కవాక్యంలో చెప్పాలంటే – శ్రీ శంకరులు పరబ్రహ్మముయొక్క పరత్వమును, ఐశ్వర్యము (ఈశిత్వము, ఈశ్వరత్వము)ను ప్రధానంగా తమ వ్యాఖ్యలో చూపించగా – శ్రీ భట్టులు పెరుమాళ్ళుయొక్క సౌలభ్యమును, సౌశీల్యమును నొక్కి వక్కాణించారు.

ఇదే అభిప్రాయాన్ని విశదీకరించడానికి శ్రీ అణ్ణాంగారాచార్యస్వామి గారు తమ ఉపోద్ఘాతంలో తెలిపినట్లు కొన్ని నామాలను ఈ ఇరువురు మహాత్ములు ఎలా వ్యాఖ్యానించారో పరిశీలించుదాము.

## సత్కృతిః

75వ శ్లోకము: **సద్గతిః సత్కృతిః సత్తా సద్భూతిః సత్పరాయణః.**

'సత్కృతి' అనే పదానికి సామాన్యమైన అర్థము – 'మంచిపైన పనులు చేయువాడు'. ఇంకొక అడుగు ముందుకు వేసి, ఈ మంచిపనులేమిటో వివరించడంలో ఈ వ్యాఖ్యానకర్తల అనుభవాలలోని భిన్నత్వము మనకు గోచరిస్తుంది.

విశ్వములోని సకల ప్రాణులను రక్షించడం శ్రీమహావిష్ణువుయొక్క 'సత్కృతి' (మంచిపని) అని శ్రీ శంకరులు అభివర్ణించారు.

శ్రీ భట్టులవారు ఈ అర్థాన్ని మరింత విస్తృతంగా వివరిస్తూ, ఇంతకుముందు శ్లోకంలోని 'వాసుదేవః' నామంతో ('**వసుప్రదో వాసుదేవో వసుర్వసుమనా హవిః**') తమ అనుభవాన్ని జోడించారు. ముద్దులొలికే బాలుని రూపంలో పరమాత్ముని బాల్య చేష్టలను – వెన్నను దొంగిలించడం, యశోదమ్మచేత రోటికి కట్టివేయబడడం వంటివానిని – ఈ 'సత్కృతిః' అనేదివ్యనామంతో అనుసంధానించారు. ఇవి మంచి పనులెందుకవుతాయి? ఎందుకంటే ఈ లీలలను స్మరించినవారికి సంసారబంధనములనుండి విముక్తి లభిస్తుందని శ్రీ భట్టుల ప్రవచనము.

ఈ రెండు వ్యాఖ్యానములు సముచితములే. ఆళ్వారుల కీర్తనలలో వెల్లివిరిసిన భగవంతుని గుణానుభవముల సౌరభము శ్రీ భట్టుల వ్యాఖ్యలో గుబాళిస్తుంది.

## విజితాత్మా

66వ శ్లోకము: **విజితాత్మా విధేయాత్మా సత్కీర్తిః ఛిన్న సంశయః**

ఈ నామమునకు సామాన్యార్థము – 'జయింపబడిన మనస్సు గలవాడు'

శ్రీ శంకరుల భాష్యము – తన మనస్సును, ఇంద్రియములను తానే నియంత్రించినవాడు. **"విజితా ఆత్మా మనో యేన సః విజితాత్మా"**

శ్రీ భట్టుల భాష్యము – తన భక్తులకు సులభముగా వశమగు మనస్సు గలవాడు. ఇది శ్రీ శంకరుల భాష్యానికి పూర్తిగా భిన్నమైన అర్థాన్నిస్తుంది.

శ్రీ శంకరుల భాష్యము భగవంతుని పరమేశ్వరత్వమును ప్రతిపాదించగా, శ్రీ భట్టుల భాష్యము భగవంతుని సౌశీల్య సౌలభ్య గుణాలను కీర్తించినది.

## విధేయాత్మా / అవిధేయాత్మా

66వ శ్లోకంలోనే 'విజితాత్మా' తరువాత వచ్చే నామమిది – **విజితాత్మా (అ)విధేయాత్మా సత్కీర్తిః ఛిన్న సంశయః**. ఇక్కడ రెండు వ్యాఖ్యలలోని భేదానికి కారణం పాఠ్యభేదము. '**విజితాత్మా అవిధేయాత్మా** ....' అనే పాఠాన్ని శ్రీ శంకరులు గ్రహించారు. శ్రీ భట్టులు '**విజితాత్మా విధేయాత్మా** ....' అని తీసుకొన్నారు.

'విధేయ' అంటే 'అణగి ఉండుట' అని అర్థం. 'అవిధేయాత్మా' అనగా 'ఎవరికీ విధేయుడు కానివాడు' అని శ్రీ శంకరులు  భాష్యం చెప్పారు. ( **న కేనాపి విధేయ ఆత్మా స్వరూపమ్ అస్య ఇతి అ-విధేయ-ఆత్మా**). శ్రీ రాధాకృష్ణ శాస్త్రి గారు ఈ వ్యాఖ్యను 'ఎవరి చేతను నియంత్రింపబడనివాడు' అని (ఆంగ్లంలోకి) అనువదించారు. ఇది నిజమే. భగవంతుడు సర్వ స్వతంత్రుడు. ఆయన తన ఇచ్ఛవచ్చినట్లే నడువగలడు.

'విధేయాత్మా' అనగా – భక్తులకు పూర్తిగా వశమై ఉండేవాడు – అని శ్రీ భట్టులు వ్యాఖ్యానించారు. భగవంతుడు భక్త సులభుడు. ఆయన సంపూర్ణముగా భక్తుల ఆదేశానుసారమే నడచుకొంటాడు. "ఇలా రా. ఇక్కడ నిలుచో. ఇక్కడ కూర్చో. ఇది తిను." అని భక్తులు చెప్పినపుడు వారి ఆజ్ఞను ఆయన పాటిస్తాడు. సొణ్ణవన్ సెయిద పెరుమాళ్ ను ఉద్దేశించి శ్రీ తిరుమళిశయాళ్వారుగారు "మణివణ్ణా! నీవిక్కడ ఉండవద్దు" అని చెప్పగానే ఆ పెరుమాళ్ళు తన శేషపాన్పును చుట్టగా చుట్టుకొని ఆళ్వారు వెంట బయలుదేరాడట. మళ్ళీ ఆళ్వారు చెప్పినపుడు తన శేషపాన్పును పరచుకొని శయనించాడట. అలాగే అర్జునుడు చెప్పగానే కృష్ణుడు విధేయుడై రథాన్ని కురుక్షేత్రంలో ఉభయసేనల మధ్యకు తోలుకొనివెళ్ళాడు.

ఇక్కడ పాఠభేదం ఆధారంగా ఇద్దరు వ్యాఖ్యానకర్తలు తమ అనుభవాలను మనకు ప్రసాదించారు. భగవానుడు సర్వేశ్వరుడని శ్రీ శంకరులూ, భక్తసులభుడని శ్రీ భట్టులూ కీర్తించారు.

# సత్కీర్తిః

ఇది కూడా 66వ శ్లోకంలోని నామమే - **విజితాత్మా (అ)విధేయాత్మా సత్కీర్తిః ఛిన్న సంశయః**

శ్రీ శంకరుల వ్యాఖ్యానము – "సతీ (అ-వితథా) కీర్తిః అస్య ఇతి సత్-కీర్తిః" – లోక ప్రశస్తమైన, సత్యమైన, దివ్యమైన కీర్తి కలిగినవాడని అర్థము. నిస్సందేహముగా ఇది సరైన భావార్థము.

శ్రీ భట్టులు కూడా ఇదే అర్థంతో ప్రారంభించి, భగవంతుని సత్కీర్తికి కారణం ఆయన సౌశీల్యమని విపులీకరించారు. "**సౌశీల్య, సత్వేన అతి మహతీ కీర్తిః అస్య ఇతి సత్-కీర్తిః**" – భగవంతుడు తన కరుణావాత్సల్యముల కారణంగా కీర్తిమంతుడయ్యెను. ఆ సత్వగుణమూర్తి కీర్తిని మాటలలో చెప్పనలవి కాదు.

ఇక్కడ ఇద్దరు వ్యాఖ్యానకర్తలూ ఒకే పాఠాన్ని, ఒకే అర్థాన్ని గ్రహించారు. భగవంతుని సౌశీల్యాన్ని ప్రశంసించే అవకాశాన్ని మాత్రం శ్రీ భట్టులవారు వదులుకొనలేదు.

# ఛిన్నసంశయః

ఇదీ 66వ శ్లోకంలోని నామమే- **విజితాత్మా (అ)విధేయాత్మా సత్కీర్తిః ఛిన్నసంశయః**

శ్రీ శంకరుల వ్యాఖ్యానము – అంతటిని అరచేతిలో పండువలె స్పష్టంగా చూచెడివాడు. ఏ విధమైన సంశయములు భగవంతునికి ఉండవు. కనుక 'ఛిన్న సంశయః' నామాంకితుడు ఆయన.

శ్రీ భట్టుల వ్యాఖ్యానము – భక్తుల మనస్సులలోని సకల సంశయములను నివృత్తి చేయువాడు.

'ఛిన్న సంశయః' అన్న పదమునకు రెండు అర్థములూ సరిపోతాయి. శ్రీ భట్టుల వ్యాఖ్యానము భగవంతుడు భక్తసులభుడనీ, భక్తులను అనుగ్రహిస్తాడనీ తెలియజేస్తుంది. "భగవంతుని తెలుసుకోవడం సాధ్యమా? ఆయననెలా ఆరాధించి ప్రసన్నం చేసుకోవాలి? ఆయన మనకు అందుబాటులో ఉంటాడా?" వంటి సంశయములు ఆయన సౌలభ్య సౌశీల్యతల కారణంగా సమసిపోతాయని శ్రీభట్టులు వివరించారు.

ఇక్కడ మళ్ళీ మనం గమనింపవచ్చును – శ్రీ శంకరులు పరబ్రహ్మముయొక్క సర్వాధిక్యతను ప్రశంసించగా, శ్రీ భట్టులు భగవంతుని కళ్యాణదయాగుణములను కొనియాడారు.

## అనీశః

67వ శ్లోకము - **ఉదీర్ణః సర్వతశ్చక్షుః అనీశః శాశ్వతస్థిరః.** ఈ పదానికి సరళంగా చెప్పాలంటే ''ఈశుడు లేనివాడు'' లేదా ''ఈశుడు కానివాడు'' అని అర్థం.

శ్రీ శంకరుల వ్యాఖ్య – ఆయనకంటె పైన అధిపతి వేరొకరు లేరు. పరబ్రహ్మముకంటె వేరు బ్రహ్మము లేదు గనుక ''భగవంతునకు వేరు భగవంతుడు లేడు. ఆయనే పరమేశ్వరుడు''

శ్రీ భట్టుల వ్యాఖ్య – సంకల్పానుసారం ఆయన (భగవంతుడు) అధిపతిగా వ్యవహరించడు. ఇక్కడ శ్రీ భట్టులవారు భక్తుని పక్షాన నిలచారు. భక్తుల ప్రార్థనలనూ, ఆజ్ఞలనూ కూడా భగవంతుడు ప్రేమతో శిరసావహించును. దొంగాటలో పిల్లలచేత వారి తల్లిదండ్రులు ఓడినట్లుగా భగవంతుడు తన భక్తులకు అధీనుడై వ్యవహరించును. అందుకే బ్రహ్మను కన్న పరమపురుషుడు గోపాలబాలుడై నందగోపుని ఇంట పెరిగి యశోద చేతికి చిక్కి రోట బంధితుడైనాడు. శ్రీ అణ్ణంగారాచార్యస్వామిగారు ఇక్కడ శ్రీ పెరియాళ్వారువారి పాశురమును ఉదాహరించారు.

## సమ్మితః / అసమ్మితః

12వ శ్లోకము - **వసుర్వసుమనాః సత్యః సమాత్మా (అ)సమ్మితః సమః.** ఇక్కడ ఇద్దరు వ్యాఖ్యాతలు పాఠభేదాల కారణంగా వేరువేరు వ్యాఖ్యానాలు ఇచ్చారు.

శ్రీ శంకరులు 'అసమ్మితః' అనే పాఠాన్ని గ్రహించారు. ''**సర్వైః అపరిచ్ఛిన్నః అమిత ఇతి అసమ్మితః**'' అనగా – దేనివలనను మితము (limit) కానివాడు. ఏ విధముగానూ నిర్వచింప సాధ్యము కానివాడు. పరిచ్ఛేదము పొందకయున్నవాడు – అని అర్థము. శ్రుతులు బ్రహ్మమును తెలియనిదిగాను, తెలియరానిదిగాను వచించుచున్నవి. బ్రహ్మము అగోచరమైనది. కనుక భగవంతుడు అసమ్మితుడు.

కాని భక్తిమార్గమును అనుసరించిన ఆళ్వారులకు భగవానుడు సులభముగా లభించునను సంప్రదాయమునకు అనుగుణముగా శ్రీ భట్టులు మాత్రము 'సమ్మితః' అనే పాఠాన్ని గ్రహించారు. ''**హస్తస్థః ఇతి సమ్యక్ పరిచ్ఛిన్నః**'' – భక్తులకు భగవంతుడు కరతలామలకము వంటివాడు. దశరధుడు, యశోద వంటివారల ముంగిట నిలచిన ముత్యము. దశరధుడు ''**ఉన షోడశ వర్షో మే రామో రాజీవలోచనః**'' అనియు, వసుదేవుడు ''**మమ అయమ్ తనయో నిజః**'' అనియు

వచించినారు. ఇక్కడ 'నా రాముడు', 'నా తనయుడు' అన్న పద ప్రయోగాలను విశేషంగా గుర్తించాలి. శ్రీ అణ్ణాంగారాచార్యస్వామిగారు పెరియతిరుమొళినుండి ఉదాహరించారు.

## మహాకోశః

**విస్తారః స్థావరస్థాణుః ప్రమాణమ్ బీజమవ్యయమ్**
**అర్థోఅనర్థో మహాకోశో మహాభోగో మహాధనః** – 46వ శ్లోకము

'కోశ' అన్న పదానికి రెండు అర్థాలు సరిపోతాయి – (1) రక్షణా కవచము (2) నిధి, దాచియుంచిన ధనము

'కవచము' అన్న అర్థంలో శ్రీశంకరుల వ్యాఖ్యానం సాగింది. పరమాత్ముడీ పంచకోశములచే ఆవరింపబడియున్నాడు. (1) అన్నమయ కోశము – ఇంద్రియ నిగ్రహముచే అధిగమింపవచ్చును. (2) ప్రాణమయ కోశము – ఉచ్ఛ్వాస నిశ్వాసములను నియంత్రించుట ద్వారా అధిగమింపవచ్చును. (3) మనోమయ కోశము – మనస్సును నిగ్రహించుట ద్వారా దీనిని అధిగమింపవచ్చును. (4) బుద్ధిమయ కోశము – బుద్ధిని అదుపులోనుంచుకొని, కోరికలను, రాగ ద్వేషాది వికారములను త్యజించుట ద్వారా విజ్ఞానమయ కోశమును దాటవచ్చును. (5) ఆనందమయ కోశము – ఆత్మజ్ఞానము ద్వారా అధిగమింపవచ్చును. ఈ విధముగా బ్రహ్మసాక్షాత్కారము సాధ్యమని శ్రీ శంకరుల భాష్యమును 'ధర్మచక్రము' రచయిత విపులీకరించినారు.

శ్రీ భట్టులవారు కోశము అనగా 'నిధి' అన్న అర్థంలో వ్యాఖ్యానించారు. భగవానుడు తరగని పెన్నిధి. భక్తులకు సకల సంపత్తులను ప్రసాదించినా అది తరగదు.

మళ్ళీ మనం ఈ వ్యాఖ్యాతల అనుభవ భేదాలను గుర్తించవచ్చును. అసామాన్యము, సర్వశక్తిమంతము, అనిర్వచనీయము, కష్టసాధ్యము, అగోచరమునైన బ్రహ్మమును ప్రతిపాదించే శ్రీ శంకరుల మార్గము దృఢమైన, క్రమమైన దీక్షతో యోగసాధన చేసేవారికి స్ఫూర్తిదాయకమనిపిస్తుంది. అలా కాకుండా భగవంతుని అనంతకరుణ, భక సులభత్వము, సౌశీల్యములను కీర్తించే శ్రీభట్టుల వ్యాఖ్యానము సాధారణ భక్తులకు కొంగుబంగారము వంటిది.

శ్రీ శంకర నారాయణన్ గారి 'శ్రీ విష్ణు సహస్ర నామమ్' (Bhavan's publication) గ్రంధానికి ముందుమాట వ్రాస్తూ శ్రీ ఎస్. రఘునాధన్ గారు మరో నామమును ఉదాహరించారు.

## వ్యాళః

10వ శ్లోకము - **అహస్సంవత్సరో వ్యాళః ప్రత్యయః సర్వదర్శనః**. 'వ్యాళము' అనగా సర్పము.

శ్రీ శంకరులు – 'సర్పమువలె పట్టుకొనుటకు దుర్లభమైనవాడు' అని చెప్పారు. అనగా భగవానుని తెలిసికొనుట, చేరుట దుర్లభము. బ్రహ్మమును తెలియుట కష్టసాధ్యమని దీని భావము.

శ్రీ భట్టులు – 'భక్తులను పెనవేసికొని యుండువాడు' అని చెప్పారు. అనగా భగవానుడు భక్తులను విడచిపెట్టడు. భక్తుల వెంట ఉండి, వారి యోగక్షేమములను చక్కదిద్దుట ఆయనకు ప్రీతికరము.

## ఇతర భేదములు

శ్రీ భట్టులు ప్రతినామమునకు శబ్దార్థభావములను వివరించుటయే కాక, 1000 నామముల క్రమములో ఒక సంబంధమును చూపారు. వేయి నామములను ఆయన 44 సమూహములుగా వర్గీకరించారు. ప్రతి సమూహము భగవంతుని ఒక్కొక్క అవతారము లేదా విభూతికి సంబంధించినది. కనుక శ్రీ భట్టుల వ్యాఖ్యానములో ప్రతి నామమునకు సందర్భానుసారముగా అంతకు ముందుగల నామముతో గల సంబంధమును వివరించారు.

ఉదాహరణకు – 1 నుండి 122వ నామమువరకు భగవంతుని పరవాసుదేవ స్వరూపమును, 123, 124 నామములు సంకర్షణ స్వరూపమును వర్ణించును. ఇలా ఈ పుణ్య నామములను మిగిలిన నామములతో అనుసంధానించి వివరించుటలోను, స్మరించుటలోను మరింత పారవశ్యం లభిస్తుందని చెబుతూ శ్రీ రాధాకృష్ణ శాస్త్రిగారు ఒక ఉదాహరణ ఇచ్చారు. **అనుకూలః, శతావర్తః, పద్మీ, పద్మనిభేక్షణః** - అనే నామములు వరుసలో వస్తాయి.

'కూలమ్' అనగా ఒడ్డు. 'అనుకూలః' అనగా ఒడ్డు (గమ్యము) చేర్చే మార్గదర్శి.

'శతావర్తః' – నూరుమార్లు – అనగా అసంఖ్యాక పర్యాయములు – మరల మరల అవతరించి, భక్తులు తరించే (గమ్యము చేరే) వరకు తోడు వదలనివాడు.

'పద్మీ' – చేతిలో తామరపూవు ధరించినవాడు – తాను సులభముగా లభించెదనని, నిస్సంశయముగా తన తోడు చేకొనమని ధైర్యము చెప్పువాడు.

'పద్మ నిభేక్షణః' – పద్మములవంటి కన్నులతో భక్తుల భయమును పోగొట్టి కరుణతో కాపాడువాడు.

ఇలా ఈ మంగళకర నామములను క్రమములో స్మరించుటవలన ఆయన భక్తసులభుడని గ్రహించి, పరవశించి, తరింపవచ్చును.

ఇది శ్రీ  శాస్త్రిగారి స్వంత ఉదాహరణ. శ్రీ భట్టుల వ్యాఖ్యనుండి గ్రహించినది కాదు. కాని నామముల మధ్య సంబంధమును స్మరించుట వలన సమకూరే ఆనందమునకు చక్కని ఉదాహరణ.

## మనకు మరింత ప్రయోజనము

నేను (శ్రీ కృష్ణమాచార్యులు) ఈ వ్యాస పరంపరలో ఎందరో మహానుభావుల వ్యాఖ్యానములను ఉపయోగించడం జరిగిందని చదువరులు గమనించగలరు. శ్రీ పరాశరభట్టు, శ్రీ శంకరాచార్యులు, శ్రీ వి. వి. రామానుజన్, శ్రీ రాధాకృష్ణశాస్త్రి, శ్రీ సత్యదేవో వాసిష్ఠ, ధర్మ చక్రము రచయిత (పేరు తెలియదు), శ్రీ పి.బి. అణ్ణాంగారాచార్య స్వామి, శ్రీ చిన్మయానంద, శ్రీ కృష్ణదత్త భరద్వాజ, మరికొందరు.

ప్రతి వ్యాఖ్యానంలోను ఏదో ఒక విశిష్టత గోచరిస్తుంది. అన్నింటికంటె శ్రీ శంకరుల భాష్యము పూర్వమైనది. తరువాతి అద్వైత వ్యాఖ్యానకర్తలందరికీ ఇది మార్గదర్శిని. అలాగే విశిష్టాద్వైత వేదాంత వాదులకు శ్రీ భట్టులవారి వ్యాఖ్య ఆద్యము మరియు బహుశా ఆధారము కూడాను. శ్రీ వి.వి. రామానుజన్ గారు నమ్మాళ్వార్ తిరువైమోళినుండి, మరియు ఇతర దివ్య ప్రబంధములనుండి విస్తారంగా ఉదాహరించారు.  శ్రీ సత్యదేవో వాసిష్ఠగారు ప్రతినామముయొక్క వ్యాకరణ, మాతృక, శబ్ద, అర్థములను (etymology)  కూలంకషంగా పరిశీలించారు.  ఇంకా వారు ప్రతి నామముయొక్క వ్యాఖ్యానాన్ని పొందుపరుస్తూ నామమునకొక్క శ్లోకం చొప్పున 1000 శ్లోకాలు రచించారు. 'ధర్మచక్రం' రచయిత ప్రతి నామమంత్రానికీ ప్రాపంచిక సంబంధాన్ని వివరించి, ఎంతో విపులంగా ఆ నామమునుండి  సామాన్య మానవులు గ్రహించవలసిన పాఠములను తెలియజేశారు. శ్రీ రాధాకృష్ణశాస్త్రి గారు శ్రీ శంకరుల, శ్రీ భట్టుల వ్యాఖ్యానాలను వివరించి, ఇకా శ్రుతులు, స్మృతులనుండి పెక్కు ఆధారాలను కలిపి అందించారు. అలాగే సంస్కృత పండితులైన శ్రీ కృష్ణదత్త భరద్వాజగారు శ్రుతులు, స్మృతులనుండి మరిన్ని ఆధారాలను అనుసంధానించారు. శ్రీ చిన్మయానంద గారి రచన

సరళమైన ఆంగ్ల భాషలో చాలామందికి చదవడానికి అనుకూలంగా ఉంది. శ్రీ పి.బి.అణ్ణాంగారాచార్య వారి వ్యాఖ్యానం తమిళంలో ఉంది. శ్రీ భట్టుల సంస్కృత భాష్యం చదువలేనివారికి ఇది ఎంతో ఉపయోగకరం. ఇంకా శ్రీ అణ్ణాంగారాచార్య గారు తమ పీఠికలో వ్రాసిన శ్రీ శంకర, శ్రీ భట్ట భాష్యాల తులనాత్మక పరిశీలన ఎంతో విశిష్టమైనది. ఈ విధమైన విశ్లేషణాత్మక రచన వేరే రచయితల ద్వారా మనకు అందలేదు.

శ్రీ విష్ణు సహస్రనామము గురించి ఈ వ్యాస పరంపర (Postings in Bhakthi list in Internet) పై వ్యాఖ్యానకర్తల అనుభవసారాన్ని పొందుపరచి మీకందించే ప్రయత్నము. ఆ మహానుభావుల వ్యాఖ్యానాలలోని వైవిధ్యము అనంతగుణ స్వరూపుని కొన్ని విశేషాలను వేరువేరు కోణాలలో దర్శించే సదవకాశంగా మనం గ్రహించాలి.

ఈ ఉపోద్ఘాతము చదువరుల ఆసక్తిని, శ్రద్ధను పెంపొందించి, ఈ మహామంత్రసారమును ఆస్వాదించుటకు మరింత దోహదం చేస్తుందని భావిస్తున్నాను. (అని శ్రీ కృష్ణమాచారిగారు వ్రాశారు).

---

శ్రీ నరసింహన్ కృష్ణమాచారి ఆంగ్ల రచనకు ఇది తెలుగు అనువాదము.

లక్ష్మీనృసింహ మమదేహి కరావలంబమ్

హరిః ఓం

# పూర్వ పీఠిక

ఈ భాగంలోని శ్లోకాల అనువాదాన్ని శ్రీ పెమ్మరాజు రాజారావుగారి రచననుండి యథాతథంగా వ్రాస్తున్నాను. (1) ఆ రచయిత తెలుగు సేత చక్కగా ఉన్నది. (2) నాకు స్వంతంగా అనువదించే పాండిత్యం లేదు (3) ఇందుకు ఆ రచయితనుండి నేను అనుమతి తీసుకొనలేదు. కాని కాపీ చేసిన విషయాన్ని బట్టి వారికి అభ్యంతరం ఉండదని ఆశిస్తున్నాను. వారి చక్కని రచనను సంపూర్ణంగా చదవడానికి పాఠకులకు ఆసక్తి కలుగుతుందని ఆశిస్తున్నాను.

ఇది కేవలం తాత్పర్యము. అనేక రచనలలో విషయం ఇంచుమించు ఇలాగేఉన్నది. కనుక నా స్వంత పదాలను జొప్పించడం మంచిది కాదని భావిస్తున్నాను.

– కా.సు. బాబు

# నమస్కారశ్లోకములు

**శుక్లాంబరధరం విష్ణుం శశివర్ణం చతుర్భుజం |**
**ప్రసన్నవదనం ధ్యాయేత్ సర్వవిఘ్నోపశాంతయే ||**

స్వచ్ఛములగు తెల్లని వస్త్రములను ధరించినవాడును, అంతటను వ్యాపించియున్నవాడును, చంద్రునివంటి మనోహరమగు శోభతో కూడినవాడును, నాలుగు బాహువులతోనొప్పువాడును, మంగళకరమగు నవ్వుమొగముతో ప్రకాశించువాడునునగు విఘ్నేశ్వరుని సర్వ విఘ్నముల నివారణార్థమై ధ్యానింపవలెను.

**వ్యాసం వసిష్ఠనప్తారం శక్తేః పౌత్రమకల్మషం |**
**పరాశరాత్మజం వందే శుకతాతం తపోనిధిం ||**

పరమ పవిత్రమూర్తియగు వసిష్ఠ మహర్షి యొక్క మునిమనుమడును, మహాపురుషుడగు పరాశరుని ప్రియనందనుడును, జ్ఞానసాగరుండగు శుకదేవుని తండ్రియునగు వ్యాస భగవానునకు వందనములు.

**వ్యాసాయ విష్ణురూపాయ వ్యాసరూపాయ విష్ణవే |**
**నమో వై బ్రహ్మనిధయే వాసిష్ఠాయ నమో నమః ||**

వ్యాసుడు విష్ణు స్వరూపుడు. వ్యాసుని రూపంలోనున్న విష్ణువునకు, బ్రహ్మనిధియైన వాసిష్ఠునకు నమోనమ.

**అవికారాయ శుద్ధాయ నిత్యాయ పరమాత్మనే |**
**సదైకరూపరూపాయ విష్ణవే సర్వజిష్ణవే ||**

జనన మరణాది షడ్భావ వికార శూన్యుండును, పరమ పవిత్రుండును, నిర్మల నిత్య స్వరూపుండును, పరబ్రహ్మమును, సచ్చిదానంద స్వరూపుండును, మంగళ మహనీయ దివ్య స్వరూపుండునునగు శ్రీవిష్ణుభగవానునకు ప్రణామములు.

**యస్య స్మరణమాత్రేణ జన్మసంసారబంధనాత్ |**
**విముచ్యతే నమస్తస్మై విష్ణవే ప్రభవిష్ణవే ||**
**ఓం నమో విష్ణవే ప్రభవిష్ణవే**

ఏ మహనీయుని స్మరణ చింతన కీర్తన మాత్రము చేతనే, జనన మరణ క్లేశములతో గూడిన భయంకరసంసార మహాబంధములన్నియును సమసిపోవునో, అట్టి సర్వాంతర్యామియగు శ్రీ విష్ణుభగవానునకు వినయపూర్వకముగ నమస్కరించుచున్నాను

# పూర్వ పీఠిక

**శ్రీ వైశంపాయన ఉవాచ**
**శృత్వా ధర్మానశేషేణ పావనాని చ సర్వశః |**
**యుధిష్ఠిరః శాంతనవం పునరేవాభ్యభాషత || (1)**

వైశంపాయన మహర్షి జనమేజయ మహారాజుతో నీరీతిగా పలుకుచున్నాడు.

అభ్యుదయ పరంపరలను కలిగించుచు, మోక్షప్రదములగు ధర్మములను, పాపభంజనములగు ధర్మరహస్యములను – అంపశయ్యపై పరుండి ప్రబోధము చేయుచున్న పరమశాంత గంభీరమూర్తి జ్ఞానసాగరుండగు భీష్మపితామహునితో ధర్మజిజ్ఞాసువగు యుధిష్ఠిరుండిట్లు ప్రశ్నించుచున్నాడు. సర్వధర్మనిధియగు భీష్మపితామహుడు ఎన్నెన్నియో ధర్మములు, ధర్మసూక్ష్మములు, అనుష్ఠానములు మున్నగునవి తెలిపియున్నాడేగాని – సకల పురుషార్థ సాధనమై, మిక్కిలి తక్కువ ప్రయాసతో, అనంతమగు మహాఫలమును మిక్కిలి తేలికగను, సుఖముగను పొందునట్టి విషయమును గూర్చి ఇంతవరకును చెప్పియుండలేదే – అని సంశయించి, ధర్మరాజు ఈ దిగువనుదాహరించిన ఆరు ప్రశ్నలను గురించి భీష్ములవారితో పలుకుచున్నాడు.

**శ్రీ యుధిష్ఠిర ఉవాచ**
**కిమేకం దైవతం లోకే కిం వాప్యేకం పరాయణం |**
**స్తువంతః కం కమర్చంతః ప్రాప్నుయుర్మానవాః శుభం || (2)**

ఈ శ్లోకమునందు నాలుగు ప్రశ్నలు అడగబడుచున్నవి

(1) ఈ లోకమునందు ఒక్కడేయైన దేవుడెవ్వడు?

(2) మానవులు పొందదగిన ఏకైక మహోన్నత స్థానమేది?

(3) ఏ దేవుని స్తుతించుటవలన మానవుడు సర్వ శుభములను పొందుచున్నాడు?

(4) మరియు ఏ దేవునియొక్క బాహ్యాంతర పూజలనాచరించుటవలన సకల శుభములు కలుగును?

**కో ధర్మస్సర్వధర్మాణాం భవతః పరమో మతః |**

**కిం జపన్ముచ్యతే జంతుర్జన్మసంసారబంధనాత్ || (3)**

(5) అన్ని ధర్మములకంటెను పరమోత్కృష్టమగు మహాధర్మము ఏదియై యున్నదని మీ అభిప్రాయము?

(6) దేనిని జపించుచున్నచో మానవులు సకల కర్మ బంధములనుండియును విముక్తిని చెందుదురు? అని మిగిలిన రెండు ప్రశ్నలు.

## శ్రీ భీష్మ ఉవాచ

జిజ్ఞాసువగు ధర్మజునియొక్క ఆరు ప్రశ్నలను విని సంతసించి, బాహ్యాభ్యంతర శత్రువులనెల్ల జయించిన సర్వవిజ్ఞానసాగరుండగు శ్రీ భీష్మబ్రహ్మచారి ఇలా అన్నాడు.

**జగత్ప్రభుం దేవదేవమనంతం పురుషోత్తమం |**

**స్తువన్నామసహస్రేణ పురుషస్సతతోత్థితః || (4)**

చరాచరాత్మకమగు ఈ విశ్వమునకంతకును ప్రభువైనవాడును, బ్రహ్మాది సకల దేవతాగణములకును అధిపతియైనవాడును, దేశకాలవస్తువులచేత పరిచ్ఛిన్నము కానివాడును, క్షరాక్షరముల కంటెను శ్రేష్ఠుడైన పరమపురుషుండగు విష్ణుదేవుని పవిత్రములగు వేయి నామములచేత స్తోత్రము చేయుటవలన మానవుడు సకల దుఃఖములనుండి ముక్తిని పొందుచున్నాడు.

**తమేవ చార్చయన్నిత్యం భక్త్యా పురుషమవ్యయం |**

**ధ్యాయన్ స్తువన్నమస్యంశ్చ యజమానస్తమేవ చ || (5)**

అవ్యయుండగు ఆ పరమ పురుషుని భక్తిపూర్వకముగా పూజించుటవలనను, ధ్యానము చేయుటవలనను, సహస్రనామములతో స్తోత్రము చేయుటవలనను, నమస్కారము చేయుట చేతను మానవుడు సకల దుఃఖములనుండియు విముక్తిని పొందుచున్నాడు.

**అనాది నిధనం విష్ణుం సర్వలోక మహేశ్వరం |**

**లోకాధ్యక్షం స్తువన్నిత్యం సర్వదుఃఖాతిగో భవేత్ || (6)**

జనన మరణాది షడ్భావ వికారములు లేనివాడును, సర్వ వ్యాపకుడును, సర్వలోక మహేశ్వరుడును, సకలమునకు సాక్షియై వెలయునట్టి పరమపురుషుని నిరంతరము స్తుతి చేయుట చేత సకల దుఃఖములనుండియు మానవుడు విముక్తిని చెందుచున్నాడు.

**బ్రహ్మణ్యం సర్వధర్మజ్ఞం లోకానాం కీర్తివర్ధనం |**
**లోకనాథం మహద్భూతం సర్వభూతభవోద్భవం || (7)**

వేదములకును, వేదవిదులగు బ్రాహ్మణులకును, తపస్సునకును, సృష్టికర్తయగు బ్రహ్మకును హితము కావించువాడును (బ్రహ్మణ్యుడు), సకల ధర్మవేదియును, తన స్వశక్తి చేత సకల లోకములందును భూతములయందును ప్రవేశించి వాటిని వృద్ధి పొందించువాడును, సకల లోకములను శాసించి పాలించువాడును – ఎవ్వడు సకల భూతజాలమునకును ఉత్పత్తి హేతువై, సర్వాధిష్ఠానమై, మహాద్భుత దివ్యమూర్తియై భాసించుచున్నాడో అట్టి పరమ పురుషుని స్తుతించుటచేత మానవుడు సకల దుఃఖములకును అతీతుడగును.

**ఏష మే సర్వధర్మాణాం ధర్మోఽధికతమో మతః**
**యద్భక్త్యా పుండరీకాక్షం స్తవైరర్చేన్నరః సదా || (8)**

తామర రేకులవలె సుందరములగు నేత్రములతో తన హృదయకమలమునందు ప్రకాశించుచున్న భగవానుడగు వాసుదేవుని నిరంతరము భక్తితో గుణకీర్తనము చేయుచు స్తోత్రము చేయుచు ఆరాధనాదులను కావించుటయే అన్ని ధర్మములకంటె మహాధర్మమైయున్నదని నా అభిప్రాయము.

**పరమం యో మహత్తేజః పరమం యో మహత్తపః |**
**పరమం యో మహద్బ్రహ్మ పరమం యః పరాయణం || (9)**

ఎవ్వడు సర్వమును ప్రకాశింపజేయునట్టి దివ్యచైతన్య స్వరూపమగు మహోన్నత దివ్య తేజస్సై యున్నాడో – ఎవడు సర్వాంతర్యామియై, సర్వ శాసనకర్తయై, పాలనాదక్షుడై సర్వమును తపింపజేయుచున్నాడో – ఎవ్వాడు సత్యధర్మాది మహోన్నత గుణగణ సంపన్నుడై, పరిపూర్ణ పరబ్రహ్మమై వెలుగొందుచున్నాడో – ఎవ్వాడు పునరావృతిరూప రహితమైన శాశ్వత ప్రసన్న ప్రశాంత పరంధాముడైయున్నాడో –

**పవిత్రాణాం పవిత్రం యో మంగళానాం చ మంగళం |**
**దైవతం దేవతానాం చ భూతానాం యోఽవ్యయః పితా || (10)**

ఏ మహాత్ముని యొక్క స్మరణ, చింతన, ధ్యాన, కీర్తన, వందన మాత్రము చేతనే సకల పుణ్యతీర్థములకును ఎవ్వడు పుణ్యత్వమును, పవిత్రతను ప్రసాదించుచున్నాడో, ఏ పుణ్యపురుషుని నామసంకీర్తన మాత్రము చేత సకలములగు అశుభములు, అమంగళములు, అశౌచములు, సకల దుఃఖానర్థములు నశించి సర్వమంగళ శుభ శాంతి శోభన సంపదలు వర్ధిల్లునో – ఏ కళ్యాణ మూర్తియొక్క ధ్యాన చింతనముల చేత స్వర్గాది ఫలములు బ్రహ్మాది మహాలోకములు కూడతుచ్ఛములుగా కానవచ్చునో – ఎవడు పరమ మంగళ మహోజ్వల దివ్యమూర్తియో, సర్వదేవతాగణ సార్వభౌముడో, ఏ మహాశక్తిసంపన్న మూర్తి సకలప్రాణికోట్లకు జన్మదాతయై, రక్షకుడై భాసిల్లుచున్నాడో – నాశనరహితుండైన దివ్య స్వరూపుడెవ్వడో –

**యతః సర్వాణి భూతాని భవంత్యాదియుగాగమే |**
**యస్మింశ్చ ప్రళయం యాంతి పునరేవ యుగక్షయే || (11)**

కల్పారంభ సమయమున ఏ మహనీయుని నుండి సకల భూతజాలములును జననము నొందుచున్నవో మరియును కల్పాంతమునందు ఏ దేవునియందు ఈ భూతములన్నియును లయమగుచున్నవో – అట్టి సృష్టి స్థితి లయ కర్తయగు మహాపురుషుడెవ్వడో –

**తస్య లోకప్రధానస్య జగన్నాథస్య భూపతే |**
**విష్ణోర్నామసహస్రం మే శ్రుణు పాపభయాపహం || (12)**

అట్టి సర్వలోక మహేశ్వరుండును, సర్వాంతర్యామియును, మాయాకళంకరహితుడును, నిస్సంగుడును, నిర్లిప్తుడును అగు దేవదేవుండగు శ్రీ విష్ణు భగవానునియొక్క వేయి పుణ్యనామములను నేను నీకిపుడు వివరించుచున్నాను.

ఓ ధర్మరాజా! సమస్త పాపములను హరించునవియును, సంసారభయతాప హరములైనవియును, సకల శుభ శోభన శాంతి ప్రసన్నతా మంగళకరములైనవియును అగు ఈ దివ్య నామములను ఏకాగ్రమగు చిత్తముతో శ్రవణము చేయుము.

**యాని నామాని గౌణాని విఖ్యాతాని మహాత్మనః |**
**ఋషిభిః పరిగీతాని తాని వక్ష్యామి భూతయే || (13)**

ఈ వేయి నామములును పరమపవిత్రములైనవి. పరమ మంగళ ప్రదములైనవి. భగవానుని గుణవిభూతి లీలా మాధుర్యభరితములైనవి. మహర్షులు గానము చేసినట్టివి. మహాత్ములు, పరమ

భక్తవరేణ్యులు స్తవము గావించినవి. మంత్రవేత్తలు, మంత్రద్రష్టలు వివరించినట్టివి. ఈ నామసహస్రము సకలపురుషార్థ సాధనమయినది. (ధర్మ-అర్థ-కామ-మోక్ష ప్రదములు). ఇట్టి సుప్రసిద్ధ, మనోహర, సుందర నామ సహస్రమును నీకు వినిపించుచున్నాను. శ్రద్ధగా  నాలకింపుము.

**ఋషిర్నామ్నాం సహస్రస్య వేదవ్యాసో మహామునిః |**
**ఛందోఽనుష్టుప్ తథా దేవో భగవాన్ దేవకీసుతః || (14)**

**అమృతాంశూద్భవో బీజం శక్తిర్దేవకినందనః |**
**త్రిసామా హృదయం తస్య శాంత్యర్థే వినియుజ్యతే || (15)**

**విష్ణుం జిష్ణుం మహావిష్ణుం ప్రభవిష్ణుం మహేశ్వరం |**
**అనేకరూపదైత్యాంతం నమామి పురుషోత్తమం || (16)**

**అస్య శ్రీ విష్ణోర్దివ్యసహస్రనామస్తోత్రమహామంత్రస్య |**
**శ్రీ వేదవ్యాసో భగవాన్ ఋషిః |**
**అనుష్టుప్ ఛందః |**
**శ్రీమహావిష్ణుః పరమాత్మా శ్రీమన్నారాయణో దేవతా |**
**అమృతాంశూద్భవో భానురితి బీజం |**
**దేవకీనందనః స్రష్టేతి శక్తిః |**
**ఉద్భవః క్షోభణో దేవ ఇతి పరమో మంత్రః |**
**శంఖభృన్నందకీ చక్రీతి కీలకం |**
**శార్ఙ్గధన్వా గదాధర ఇత్యస్త్రం |**
**రథాంగపాణిరక్షోభ్య ఇతి నేత్రం |**
**త్రిసామా సామగః సామేతి కవచం |**
**ఆనందం పరబ్రహ్మేతి యోనిః |**
**ఋతుస్సుదర్శనః కాల ఇతి దిగ్బంధః |**
**శ్రీ విశ్వరూప ఇతి ధ్యానం |**
**శ్రీమహావిష్ణుప్రీత్యర్థే సహస్రనామ జపే వినియోగః |**

శ్రీ విష్ణుసహస్రనామస్తోత్ర మహామంత్రమునకు వేదవ్యాసుడు ఋషి. దీని ఛందస్సు 'అనుష్టుప్'. దేవకీనందనుడైన పరమాత్మ శ్రీమన్నారాయణమూర్తియే మంత్రాధిష్ఠాన దైవము. 'అమృతాంశూద్భవోభానుః' అను నామములు బీజము. 'దేవకీనందనః స్రష్టా' అను నామములు శక్తి. 'ఉద్భవః క్షోభణో దేవః' అను నామములు పరమ మంత్రము. 'శంఖభృన్నందకీ చక్రీ' అనునది కీలకము. 'శార్ఙ్గధన్వా గదాధరః' అనునది అస్త్రము. 'రథాంగపాణిరక్షోభ్యః' అనునది నేత్రము. 'త్రిసామాసామగస్సామ' అనునది కవచము. 'ఋతుః సుదర్శనః కాలః' అనునది దిగ్బంధము. ఈ రీతిగా భావించి, దిగ్బంధనము గావించి, విశ్వరూపముగ ధ్యానమొనరించి, శ్రీమహావిష్ణువు ప్రీతికొరకు సహస్రనామజప పారాయణము చేయవలయును.

## ధ్యానం

**క్షీరోదన్వత్ప్రదేశే శుచిమణివిలసత్సైకతే మౌక్తికానాం**
**మాలాక్లుప్తాసనస్థః స్ఫటికమణినిభైర్మౌక్తికైర్మండితాంగః |**
**శుభ్రైరభ్రైరదభ్రైరుపరివిరచితైర్ముక్తపీయూషవర్షైః**
**ఆనందీ నః పునీయాదరినలినగదాశంఖపాణిర్ముకుందః ||**

పవిత్రమగు క్షీరసాగరమున – స్వచ్ఛములగు వివిధ మణిసమూహముల దివ్యకాంతులచేత ప్రకాశించుచున్న ఇసుకతిన్నెపైని – ముత్యముల మాలలతో పొదగబడి, శోభాయమానముగా అలంకరింపబడిన దివ్యసింహాసనమునందున్నవాడై – స్ఫటికమణికోటి దివ్యప్రకాశములతో కూడిన మణిహారములతో అలంకరింపబడిన అవయువములతో శోభిల్లుచు – స్వచ్ఛములగు మేఘములు అమృతవర్షము కురిపించుచుండగా – దివ్యానందమూర్తియై – శంఖ చక్ర గదా పద్మములు ధరించి ప్రకాశించుచున్న కళ్యాణమూర్తియగు ముకుందుడు మనలను పవిత్రులను గావించుగాక!

**భూః పాదౌ యస్య నాభిర్వియదసురనిలశ్చంద్రసూర్యౌ చ నేత్రే**
**కర్ణావాశాః శిరో ద్యౌర్ముఖమపి దహనో యస్య వాస్తేయమబ్ధిః |**
**అంతఃస్థం యస్య విశ్వం సురనరఖగగో భోగిగంధర్వదైత్యైః**
**చిత్రం రంరమ్యతే తం త్రిభువనవపుషం విష్ణుమీశం నమామి ||**

ఏ మహాత్మునకు భూమి పాదములో – ఆకాశము నాభియో, వాయువే ప్రాణమో - చంద్రసూర్యులే నేత్రములో - దిక్కులే చెవులో, స్వర్గమే శిరస్సో – అగ్నియే ముఖమో – సముద్రమే దివ్య మందిరమో మరియును – ఏ మహామూర్తియందు భాసిల్లుచున్న అనంత విశ్వము దేవతలు,

నరులు, పక్షులు, గోవులు, సర్పములు, గంధర్వులు, దైత్యులు మున్నగువారితో ఆయాలోకములతో కూడి చిత్రవిచిత్రముగా శోభిల్లుచున్నదో – మరియు నెవ్వాడు మూడులోకములు తన శరీరముగా కలిగియున్నాడో – అట్టి సర్వవ్యాపియును, సర్వేశ్వరుడును నగు ఆ సచ్చిదానంద పరబ్రహ్మమునకు నమస్కరించుచున్నాను.

**ఓం నమో భగవతే వాసుదేవాయ |**

**శాంతాకారం భుజగశయనం పద్మనాభం సురేశం**
**విశ్వాధారం గగనసదృశం మేఘవర్ణం శుభాంగం |**
**లక్ష్మీకాంతం కమలనయనం యోగిహృద్ధ్యానగమ్యం**
**వందే విష్ణుం భవభయహరం సర్వలోకైకనాథం ||**

పరమశాంతి స్వరూపుడును, శేషశాయియును, నాభియందు పద్మము విలసిల్లినవాడును, సర్వదేవతా చక్రవర్తియును, సమస్త సృష్టికిని ఆధారభూతుండును – సర్వవ్యాపి అయ్యును నిస్సంగుడును – శ్యామసుందరుడును, సకల మంగళ సుందరాంగశోభితుండును, లక్ష్మీపతియును, పద్మనేత్రుండును, యోగిపుంగవుల హృదయపద్మముల విరాజిల్లువాడును, జనన మరణ జరా వ్యాధి భయములను పోగొట్టువాడును, సర్వ లోకైక చక్రవర్తియునునగు శ్రీ విష్ణుభగవానునకు వినయపూర్వకముగా నమస్కరించుచున్నాను.

**మేఘశ్యామం పీతకౌశేయవాసం**
**శ్రీవత్సాంకం కౌస్తుభోద్భాసితాంగం |**
**పుణ్యోపేతం పుండరీకాయతాక్షం**
**విష్ణుం వందే సర్వలోకైకనాథం ||**

మేఘమువలె శ్యామలవర్ణముతో భాసిల్లువాడును, పీతాంబరధారియును, శ్రీవత్సలాంఛనముతో వెలయువాడును, కౌస్తుభ మాణిక్యముయొక్క దివ్యకాంతి పుంజములతో వెలుగువాడును, పుణ్యమూర్తియును, తామరరేకులవలె విశాలములగు ప్రసన్న ప్రశాంత సుందర నేత్రములతోనొప్పువాడును, సర్వలోకేశ్వరేశ్వరుండునునైన శ్రీవిష్ణుభగవానుని హృదయపూర్వకముగా ధ్యానించుచున్నాను.

**నమస్సమస్తభూతానామాదిభూతాయ భూభృతే |**
**అనేకరూపరూపాయ విష్ణవే ప్రభవిష్ణవే ||**

**సశంఖచక్రం సకిరీటకుండలం**
**సపీతవస్త్రం సరసీరుహేక్షణం |**
**సహారవక్షఃస్థలశోభికౌస్తుభం**
**నమామి విష్ణుం శిరసా చతుర్భుజం ||**

శంఖచక్రములను ధరించినవాడును, కిరీటకుండల భూషితుండును, పీతాంబరధారియును, తామరరేకులవంటి సుందర నేత్రములు గలవాడును, వక్షస్థలమునందు కౌస్తుభ మణిహారాది శోభితుండును అగు శ్రీమహావిష్ణువునకు శిరస్సు వంచి వినయపూర్వకముగా నమస్కరించుచున్నాను.

**ఛాయాయాం పారిజాతస్య హేమసింహాసనోపరి |**
**ఆసీనమంబుదశ్యామమాయతాక్షమలంకృతం ||**
**చంద్రాననం చతుర్బాహుం శ్రీవత్సాంకితవక్షసం |**
**రుక్మిణీసత్యభామాభ్యాం సహితం కృష్ణమాశ్రయే ||**

గీతా సాహిత్య శిరోమణి **పండిత పెమ్మరాజు రాజారావు** రచన – శ్రీ విష్ణు సహస్ర నామ స్తోత్రము – సంగ్రహ తాత్పర్య వివరణ (గొల్లపూడి వీరాస్వామి సన్, రాజమండ్రి) నుండి శ్లోకముల తాత్పర్యములు కాపీ చేయబడినవి.

కాపీహక్కులు: గొల్లపూడి వీరాస్వామి సన్, రాజమండ్రి

## ఓం శ్రీ పరమాత్మనే నమః

# స్తోత్రము

# హరిః ఓమ్

ఈ స్తవరాజము 'ఓమ్' అను పవిత్రాక్షరముతో ప్రారంభము అగుచున్నది. ఓంకారము మంగళప్రదము, పవిత్రము అగుటచేత ఆరంభమునను, అంతమునను ఈ దివ్యమంత్రము గానము చేయబడును. ఇది ప్రణవమని పిలువబడును.

'ఓమ్' అను మంత్రముతో భగవానుని ఉపాసించువాడు ముక్తిని పొందునని ప్రశ్నోపనిషత్తు తెలుపుతున్నది. **"ఓమిత్యేకాక్షరం ఇదగ్ం సర్వం"** అని మాండుక్యోపనిషత్తు గానము చేయును. **"ఓం తద్బ్రహ్మ ఓం తద్వాయుః ఓం తదాత్మా ఓ తత్సర్వం ఓం తత్సర్వం"** అని నారాయణోపనిషత్తు గానము చేయుచున్నది.

**"ఓమిత్యేకాక్షరం బ్రహ్మవ్యాహరన్ మామనుస్మరన్ యః ప్రయాతి త్యజన్ దేహం స యాతి పరమాగతిమ్"** – ఎవ్వడు ఓంకారమును ఉచ్చరించుచు దేహత్యాగము చేయునో వాడు పరమగతిని పొందును – అను గీతావాక్యము స్మరణీయము (గీత : 8-11)

**"ప్రణవః సర్వ వేదేషు"** – సర్వవేదసారము ప్రణవమైయున్నది (గీత : 7-8)

**"గిరామస్మ్యేకమక్షరం"** – వాక్కులయందు నేను ఓంకారమునై యున్నాను (గీత : 10-25)

**"ఓం అథ"** అను ఈ రెండు శబ్దములును సృష్టి ప్రారంభమున బ్రహ్మదేవుని కంఠమునుండి ఆవిర్భవించిన మంగళ శబ్దములని శృతి గానము చేయును. కావున మంగళప్రదమగు ఓంకార పుణ్యశబ్దముతో మంగళప్రదమగు ఈ స్తవరాజము ప్రారంభమగుచున్నది.

**"తస్య వాచకః ప్రణవః"** – భగవానుని నామము ప్రణవమని పతంజలి మహర్షి తెలిపియున్నాడు. 'ఓం' అనునది భగవానుని నామముగా గీతా శాస్త్రమున (17-23) తెలుపబడియున్నది.

''ఓం'' అని పిలిచినచో ''ఓ'' యని భగవానుడు పలుకునని భక్తులయొక్క విశ్వాసము. కావున 'ఓమ్' అను దివ్యనామముతో ఈ స్తవరాజము మంగళకరముగా ప్రారంభమగుచున్నది.

*(పూర్వపీఠిక లోని శ్లోకాలకు అనువాదము, మరియు 'ఓమ్' మంత్రమునకు వ్యాఖ్య కూడా శ్రీ పెమ్మరాజు రాజారావుగారి రచననుండి అధికంగా కాపీ చేశాను. ఇక్కడినుండి శ్రీ కృష్ణమాచారి గారి ఆంగ్ల రచనకు తెలుగు అనువాదం ప్రారంభిస్తున్నాను – కా.సు.బాబు).*

## విశ్వం విష్ణుర్వషట్కారో భూతభవ్యభవత్ప్రభుః |
## భూతకృద్భూతభృద్భావో భూతాత్మా భూతభావనః || (1)

## 1. విశ్వమ్

- విశ్వము (నామరూపాత్మకమై, చిత్రాతి చిత్రమై – వికసించి, విస్తరించి, విరాజిల్లుచు కానవచ్చు సకల చరాచర చైతన్యసహితమగు ప్రపంచమే విశ్వము) – లేదా, విశ్వమునకు మూలకారణమైనవాడు.
- సకల విషయములందును సంపూర్ణమైనవాడు

### ఓం విశ్వాయ నమః

'విశ్' – ప్రవేశించుట – అనే ధాతువునుండి 'విశ్వమ్' అనే పదం వస్తుంది. శ్రీ భట్టులు మోక్షధర్మమునుండి ఈ శ్లోకాన్ని ఉదాహరించారు

**వేషణాత్ విశ్వమిత్యాహుః లోకానామ్ కాశిసత్తమ**
**లోకాన్ శ్చ విశ్వమేవ ఇతి ప్రవదన్తి నరాధిప**

సకల లోకములందును ప్రవేశించియున్నవాడగుటచే భగవానుడు 'విశ్వమ్' అని చెప్పబడును. (అందువలననే లోకములన్నింటిని కలిపి 'విశ్వము' అంటారు.)

శ్రీ భట్టులు 'విశ్వమ్' అనే నామమును 'సంపూర్ణము' అనే భావములో వ్యాఖ్యానించారు. శ్రీ విష్ణుసహస్రనామ స్తోత్రములోని ప్రధమ నామము అయిన 'విశ్వము' ఆ సర్వేశ్వరుని అనంత గుణ స్వరూప వైభవమును, ఆయన పరమ పావన దివ్యమంగళ శుభకర అనితర తత్వమును గానము చేయుట ఎంతో ఉచితముగా ఉన్నదని శ్రీ భట్టులు వ్యాఖ్యానించారు. ఈ పరిపూర్ణత ఆయన సకల రూప, స్వరూప, గుణాది సకల సంపదలకు వర్తించునని వివరిస్తూ శ్రీ వి.వి. రామానుజన్ గారు శ్రీ నమ్మాళ్వార్

'తిరువైమోళి' (1.1.1.) నుండి ఉదాహరించారు. అందుకే భగవంతుని పరిపూర్ణతను ఉపదేశించే 'విశ్వమ్' అనే పుణ్యనామము తక్కిన 999 పుణ్యనామములకు ముందుగా గానము చేయబడినది.

శ్రీ శంకరుల భాష్యము – సర్వేశ్వరుడైన బ్రహ్మము విశ్వమును సృష్టించినందున 'విశ్వమ్' అని ఆ భగవానుడే చెప్పబడుచున్నాడు. సృష్టించిన బ్రహ్మ కారణము. సృష్టింపబడిన విశ్వము కార్యము. అద్వైత సిద్ధాంతానుసారము కార్యకారణముకు భేదము లేనందున, సమస్తమూ బ్రహ్మమే అయినందున, విశ్వసృష్టికర్తయైన విష్ణువును 'విశ్వమ్' అని ధ్యానించనగును.

శ్రీ భట్టులు మాత్రము – తక్కిన 999 నామములవలెనే – 'విశ్వమ్' అను నామము కూడా విష్ణుభగవానుని ఒకానొక గుణస్వరూపవైభవమును సూచించునని వివరించారు.

తమ 'తిరువైమోళి' వ్యాఖ్యానములో శ్రీ వేదాంతదేశికులు ఇలా అభిప్రాయపడ్డారు – 'బ్రహ్మము', 'విశ్వము' ఒకటే అనుట సమానాధికారణ్య సిద్ధాంతము. దీనిని ఆళ్వారులు అంగీకరించుటలేదు. విశ్వము లేదా లోకములు లేదా ప్రపంచము – అనునవి భగవానుని విభూతి, ప్రకారములు. సకల లోకములు, జీవములు, జడ చైతన్య స్వభావములు – సమస్తమునకు ఆయనే కారణము, పోషకుడు, అధికారి, నియంత్రణకర్త.

శ్రీ చిన్మయానంద – 'విశ్వరూపము' లేదా 'విరాడ్రూపము' ఆధారముగా 'విశ్వమ్' అను పదము (నామము)ను వివరింపవచ్చును. **"స ఏవ సర్వ భూతాత్మా విశ్వరూపో యతో అవయవః"** (విష్ణుపురాణము: 1-2-69). ఆ విశ్వరూపుడే సకల భూతములకును ఆత్మ. సమస్తమును ఆయన శరీరమే.

శ్రీ సత్యదేవో వాసిష్ఠ – ఈ విశ్వమంతయును ఆయననుండియే ఉద్భవించినది. మరల సమస్తమును ఆయనయందే లయమగును. కనుకనే ఆయన 'విశ్వమ్'.

ఇక్కడ మనం గమనించవలసిన విషయము – వ్యాకరణ పరంగా 'విశ్వమ్' అనే పదము నపుంసక లింగవాచకము. కాని ఈ నామము భగవానుని సకల గుణ శక్తి వైభవ పరిపూర్ణతను పొందుపరచినందున **"విశ్వాయ నమః"** అని శ్రీ భట్టులు, విశిష్టాద్వైతమార్గానువర్తులు అర్చించుచున్నారు. నిర్గుణ నిరాకార బ్రహ్మతత్వమును ప్రతిపాదించే శ్రీ శంకరులు, అద్వైత వేదాంతులు **"విశ్వస్మై నమః"** అని ధ్యానించుచున్నారు.

క్లుప్తముగా – భగవానుడు పరిపూర్ణుడు. ఆయననుండి ఈ విశ్వమంతా సృజింపబడినది. ఆయనవల్లనే, ఆయనయందే ఈ విశ్వము నిలచియున్నది. విశ్వమంతయును ఆయనయందే లయమగును.

మరికొన్ని ప్రమాణములు-

**బ్రహ్మై వేదం విశ్వమిదం వరిష్ఠమ్. పురుష ఏ వేదం విశ్వమ్** – ఈ విశ్వము పరబ్రహ్మమే. ఈ విశ్వము పరమపురుషుడే.

**విశతీతి విశ్వం బ్రహ్మ.**

**హరిమయము విశ్వమంతయు హరి విశ్వమయుండు – సంశయింప బనిలేదు – హరిమయము గాని వస్తువు పరమాణువు లేదు** – భాగవతము

**మత్తః పరతరం నాన్యత్ కించిదస్తి ధనంజయ** – గీత: 7-7

**వాసుదేవస్సర్వమితి స మహాత్మా సుదుర్లభః** – గీత: 7-19

## 2. విష్ణుః

- అంతటను వ్యాపించియున్నవాడు. సకల చరాచర, జడ చైతన్య వస్తువులయందు అంతస్థితుడైయున్నవాడు.
- అంతటను ఆవరించియున్నవాడు.

## ఓం విష్ణవే నమః

ఈ నామము మరల 259, 663వ నామములుగా వచ్చును.

1వ శ్లోకము – 2వ నామము – విష్ణుః – **విశ్వమ్ విష్ణుః వషట్కారో భూతభవ్యభవత్ప్రభుః**

28వ శ్లోకము – 259వ నామము – విష్ణుః – **వృషాహీ వృషభో విష్ణుః వృషపర్వా వృషోదరః**

70వ శ్లోకము – 663వ నామము – విష్ణుః – **అనిర్దేశ్యవపుః విష్ణుః వీరోఽనంతో ధనంజయః**

'విష్ణు' అను పదమునకు మూల ధాతువులను రెండు విధములుగా చెప్పవచ్చును.

(1) విష్ – వ్యాప్తౌ – ఆవరించుట

(2) విస్ – ప్రవేశనే – లోపల ప్రవేశించుట.

**"స్వ విభూతి భూతమ్ చిత్ అచిత్ ఆత్మకమ్ సర్వమ్ విశతి ఇతి విష్ణుః"** అని శ్రీ భట్టులు వ్యాఖ్యానించారు. కేశవుడు సర్వాంతర్యామి. సమస్తమును ఆయన సంపద. ఆయన దేశ కాల వస్తువులచే పరిచ్ఛేదము కానివాడు. విశ్వమందు అంతటను ఆయన అంతరముగాను, బాహ్యముగాను వ్యాప్తుడై యున్నాడు.

**"వేవేశ భూతాని చరాచరాణి – తత్ సృష్ట్వా, తదేవాను ప్రావిశత్"** – అనగా భగవానుడు సకలచరాచర భూతములను సృష్టించి, వానియందే ప్రవేశించెను.

**వ్యాప్య సర్వాన్ ఇమాన్ లోకాన్ స్థితః సర్వత్ర కేశవః**
**తతశ్చ విష్ణు నామాసి విశేర్ధాతో ప్రవేశనాత్**
'విశ్' ధాతువునకు 'ప్రవేశము' అను అర్థముండుట చేత, సర్వకాలలోకావస్థలయందును స్థితుడైన కేశవుడు విష్ణునామాంకితుడయ్యెను.

మరల 259వ నామములో శ్రీ భట్టులు భగవానుని 'వ్యాప్తి' గుణమును మరింత విశదీకరించారు. నిప్పుకును, పొగకునువలె పరమాత్మునకును, జీవులకును అవినాభావసంబంధమున్నది. గీతలో చెప్పబడినట్లుగా – **"న తదాస్తి వినా యత్ స్యాత్ మయా భూతమ్ చరాచరమ్"** – నేను లేకుండా చరాచర భూతములేవియును లేవు.

శ్రీ వి.వి.రామానుజన్ అందించిన మరో గుణానుభవ కుసుమ సౌరభం – భగవానుని సకల వ్యాప్తిత్వము ఆయన సకల చరాచర జడ చైతన్య భూతములకు అంతస్థితుడనీ, భగవంతునితో సబంధము లేనిది ఏదీ లేదనీ చెప్పడము మాత్రమే కాదు. ఈ గుణం ఆయన సౌశీల్య తత్వమును చాటి చెబుతుంది. సృష్టిలోని సకల వస్తువులపై ప్రేమతో కరుణామృతమును వెదజల్లు ప్రేమమూర్తి ఆయన. శ్రీ కృష్ణదత్త భరద్వాజగారు ఈ అర్థాన్ని ఇలా విపులీకరించారు. 'విషు' అనే ధాతువునకు 'సేచనే' అనగా 'చల్లుట' లేదా 'పోయుట' అనే అర్థాలున్నాయి. **"వేషతి (సించతి) భక్త తరూన్ ఆశీర్వారిభిః ఇతి విష్ణుః"**

శ్రీ నమ్మాళ్వారు ఇలా కీర్తించారు – సర్వేశ్వరుడు పంచభూతములను సృష్టించి, వానినుండి సమస్తమును సృష్టించెను. ఆయనే సకలభూతములుగా రూపొందెను. అన్నింటికి లోపల, బయట ఆయనే వ్యాపించియున్నాడు. అన్ని శరీరములందు ఆత్మయై యున్నాడు.

భగవానుడు అంతటా ఎందుకు వ్యాపించియున్నాడు? సృష్టిలోని జీవ వస్తు సముదాయము అంతా నియమానుసారము నడచుకొనేలా చూడడానికి – అని శ్రీ రాధాకృష్ణశాస్త్రిగారు వివరించారు. ఇందుకు ఉదాహరణగా ఆయన తైత్తరీయోపనిషత్తులోని ఈ ప్రశ్నను, సమాధానాన్ని చెప్పారు.
ప్రశ్న – **"కే న మే విధృతే ఉభే?"** – రెండు వస్తువులు (గ్రహ నక్షత్రాదులు) ఢీకొట్టుకొని విధ్వంసము కాకుండా ఉండడానికి కారణం ఏమిటి?. సమాధానం – **"విష్ణునా విధృతే భూమీ; ఇతి వత్సస్య వేతనా"**. విష్ణువు కారణంగా భూమ్యాదులు నిలచి ఉన్నాయని వత్స ఋషి వాక్యము.

ఇదే నామమునకు శ్రీ శంకరులు చెప్పిన ఆధారాలు
**"అంతర్ బహిశ్చ తత్ సర్వమ్ వ్యాప్య నారాయణా స్థితః"** (మహా నారాయణోపనిషత్తు: 1.13) – విశ్వమందంతటను నారాయణుడే అంతరముగను, బాహ్యముగను వ్యాపించియున్నాడు.
**యస్మాద్ విష్టమ్ ఇదమ్ సర్వమ్ తస్య శక్త్యా మహాత్మనః**

**తస్మాద్ విష్ణురితి ఖ్యాతో వేషేర్ ధాతోః ప్రవేశనాత్** - (విష్ణు పురాణము: 3.1.45)
తన మహోన్నత శక్తిచే సకల లోకములందెల్లను వ్యాపించియున్నవాడగుటచే, 'విష్' (ప్రవేశించుట, వ్యాపించుట) అనే ధాతువు ఆధారముగా ఆయన విష్ణువు అని చెప్పబడుచున్నాడు.

**వ్యాప్తే మే రోదశీ పార్థ కాంతిశ్చాప్యధికా స్థితా**
**క్రమణాచ్చాప్యహమ్ పార్థ। విష్ణురితి అభిసంజ్ఞితః** (మహాభారతము: 350.43)
నేను దిగంతములవరకు వ్యాపించియున్నాను. నా ప్రభావము సాటిలేనిది. నేను ముల్లోకములను అడుగులతో కొలిచియుంటిని. అందుకే, అర్జునా, నన్ను విష్ణువని సంబోధింతురు. (ఇక్కడ 'కాంతి' అనగా ముల్లోకములను వ్యాపించి అధిగమించే భగవానుని దివ్య తేజస్సు, ప్రకాశము అని శ్రీ రాధాకృష్ణ శాస్త్రిగారు వ్యాఖ్యానించారు.)

ఇక 663వ నామము 'విష్ణుః'నకు శ్రీ భట్టులు విష్ణువుయొక్క సమస్తలోకవ్యాప్తమైన శక్తిపరంగా వివరణ చెప్పారు. **'సర్వ శక్త్యాత్మనే'** అనే మంత్రము ఆధారంగా ఆయన అన్ని శక్తులకును ఆలవాలము. **"యస్మాద్ విష్టమిదమ్ సర్వమ్ తస్య శక్త్యా మహాత్మనః"** అనే శ్లోకాన్ని కూడా మరల ఉదాహరించారు. తన అడుగులలో మూడు లోకములను కొలిచిన త్రివిక్రముని శక్తే ఇందుకు తార్కాణము. **"విష్ణుః విక్రమణాత్ దేవః"** (మహా భారతము. ఉద్యోగ. 5.68.13).

అదే మహత్తర సర్వోన్నత అనంత శక్తిని నమ్మాళ్వార్ గారు ఇలా కీర్తించారు – ఆయన నన్ను నిత్య సంసారినుండి నిత్యసూరిగా మార్చివేశాడు. నా సకల పాపములను, నా ముందు తరములవారి పాపములను, నా తరువాతి తరమువారి పాపములను భస్మీపటలం చేశాడు. మేమందరము ఆ సర్వేశ్వరుని పరిజనమైనాము. ఇది ఆ విష్ణువుయొక్క మహాత్మ్యమే. సర్వాంతర్యామి అని ఆయన పేరే చెబుతుంది గదా?

ఇంకా 661 నుండి 664 వరకు నామములను - **కృతాగమః, అనిర్దేశ్యవపుః, విష్ణుః, వీరః** – నామములను అన్నింటినీ ఆ సర్వశక్తిమంతుని 'శక్తి' గుణనామములుగానే శ్రీ భట్టులు వ్యాఖ్యానించారు.

శ్రీ చిన్మయానంద ఈశావాస్యోపనిషత్తు నుండి ప్రస్తావించారు. **"ఈశావాస్యమిదమ్ సర్వమ్ యత్ కిఞ్చ జగత్యామ్ జగత్"** – ఈ జగత్తులో భగవంతుని స్వభావము కానిదేదీ లేదు. ఆన ప్రభావమునకు హద్దులు లేవు. ఆయన దేశ కాల వస్తువులచే పరిచ్ఛిన్నుడు కాడు.

శ్రీ కృష్ణదత్త భరద్వాజగారు మరో చక్కని వ్యాఖ్యానాన్ని అందజేశారు – వి + ష్ణుః = విష్ణుః – **విశేషేణ స్నావయతి ప్రస్రావయతి భక్త అభిలాషాన్ ఇతి విష్ణుః**. భక్తుల కోరికలను అమితముగా మన్నించి ప్రసాదించువాడు.

ఇక్కడ మనం గమనించవలసిన మరొక విషయం – మొదటి నామము 'విశ్వమ్', మరియు రెండవ నామము 'విష్ణుః' – రెండును ఒకే ధాతువు 'విష్' నుండి ఏర్పడిన పదములు. కాని అర్థ వివరణ మాత్రము భిన్నంగా ఉంది.

విశ్వమ్ – భగవంతుడే సమస్తము. ఆయన కానిదేదీ లేదు

విష్ణుః – భగవంతుడు సర్వాంతర్యామి. ఆయన లేనిదేదీ లేదు.

**"అన్గు పూర్తియిల్ నోక్కు, ఇన్గు వ్యాప్తియిల్ నోక్కు"** అని శ్రీ వి.వి. రామానుజన్ చమత్కరించారు. మొదటి నామము భగవానుని పరిపూర్ణతను, రెండవ నామము ఆయన సర్వవ్యాప్తిత్వమును విశేషించి కీర్తిస్తున్నాయి.

శ్రీ రాధాకృష్ణశాస్త్రి – ఈ రెండు పుణ్య నామముల విశిష్టతను స్మరించి ధ్యానిస్తే మనము శాంతి, ప్రశాంతత, అహింస, సేవా తత్పరత వైపు సాగుట తథ్యము. ఎందుకంటే, అంతా భగవంతుడనీ, అంతటా భగవంతుడున్నాడనీ గ్రహించినవారికి భయము, కామము, స్వార్థము, అశాంతినుండి విముక్తి లభించి తీరుతుంది.

అమరకోశమునకు వ్యాఖ్యానములో శ్రీ సూరిగారు 'విష్ణు' అనే పదమునకు 'వేష్ట్' అనగా ఆవరించుట అనే శబ్దమునుండి **"వేవేష్టి ఇతి విష్ణుః"** – ఆవరించి ఉండువాడు విష్ణువు – అని అర్థం చెప్పారు. (తమిళములో ధోవతిని 'వేష్టి' అంటారు. అనగా చుట్టుకొని ఉండేదన్నమాట)

ఇక్కడ ఒక ఆసక్తికరమైన విషయం – ఈ మంగళకరస్తోత్రం పేరే విష్ణుసహస్రనామము. మరి వేదవ్యాసుడు ఈ స్తోత్రాన్ని "విష్ణుర్విశమ్ వషట్కారో.." అని మొదలుపెట్టిఉండవచ్చునుగదా? అలా కాకుండా ఆయన **"విశ్వమ్ విష్ణుర్వషట్కారో ..."** అని ఎందుకు ప్రారంభించినట్లు? శ్రీ భట్టుల గుణానుభవమును బట్టి ఇలా అనిపిస్తున్నది – పరవాసుదేవుని షడ్గుణ పరిపూర్ణత్వమును కీర్తించే ప్రాథమిక నామము 'విశ్వమ్' – అంతా ఆయనే. సంపూర్ణుడు, సమస్తము ఆయనే అని చెబుతుంది. తరువాత వచ్చే 'విష్ణుః' నామము, విశ్వముయొక్క సకల వ్యాప్తి సర్వాంతర్యామి తత్వము అనే గుణాన్ని తెలియజేస్తుంది.

శ్రీ సత్యదేవో వాసిష్ఠగారు తార్కికంగా ఇలా ప్రశ్నించారు – మరి విష్ణువు అంతటా ఉంటే మనకెందుకు కనిపించడు? దీనికి సాధనము శ్రద్ధ..

**"శ్రద్ధయా విందతే వసుః"** – ఋగ్వేదము-10.151.4

**"శ్రద్ధయా అగ్ని సమిధ్యతే శ్రద్ధయా హూయతే హవిః**
**శ్రద్ధామ్ భగస్య మూర్ధని వచసా వేదయామసి"** – ఋగ్వేదము-10.151.1
**శ్రద్ధామ్ ప్రాతర్ హవామహే శ్రద్ధామ్ మధ్యమ్ దినమ్ పరి**
**శ్రద్ధామ్ సూర్యస్య నిమ్రుచి శ్రద్ధే శ్రద్ధాపయేహ నః** – ఋగ్వేదము-10.151.1

సాత్త్విక స్వభావము కలిగి శ్రద్ధతో చరించువాడు ఎల్లపుడు, ఎల్లెడల విష్ణువును దర్శించుచునే యుండును.

సారాంశము – 'విష్ణుః' నామము – గడ్డి పరకనుండి బ్రహ్మము వరకు సమస్త చరాచరములయందు భగవంతుడు వ్యాప్తినొందియుండునని, ఆయన దేశ కాల వస్తువుల చేత పరిచ్ఛిన్నుడు కాడని తెలుపు గుణకీర్తనము. త్రివిక్రముని శక్తియే అంతటికిని మూలము, ఆధారము. అన్నింటికిని లోపల ప్రవేశించి, బయట ఆవరించి ఆ కరుణామయుడు లోకములను పాలించి, శాసించుచున్నాడు. ఆయన విశ్వాకారము, విశ్వాధారము, విశ్వ శాసనము. భక్తుల కోరికలను దయతో వర్షించు సర్వేశ్వరుడును ఆయనే.

<u>భాగవతంలో శ్రీ పోతన పద్యాలు</u>

విష్ణువు అన్నిచోట్లా ఉన్నాడంటూ ప్రహ్లాదుడిలా అన్నాడు
**కలడంబోధి కలండు గాలి గలడాకాశంబునన్ గుంభినిన్**
**గలడగ్నిన్ దిశలం బగళ్ళ నిశలన్ ఖద్యోత చంద్రాత్మలన్**
**గలడోంకారమునన్ త్రిమూర్తుల ద్రిలింగవ్యక్తులందంతటన్**
**గలడీశుండు గలండు తండ్రి! వెదుకంగా నేల ఈ యా యెడన్?**

**ఇందుగలడందు లేడని**
**సందేహము వలదు చక్రి సర్వోపగతుం**
**డెందెందు వెదకి చూచిన**
**నందందే గలడు దానవాగ్రణి! వింటే**

ఇలా ప్రహ్లాదుడు, అతని తండ్రి తర్కిస్తూ ఉండగా విష్ణువు శ్రీనరసింహాకృతిలో అన్నింటా స్థితుడైయుండెను.
**హరి సర్వాకృతులం గలండనుచు ప్రహ్లాదుండు భాషింప స**
**త్వరుడై యెందును లేడు లేడని సుతున్ దైత్యుండు తర్జింప శ్రీ**
**నరసింహాకృతినుండె నచ్యుతుడు నానాజంగమ స్థావరో**
**త్కర గర్భంబుల నన్ని దేశముల నుద్ధండ ప్రభావంబుతోన్**

## 3. వషట్కారః

- నియంత్రించి, పాలించువాడు (వ్యాపించుటయే గాదు, శాసించును కూడ)
- వేదమంత్ర స్వరూపి ('వషట్' క్రియకు గమ్యము)

## ఓం వషట్కారాయ నమః

శ్రీ భట్టుల వివరణ: విష్ణుః, వషట్కారః, భూతభవ్యభవత్ప్రభుః నామములు 'విశ్వమ్' అను నామముయొక్క వేర్వేరు గుణములను విశదీకరించును. 'వస్' – ఇచ్చానుసారము వర్తించుట – అనే మూలమునుండి ఈ 'వషట్కార' శబ్దం వస్తుంది.

విశ్వమ్ – భగవంతుడు అన్నియునై యుండును. ఈ షడ్గుణ్య పరిపూర్ణత్వము ఆయనకు స్వాభావికమైన గుణము.

విష్ణుః – భగవంతుడు అంతటా వ్యాపించెను. ఈ 'అంత'యును ఆయనే సృష్టించాడు. ఆయనే అంతటికిని హక్కుదారుడు.

వషట్కారః – భగవంతుడు తన ఇచ్చానుసారము ఎల్ల లోకములను నియంత్రించును.

అంటే ఈ గుణములు బయటినుండి ఆయనకు ఆపాదింపబడినవి కావు. అన్నీ ఆయన ఇచ్చానుసారము వెల్లడి అగుచున్న గుణవైభవములు. ఇలా శ్రీ భట్టులు ఈ నామాలను అనుసంధించారు. శృతులనుండి మనం గమనించదగిన ఆధారాలు

**సర్వస్య వశీ సర్వస్య ఈశానః** – సకలములకు ఆయన శాసకుడు, పాలకుడు.

**జగద్వశే వర్తతేదమ్** – జగత్తు ఆయనకు వశమై వర్తించును.

శ్రీ శంకరుల భాష్యము వేరే దృక్పథములో చెప్పబడింది. వేదోక్తములైన యజ్ఞములలో 'వషట్' అనే మంత్రంతో హోమం చేస్తారు. 'ఓం', 'స్వాహా'ల లాగానే ఇది కూడా యజ్ఞమంత్రము గనుక యజ్ఞస్వరూపుడు, యజ్ఞభోక్తయునైన పరమేశ్వరుని 'వషట్కారః' అని కీర్తిస్తారు. పవిత్ర శ్లోక స్తోత్ర పారాయణమునకు ముందు అంగన్యాస, కరన్యాస విధులలో ఈ వషట్కారము స్మరింపబడును (**"సహస్రార్చిః సప్తజిహ్వ ఇతి శక్త్యై శిఖాయై వషట్"**). కనుక వషట్కారము ఒక మంత్రము. మంత్రస్వరూపియైన భగవానుడు కూడా వషట్కారుడే.

## 4. భూత భవ్య భవత్ప్రభుః

- భూత కాలము, వర్తమానకాలము, భవిష్యత్కాలము – మూడు కాలములకును అధిపతి.
- మూడు కాలములందలి సకలములకును అధినాథుడు.

## ఓ భూత భవ్య భవత్ప్రభవే నమః

నిరుక్తి – **“త్రికాల వర్తినామ్ శేషి”** – గతము, వర్తమానము, భవిష్యత్తులో ఉండెడి అన్నింటికిని అధిపతి. **“భూత-భవ్య-భవన్-నాథః కేశవః కేశి సూదనః”** అని శృతివాక్యము.

కాలముగాని, మరే బంధములు, పరిమితులు గాని భగవంతునికి వర్తించవు. ఆయనకు ఆది, అంతము లేదు. కాలక్రమమున అన్నియును నశించును కాని కాలమునకే అధిపతియైన భగవంతుడు ఒకప్పుడు, ఇప్పుడు, మరెప్పుడూ సకలచరాచరములకు అధిపతియే. భగవంతుడు కాలస్వరూపుడు, కాలాతీతుడు, కాలమునకధీశ్వరుడు.

## 5. భూతకృత్

- సకల భూతములను సృజించువాడు (భూత-కృత్)
- సకల భూతములను నాశనము చేయువాడు (భూతాని-కృన్తతి)

## ఓం భూతకృతే నమః

**“భూతాని కరోతి ఇతి భూతకృత్”**

**“సర్వాణి భూతాని స్వతంత్రః సృజతి”**
స్వతంత్రముగా, అనగా ఏ విధమైన ఆధారము లేకుండా, సర్వభూతములను సృజించు పరమాత్ముడే ‘భూతకృత్’ అని శ్రీ భట్టులు వ్యాఖ్యానించారు.

రజోగుణమునను సరించి చతుర్ముఖ బ్రహ్మ రూపమున సకల ప్రాణులను సృజించు ఆ పరమాత్ముడే తమోగుణమునాశ్రయించి, రుద్రుని రూపంలో సకలప్రాణులను సంహరించును (భూతాని – ప్రాణులను, కృన్తతి – నాశనము చేయును) కనుక కూడ ఆయన ‘భూతకృత్’

## 6. భూతభృత్

అన్ని భూతములను పోషించువాడు **“భూతాని బిభ్రతి ఇతి భూతభృత్”**

## ఓం భూతభృతే నమః

చక్రమునకు ఇరుసువలెనుండి, వానికాధారమై, అంతరాత్మయై, మార్గదర్శిగా భగవంతుడు అన్ని భూతములను పోషించును.

ఆదికూర్మముగా మందరగిరిని ధరించినవాడు, శ్రీవరాహమూర్తియై భూమిని ఉద్ధరించినవాడు అయిన శ్రీమహావిష్ణువే 'భూతభృత్' అని శ్రీ రాధాకృష్ణశాస్త్రిగారు వివరించారు.

పై మూడు నామములు (**భూతభవ్యభవత్ప్రభుః, భూతకృత్, భూతభృత్**) కలిపి – భగవంతుడు సృష్టి, స్థితి, లయలకు ఆధారమని  తెలియుచున్నది. కాని ఆయనకు ఆది, అంతము లేదు. సృష్టికిని, కాలమునకును, భూతములకును ఆధారము ఆయనే.

**శింశుమారాత్మనా విష్ణుః భూరాదీనూర్ధ్వతః స్థితాన్**
**దధ్రే శేషతయా లోకాన్ సప్తలోకాన్ అధః స్థితాన్**
శ్రీమహావిష్ణువు శింశుమార (మొసలి) రూపంలో ఊర్ధ్వలోకాలను, ఆదిశేషుని రూపంలో అధోలోకాలను ధరించియున్నాడు. లోకాలయొక్క రక్షణ బాధ్యత శ్రీమహావిష్ణువుదే. అందుచేతనే సత్వగుణమునాశ్రయించి జీవులన్నిటినీ పాలిస్తున్నాడు, పోషిస్తున్నాడు. కనుక ఆయన 'భూతభృత్'.

## 7. భావః

ఉనికియైయున్నవాడు. "భవతి ఇతి భావః"

## ఓం భావాయ నమః

తనంత తానే, అప్రమేయముగా, విశ్వమంతను సృజించి, విస్తరించి, విరాజిల్లునది.
భూ – ఉండునది – అనే ధాతువునుండి ఈ పదము గ్రాహ్యము.
**"శ్లిష్టత్వాత్ భావ ఈరితః"** – సకల విభూతులతోను కూడిఉన్నవాడు 'భావః'

డా. క్రోవి పార్థసారథి ఈ నామం వివరణలో భగవద్గీత విభూతియోగం నుండి అనేక శ్లోకాలు (భగవద్విభూతులు) ఉదాహరించారు.

## 8. భూతాత్మా

సకల భూతములకును ఆత్మయైయున్నవాడు – "సర్వేషాం భూతానామ్ ఆత్మా"

## ఓం భూతాత్మనే నమః

అన్ని భూతములును భగవంతుని శరీరమే. అన్ని శరీరములకును భగవంతుడే ఆత్మ. సకల కార్యములకును ఆయనే అంతర్యామి, సాక్షి.

శ్రీ శంకరులు బృహదారణ్యకోపనిషత్తునుండి ఉదాహరించారు-

**“ఏష త ఆత్మా అంతర్యామ్యమృతః”** – భగవంతుడే సకల భూతములకును ఆత్మ, అంతర్యామి, నాశనరహితము.

శ్రీ చిన్మయానందగారు కఠోపనిషత్తునుండి ఉదాహరించారు.

**“ఏకో వశీ సర్వ భూతాంతరాత్మా రూపమ్ ప్రతిరూపో బహిశ్చ”** – బయటకు వివిధ రూపములలో వ్యక్తమగు సర్వభూతముల లోపల అంతరాత్మయై ఒకే పరమాత్ముడు వాసము చేయును.

సర్వసారోపనిషత్తు – తనతో కూడి ఉండు కూటస్థుడు మొదలైనవారితో భేదములు గల స్వరూపాన్ని తెలుసుకొనే విషయంలో హేతువుగను, సకల దేహములయందు మణులలో దారములాగా వరుసగా లోపల ఉండి నియమించువాడుగను, ప్రకాశించు ఆత్మయే అంతరాత్మ.

ఐతరేయోపనిషత్తు – పరమేశ్వరుడు జీవరాశిని సృష్టించిన తరువాత, ఆ శరీరంలో తాను ప్రవేశించాలి అనుకొన్నాడు. బ్రహ్మరంధ్రంగుండా లోనికి ప్రవేశించాడు.

**అధిభూతం క్షరోభావః పుషశ్చాధిదైవతమ్**
**అధియజ్ఞో అహమేవాత్ర దేహే దేహభృతాంవరః** – భగవద్గీత 8.4
ఉత్పత్తి వినాశ శీలములైన పదార్థములు అన్నియును అధిభూతములు అనబడును. హిరణ్మయుడైన పురుషుడు అధిదైవము. దేహధారులలో శ్రేష్ఠుడవైన ఓ అర్జునా! ఈ శరీరములో అంతర్యామిగా ఉన్న నేనే – వాసుదేవుడనే – అధియజ్ఞమును.

## 9. భూతభావనః

అన్ని భూతములను సృష్టించి, పోషించి, నిలుపువాడు

## ఓం భూతభావనాయ నమః

‘వర్ధయతి’ – అనగా పోషించి పెంపొందించువాడు – అన్న అర్థంలో శ్రీ శంకరులు, శ్రీ భట్టులు కూడా ఈ నామమును వ్యాఖ్యానించారు.

శ్రీ భట్టులు: **“తాని ధారక పోషక భోగ్య ప్రదానేన వర్ధయతి ఇతి భూత భావనః”** - అన్ని భూతములను ధరించి, పోషించి, భాగ్యములను ప్రసాదించి వర్ధిల్లజేయువాడు భూతభావనుడు.

శ్రీ శంకరులు: **“భూతాని భావయతి, జనయతి, వర్ధయతి ఇతి వా భూతభావనః”** – (భా - వెలుగొందుట) – భూతములను ప్రకాశింపజేసి, సృజించి, వర్ధిల్లజేయువాడు భూతభావనుడు.

మొదటి శ్లోకంలోని ఈ తొమ్మిది నామములను ఇలా అనుసంధానింపవచ్చును.

1. విశ్వః - ఆయనే సర్వస్వము

2. విష్ణుః - ఆయన అంతట, లోన, బయట వ్యాపించియున్నాడు

3. వషట్కారః - సర్వ స్వతంత్రుడు, సర్వాధిపతి

4. భూతభవ్యభవత్ప్రభుః- మూడు కాలములకును అధిపతి, కాలాతీతుడు

5. భూతకృత్ - సకల భూతములను సృష్టించి, నశింపజేయును.

6. భూతభృత్ - సకల భూతములను భరించును.

7. భావః - అన్నింటికీ ఆయనే ఉనికి

8. భూతాత్మా - సకల భూతములకును అంతరాత్మ

9. భూతభావనః - సకల భూతములను పోషించి, వర్ధిల్లజేయువాడు

1,2,3,4 - వాసుదేవుడే సర్వస్వము

5,6 - అన్ని భూతములకును ఆది, అంతము

7,8,9 - అన్ని భూతములకును ఆధారము.

**సర్వ భూతాని కౌంతేయ ప్రకృతి యాంతి మామకామ్**

**కల్పక్షయే పునస్తాని కల్పాదౌ విసృజామ్యహమ్** (భగవద్గీత 9-7)

ఓ కౌంతేయా! కల్పాంతమునందు భూతములన్నియును నా ప్రకృతినే చేరును. అనగా ప్రకృతిలో లీనమగును. కల్పాదియందు నేను మరల వానిని సృజించుచందును.

**ఉపద్రష్టానుమంతా చ భర్తా భోక్తా మహేశ్వరః**

**పరమాత్మేతి చాప్యుక్తో దేహే అస్మిన్ పురుషః పరః** (భగవద్గీత 13-22)

ఈ దేహమునందున్న ఆత్మ వాస్తవముగా పరమాత్మయే. అతడు సాక్షిభూతుడగుటవలన 'ఉపద్రష్ట' యనియు, యదార్థ సమ్మతినిచ్చువాడు అగుటవలన 'అనుమంత' అనియు, అన్నింటిని ధరించి, పోషించువాడు అగుటవలన 'భర్త' అనియు, జీవరూపములో 'భోక్త' అనియు, బ్రహ్మాదులకును స్వామియగుటవలన 'మహేశ్వరుడు' అనియును, శుద్ధ సచ్చిదానంద ఘన స్వరూపుడగుట వలన 'పరమాత్మ' అనియు పిలువబడుచున్నాడు.

**గామావిశ్య చ భూతాని ధారయామ్యహమోజసా**

**పుష్ణామి చౌషధీః సర్వాః సోమో భూత్వా రసాత్మకః** (భగవద్గీత 15-13)

పృథ్వియందు ప్రవేశించి, నేను నా శక్తి ద్వారా సకల భూతములను ధరించి, పోషించుచున్నాను. రసస్వరూపుడనై – అనగా అమృతమయుడైన చంద్రుడనై – ఓషధులకు, అనగా వనస్పతున్నింటికిని పుష్టిని చేకూర్చుచున్నాను.

**అన్నమయ్య కీర్తన**

శ్రీవేంకటేశుడు శ్రీపతియు నితడే - పావనపు వైకుంఠపతియును నితడే

భాగవతములో జెప్పే బలరాముతీర్థయాత్ర - నాగమోక్షమైన దైవ మాత డితడే

బాగుగా బ్రహ్మాండపురాణ పద్ధతి యాత డితడే - యోగమై వామన పురాణోక్తదైవ మీతడే

వెలయ సప్తఋషులు వెదకి ప్రదక్షిణము - లలర జేసిన దేవు డాత డీతడే

నెలపై కోనేటిపొంత నిత్యము గుమారస్వామి - కలిమి దనము సేసి కన్నదేవు డీతడే

యెక్కువై బ్రహ్మాదులు నెప్పుడు నింద్రాదులు - తక్కక కొలిచియున్న తత్త్వ మీతడే

చక్క నారదాదుల సంకీర్తనకు జొక్కి - నిక్కిన శ్రీవేంకటాద్రి నిలయుడు నీతడే .

(1) శ్రీ నరసింహన్ కృష్ణమాచారి ఆంగ్ల రచనకు ఇది తెలుగు అనువాదము.

(2) భగవద్గీత శ్లోకముల తాత్పర్యము గీతాప్రెస్, గోరఖపూర్ ప్రచురణనుండి.

(3) 'ఓమ్' వ్యాఖ్య శ్రీ పెమ్మరాజు రాజారావు రచననుండి.

## పూతాత్మా పరమాత్మా చ ముక్తానాం పరమా గతిః |
## అవ్యయః పురుషః సాక్షీ క్షేత్రజ్ఞోఽక్షర ఏవ చ || (2)

### 10. పూతాత్మా

- పవిత్రమగు ఆత్మ – **"పూతా ఆత్మా యస్య స పూతాత్మా"** – ఏ విధమైన కర్మలచేతను బద్ధుడు కానివాడు. కర్మఫలములు అంటనివాడు.

### ఓం పూతాత్మనే నమః

మన మనోశరీరములు కర్మసాధనములు అగుటచేత మనకు కర్మఫలములు అంటుతాయి. కాని భగవంతుడు పవిత్రాత్ముడు గనుక, ఎలాంటి కర్మఫలములు ఆయనను అంటవు. సకల భూతముల శరీరములు విశ్వరూపుని అవయవములే అయినను, సకల భూతములలోని అంతరాత్మ ఆయనే అయినా కూడా, ఏ విధమైన మాలిన్య వికార రాగాది విషయవాసనలు అంటనివాడే ఆ పరమాత్ముడు.

శ్రీ భట్టులు చెప్పిన ఉదాహరణ: ఒక ఉపాధ్యాయుడు బెత్తముతో విద్యార్థిని దండించినపుడు బెత్తము ఇద్దరి శరీరములను అంటి ఉంటుంది. కాని నొప్పి మాత్రం విద్యార్థికే కలుగుతుంది. అలాగే భగవంతుడు సకల భూతముల అంతరాత్మయైనా, ఆ భూతముల కర్మఫలములు మాత్రము భగవానునికి అంటవు.

శ్రుతి: **"శుభాశుభ కర్మాణాభిర్యో న లిప్యతి కదాచన"** – మంచిగాని, చెడుగాని కర్మలు అంటనివాడు.

**న మాం కర్మాణి లిమ్పన్తి న మే కర్మఫలే స్పృహా**
**ఇతి మాం యో అభిజానాతి కర్మభిర్న స బధ్యతే** – భగవద్గీత-4.14

నాకు కర్మఫలాసక్తి లేదు. కావున కర్మలు నన్నంటవు. ఈ విధముగా నా తత్వమును తెలిసినవారు కర్మబద్ధులు కారు.

## 11. పరమాత్మా

పరమమైన, అంతకు అధికము లేని ఆత్మ. – **"పరమా ఆత్మా అస్య స పరమాత్మా"**

## ఓం పరమాత్మనే నమః

మనందరకు భగవానుడు అంతరాత్మయైయున్నాడు. ఆయన చైతన్యము వల్లనే సమస్తమును చైతన్యవంతమగుచున్నది. అయితే భగవానునకు మాత్రము ఆయనే స్వయముగా ఆత్మ, అంతరాత్మ, చైతన్యము. అందుకే ఆయన పరమాత్ముడు. అంతకు అధికుడు లేడు. నిరుక్తము రచయిత చెప్పినట్లుగా **"ఆత్మా ఈశ్వరత్వాత్ పరమాత్మా"**

శ్రీ ఏకనాథ ఈశ్వరన్ గారు సూచించిన గీతా ప్రవచనం – నేను అందరిలో ఉన్నాను. కాని నాలో ఎవరూ లేరు. (దీనికి సంబంధించిన శ్లోకములు నేను గుర్తించలేకపోయాను. చదువరుల సహాయం కోరుతున్నాను – అని శ్రీ కృష్ణమాచారిగారి వినతి)

[భగవద్గీత రాజవిద్యారాజగుహ్య యోగము లో 5,6 శ్లోకాలకు నావద్ద ఉన్న (గీతాప్రెస్, గోరఖ్ పూర్) అనువాదం పై ప్రవచనానికి భిన్నంగా ఉంది – కా.సు. బాబు
**"భూతభృన్న చ భూతస్థో మమాత్మా భూతభావనః"**
ఈ భూతములన్నింటిని సృష్టించునదియు, పోషించునదియును నేనేయైనను యదార్థముగా నా ఆత్మ వాటియందు స్థితమైయుండదు.
**"తథా సర్వాణి భూతాని మత్స్థానీత్యుపధారయ"**
అట్లే నా సంకల్పము ద్వారా ఉత్పన్నమైన భూతములు (ప్రాణులు) అన్నియును నాయందే స్థితమైయుండును అని యెఱుంగుము. ]

ఇంకా శృతులనుండి పెక్కు ఉదాహరణలు గ్రహింపవచ్చును.
**"న పరమ్ పుండరీకాక్షాత్ దృశ్యతే భరతర్షభ"**
**"పరమ్ హి పుండరీకాక్షాత్ న భూతమ్ న భవిష్యతి"** –పుండరీకాక్షునికంటె ఉన్నతమైనది ఏదియును లేదు.
**"న దైవమ్ కేశవాత్ పరమ్"** – కేశవునికంటె దైవము లేదు.
**"మత్తః పరతరమ్ నా అన్యత్ కించిదస్తి"** – నాకంటెను పరమకారణమైనది ఏదియును లేదు (గీత-7-7)

**"పరమ్ హి అమృతమ్ ఏతస్మాత్ విశ్వరూపాత్ న విద్యతే"** – విశ్వరూపుడైన ఆ విరాట్ పురుషుని కంటె వేరు పరమామృతము లేదు.

**"పరః పరాణామ్ పరమః పరమాత్మా"** – ఆయన ఉన్నతులకంటె మహోన్నతుడు. సర్వాధిపుడు. ఆయనే పరమాత్ముడు. (విష్ణు పురాణము-1.2.10)

**పరమాత్మా చ సర్వేషామ్ ఆధారః పరమేశ్వరః**

**విష్ణుర్నామ సర్వవేదేషు వేదాంతేషు చ గీయతే** – విష్ణుపురాణము-6.4.10

పరమాత్ముడే సమస్తమునకును ఆధారము. సర్వమునకును ఈశ్వరుడే ఆయన. వేదవేదాంతములు ఆయననే 'విష్ణు' నామమున గానము చేయుచున్నవి.

## 12. ముక్తానాం పరమాగతిః

ముక్తులయిన, జనన మరణ చక్రబంధమునుండి విముక్తి పొందిన మహనీయులకు పరమాశ్రయమైనవాడు. ముక్తులకు ఇంతకంటె ఆశింపవలసినది మరొకటి లేదు.

## ఓం ముక్తానాం పరమాగతయే నమః

ముక్తులనగా నెవరు? రాగ ద్వేష సాంగత్య దోషములను త్యజించి, కర్మ బంధములను త్రెంచుకొని, భక్తి జ్ఞాన వైరాగ్య సాధనములతో భగవంతుని అర్చించి, జనన మరణ దుఃఖ భూయిష్టమగు సంసార చక్రమునుండి బయటపడి, ఆ పరంధాముని ఆశ్రయము పొందినవారే ముక్తులు. భగవత్సేవయే వారికి మార్గము, సాధనము, గమ్యము. సచ్చిదానందానుభవమే వారి లక్ష్యము. అందులకే ఆ పరమాత్ముడు, పరమపురుషుడు ముక్తులకు పరమగతి.

సామాన్యముగా ఒకదాని తరువాత మరొకటిగా లక్ష్యములు ప్రత్యక్షమవుతూనే ఉంటాయి. కాని సచ్చిదానంద బ్రహ్మమును ఆశ్రయించినవారికి అంతకంటె కోరదగినదేమియును ఉండదు. అదే వారికి పరమాగతి.

గీత. 7.18: **"అస్థితః సహి యుక్తాత్మా మామేవానుత్తమమ్"** – అట్టి జ్ఞానియైన భక్తుడు తన మనస్సును, బుద్ధిని నాయందే స్థిరముగానుంచి, నన్నే పరమప్రాప్యునిగా భావించును. ఈ విధముగా అతడు నన్నే పొందును.

**ఆబ్రహ్మభువనాల్లోకాః పునరావర్తినో అర్జున**

**మాముపేత్య తు కౌంతేయ పునర్జన్మ న విద్యతే** – గీత 8.16

అర్జునా! బ్రహ్మలోక పర్యంతము ఉన్న సమస్త లోకములును పునరావృతములు. కౌంతేయా! (ఈ లోకములన్నియును కాలమునకు పరిమితములైనవి. కాని నేను కాలాతీతుడను.) కనుక నన్ను చేరినవానికి పునర్జన్మయుండదు.

కఠోపనిషత్తు-3.11 – **"సా కాష్ఠా సా పరాగతిః"** – అదే పరమ సాధనము. అదే పరమగతి.

శ్రీ భట్టుల భాష్యము ప్రకారము – భగవానుడు ముక్తులకు పరమగతి అవడానికి కారణం ఏమిటో తరువాతి 5 నామములలో విశదీకరింపబడినది.

13. అవ్యయః ఆయన ముక్తులను మరల సంసారచక్రములో పడనీయడు

14. పురుషః ఆయన ముక్తులకు పరమానందమును ప్రసాదించును.

15. సాక్షీ ముక్తుల సచ్చిదానందానుభవమును చూచి ఆనందించువాడు.

16. క్షేత్రజ్ఞః ముక్తులకు ఏది ఉత్తమ స్థానమో తెలిసినవాడు

17. అక్షరః ఎంత అనుభవించినా తరగని ఆనందనిధి ఆయన

శ్రీ భట్టుల వ్యాఖ్యానము వ్యాకరణ శబ్దార్థములకు పరిమితం కాకుండా, ఒక్కొక్క నామమునకు దాని ముందు నామమునకు అనుబంధాన్ని అందంగా పొందుపరచిందని మళ్ళీ మనం గమనింపవచ్చును. ఇది శ్రీ భట్టుల వ్యాఖ్యానంలో ఒక విశిష్టత. శ్రీ శంకరుల వ్యాఖ్యానంలో ఈ విధమైన దృక్కోణం మనకు అగుపించదు. ఇదే కాకుండా వారిద్దరి వేదాంత మార్గముల కారణంగా అనిపించే భేదాలు ఉండనే ఉన్నాయి. శ్రీ శంకరులది అద్వైత వాదము. శ్రీ భట్టులది విశిష్టాద్వైతము.

## 13. అవ్యయః

- తనను చేరినవారిని మరల జనన మరణ చక్రములో పడనీయనివాడు. **నవీయతే నవ్యగమ్యతే ఇతి అవ్యయః** (శ్రీ భట్టుల వ్యాఖ్య).
- తరుగుదల లేనివాడు. **న అస్య వ్యయః ఇతి అవ్యయః** (శ్రీ శంకరుల వ్యాఖ్య)

## ఓం అవ్యయాయ నమః

శ్రీ భట్టుల వ్యాఖ్య – పరమాత్ముని సన్నిధానము చేరిన ముక్తులు మరల పతనము చెందే భయము లేదు. యమస్మృతిలో చెప్పినట్లుగా

**సత్వమ్ వహతి సూక్ష్మత్వాత్ పరమ్ నారాయణమ్ ప్రభుమ్**

**పరమాత్మానమ్ ఆసాద్య పరమ్ వైకుంఠమ్ ఈశ్వరమ్**

ముక్తులైనవారు శుద్ధ సూక్ష్మ సత్వ శరీరములు పొంది శ్రీమన్నారాయణుని సన్నిధిని చేరుదురు. అలా ఒకమారు వైకుంఠమున భగవత్ప్రాప్తి పొందిన తరువాత అమృతత్వము పొందుదురు. మరల ఇహలోకమునకు మరలరు.

శ్రీ శంకరుల వ్యాఖ్య – వ్యయమనగా నాశనము. నాశనము లేనివాడు, షడ్వికార రహితుడు అవ్యయుడు. అందుకు బృహదారణ్యకోపనిషత్తు (6.4.25)నుండి శ్రీ శంకరులు ప్రమాణం చూపారు. **"అజరః అమరః అవ్యయః"**. (1) ఒకప్పుడు ఉండుట (2) పుట్టుట (3) పెరుగుట (4) మార్పు చెందుట (5) క్షీణించుట (6) నశించుట – అనేవి షడ్వికారములు. ఈ ఆరు గుణములు లేనివాడే పరమాత్ముడు గనుక ఆయన అవ్యయుడు.

## 14. పురుషః

- ముక్తులకు పుష్కలముగా బ్రహ్మానందానుభవమును ప్రసాదించువాడు – **"పురు సనోతి ఇతి పురుషః"**
- శరీరమందు శయనించియున్నవాడు – **"పురి సేతే ఇతి పురుషః"**
- సమస్తమునకు పూర్వమే ఉన్నవాడు – **"పురా ఆసీత్ ఇతి పురుషః"**
- జగత్తునకు పరిపూర్ణతనొసగువాడు – **"పూరయతి ఇతి పురుషః"**

## ఓం పురుషాయ నమః

2వ శ్లోకము. 14వ నామము. పురుషః – **అవ్యయః పురుషః సాక్షీ క్షేత్రజ్ఞోఽక్షర ఏవ చ**
44వ శ్లోకము. 407వ నామము. పురుషః – **వైకుంఠః పురుషః ప్రాణః ప్రాణదః ప్రణవః పృథుః**

'పురు' అనగా పుష్కలము. 'సనోతి' అనగా ఇచ్చువాడు. **"పురు సనోతి ఇతి పురుషః"** – పుష్కలముగా ఫలములను ఇచ్చువాడు. **"పురూణి ఫలాని సనోతి - దదాతి ఇతి పురుషః"**
తైత్తరీయోపనిషత్తు – **"రసో వై సః రసమ్ హ్యేవాయమ్ లబ్ధ్వా ఆనందీ భవతి"** – ఆయనే సచ్చిదానంద స్వరూపుడు. ఆయనను పొందినవారు ఆనందులగుదురు.

శ్రీ శంకరులు, శ్రీ భట్టులు కూడా పై భావమును చెప్పారు. ఇంకా శ్రీ శంకరులు – శరీరమను పురమునందు వసించినవాడు పురుషుడు – అన కూడా వ్యాఖ్యానించారు.
**నవద్వారమ్ పుణ్యమ్ ఏతైర్భావైః సమన్వితమ్**
**వ్యాప్య సేతే మహాత్మా యస్తస్మాత్ పురుష ఉచ్యతే** – మహాభారతము 12.203.35
నవ ద్వారములు కలిగిన పురము అనబడే ఈ శరీరమున వ్యాపించి, వసించి యున్నవాడు పురుషుడు. గీతలో కూడ శరీరము "నవద్వారే పరే దేహీ" అని ప్రస్తావింపబడినది.

శ్రీ శంకరుల మరొక వ్యాఖ్య – సకల భూతములకు పూర్వమే ఉన్నవాడు. తైత్తరీయారణ్యకము:
**"పూర్వమేవ అహమ్ ఇహ ఆసమ్ ఇతి పురుషస్య పురుషత్వమ్"**
వేదమంత్రోచ్చారణలో 'పురుష' అనే పదము కొన్నిమార్లు 'పూరుష' అని ఉచ్చరింపబడుతుంది. (**"అతో జ్యాయాగ్ శ్చ పూరుషః"** – పురుష సూక్తము)

**"పూరయతి ఇతి పురుషః"** - ఆయన సర్వవ్యాపి. ఆయనవల్లనే జగత్తు పరిపూర్ణమగును. ఆ పరమాత్ముడు, పరమపురుషుడు లేని జగము ఎలా ఉంటుంది? ఆత్మ లేని శరీరంలాగా, అర్థం లేని శబ్దంలాగా, గమ్యం లేని గమనం లాగా ఉంటుంది.

ఇలా ఆ పరమ పురుషుని ఒక్కొక్క నామమునకు మహానుభావులైన భాష్యకర్తలు వేరు వేరు విధంగా వివరణలు సమర్పించి, ఆ అనంత భగవత్తత్వమును ఇంకా కొంచెము, ఇంకా కొంచెము తెలిసికోవడానికి మనకు సహాయము అందజేశారు. ఇది శ్రీ చిన్మయానందగారి అభిప్రాయము.

## 15. సాక్షీ

- సర్వమును ప్రత్యక్షముగా, ఇంద్రియ సాధనములు అవుసరం లేకుండా చూచువాడు – **"సాక్షాత్ ఈక్షతే"**
- సమస్తము తెలిసినవాడు, సర్వజ్ఞుడు.

## ఓం సాక్షిణే నమః

సూర్యుడు అన్నింటిపై ప్రకాశించుచున్నాగాని వాటి గుణదోషాలతో సూర్యునికి సంబంధం లేదు. అలాగే భగవంతుడు కూడా సమస్తమును సకల కాల స్థితి రూపములలోనూ చూస్తూ ఉంటాడు. కాని వాటివలన ఆయన ప్రభావితం కాడు.

జీవాత్మలు (సకల భూతములు) కన్నులవంటి ఇంద్రియాల ద్వారా ప్రపంచమును తెలిసికొనును (చూచును). ఆయా ఇంద్రియములకు ఉన్న పరిమితుల వలన వాని జ్ఞానము కూడా పరిమితము. కాని విశ్వసాక్షికి ఆ పరిమితి లేదు. ఆయన సర్వజ్ఞుడు, సర్వసాక్షి.

శ్రీ భట్టుల అదనపు వ్యాఖ్య – **"వ్యయమానందయన్ తృప్యన్ సాక్షీ సాక్షాత్కరోతి సః"** ముక్తాత్ముల ఆనందానుభవములను ప్రత్యక్షముగ వీక్షించి ఆ పరమాత్ముడు ప్రసన్నుడగును. అందువలన ముక్తాత్ముల ఆనందానుభూతి ఇంకా అధికమగును. భగవంతుడే ముక్తుల పరమాగతి గదా!.

## 16. క్షేత్రజ్ఞః

- ముముక్షువుల పరమార్థమైన శుద్ధ సచ్చిదానంద పరబ్రహ్మానుభవము వారికి ఎక్కడ లభించునో తెలిసినవాడు. వారిని అక్కడికి చేర్చువాడు (శ్రీ భట్టుల వ్యాఖ్య)
- ఈ శరీరం అనే క్షేత్రంలో విలసిల్లుచూ, ఎన్నడూ నశింపక, క్షేత్ర తత్వమును ఎఱిగిన పరమాత్ముడు (శ్రీ శంకరుల వ్యాఖ్య)

## ఓం క్షేత్రజ్ఞాయ నమః

**క్షేత్రస్తు పరమవ్యోమ ముక్తేభ్యో వేత్తి నిత్యశః**
**ధాతుం సవానుభవం యశ్చ క్షేత్రజ్ఞః స తు కథ్యతే**

'క్షేత్రము' అంటే పరమ పదము. అది భగవద్భోగాన్ని కొన్ని వందలరెట్లు వృద్ధి చేస్తుంది. ముక్తి పొందిన తన భక్తులకు పరమపదములో ఆ భోగము స్థిరముగా ఉంటుందని తెలిసినవాడు క్షేత్రజ్ఞుడు. అంటే ముక్తి పొందినవారు పరమపదమునందు శాశ్వతమైన ఆనందాన్ని అనుభవిస్తారని అర్థము.

శ్రీ నారాయణుడు వైకుంఠవాసి. వైకుంఠప్రాప్తిని పొందినవారు మరల ఇహలోకమునకు తిరిగిరారు. భక్తిదీక్షాపరులైన మహాతపస్వులకు మాత్రమే వైకుంఠప్రాప్తి సాధ్యము. వరాహపురాణంలో అగస్త్యమహాముని అన్న మాట –

**అద్యాపి తం లోకవరమ్ ధ్యాయన్ తిష్ఠామి సువ్రత!**
**కదా ప్రాప్యేత్ తు అసౌ లోకః సర్వలోక వరోత్తమః**

నేను ఇంకా ఆ పుణ్యలోకాల గురించిన ధ్యానంలోనే నిమగ్నుడనైయున్నాను. సర్వ లోకాలలో ఉత్తమమైన ఆ లోకమును నేనెప్పుడు చేరగలనో?

భగవంతుడు అగస్త్యునితో ఇలా అన్నాడు –

**పశ్య లోకమిమమ్ మహ్యమ్ యో న వేదేస్తు దృశ్యతే**
**త్వత్ ప్రియార్థమ్ అయం లోకః దర్శితస్తే ద్విజోత్తమ**

వేదములవల్ల కూడ తెలియరాని ఈ నా లోకమును చూడుము. బ్రాహ్మణోత్తమా! నీ సంతోషము కొఱకు ఈ లోక దర్శనమును నీకు ప్రసాదించుచున్నాను - అగస్త్యునివంటి మహామునికి కూడ వైకుంఠదర్శనము సుదుర్లభము. భగవంతుని కృపవల్ల మాత్రమే ఆ లోక దర్శనం లభించింది.

శ్రీ శంకరులు 'క్షేత్రజ్ఞః' అనే నామమును భగవద్గీతలోని 13వ అధ్యాయము - క్షేత్ర క్షేత్రజ్ఞ విభాగ యోగము – ఆధారంగా వ్యాఖ్యానించారు. ముఖ్యంగా 2,3 శ్లోకాలు ఇలా చెబుతున్నాయి.

**ఇదం శరీరం కౌన్తేయ క్షేత్రమిత్యభిధీయతే**

**ఏతద్యో వేత్తి తం ప్రాహుః క్షేత్రజ్ఞ ఇతి తద్విదః** – గీత 13.2

**క్షేత్రజ్ఞం చాపి మాం విద్ధి సర్వక్షేత్రేషు భారత**

**క్షేత్రక్షేత్రజ్ఞయోర్జ్ఞానం యత్తద్ జ్ఞానం మతం మమ** – గీత 13.3

శ్రీ భగవానుడు ఇలా అన్నాడు – ఓ కౌంతేయా! ఈ శరీరమును 'క్షేత్రము' అని పేర్కొందురు. ఈ క్షేత్రమును గూర్చి ఎఱింగినవానిని క్షేత్రజ్ఞుడు అని తత్వము తెలిసిన జ్ఞానులు తెలుపుదురు.
ఓ అర్జునా! అన్ని క్షేత్రముల యందున్న క్షేత్రజ్ఞుడను, అనగా జీవాత్మను నేనే అని తెలిసికొనుము. క్షేత్ర క్షేత్రజ్ఞులకు సంబంధించిన జ్ఞానము అనగా వికార సహిత (త్రిగుణాత్మకమైన) ప్రకృతి మరియు నిర్వికార పురుషుల తత్వములను గూర్చి తెలిసికొనుటయే 'జ్ఞానము' అని నా అభిప్రాయము.

(ఇక్కడ 'క్షేత్రజ్ఞుడు' అనగా సకల భూతములలోను అంతర్యామియై, సాక్షియై ఉన్న పరమాత్ముని మరొక గుణవిశేషంగా, 'భూతాత్ముడు' అన్న నామమునకు మరింత విస్తారమైన వివరణగా కనిపిస్తుంది. భగవద్గీతలో 'క్షేత్రజ్ఞ' పదము ఈ అర్థంలో చెప్పబడినదా లేక వేరే విధముగా వివరించవలెనా అనే విషయాన్ని పరిశీలించవలసిఉన్నది.)

## 17. అక్షరః

- ముక్తులు ఎంత అనుభవించినా తరగని అనంత సచ్చిదానంద ఐశ్వర్య స్వరూపుడు – **"న క్షరతి ఇతి అక్షరః"** (శ్రీ భట్టుల వ్యాఖ్య)
- ఎల్లప్పుడూ (కల్పాంతమునందు కూడ) నశింపక నిలచియుండువాడు భగవానుడే – **"స ఏవ న క్షరతి ఇతి అక్షరః"** (శ్రీ శంకరుల వ్యాఖ్య)

## ఓం అక్షరాయ నమః

భగవంతుని అధికారము, ఔన్నత్యము, వైభవము, ఐశ్వర్యములు అనంతములు. అవి ఆయన గుణతత్వములకు అంతర్గతములైన విషయములు. వేరు ఆధారమునుండి (బయటనుండి) సంక్రమించినవి కావు. ఎన్నడూ తరుగవు. నిరుక్తిలో ఇలా చెప్పారు –

**సదా నుభూయమానో అపి నిస్సీమ గుణగౌరవాత్**

**ముక్తైః క్వచిత్ న క్షరతి ఇతి అక్షరః పరికీర్తితః**

కల్పాంతమున సమస్తమును నశించినను వటపత్రశాయి సకల గుణ వైభవ పరిపూర్ణుడై విలసిల్లుచుండును. ఆయన ఆద్యంత రహితుడు.

మనము గమనించదగినది మరొక విషయము- 12వ నామము 'ముక్తానాం పరమాగతి'. ఆయన ముక్తులకు పరమగతి. ఎందువలన? ఆయన అవ్యయుడు. ముక్తులను మరల జనన మరణ చక్రములో పడనీయడు. పరుషుడై పూర్ణానుభవానందమును ప్రసాదించును. సాక్షియై ముక్తులతో ఆనందమును పంచుకొనును. క్షేత్రజ్ఞుడు గనుక ముక్తులను తగిన స్థానమునకు చేర్చును. ఆ అక్షరుడు తరగని ఆనందనిధి. ఇలా శ్రీ భట్టులు 13నుండి 17వ నామము వరకు తెలిపిన వ్యాఖ్యానము 12వ నామమునకు కారణములను వివరించుచున్నవి.

(1) శ్రీ నరసింహన్ కృష్ణమాచారి ఆంగ్ల రచనకు ఇది తెలుగు అనువాదము.

(2) భగవద్గీత శ్లోకముల తాత్పర్యము గీతాప్రెస్, గోరఖపూర్ ప్రచురణనుండి.

## యోగో యోగవిదాంనేతా ప్రధానపురుషేశ్వరః |
## నారసింహవపుః శ్రీమాన్ కేశవః పురుషోత్తమః || (3)

### 18. యోగః

- ముక్తి సాధనకు ఆ భగవానుడే మార్గము, సాధనము, ఉపాయము
- యోగము వల్లనే ఆయనను పొందగలము

### ఓం యోగాయ నమః

అమర కోశము(3.3.22)లో 'యోగము' అనే పదానికి అనేక అర్థాలు ఉన్నాయి – **"యోగః సన్నాహః ఉపాయ ధ్యాన సంగతి ముక్తిషు"**. వ్యాఖ్యానకర్తలు కూడా 'యోగః' అనే నామమునకు వేరు వేరు దృక్పథాలలో భావార్థములను వివరించారు.

శ్రీ భట్టులు 'ఉపాయము, సాధనము' అనే భావంలో 'యోగః' నామమును వ్యాఖ్యానించారు. **"అస్యైవ నిరుపాధిక ముక్తి ఉపాయత్వమపి వక్తి - యోగః"** – ముక్తి సాధనకు, పరమపదప్రాప్తికి ఆ శ్రీమన్నారాయణుడే ఉపాయము, మార్గము. **"స సాయుజ్యస్య అనన్యాపేక్షః సాక్షాత్ హేతుః ఇత్యర్థః"** – సాయుజ్యమునకు సాక్షాత్తు ఆయనే కారణము. ఆయనకు వేరు సాధనాలతో నిమిత్తము లేదు. ఇందుకు శ్రీ భట్టులు బ్రహ్మసూత్రములు, గీత నుండి ఆధారములు చూపారు.

**"తద్ హేతుః వ్యాపదేశాచ్చ"** (బ్రహ్మసూత్రములు 1.1.15) – సకల భూతములు అనుభవించు పరమానందమునకు కారణము ఆయనే.

**"ఏష హ్యేవ ఆనందయాతి"** (తైత్తరీయ-ఆనందవల్లి 2.7.1)

**"అహమ్ త్వా సర్వ పాపేభ్యో మోక్షయిష్యామి"** (గీత 18.6) – నేను నిన్ను అన్ని పాపములనుండి విముక్తుని చేయుదును.

శ్రీ సత్యసంధ తీర్థ 'యోగః' నామమునకు 'ఉపాయము' అన్న భావములోను, ఇతర భావములలోను శ్రీ భట్టులవలెనే వ్యాఖ్యానించారు. **"భూతానామ్ భవతరణ ఉపాయ ఇతి యోగః"**

శ్రీ కృష్ణదత్త భరద్వాజ కూడా 'ఉపాయము' అన్న అర్థంలోనే వ్యాఖ్యానించారు. **"యోగః భక్త అభిలాష అధిగమాయ అమోఘ ఉపాయః"** – భక్తులు తమ కోర్కెలను సాధించుకొనుట కొఱకు తిరుగులేని ఉపాయము యోగము.

శ్రీ శంకరులు 'యోగః' నామమునకు 'ఐక్యమగుట, కలయిక' అనే భావంలో వ్యాఖ్యానం చెప్పారు. అద్వైత వాదంలో జీవాత్మ, పరమాత్మలకు భేదం లేదు. ఇంద్రియాలను, మనస్సును నిగ్రహించి, తరతమ భేదభావములను అధిగమించి, ఆత్మ, పరమాత్మల ఏకత్వమును తెలిసికొనుటయే యోగము. ఇట్టి యోగమువలన పొందబడువాడు గనుక భగవానుడు 'యోగః' నామమున కీర్తింపబడెను. (కార్య కారణములకు అభేదము అని గ్రహింపవలెను).

[విష్ణు సహస్రనామము, భగవద్గీత, బ్రహ్మసూత్రములు, ఉపనిషత్తులు వంటి ప్రామాణిక గ్రంథములపై వ్యాఖ్యానములు రచించుట ద్వారా పరమాచార్యులు తమ వేదాంత సిద్ధాంతములు శృతి, స్మృతి, పురాణములకు అనుగుణంగా ఉన్నాయని ఆధారసహితంగా నిరూపించదలచారు. శ్రీ భగవద్రామానుజుల గీతాభాష్య గ్రంథమునకు పరిచయ పీఠికలో శ్రీ స్వామి అధిదేవానందగారు ఇలా వ్రాశారు – ఈ ప్రయత్నంలో ఒక్కోమారు తమ వాదమునకు అనుగుణంగా ఉండే భావము కొఱకు భాషను, పాఠమును కాస్త మెలిత్రిప్పినట్లు అనిపిస్తుంది. ..... ఇంకా తమ మార్గానువర్తులను సంశయాత్మకతనుండి మరలించి ఏకోన్ముఖులుగా చేయడానికి, మరీ సాగదీసి అన్వయించినట్లుగా వ్యాఖ్యానించవలసిన అవుసరం వారికి అప్పుడప్పుడూ కలిగిఉండవచ్చును – ఈ పరిస్థితిని అందరు వ్యాఖ్యానకర్తల ప్రవచనాలలోనూ – వారి సిద్ధాంతాలకు ఆధారాలు చూపేప్రయత్నంలో – గమనించవచ్చును. అయితే ఇలాంటి అన్వయాలు చాలా అరుదుగానే గోచరిస్తాయి. ఈ విషయాన్ని మనం విపరీతంగా అర్థం చేసుకోకుండా ఉండడానికి శ్రీ అధిదేవానంద జాగ్రత్తగా సూచించినదేమంటే – ఆ మహానుభావులైన ఆచార్యులు, ప్రామాణిక గ్రంథాల ఆధారంగా, తమ సిద్ధాంతాలను హేతుబద్ధంగానే, సంతృప్తికరంగానే సమర్థించుకొన్నారు.

'యోగః' నామమునకు మనకు లభించిన వేరు వేరు వ్యాఖ్యానాలు ఇందుకు ఒక ఉదాహరణ]

శ్రీ బలదేవ విద్యాభూషణ వ్యాఖ్యలో 'యోగః పదమునకు 'ధ్యానము, కలయిక' అనే రెండు అర్థాలనూ కలిపి అన్వయించినట్లుగా అనిపిస్తుంది. **"యుజ్యతే మనః అస్మిన్ ఇతి యోగః సమాధేః శుభాశ్రయః"** – యోగసమాధి (ధ్యానము) ద్వారా భక్తుని మనస్సు భగవంతునిలో లీనమగును.

శ్రీ చిన్మయానంద కూడా 'ధ్యానము' అనే అర్థంలో వివరించారు. యోగము ద్వారా తెలిసికొనబడువాడు 'యోగః'. సర్వేంద్రియములను విషయవాసనలనుండి మరలించి, మనస్సును ప్రశాంతపరచి, ఆత్మను చైతన్యవంతము చేసి, పరమ సత్యమును తెలిసికొను జ్ఞానసాధనమే యోగము. అప్పుడే అభేద భావానుభవము కలుగును. అదే యోగము. **"సమత్వమ్ యోగ ఉచ్యతే"** (గీత 12.48)

శ్రీసత్యసంధ తీర్థ 'ధ్యానము' అనే అర్థంలోనే 'యోగః' నామమును వ్యాఖ్యానించారు. **"యుజ్యతే హృది యోగిభిః ధ్యాయత ఇతి యోగః"** - యోగులచే హృదయమున ధ్యానింపబడువాడు 'యోగః'

వేరు వేరు ప్రామాణిక అర్థాలలో ఒకే నామమును, తమ తమ సిద్ధాంతములకు అనుగుణంగా వ్యాఖ్యానించారనడానికి ఈ నామము ఒక చక్కని ఉదాహరణ. ఇలా ఆ మహానుభావులు తమ గుణానుభవ వైవిధ్యాన్ని మనకు పలురీతులుగా పంచి ఇచ్చారు.

| **నామము** | **అర్థము** | **వివరణ** | **వ్యాఖ్యానకర్త** |
|---|---|---|---|
| యోగః | ఉపాయము | ముక్తి ప్రాప్తికి ఏకైక, స్వతంత్ర సాధనము. | శ్రీ భట్టులు |
| యోగః | ఉపాయము | భవ తరణోపాయము | శ్రీ సత్యసంధ తీర్థ |
| యోగః | ఉపాయము | కోర్కెలు తీరుటకు తిరుగులేని ఉపాయము | శ్రీ కృష్ణదత్త భరద్వాజ |
| యోగః | సమైక్యత | యోగసాధన వలన పొందబడువాడు | శ్రీ శంకరులు |
| యోగః | ధ్యానము, సమైక్యత | యోగధ్యానము వలన భక్తులు ఆయనలో లీనమగుదురు | శ్రీ బలదేవ విద్యాభూషణ |
| యోగః | ధ్యానము | యోగులచే ధ్యానింపబడువాడు | శ్రీ సత్యసంధ తీర్థ |
| యోగః | ధ్యానము | ధ్యానము వలన, సమత్వ భావము వలన తెలియబడువాడు | శ్రీ చిన్మయానంద. |

## 19. యోగవిదాం నేతా

యోగసాధన చేయువారిని మార్గదర్శియై, నాయకుడై గమ్యము చేర్చువాడు.

## ఓం యోగవిదాం నేత్రే నమః

**ఉపాయ భక్తి విషయే తే చ యోగవిదః స్మృతాః**

**తేషాం చ ఫలపర్యన్త నేతా నిర్వాహకశ్చయః**

కర్మ యోగము, భక్తియోగములను అనుసరించేవారికి, అవి ఫలించేవరకు విచ్ఛిన్నము కాకుండా నిర్వహించేవాడు.

శ్రీ శంకరుల భాష్యము – **యోగం విదన్తి, విచారయన్తి, జానన్తి, లభన్త ఇతి యోగవిదః.** యోగమును ప్రశ్నించి, ప్రయత్నించి, సాధించి తెలుసుకొన్న వాడు 'యోగవిత్'. **నయతి ఇతి నేతా.** ముందుండి నడుపువాడు నేత.

**అనన్యాశ్చింతయంతోమామ్ యే జనాః పర్యుపాసతే**

**తేషామ్ నిత్యాభియుక్తానామ్ యోగక్షేమం వహామ్యహమ్** – గీత 9.22

పరమేశ్వరుడనైన నన్ను నిరంతర భక్తితో చింతన చేయుచు, నిష్కామ భావముతో సేవించువారి యోగక్షేమములను నేనే వహించుదును. వారికి యోగము (నాలో ఐక్యమగు భాగ్యము), క్షేమము (తిరిగి సంసారమునకు రాకుండు రక్షణ) ప్రసాదించెదను. అప్రాప్త వస్తుప్రాప్తిని 'యోగము' అనియు, ప్రాప్తించిన వస్తురక్షణమును 'క్షేమము' అనియు అందురు.

## 20. ప్రధాన పురుషేశ్వరః

మాయ (ప్రకృతి), చైతన్యము (జీవుడు) – రెండింటికిని కూడ ఈశ్వరుడు

## ఓం ప్రధాన పురుషేశ్వరాయ నమః

'ప్రధాన' అనగా బంధమునకును, అజ్ఞానమునకును కారణమైన ప్రకృతి లేక మాయ. 'పురుషః' అనగా చైతన్యస్వరూపుడగు జీవుడు. ఈ రెండింటికిని, అనగా ప్రకృతి పురుషులకు అతీతుడైనవాడు పరమాత్ముడు.

బ్రహ్మసూత్రములు – **దేహ యోగాద్వాసో అపి.** సృష్టి సమయమున శరీర సాంగత్యమువల్లను, ప్రళయకాలమున ప్రకృతి (ప్రధాన) వల్లను ఈ మాయ సంభవించి, జీవాత్ముడు అజ్ఞాన బంధితుడగును. అనగా జీవాత్మకు ప్రకృతియే మాయాస్వరూపము (అసత్). ఈ శరీరము చైతన్య స్వరూపమగు జీవాత్మను మాయలో బంధించు సాధనము.  ప్రకృతి, జీవాత్మల సంబంధము భగవద్గీత 13వ అధ్యాయములో విశదముగా చెప్పబడినది.

**ప్రకృతిం పురుషంచైవ విధ్యనాదీ ఉభావపి**

**వికారాంశ్చ గుణాంశ్చైవ విద్ధి ప్రకృతి సంభవాన్** – గీత 13.19

ప్రకృతి, పురుషుడు – అను ఈ రెండును అనాదియైన (సనాతనమైన)వనియు, రాగద్వేషాది వికారములును, త్రిగుణాత్మకమైన పదార్థములన్నియును ప్రకృతినుండియే ఉత్పన్నమైనవనియును ఎఱుంగుము.

**దైవీహ్యేషా గుణమయీ మమ మాయా దురత్యయా**

**మామేవ యే ప్రపద్యంతే మాయమేతాం తరంతితే** - గీత 7.14

నా మాయ త్రిగుణాత్మకమైనది. అలౌకికమైనది. ఇది అధిగమించుటకు సాధ్యము కానిది. కాని నిరంతరము కేవలము నన్నే భజించువారు ఈ మాయను అధిగమించి సంసారసముద్రమునుండి బయటపడగలరు.

ప్రకృతి, పురుషులు అనాదిగాయున్నారు. ప్రకృతి సత్వ, రజ, స్తమో గుణయుక్తమైనది. పంచభూతములు, 11 ఇంద్రియములు (5 జ్ఞానేంద్రియములు, 5 కర్మేంద్రియములు, మనస్సు) కు కారణము. పురుషుడు బద్ధుడైయున్నాడు. ప్రకృతికిని, పురుషునకును అధీనుడే పరమేశ్వరుడు.
తిరుక్కళ్ళమ్ శ్రీ నరసింహాచార్యులు తమ గీతాభాష్యములో ఈ విషయము సవివరంగా తెలిపారు.

**కార్య కరణ కర్తృత్వే హేతుః ప్రకృతిరుచ్యతే**

**పురుషః సుఖదుఃఖానాం భోక్తృత్వే హేతురుచ్యతే** - గీత 13.20

కార్య కరణములను ఉత్పన్నము చేయుటలో ప్రకృతియే హేతువనియు, సుఖ దుఃఖములను అనుభవించుటలో జీవాత్మయే హేతువనియును చెప్పబడుచున్నది.

**పురుషః ప్రకృతిస్థోహి భుంక్తే ప్రకృతిజాన్ గుణాన్**

**కారణం గుణసంగో అస్య సదసద్యోని జన్మసు** - గీత 13.21

పురుషుడు ప్రకృతిస్థుడై ప్రకృతినుండి ఉత్పన్నమైన త్రిగుణాత్మక పదార్థములను అనుభవించును. ఈ గుణసాంగత్యమే జీవాత్మయొక్క ఉత్తమాధమ జన్మలకు కారణమగును.

## 21. నారసింహవపుః

నరుడు, సింహము శరీరములు మిశ్రమమైన శరీరము కలవాడు. ఇది శ్రీమహావిష్ణువుయొక్క నాలగవ అవతారమగు నృసింహావతారమును స్తుతించు పుణ్యానామము. అభయప్రదము. మంగళకరము.

## ఓం నారసింహవపుషే నమః

**నరవత్ సింహవద్రూపం యోభిభర్త్యభయ ప్రదమ్**

**యథా కామన్తు భక్తానాం నారసింహవపు శ్చ వః**

తన భక్తులయొక్క భయాన్ని పోగొట్టడానికి, వారు కోరిన మరుక్షణమే, వారియొక్క కోరిక మేరకు నరుడు, సింహము – రెండూ కలసిన రూపమును ధరించినవాడు.

శ్రీ భట్టులు శ్రీనృసింహావతారమును గూర్చి ఎన్నో భావాలను ఒక్క వాక్యంలో ఇమిడ్చి చెప్పారు. **"స్వభక్త్యాన్తరాయ నివారణమ్ భక్తభయాపహ తదపేక్షా సమక్షణ ప్రతిపన్నయథా కామ దివ్య మహాన్నృసింహ సమ్ప్థానన:"**

1. ఈ అవతారము తన భక్తులకు భక్తిమార్గంలోని అడ్డంకులను తొలగించెను.
2. తన భక్తుల భయమును హరించెను.
3. భగవానుడు తన ఇచ్ఛానుసారము అవతరించెను.
4. ఆయన అవతారములు దివ్యములు.
5. ఆయన భక్తుల ఆర్తి, ప్రార్థనలకు సమాధానంగా తత్ క్షణమే అవతరించెను.

శ్రీ రాధాకృష్ణ శాస్త్రి భక్తసులభుని ఈ తత్త్వమును విపులముగా వర్ణించి, మరికొన్ని భావానుభవములను ప్రతిపాదించారు.

6. మన 'సామాన్య' హేతు బద్ధత భగవంతునికి వర్తించదు. భగవంతుడు సింహము తల, మనిషి శరీరముతోనే ఎందుకు అవతరించెను? మనిషి తల, సింహము శరీరము అయితే బుద్ధి బలము, శరీరబలము మరింతగా కలసి ఉండేదేమో? – ఇటువంటి లౌకిక తార్కిక విశ్లేషణ ద్వారా ఆయన గుణతత్త్వములను గ్రహించుట అసాధ్యము. ఇంకా తన భక్తులను అనుగ్రహించడానికి ఆయన ఏమయినా, ఎలాగైనా చేస్తాడు. శ్రీనారసింహుడై ఆయన రాక్షసుని (హిరణ్య కశిపుని) చీల్చి చెండాడాడు. శ్రీవరాహమూర్తియై, ఖురదకారే దేహం ధరించి, రాక్షసుని (హిరణ్యాక్షుని) వెంటబడి చంపాడు. శ్రీవామనమూర్తియై రాక్షసుని (బలి) వద్ద భిక్షను స్వీకరించాడు. అండాళ్ అమ్మవారు శ్రీవరాహావతారమును ప్రేమతో "మానమ్ ఇలాప్ పన్టి" అని ప్రస్తావించినది.

7. శ్రీ నారసింహమూర్తి తన వాడిగోళ్ళతో రాక్షసదేహమును చీల్చుట చూచినవారు ఎవరైనను భయకంపితులు కావచ్చును. కాని **"అడుగడుగునకును మాధవానుచింతన సుధామాధుర్యమున మేను మరచువాడును, సంతత శ్రీమన్నారాయణ పాదపద్మ యుగళీ చింతామృతాస్వాద సంధానుండైన"** ప్రహ్లాదుడు భక్తితో, వినయముతో పులకాంకితుడైనాడు. శ్రీహరి హిరణ్యకశిపు భంజనుడు. ప్రహ్లాద రంజనుడు. ఇలా వ్యతిరిక్తమనిపించే భావాలతో విలసిల్లుట భగవానుని విశిష్ట గుణము.

8. శ్రీనారసింహుని సౌందర్య సంపన్నత మరియొక విశేషము. నిరంతర లక్ష్మీసమేతుడైన శ్రీనారసింహుని సౌందర్యము పొంగి పొరలి విశ్వవ్యాప్తమగు గుణవిశేషము. అందుకే తరువాత 'శ్రీమాన్' నామముతో ఆయనను స్తుతిస్తాము.

**ఏకేన చక్రమపరేణ కరేణ శంఖ**
**మన్యేన సింధు తనయా మవలంబ్య తిష్ఠన్**
**వామేతరేణ వరదాభయ హస్తముద్రా**
**లక్ష్మీనృసింహ మమదేహి కరావలంబమ్**

9. మనము లౌకిక తర్కమును అనుసరించి, జీవ పదార్థము జీవమునుండి ఉద్భవిస్తుందనీ, కనుక జడపదార్థము (స్తంభము) నుండి వెలువడేది జడమే అవుతుందనీ అనుకొనవచ్చును. కాని శుద్ధ సత్వ చైతన్య సచ్చిదానందరూపునికి ఇలాంటి తర్కం అన్వయించదు.

శ్రీ స్వామి దేశికన్ తమ దశావతార స్తోత్రంలో, స్తంభంనుండి శ్రీనృసింహస్వామి ఆవిర్భవించడాన్ని విచిత్రంగా కవితలో పొందుపరచారు. బ్రహ్మను కన్నతండ్రియైన శ్రీమన్నారాయణుడు నృసింహస్వరూపుడై స్తంభమునుండి జన్మించెను. కనుక ఆ స్తంభము బ్రహ్మకే నాయనమ్మగా అదృష్టమును సంతరించుకొన్నదట. (5వ శ్లోకము – ''మహాసుర గృహస్థూణ పితామహ్యాభూత్'')

10. శ్రీ సత్యదేవో వాసిష్ఠ 'నారసింహవపుః' అన్న నామానికి – నరుడు, సింహం అవయవాలు కలసిన దేహధారి – అన్నట్లుగా కాకుండా వేరేవిధంగా అర్థం చెప్పారు. నరునివలె ఆలోచనాశక్తి, సింహంవలె శరీరదారుఢ్యము – ఇలా అన్ని విధాల ఉత్తమగుణసంపన్నుడైనవాడు భగవానుడు – అని. ఈ విధమైన భాష్యము చెబుతూ ఆయన మరొక ఆసక్తికరమైన సూక్తిని ప్రతిపాదించారు. ఏదయినా కార్యము సఫలీకృతము కావాలంటే కర్మ మాత్రమే చాలదు. కేవలము జ్ఞానం కూడా చాలదు. రెండూ అవుసరమే అని ఆయన శృతినుండి ఇలా ఉదాహరించారు.

**ఇదమ్ మే బ్రహ్మ చ క్షాత్రమ్ చ ఉభే శ్రియమ్ అశ్నుతమ్** – (యజుర్వేదము 32.16)
**యత్ర బ్రహ్మ చ క్షాత్రమ్ చ సమ్యాన్ చౌ చరతౌ సహః**
**తమ్ లోకమ్ పుణ్యమ్ ప్రాజ్ఞేషమ్ యత్ర దేవాః సహాగ్నునా** – (యజుర్వేదము 20.25)

కనుక ఏదయినా కార్యము తలపెట్టేటపుడు అన్ని సాధ్యాసాధ్యాలనూ, అన్ని పరిణామాలనూ జాగ్రత్తగా పరిశీలించాలి. అలాగే శక్తి ఉన్నంత మాత్రాన సరి కాదు. ఆ శక్తిని ఎలా ఎప్పుడు ఉపయోగించాలనేది తెలియాలి.

11. శ్రీ స్వామిదేశికన్ శరణాగతి దీపిక (17వ శ్లోకము)లో భగవంతుని అవతారములలోని ఆరు రహస్యములను వివరించారు. ఇవన్నీ శ్రీనారసింహవపుని అవతరణలో మనం ప్రస్ఫుటంగా గమనించవచ్చును.

- **నానావిధైః** – ఆయన ఇచ్ఛానుసారము వివిధగుణరూపములలో అవతరించును. ఈ విధంగానే అవతరించునని చెప్పనలవి కాదు.
- **అకపటైః** – ఆయా అవతారములు ఆయన సంపూర్ణ నిజ స్వరూపములు. మాయవలననో భ్రమవలననో అలా కనిపిస్తాడనుకోరాదు.
- **అజహత్ స్వభావైః** – ప్రతి అవతారమునందును ఆయన పరత్వము, కళ్యాణగుణవైభవము పరిపూర్ణములై యుండును. అరకొరగా కాదు.
- **అప్రాకృతైః** – ఆయన మూర్తి స్వరూపములు సామాన్యమానవులవలె పాంచభౌతికమైనవి కావు. ఏ అవతారమునందైనను ఆయన శుద్ధసత్వమూర్తి. త్రిగుణాతీతుడు.
- **నిజవిహారసిద్ధైః** – ఆయన అవతారములు కర్మబంధానుగుణములు కావు. ఆయన కర్మలకు అతీతుడు కనుక, కర్మల కారణముగా జన్మింపడు. కేవలము తన లీలానుగుణముగానే ఆయన అవతరించును.
- **ఆత్మీయ రక్షణా విపక్ష వినాశార్థైః** – తన భక్తుల సంరక్షణ కొఱకు, వారి శత్రువులను నశింపజేయుటకు ఆ భక్తప్రియుడు అవతరించును.

ఉగ్రం వీరం మహావిష్ణుం జ్వలంతం సర్వతోముఖం
నృసింహం భీషణం భద్రం మృత్యుమృత్యుం నమామ్యహం

సిద్ధి బుద్ధి ప్రదే దేవి భుక్తి ముక్తి ప్రదాయిని
మంత్రమూర్తే సదా దేవి మహాలక్ష్మి నమోస్తుతే

**పోతన భాగవతమునుండి.** (శ్రీ భండారు పర్వతరావు రచన – ఓం నమో శ్రీ నారసింహాయ)

శ్రీ నారసింహుని సకల దేవతలు అనేక విధములుగా స్తుతించి ప్రణతులు అర్పించారు. మహాభాగవతుడైన ప్రహ్లాదుడు అంజలి ఘటించి నమస్కరించి, సాష్టాంగ దండ ప్రమాణం చేశాడు. అప్పుడా శరణాగత వత్సలుడు, కరుణాంతరంగుడు, ప్రహ్లాదవరదుడు

**ప్రాభవమొప్ప నుత్కట కృపామతియై కదియంగ జీరి సం**
**శోభిత దృష్టి సంఘముల జూచుచు బాలుని మౌళియందు లో**
**కాభినుతుండు పెట్టె నసురాంతకు డుద్భట కాలసర్ప భీ**
**తాభయ దాన శస్తము ననర్గళ మంగళ హేతుహస్తమున్**

ఇలా తన తలపై చేతినుంచి అభయదానము చేసిన శ్రీహరిని వినయ వివేక భూషణుడైన ప్రహ్లాదుడు భక్తితో పరవశించి చేతులు జోడించి స్తుతించాడు.

ప్రసాదపూర్ణముఖుడైన శ్రీ నరసింహుని చూచి బ్రహ్మదేవుడు – ఓ దేవదేవా! అఖిలాధ్యక్ష! భూతచర పూర్వజ! నియమంతో ధ్యానించేవానికి నీ నరసింహరూపం అన్ని భయాలను, మృత్యుభీతిని కూడా పోగొడుతుంది. - అన్నాడు.

**నీ నృసింహావతారంబు నిష్ఠతోడ**
**దగిలి చింతించువారలు దండధరుని**
**బాధనొందరు మృత్యువు బారిపడరు.**

నారదుడు ధర్మరాజుతో ఇలా అన్నాడు.-

**శ్రీ రమణీయమైన నరసింహ విహారము నింద్రశత్రు సం**
**హారము బుణ్యభాగవతుడైన నిశాచరనాథపుత్ర సం**
**చారము నెవ్వడైన సువిచారత విన్న పఠించినన్ శుభా**
**కారము తోడ నే భయము గల్గని లోకము జెందు భూవరా**

**ఓం నమో భగవతే తుభ్యం పురుషాయ మహాత్మనే**
**హరయేऽద్భుత సింహాయ బ్రహ్మణే పరమాత్మనే**

**సర్వ వేదాంత వేద్యాయ కారణాయ మహాత్మనే**
**సర్వలోక శరణ్యాయ శ్రీనృసింహాయ మంగళమ్**

**మాతర్నమామి కమలే కమలాయతాక్షి**
**శ్రీ విష్ణుహృత్కమల వాసిని విశ్వమాత**
**క్షీరోదజే కమల కోమల గర్భగౌరి**
**లక్ష్మి ప్రసీద సతతం నమతాం శరణ్యే**

## 22. శ్రీమాన్

- రమణీయమగు స్వరూపము గలవాడు. శ్రీనారసింహుడు.
- సదా శ్రీలక్ష్మీదేవిని వక్షస్థలమున ధరించినవాడు

### ఓం శ్రీమతే నమః

మరల ఈ మంగళకర నామము 180, 222వ నామములుగా వస్తుంది. ఈ మూడు సందర్భములలోను ప్రముఖ వ్యాఖ్యాతల అనుభవం క్రింద సంక్షిప్తంగా చెప్పడమైనది.

౩వ శ్లోకము. 22వ నామము. శ్రీమాన్ – **నారసింహవపుః శ్రీమాన్ కేశవః పురుషోత్తమః**

శ్రీ భట్టుల వ్యాఖ్య: అతిమనోహర సుందర శ్రీ నారసింహ స్వరూపము

శ్రీ శంకరుల వ్యాఖ్య: వక్షస్థలమున శ్రీలక్ష్మిని ధరించినవాడు.

19వ శ్లోకము. 180వ నామము. శ్రీమాన్ – **అనిర్దేశ్యవపుః శ్రీమాన్ అమేయాత్మా మహాద్రిధృక్**

శ్రీ భట్టుల వ్యాఖ్య: దివ్యాభరణములతో, దివ్య మాల్యాంబరములతో శోభిల్లువాడు.

శ్రీ శంకరుల వ్యాఖ్య: సకలైశ్వర్య సంపన్నుడు

24వ శ్లోకము. 222వ నామము. శ్రీమాన్ – **అగ్రణీః గ్రామణీః శ్రీమాన్ న్యాయోనేతా సమీరణః**

శ్రీ భట్టుల వ్యాఖ్య: శ్రీయుత మత్స్య మూర్తి. అన్ని సంపదలను కలిగినవాడు.

శ్రీ శంకరుల వ్యాఖ్య: అనన్య తేజోమయుడు.

65వ శ్లోకములో **శ్రీధరః శ్రీకరః శ్రేయఃశ్రీమాన్ లోకత్రయాశ్రయః** పాదములో శ్రీ శంకరులు '**శ్రీమాన్**' అనే నామమును పరిగణించగా, శ్రీ భట్టులు '**శ్రేయఃశ్రీమాన్**' అనే నామముగా పరిగణించారు. ఇలా శ్రీ శంకరుల వ్యాఖ్యప్రకారము 'శ్రీమాన్' నామము నాలుగుమార్లు (౩వ, 19వ, 24వ, 65వ శ్లోకములలో) వస్తుంది. శ్రీ భట్టుల వ్యాఖ్య ప్రకారము ఈ నామము ౩ మార్లు (౩వ, 19వ, 24వ శ్లోకములలో) వస్తుంది.

22వ నామము 'శ్రీమాన్'ను శ్రీ భట్టులు శ్రీనారసింహావతారం పరంగా వ్యాఖ్యానించారు. శ్రీనారసింహమూర్తి **"సౌందర్య లావణ్యాదిభిః అతి మనోహర దివ్యరూపః"** అని శ్రీ భట్టులు వివరించారు. ప్రహ్లాదవరదుడు, హిరణ్యకశిపు శాపవిమోచకుడు అయిన శ్రీహరి నృసింహరూపమును ఉగ్రము, భీకరము, అపూర్వముగా ఎన్నోచోట్ల వర్ణించారు. ఆయన ప్రచండ నేత్రుడు. కత్తివంటి నాలుక, వజ్రాయుధమువంటి నఖములు కలవాడు.

ఈశ్వర సంహితంలో ఈ శ్లోకం ఉన్నది.

**జపాపుష్ప ప్రతీకాశం ద్విభుజం రక్తలోచనం**<br>
**కరే భూమే ప్రతిష్ఠాయ లేవిహన్ స చరాచరం**<br>
**ఆస్ఫోట్య భూమే లాంగూలం పుచ్ఛయుక్తం సురేశ్వరం**<br>
**పుచ్ఛసింహమితి ఖ్యాతం సర్వలోక భయంకరం**

ఈ రూపం భయానకమని కొందరు అజ్ఞానకారణంగా భావింపవచ్చును. ఆయన కరుణామూర్తి. శుద్ధసత్వ స్వరూపి. భక్త సులభుడు. ఆశ్రిత పారిజాతము. ఆయన ఎనలేని సౌందర్యమూర్తి. సకల భయములను

హరించు రక్షకుడు. శ్రీనృసింహావతారమును స్మరించినవారు ఏ భయమును లేని లోకము చేరుట తథ్యము. కనుకనే ఆ దివ్య సుందరమూర్తిని 'శ్రీమాన్' అని కీర్తించారు.

శ్రీ శంకరుల వ్యాఖ్య

**"యస్య వక్షసి నిత్యం వసతి శ్రీః స శ్రీమాన్"** – ఎల్లప్పుడు శ్రీలక్ష్మీదేవిని వక్షస్థలమున ధరించువాడు. కనుకనే ఆయన సకల ఐశ్వర్య వైభవ కళ్యాణ మంగళ గుణమూర్తి. 'శ్రీ' అనగా లక్ష్మి – విద్య – ధనము – ఐశ్వర్యము – వైభవము – ధృతి – క్షమ – ఓజస్సు – తేజస్సు మున్నగు దివ్య విభూతులని భావము. వీటన్నింటిని తన్నాశ్రయించిన భక్తులకు వారి వారి అర్హతలను అనుసరించి దయతో ప్రసాదించువాడు శ్రీహరియే గనుక ఆయన 'శ్రీమాన్'.



పశ్చిమగోదావరి రంగాపురం ఆలయంలో శ్రీలక్ష్మీదేవి శిల్పం

శ్రీ వేంకటేశ్వర ప్రపత్తి

**ఈశానాం జగతోస్య వేంకటపతేః విష్ణోః పరాం ప్రేయసీం**
**తద్వక్షస్థల నిత్యవాసరసికాం తత్ క్షాంతి సంవర్ధినీం**
**పద్మాలంకృత పాణిపల్లవ యుగాం పద్మాసనస్థాం శ్రియం**
**వాత్సల్యాది గుణోజ్వలాం భగవతీం వందే జగన్మాతరమ్**

శ్రీ లక్ష్మ్యష్టోత్తర శతనామ స్తోత్రము

**శుభాం హిరణ్య ప్రాకారాం సముద్ర తనయాం జయామ్**
**నమామి మంగళాం దేవీం విష్ణువక్షస్థల స్థితామ్**

కనకధారా స్తోత్రము

**అంభోరుహం జన్మగృహం భవత్యా వక్షస్థలం భర్తృగృహం మురారేః**

**కారుణ్యతః కల్పయ పద్మవాసే లీలాగృహమ్ మే హృదయారవిందమ్**

## 23. కేశవః

- సుందరమగు కేశములతో నొప్పువాడు. దివ్య సుగంధ భరితములైన శిరోజములు కలవాడు.
- 'కేశి' అను రాక్షసుని సంహరించినవాడు.
- బ్రహ్మకును, శివునకును మూలమైనవాడు.
- సూర్యాదుల కిరణములకు కారణమైనవాడు.
- శత్రువులను పీడించేవాడు.
- సకల జలములపై ఆధిపత్యము కలవాడు.
- (మోక్షముతో సహా) అన్ని సుఖములపై ఆధిపత్యము కలవాడు.

## ఓం కేశవాయ నమః

ఈ నామము రెండుమార్లు వస్తుంది.

3వ శ్లోకము . 23వ నామము. కేశవః - **నారసింహవపుః శ్రీమాన్ కేశవః పురుషోత్తమః**

69వ శ్లోకము . 654వ నామము. కేశవః - **త్రిలోకాత్మా త్రిలోకేశః కేశవః కేశిహా హరిః**

**"ప్రశస్తః కేశః సన్తు అస్య కేశవః"** – ఆయన లక్ష్మీవల్లభుడగుట చేత మాత్రమే సుందరుడు కాదు. స్వయముగా శ్యామసుందరుడు. సర్వాంగమనోహరుడు. అందమైన కేశములతో విరాజిల్లువాడు.

**కుటిలాలక సంయుక్తం పూర్ణచంద్ర నిభాననం**

**విలసత్కుండలధరం కృష్ణం వందే జగద్గురుం**

కంసునిచే పంపబడిన 'కేశి' అనే రాక్షసుని వధించినవాడు గనుక శ్రీకృష్ణుడు కేశవుడని పిలువబడెను. ఇందుకు విష్ణుపురాణములో ఆధారమున్నది.

**యస్మాత్ త్వయైవ దుష్టాత్మా హతః కేశీ జనార్దనః**

**తస్మాత్ కేశవ నామ్నా త్వమ్ లోకే జ్ఞేయో భవిష్యతి**

(తరువాత 'కేశవః', 'కేశిహా' అనే నామములు ఈ స్తోత్రములో వస్తాయి. పునరుక్తి దోషము లేకుండా వ్యాఖ్యాతలు ఈ నామములకు అర్థాలను చెప్పారు. మరి కొంత వివరణ 654వ నామమునకు వ్రాయబడినది)

శ్రీ పెమ్మరాజు రాజారావు రచననుండి – (1) కేశములు అనగా కిరణములు. సూర్యచంద్రుల దివ్య కిరణములే కేశములుగా కలిగి విశ్వమును మహాచైతన్యవంతము కావించువాడు పరమాత్మయే యగుట చేత 'కేశవ' నామముతో అర్చనీయుడగుచున్నాడు. (2) క+అ+ఈశ+వ = కేశవ అని వ్యుత్పత్తి కలదు. 'క' అను అక్షరము సృష్టికర్తయగు బ్రహ్మను, 'అ' అను అక్షరము విష్ణువును, 'ఈశ' పదము పరమ శివుని సూచించును. 'వపుః' అనగా ఈ మూడు స్వరూపములను శరీరముగా కలిగినవాడని భావము. త్రిమూర్తి స్వరూపుడగుట చేత కేశవుడగుచున్నాడు.

## 24. పురుషోత్తమః

**"పురుషేభ్యః ఉత్తమః, పురుషాణామ్ ఉత్తమః, పురుషేషు ఉత్తమః"** – పురుషులలో మిక్కిలి శ్రేష్ఠుడు.

## ఓం పురుషోత్తమాయ నమః

భగవద్గీత 15వ అధ్యాయము పురుషోత్తమ ప్రాప్తి యోగము. ఈ అధ్యాయంలో చెప్పినట్లుగా ఈ లోకంలో రెండు విధాలైన పురుషులున్నారు

(1) క్షరులు – ప్రకృతిచేత మాయా బద్ధులై సంసారమున బంధితులైనవారు.

(2) అక్షరులు లేదా ముక్తులు – సంసార బంధమునుండి విముక్తులైనవారు.

వీరిద్దరికంటె వేరైనవాడు, సకల చేతనాచేతనములకు ఆధారమైనవాడు గనుక శ్రీహరి పురుషోత్తముడు.

గీత: 15-16,17,18

**ద్వావిమౌ పురుషౌ లోకే క్షరశ్చాక్షర ఏవ చ**

**క్షరః సర్వాణి భూతాని కూటస్థోఽక్షర ఉచ్యతే**

ఈ జగత్తునందు క్షరుడు (నశ్వరుడు), అక్షరుడు (వినాశరహితుడు) అని పురుషులు రెండు విధములుగా గలరు. సకల ప్రాణుల శరీరములు నశ్వరములు. జీవాత్మ నాశన రహితుడు.

**ఉత్తమః పురుషస్త్వన్యః పరమాత్మేత్యుధాహృతః**

**యో లోకత్రయమావిశ్య బిభర్త్యవ్యయ ఈశ్వరః**

పై ఇద్దరి కంటెను ఉత్తముడైన పురుషుడు వేరొకడు గలడు. అతడే నాశరహితుడైన పరమేశ్వరుడు. పరమాత్మ. అతడు ముల్లోకములయందును ప్రవేశించి, అందరిని భరించి, పోషించుచున్నాడు.

**యస్మాత్క్షరమతీతోఽహమక్షరాదపి చోత్తమః**

**అతోఽస్మి లోకే వేదే చ ప్రథితః పురుషోత్తమః**

ఏలనన నశ్వరమగు జడవర్గము (క్షేత్రము) కంటెను నేను సర్వథా అతీతుడను. నాశరహితమైన జీవాత్మకంటెను ఉత్తముడను. కనుక ఈ జగత్తునందును, వేదములయందును పురుషోత్తముడనని ప్రసిద్ధికెక్కితిని.

(1) శ్రీ నరసింహన్ కృష్ణమాచారి ఆంగ్ల రచనకు ఇది తెలుగు అనువాదము.

(2) భగవద్గీత శ్లోకముల తాత్పర్యము గీతాప్రెస్, గోరఖపూర్ ప్రచురణనుండి.

---

పోతన ఆంధ్రమహాభాగవతం భక్తులపాలిటి కల్పతరువు. సాహితీప్రియులకు మధురాన్నభోజనం. తెలుగువారి పారాయణ పారిజాతం. ఇందులో శ్రీ నరసింహావతార వర్ణన మనోహరము, జ్ఞానప్రదము, మంగళకరము, అభయదాయకము.

## శ్రీ నరసింహావతార వర్ణన.

ఒకమారు హిరణ్యకశిపుడు ప్రహ్లాదుని చేరబిలచి - నీవు ఏమి నేర్చుకున్నావు? నీకు ఏది భద్రము?- అని ప్రశ్నించగా ప్రహ్లాదుడు "సర్వము అతని దివ్యకళామయము అని తలచి విష్ణువు నందు హృదయము లగ్నము చేయుట మేలు" అని ఉత్తరమిచ్చాడు. రాక్షసులకు తగని ఈ బుద్ధి నీకెలా పుట్టింది? హరీ, గిరీ అని ఎందుకు ప్రేలుతున్నావు? అని తండ్రి గద్దించాడు. అందుకు ప్రహ్లాదుడు

మందార మకరంద మాధుర్యమున దేలు -మధుపంబు వోవునే మదనములకు?
నిర్మల మందాకినీ వీచికల దూగు - రాయంచ చనునె తరంగిణులకు?
లలిత రసాల పల్లవ ఖాదియై చొక్కు - కోయిల సేరునే కుటజములకు?
అంబుజోదర దివ్య పాదారవింద
చింతనామృత పాన విశేష మత్త
చిత్తమేరీతి నితరంబు జేరనేర్చు
వినుత గుణశీల మాటలు వేయునేల?

విష్ణు భక్తి నాకు దైవయోగం వల్ల సహజంగా సంభవించింది. అని జవాబిచ్చాడు. కోపించిన రాక్షస రాజుకు సర్దిచెప్పి, మరల వివిధోపాయాలలో బోధన చేస్తామని ప్రహ్లాదుని గురుకులానికి తీసుకొని వెళ్ళారు గురువులు. అక్కడ మళ్ళీ ప్రహ్లాదునికి తమ విద్యలు నూరిపోసి, రాజువద్దకు తిరిగి తీసికొని వెళ్ళారు. రాజు తన కొడుకును ముద్దుచేసి – "గురువులే సంవిద్యాంశంబులు జెప్పిరో, విద్యా సారమెరుంగకోరెద, భవదీయోత్కర్షమున్ జూపవే ననుగన్న తండ్రీ" - అని అడిగాడు. అప్పుడు ప్రహ్లాదుడు

చదివించిరి నను గురువులు
చదివితి ధర్మార్ధ ముఖ్య శాస్త్రంబులు
నే చదివినవి గలవు పెక్కులు
చదువులలో మర్మమెల్ల చదివితి తండ్రీ!

అని చెప్పెను. మరి ఆ మర్మమమేమిటి? "తను హృద్భాషలసఖ్యమున్, శ్రవణమున్, దాసత్వమున్, వందనార్చనముల్, సేవయు, నాత్మలో నెఱుకయున్, సంకీర్తనల్, చింతనంబను నీ తొమ్మిది భక్తిమార్గంబుల సర్వాత్ముడైన హరిన్ నమ్మి సజ్జనుడై యుండుట భద్రము. శ్రీహరి భక్తిలేని బ్రతుకు వ్యర్ధము. విష్ణుని సేవించు దేహమే ప్రయోజనకరము. ఆ దేవదేవుని గూర్చి చెప్పేదే సత్యమైన చదువు. మాధవుని గూర్చి చెప్పేవాడే సరైన గురువు. హరిని చేరుమని చెప్పేవాడే ఉత్తముడైన తండ్రి" - అని వివరించాడు.

హిరణ్య కశిపుడు మండి పడ్డాడు. తన శత్రువైన విష్ణువును కీర్తించినందుకు ప్రహ్లాదుని కఠినంగా శిక్షించమని ఆదేశించాడు. కాని శూలాలతో పొడిచినా, ఏనుగులతో తొక్కించినా, మంటల్లో కాల్చినా, కొండలపైనుండి త్రోయించినా ప్రహ్లాదునకు బాధ కలుగలేదు. అతడు హరినామ స్మరణ మానలేదు. అదిచూసి రాజు చింతాక్రాంతుడయ్యాడు. మరొక అవకాశం అడిగి రాక్షసగురువు ప్రహ్లాదుని గురుకులానికి తీసికొనివెళ్ళారు. అక్కడ ప్రహ్లాదుడు మిగిలిన రాక్షస బాలురకు ఆత్మజ్ఞానాన్ని, హరితత్వాన్ని, మోక్షమార్గాన్ని ఉపదేశించసాగాడు. ఇలా లాభం లేదని గురువు రాజుతో మొరపెట్టుకున్నాడు.

క్రోధంతో హిరణ్య కశిపుడు ప్రహ్లాదుని పిలిపించి - నేనంటే సకల భూతాలు భయపడతాయి. దిక్పాలకులు నా సేవకులు? ఇక నీకు దిక్కెవరు? బలమెవరు? అని గద్దించాడు. అందరికీ ఎవరు బలమో, అందరికీ ఎవరు దిక్కో ఆ విభుడే నాకు దిక్కన్నాడు ప్రహ్లాదుడు. ఆ హరి ఎక్కడుంటాడు? అని దానవేశ్వరుడు ప్రశ్నించగా

కలడంబోధి కలండు గాలి గలడాకాశంబునన్ గుంభినిన్
గలడగ్నిన్ దిశలం బగళ్ళ నిశలన్ ఖద్యోత చంద్రాత్మలన్
గలడోంకారమునం ద్రిమూర్తుల ద్రిలింగ వ్యక్తులం దంతటన్
గలడీశుండు గలండు తండ్రి! వెదుకంగా నేల యీ యా యెడన్?
అన్నాడు బాలుడు. ఇంకా "చక్రి సర్వోపగతుడు. ఎందెందు వెదకి జూచిన నందందే గలడు" అని చెప్పాడు.

హరి సర్వాకృతులన్ గలండనుచు ప్రహ్లాదుండు భాషింప స
త్వరుడై ఎందును లేడు లేడని సుతున్ దైత్యుండు తర్జింప శ్రీ
నరసింహాకృతినుండె నచ్యుతుడు నానా జంగమ స్థావరో
త్కర గర్భంబుల నన్ని దేశముల నుద్దండ ప్రభావంబుతోన్
ఇలా దైత్యరాజు, అతని సుతుడు వాదించుకొటుండగా శ్రీహరి సకల జడ, చేతన పదార్ధములలో శ్రీ నరసింహాకృతిలో నుండెను (సర్వాంతర్యామిత్వం)

అయితే "ఈ స్తంభమునన్ జూపగలవె చక్రిన్ గిక్రిన్?" అని రాజు ప్రశ్నించాడు. "బ్రహ్మ నుండి గడ్డిపోచవరకు అన్నింటిలో విశ్వాత్ముడైయుండేవాడు ఈ స్తంభమునందెందుకుండడు? స్తంభాంతర్గతుడై ఉండును. ఏ సందేహములేదు. నేడు గానబడు ప్రత్యక్ష స్వరూపంబునన్" అన్నాడా పరమ భాగవతుడైన ప్రహ్లాదుడు. "సరే. చూద్దాం. ఈ స్తంభంలో విష్ణువును చూపకుంటే నీ తలతీయిస్తాను. అప్పుడు హరి వచ్చి అడ్డుపడతాడా?" అని హిరణ్యకశిపుడు చేతితో స్తంభంపై చరిచాడు.

ఇట్లు దానవేంద్రుండు పరిగ్రుహ్యమాణ వైరుండును, వైరానుబంధ జాజ్వల్యమాన రోషానలుండును, రోషానల జంఘన్యమాన విజ్ఞాన వినయుండును, వినయ గాంభీర్య ధైర్య జేగీయమాన హృదయుండును హృదయ చాంచల్యమాన తామసుండును, తామస గుణ చంక్రమ్యమాణ స్థైర్యుండును నయి విస్రంభంబున హుంకరించి, బాలుని ధిక్కరించి హరి నిందు జూపుమని కనత్కనక మణిమయ కంకణ క్రేంకార శబ్దపూర్వకంబుగా దిగ్దంతి దంత భేదన పాటవ ప్రశస్తం బగు హస్తంబున సభామండప స్థంభంబు వ్రేసిన వ్రేటు తోడన

దశ దిశలును మిణుగురులు సెదర జిటిలి పెటిలి పడి బంభాజ్యమానంబగు నమ్మహాస్తంభంబు వలన ప్రళయ వేళా సంభూత సప్త స్కంద బంధుర సమీరణ సంఘటిత జోఘుష్యమాణ మహా బలాహక వర్గ నిర్గత నిబిడ నిష్ఠుర దుస్సహ నిర్ఘాత సంఘ నిర్ఘోష నికాసంబులైన చట చ్చట స్ఫట స్ఫట ధ్వని ప్రముఖ భయంకరారావ పుంజంబులు జంజన్యమానంబులై ఎగసి, యాకాస కుహరాన్తరాళంబు నిరవకాశంబు సేసి నిండినం బట్టు చాలక దోదూయమాన హృదయంబులై, పరవసంబులైన పితామహా మహేంద్ర వరుణ వాయు శిఖి ప్రముఖ చరాచర జంతు జాలంబులతోడ బ్రహ్మాండ కటాహంబు పగిలి పరిస్ఫోటితంబుగా

ప్రఫుల్ల పద్మ యుగళ సంకాశ భాసుర చక్ర చాప హల కులిశాన్కుశ జలచర రేఖాంకిత చారు చరణ తలుండును, చరణ చంక్రమణ ఘన వినిమిత విశ్వ విశ్వంభరాభర ధౌరేయ దిక్కుంభి కుంభీనస కుంభినిధర కూర్మ కులశేఖరుండును, దుగ్ద జలధి జాత శుండాల సుండాదండ మండిత ప్రకాండ ప్రచండ మహోరు స్తంభ యుగళుండును, ఘన ఘణాయమాన మణికింకిణీ గణ ముఖరిత మేఖలావలయ వలయిత పీతాంబర శోభిత కటి ప్రదేశుండును , నిర్జర నిమ్నగా వర్త వర్తుల కమలాకర గంభీర నాభి వివరుండును, ముష్టి పరిమేయ వినుత తనుతర స్నిగ్ధ మధ్యుండును , కులాచల సానుభాగ సదృశ కర్కశ విశాల వక్షుండును , దుర్జన దనుజభట ధైర్యలతికా లవిత్రయామాస , రక్షో రాజ వక్షో భాగ విసంకటక్షేత్ర విలేఖన చుంచులాంగాలాయమాన ప్రతాప జ్వలన జ్వాలాయమాన శరణాగత నయన చకోర చంద్ర రేఖాయమాన వజ్రాయుధ ప్రతిమాన భాసమాన నిశాత ఖరతర ముఖ నఖరుండును, శంఖ చక్ర గదా కుంత తోమర ప్రముఖ నానాయుధ మహిత మహోత్తుంగా మహీధర శృంగ సన్నిభ వీరసాగర వేలాయమాన మాలికా విరాజమాన నిరర్గళానేక శత భుజార్గళున్డును, మంజు మంజీర మణిపుంజ రంజిత మంజుల హారకేయూర కంకణ కిరీట మకర కుండలాది భూషణ భూషితుండును, త్రివళీ యుత శిఖరి శిఖరాభ పరిణద్ధ బంధుర కన్ధరుండును, ప్రకంపన కంపిత పారిజాత పాద పల్లవ ప్రతీకాశ కోపావేశా సంచలితాధరుండును, శరత్కాల మేఘజాల మధ్యమ ధగద్ధగాయమాన తటిల్లతా సమాన దేదీప్యమాన దంష్ట్రాంకురుండును, కల్పాంతకాల సకల భువన గ్రసన విలసన విజ్రుమ్భమాణ సప్తజిహ్వా జిహ్వా తులిత తరళ తరాయమాన విభ్రాజమాన జిహ్వుండును, మేరు మందర మహా గుహాన్తరాళ విస్తార విపుల వక్త్ర నాసికా వివరుండును, నాసికా వివర నిస్సర న్నిబిడ నిస్స్వాస నికర సంఘట్టన

సంక్షోభిత సంతప్యమాన సప్తసాగరుండును, పూర్వ పర్వత విద్యోతమాన ఖద్యోత మండల సద్రుక్ష సమంచిత లోచనుండును, లోచనాంచల సముత్క్రీర్యమాణ విలోల కీలాభీల విస్ఫులింగా వితాన రోరుధ్యమాన తారకా గ్రహ మండలుండును, శక్ర చాప సురుచిరోదగ్ర మహా భ్రూలతాబంధ బంధుర భయంకర వదనుండును, ఘనతర గండ శైల తుల్య కమనీయ గండ భాగుండును, సంధ్యారాగ రక్త దారధరమాలికా ప్రతిమ మహా బ్రంకష తంతన్యమాన పటుతర సటాజాలుండును, సటాజాల సంచాలన సంజాత వాత డోలాయమాన వైమానిక విమానుండును, నిష్కంపిత శంఖ పర్ణా మహోర్ధ్వకర్ణుండును, మన్థదండాయమాన మందర వసుంధరాధర పరిభ్రమణ వేగ సముత్పద్యమాన వియన్మండల మండిత సుధారాశి కల్లోల శికరాకార భాసుర కేసరుండును, పర్వాఖర్వ శిశిర కిరణమయూఖ గౌర తనూరుహస్టునును, నిజ గర్జన నినాద నిర్దళిత కుముద సుప్రతీక వామనైరావత సార్వభౌమ ప్రముఖ ధిగిభరాజ కర్ణ కోటరుండును, ధవళ ధరాధర దీర్ఘదురవలోకనియ దేహుండును, దేహ ప్రభాపటల నిర్మధ్యమాన పరిపన్థి యాతుదాన నికురుంబ గర్వాంధకారుండును, బ్రహ్లాద హిరణ్యకశిపు రంజన భంజన నిమిత్తాంతరంగ బహిరంగ జేగీయమాన కరుణా వీర రస సంయుతుండును, మహా ప్రభావుండును నైన శ్రీ నృసింహదేవుం డావిర్భవించినం గనుంగొని.......

ఇది నరమూర్తికాదు, కేవల హరిమూర్తియు కాదు. హరిమాయా రచితమై యున్నదను కొన్నాడు హిరణ్య కశిపుడు. అప్పుడు

సటలు దళిపించి గర్జించి సంభ్రమించి
దృష్టి సారించి బొమలు బంధించి కెరలి
జిహ్వ యాడించి లంఘించి చేతనొడిసి
పట్టె నరసింహుడా దితిపట్టి నధిప!



**చిన్న తిరుపతిలో శ్రీనృసింహుని శిల్పము**

విహగేంద్రుండహి వ్రచ్చు కైవడి మహోద్వృత్తిన్ నృసింహుండు సా
గ్రహుడై యూరువులందు చేర్చి నఖ సంఘాతంబులన్ వ్రచ్చె దు
స్సహ దంభోళి కఠోరదేహు నచలోత్సాహున్ మహాబాహు నిం
ద్ర హుతాశాంతక భీకరున్ ఘనకరున్ దైత్యాన్వయ శ్రీకరున్

శ్రీ నృసింహదేవుడు భీకరంగా హిరణ్యకశిపుని ఒడిసిపట్టి తనయొడిలో వేసికొన్నాడు. వేసికొని వజ్రాలవంటి తన నఖాలతో (గోళ్లతో)చీల్చి చెండాడాడు.

చించున్ హృత్కమలంబు శోణితము వర్షించున్ ధరామండలిన్
ద్రెంచున్ గర్కశ నాడికావళులు భేదించున్ మహావక్షము౦
ద్రుంచున్ మాంసము సూక్ష్మ ఖండములుగా దుష్టాసురున్ వ్రచ్చిద
ర్పించున్ బ్రేవులు కంఠమాలికలుగ గల్పించున్ నఖోద్భాసియై

ఓం నమో శ్రీ నారసింహాయ

ఇలా శ్రీహరి (మనిషీ, జంతువూ కాక)నారసింహుని రూపంలో, (పగలూ, రాత్రీ కాని) సంధ్యాకాలంలో, (ప్రాణం ఉన్నవీ లేనివీ అని చెప్పలేని) గోళ్ళతో, (ఇంటా బయటా కాక) గుమ్మంలో, (భూమిపైనా, ఆకాశంలో కాక) తనతొడపైన హిరణ్యకశిపుని సంహరించాడు. బ్రహ్మ వరం వ్యర్థం కాలేదు. ప్రహ్లాదుని మాట పొల్లు పోలేదు.

స్వామి ముఖం భీకరంగా కనపిస్తోంది. రక్తరంజితమైన వజ్రనఖాలు సంధ్యాకాలపు ఎర్రదనాన్ని సంతరించుకొన్నాయి. ప్రేవులను కంఠమాలికలుగా వేసుకొన్నాడు. జూలునుండి రక్తం కారుతోంది. ఆయన నిట్టూర్పులు పెనుగాలుల్లా ఉన్నాయి. దేవతలు ఆయనపై పుష్పవర్షాన్ని కురిపించారు. సకలదేవతలు స్తుతించి ప్రణతులు అర్పించారు.

మహాభాగవతుడైన ప్రహ్లాదుడు ఉగ్రమూర్తిగా దర్శనమిచ్చిన స్వామికి అంజలి ఘటించి సాష్టాంగ ప్రమాణం చేశాడు. శ్రీనారసింహస్వామి తన అభయ మంగళ దివ్య హస్తాన్ని ప్రహ్లాదుని తలపైనుంచి దీవించాడు.

ప్రాభవమొప్ప నుత్కట కృపామతియై కదియంగ జీరి సం
శోభిత దృష్టి సంఘముల జూచుచు బాలుని మౌళియందు లో
కాభినుతుండు పెట్టె నసురాంతకు డుద్భట కాలసర్ప భీ
తాభయ దాన శస్తము ననర్గళ మంగళ హేతుహస్తమున్

ఇలా తన తలపై చేతినుంచి అభయదానము చేసిన శ్రీహరిని వినయ వివేక భూషణుడైన ప్రహ్లాదుడు భక్తితో పరవశించి చేతులు జోడించి స్తుతించాడు.

తపమున్ వంశము తేజమున్ శ్రుతము సౌందర్యంబును
ద్యోగమున్ నిపుణత్వంబుప్రతాప పౌరుషములున్ నిష్ఠాబల ప్రజ్ఞలున్
జప హోమంబులు జాలవీశ్వర! భవత్సంతుష్టికిన్ దంతి యూ
థపు చందంబున భక్తి సేయవలయున్ దాత్పర్య సంయుక్తుడై.

ఓ ఈశా! నీవు సత్వగుణ నిలయుడవు. ఈ బ్రహ్మాది దేవతలంతా నీ ఆనతి ప్రకారం నడిచేవారే. వాళ్ళంతా నీ ఉగ్రరూపాన్ని చూచి భయపడుతున్నారు. అసలు ఈ రూపం కాంతివంతం. ఈ విశ్వానికి నీ రూపం వల్ల ఐశ్వర్యం,

క్షేమం, ఆత్మసుఖం కలగుతాయి. బ్రహ్మాది దేవతలంతా నీ కోపం ఎప్పుడు చల్లారుతుందా అని వేచియున్నారు. నీ నారసింహ స్వరూపాన్ని ప్రజలు భయశాంతికోసం ఆరాధిస్తారు - అని ప్రహ్లాదుడన్నాడు.

ఖరదంష్ట్రా భ్రుకుటీ సటా నఖయు నుగ్రధ్యానయున్ రక్త కే
సరయున్ దీర్ఘతరాంత్ర మాలికయు భాస్వన్నేత్రయున్నైన నీ
నరసింహాకృతి జూచి నే వెరవ, బూర్ణ క్రూర దుర్వార దు
ర్భర సంసార దవాగ్నికిన్ వెరతు నీ పాదాశ్రయుం జేయవే

అట్టి స్తుతిచే శ్రీహరి సంతోషించి ప్రసన్నుడై "ప్రహ్లాద! భద్ర! భద్రంతే ప్రీతోహం తే సురోత్తమ' అనినాడు. ప్రహ్లాదుడు పరవశించి పలువిధాల స్తుతించాడు. ప్రసన్నుడైన స్వామి ఏమయినా వరాన్ని కోరుకొమ్మన్నాడు.

"స్వామీ! నా తండ్రి చేసిన భాగవతాపరాధాన్ని మన్నించు" అని కోరాడు ప్రహ్లాదుడు. "నాయనా, నిన్ను కొడుకుగా పొందినపుడే నీ తండ్రితో 21 తరాలు (తల్లివైపు 7 తరాలు, తండ్రివైపు 7 తరాలు, ప్రహ్లాదుని తరువాతి 7 తరాలు) పావనమైనాయి. నా స్పర్శతో నీ తండ్రి పునీతుడైనాడు. నీ తండ్రికి ఉత్తర క్రియలు చేసి రాజువు కా. నా యందు మనసు నిలిపి, విజ్ఞుల ఉపదేశాన్ని పొందుతూ పాలన చేయి" అని ఆశీర్వదించాడు స్వామి.

ప్రసాదపూర్ణముఖుడైన శ్రీ నరసింహుని చూచి బ్రహ్మదేవుడు – ఓ దేవదేవా! అఖిలాధ్యక్ష! భూతచర పూర్వజ! నియమంతో ధ్యానించేవానికి నీ నరసింహరూపం అన్ని భయాలను, మృత్యుభీతిని కూడా పోగొడుతుంది. - అన్నాడు.

**నీ నృసింహావతారంబు నిష్ఠతోడ**
**దగిలి చింతించువారలు దండధరుని**
**బాధనొందరు మృత్యువు బారిపడరు.**

శంకరుడు, బ్రహ్మాది దేవతలు శ్రీనారసింహుని ప్రస్తుతించారు. శ్రీలక్ష్మీ సమేతుడై స్వామి వైకుంఠమునకరిగెను. బ్రహ్మాది దేవతలు ప్రహ్లాదుని పూజలందుకొని తమలోకములకరిగిరి.

ఈ అవతారాన్ని గురించి ధర్మరాజునకు చెబుతూ నారదుడిలా అన్నాడు.

శ్రీ రమణీయమైన నరసింహ విహారము నింద్రశత్రు సం
హారము బుణ్య భాగవతుడైన నిశాచరనాథ పుత్ర సం
చారము నెవ్వడైన సువిచారత విన్న పఠించినన్ శుభా
కారము తోడ నే భయము గల్గని లోకము జెందు భూవరా!

-------

**ఓ నమో భగవతే తుభ్యం పురుషాయ మహాత్మనే**
**హరయే஽ద్భుత సింహాయ బ్రహ్మణే పరమాత్మనే**

**సర్వ వేదాంత వేద్యాయ కారణాయ మహాత్మనే**
**సర్వలోక శరణ్యాయ శ్రీనృసింహాయ మంగళమ్**

**మాతర్నమామి కమలే కమలాయతాక్షి**
**శ్రీ విష్ణు హృత్కమల వాసిని విశ్వమాత**
**క్షీరోదజే కమల కోమల గర్భగౌరి**
**లక్ష్మీ ప్రసీద సతతం నమతాం శరణ్యే.**

(http://srigurupada.blogspot.com నుండి కొంత భాగము కాపీ చేయబడినది. కొంత భాగము శ్రీ భండారు పర్వతరావుగారి "ఓం నమో శ్రీ నారసింహాయ" పుస్తకం నుండి. మరి కొంత భాగం తెలుగు వికీపీడియానుండి.)

## సర్వః శర్వః శివః స్థాణుర్భూతాదిర్నిధిరవ్యయః |
## సంభవో భావనో భర్తా ప్రభవః ప్రభురీశ్వరః || (4)

### 25. సర్వః

సర్వము తానెయైనవాడు. సృష్టి స్థితి లయములకు మూలము.

### ఓం సర్వాయ నమః

**చరాచర శరీరేషు వ్యాప్తిమాన్ సర్వ ఈరితః** స్థావర జంగమాత్మకమైన ఈ జగత్తంతా వ్యాపించియున్నవాడు

**అసతశ్చ సతశ్చైవ సర్వస్య ప్రభవాప్యయాత్**
**సర్వస్య సర్వదా జ్ఞానాత్ సర్వమేనమ్ ప్రచక్షతే** – మహాభారతము – ఉద్యోగ పర్వము 5.68.11
చేతనాచేతనములైన సమస్తమునకును ఆదియును, అంతమును అగుట చేతను, సర్వదా సకలమును ఎరిగినవాడగుట చేతను ఆయన 'సర్వః' అని పిలువబడెను.

శ్రీ చిన్మయానంద ఉదాహరణ: అలలు అన్నీ సముద్రమునుండి జనించి, మరల లీనమగును. కనుక అలలన్నింటినీ సముద్రమనే చెప్పవచ్చును.

**ఎవ్వనిచే జనించు జగమెవ్వని లోపలనుండు లీనమై**
**ఎవ్వనియందు డిందు పరమేశ్వరుడెవ్వడు మూలకారణం**
**బెవ్వడనాది మధ్యలయుడెవ్వడు సర్వము తానెయైనవా**
**డెవ్వడు వాని నాత్మభవు నీశ్వరునే శరణంబు వేడెదన్** - పోతన – భాగవతము – గజేంద్రుని ప్రార్థన

గోస్వామి తులసీదాసు – **సీయ రామమయ సబ్ జగ జానీ, కరఉ ప్రనామ జోరి జుగపానీ** – జగత్తంతయు శ్రీ సీతారామమయమని తెలిసికొని, నేను నా రెండు చేతులను జోడించి, అందఱికిని నమస్కరింతును.

డా. క్రోవి పార్థసారధి రచన శ్రీ కైవల్య సారధి నుండి – బృహదారణ్యకోపనిషత్తు: సృష్టికి పూర్వము మానవాకారంలో ఉన్న విరాడాత్మ మాత్రమే ఉన్నది. అతనికన్న భిన్నమైనదేదీ లేదు. నారాయణోపనిషత్తు: ఈ జగత్తులో నారాయణుడే నిత్యుడు. అతడే బ్రహ్మ. అతడే విష్ణువు. అతడే రుద్రుడు. అతడే ఇంద్రుడు. అతడే భూమి. అతడే ఆకాశము. అతడే కాలము. అతడే దిక్కులు. పైనున్నది అతడే. క్రిందనున్నది అతడే. మధ్యనున్నది అతడే. లోపల ఉన్నది అతడే. బయట ఉన్నది అతడే. భూతభవిష్యద్వర్తమానములు అతడే. ఈ సమస్తమూ అతడే. అతడు నిష్కళంకుడు. నిరంజనుడు. నిర్వికల్పుడు. ఈ జగత్తులో నారాయణుడు తప్ప వేరెవరూ లేరు. అతడు జగత్తంతా ఆవరించి యున్నాడు. అందుచేతనే అతడు 'సర్వుడు' అనబడుచున్నాడు.

## 26. శర్వః

- సకల పాపములను పటాపంచలు చేయువాడు. సకల శుభములను కలిగించువాడు.
- ప్రళయ కాలమున భూతములను హింసించు (నాశనము చేయు) శివుడు.

## ఓం శర్వాయ నమః

శ్రీ పెమ్మరాజు రాజారావు రచన నుండి: సకల శుభములను కలిగించువాడని భావార్థము. భగవానుడు కల్పవృక్షము, కామధేనువు, చింతామణియై యున్నందున తనను కీర్తించిన, స్మరించిన, ధ్యానించిన, స్తుతించిన, నమస్కరించిన భక్తులెల్లరకును వారి వారి అర్హతలకు అనుకూలములగు ఫలములను ప్రసాదించువాడు శ్రీహరియే అగుట చేత 'శర్వః' అని గానము చేయబడును.

డా. క్రోవి పార్థసారధి రచననుండి: శర్వుడు అనగా హింసించువాడు. **స్వ శరీర జగత్ దుఃఖం శర్వః సః స్యాత్ శృణతి యః** – తనకు శరీరమువలె పరతంత్రులగు సకల ప్రాణుల దుఃఖమును నశింపజేయువాడు. **అశుభం శృణాతి హింసతీతి శర్వః** – తనకు శరీర భూతులైన ప్రాణులయొక్క అనిష్ఠములను నశింపజేయువాడు. **శృణాతి ఇతి శర్వః** – ప్రళయకాలమున భూతములను హింసించువాడు, శివుడు.

శ్రీ కృష్ణమాచారి రచననుండి: నాకు ఈ నామముయొక్క భావార్థములు స్పష్టముగా అవగతము కావటములేదు. 'శృ' - అనగా ముక్కలుగా చీల్చుట, సంహరించుట, శిక్షించుట – అనే మూలము నుండి ఈ 'శర్వ' శబ్దము ఉత్పన్నమయినదనిపిస్తుంది. అయితే శ్రీ భట్టులు గాని, శ్రీ శంకరులు గాని తమ తమ భాష్యములలో ఈ నామమునకు శృతులనుండి ప్రమాణములను ఉదాహరించలేదు. అలా ఉంటే మనకు

ఉపయోగకరంగా ఉండేది. భగవద్గీతనుండి గాని, మరే ఆధ్యాత్మిక సాహిత్యమునుండి గాని 'శర్వ' నామమును వాడిన సందర్భమును ఎవరైనా ఉదాహరిస్తే, ఈ నామమును అర్థం చేసుకోవడానికి నాకు సహకరించినట్లవుతుందని మనవి.

శ్రీ భట్టుల వ్యాఖ్య – **స్వ శరీర భూతానామ్ అశుభమపి శృణతి ఇతి శర్వః.** భగవంతుడు తన శరీరమునుండి దుష్ట భాగములను తొలగించును గనుక 'శర్వః' అని కీర్తింపబడును. బహుశా దీని భావము – భక్తుల పాపములను నశింపజేయును – అని కావచ్చును. అయితే 'అశుభమపి' అన్న పదముయొక్క ప్రాముఖ్యత నాకు (అనగా కృష్ణమాచారికి) బోధపడడంలేదు. శ్రీ భట్టుల వ్యాఖ్యను నిరుక్తి రచయిత ఇలా వివరించారు - **స్వ శరీర జగత్ దుఃఖం శర్వః సః స్యాత్ శృణతి యః.**

శ్రీ శంకరుల వ్యాఖ్య – **శృణతి సంహార సమయే సంహరతి సంహారయతి వా సకలాః ప్రజాః ఇతి శర్వః** – ప్రళయకాలంలో సమస్త భూతములను సంహరించే (తనలో లీనం చేసుకొనే) వాడు శర్వుడు.

శ్రీ రాధాకృష్ణశాస్త్రి వివరణ – బియ్యపు గింజలు అన్నంగా మారాలంటే వాటి పూర్వరూపం నశించాలి. అలాగే సర్వ భూతములు కల్పాంతమున నశించినట్లయితే మరల సృష్టికి వీలు కలుగును. కనుక ప్రళయ కాలమున ప్రాణులు లయమగుటను దారుణముగా భావింపరాదు.

## 27. శివః

మంగళప్రదుడు, శుభకరుడు – **శుభ ఆవహశ్చ శివః**

## ఓం శివాయ నమః

ఈ మంగళప్రదమగు నామము 27వ నామముగాను, మరల 607వ నామముగాను కూడ చెప్పబడెను.

4వ శ్లోకము. 27వ నామము. శివః – **సర్వః శర్వః శివః స్థాణుః భూతాదిః నిధిరవ్యయః**

64వ శ్లోకము. 607వ నామము. శివః – **అనివర్తీ నివృత్తాత్మా సంక్షేప్తా క్షేమకృత్ శివః**

**స మేఘయతి యన్ నిత్యమ్ సర్వార్థాన్ సర్వ కర్మసు**

**శివమిచ్ఛాన్ మనుష్యానామ్ తస్మాదేష శివః స్మృతః** – మహాభారతము – ద్రోణపర్వము (202)

అన్నియెడల, అనునిత్యము, తన భక్తులు కోరినవన్నియును ప్రసాదించు గుణము కలిగినందున భగవంతుడు శివుడు అని స్మరింపబడును.

నారాయణోపనిషత్తులో విష్ణువును 'శివః' నామముతో ప్రస్తావించిన ఉదాహరణలు.

**శాశ్వతమ్ శివమ్ అచ్యుతమ్** – ఆయన కాలమునకు అతీతుడైన శాశ్వతుడు. మంగళకరుడు. తన భక్తులను ఎన్నటికీ పతనము కానీయడు.

**స బ్రహ్మ స శివః సేంద్రః నో అక్షరః పరమః స్వరాత్** – ఆయనే బ్రహ్మ, ఆయనే శివుడు, ఆయనే ఇంద్రుడు. ఆయన వినాశరహితుడు. అందరికిని పరమ ప్రభువు.

**హరియను రెండక్షరములు**
**హరియించును పాతకముల నంబుజనాభా**
**హరి నీ నామ మాహాత్మ్యము**
**హరియని పొగడంగ వశమె హరి శ్రీకృష్ణా** –కృష్ణాశతకము

## 28. స్థాణుః

- స్థిరమైనవాడు. భక్తుల పట్ల అనుగ్రహము కలిగి నిశ్చయముగా ఇష్టకామ్యములను సిద్ధింపజేయువాడు.
- వృద్ధి క్షయ గుణములకు లోబడనివాడు.

## ఓం స్థాణవే నమః

'స్థ' అనే ధాతువునుండి 'తిష్ఠతి' అనే పదం వస్తుంది. 'స్థాణు' పదము కూడా ఇదే ధాతువునుండి వస్తుంది. భక్తులయెడల భగవంతుని అనుగ్రహము అచంచలము. అపారము. భుక్తిని, ముక్తిని ప్రసాదించు సులభ అనుగ్రహ మూర్తియే 'స్థాణుః' అని శ్రీ భట్టులు వ్యాఖ్యానించారు.

**సంశమయ్యా శివం సర్వం విశ్రాణ్యాపి శివం బహు**
**స్వయం న విశ్రామ్యతి య స స్థాణుః పరికీర్తితః**
తన భక్తులయొక్క కష్టములన్నీ తొలగించి, వారు కోరిన కోరికలన్నింటినీ తీర్చి, తాను హాయిగా విశ్రమించినవాడు స్థాణువు.

శ్రీ రాధాకృష్ణ శాస్త్రి – 'స్థాణు' అనే పదానికి – బాగా ముదిరి, ఎండ వానలవల్ల ప్రభావితము కాని మహావృక్షము – అని కూడ అర్థము చెప్పవచ్చును. భగవంతుడు కాలమును బట్టి గాని, స్థలమును బట్టి గాని మారడు. వృద్ధి, క్షయము వంటి స్వాభావికమగు మార్పులకు ఆయన అతీతుడు.

(మరల **"విస్తారః స్థావరః స్థాణుః"** అని మరొక శ్లోకం ఉంది. అప్పుడు వేరే విధమైన వ్యాఖ్యలను పరిశీలించుదాము)

**అచ్ఛేద్యో అయమ దాహ్యో అయమ క్లేద్యో అశోష్య ఏవచ**
**నిత్యః సర్వగతః స్థాణుః అచలో అయం సనాతనః** – గీత 2.24
ఈ ఆత్మ ఛేదించుటకును, దహించుటకును, తడుపుటకును, శోషింపజేయుటకును సాధ్యము కానిది. ఇది నిత్యము. సర్వ వ్యాపి. చలింపనిది (ఆచలము). స్థాణువు (స్థిరమైనది). సనాతనము (శాశ్వతము)

**లోకంబులు లోకేశులు**

**లోకస్థులు తెగిన తుది నలోకంబగు పెం**

**జీకటి నెవ్వడు వెలిగెడు**

**నేకాకృతి తోడ నతని నే సేవింతున్** – పోతన భాగవతము – గజేంద్రుని ప్రార్థన

## 29. భూతాదిః

- సకల భూతములచే ఆత్రముగా కోరబడువాడు.
- సకల భూతములకు మూలము, కారణము.
- పంచ భూతములకు ప్రధముడు, సృష్టికర్త.

## ఓం భూతాదయే నమః

శ్రీ భట్టుల వ్యాఖ్య – **భూతైః స్పృహణీయతనతయా ఆదీయతే** – అన్ని భూతములచే గాఢముగా వాంఛింపబడువాడు. (పరమపద ప్రాప్తియే సకల భూతముల పరమార్థము.)

**భూతైర్యః ప్రాణాభిర్నిత్యం స్పృహణీయ తమత్వతః**

**ఉపాదానాద్ధి భూతాది రుచ్యతే సున్దరాకృతిః**

పరమేశ్వరుడు మిక్కిలి సుందరమైన ఆకారము కలవాడు. జగత్తులోని అందమంతా ఆయనయందే ఉన్నది. అందుచేత జీవులన్నీ ఆయనను కోరుతాయి. కాబట్టి సమస్త జీవులచేత ఎల్లప్పుడూ గ్రహింపబడుతూ ఉండేవాడు భూతాది.

శ్రీ శంకరుల వ్యాఖ్య – **భూతానామ్ ఆది కారణత్వాత్ భూతాదిః** – అన్ని భూతములకును మూలకారణము గనుక భూతాది.

శ్రీ చిన్మయానంద – పంచభూతములనగా పృథ్వి ఆపస్తేజో వాయురాకాశములు (భూమి, జలము, తేజస్సు, వాయువు, ఆకాశము). నామరూపాత్మక ప్రకృతికి మూలమగు ఈ పంచభూతములకును పరమేశ్వరుడే ఆద్యుడు కనుక భూతాది.

నారాయణోపనిషత్తు – ఈ సృష్టి ప్రారంభంలో పరమపురుషుడైన నారాయణుడు ప్రాణులను సృష్టించాలి అనుకొన్నాడు. అప్పుడు హిరణ్యగర్భుడు ఉదయించాడు. ఆ తరువాత ఆకాశాది పంచభూతాలు ఉద్భవించినాయి. ఈ రకంగా శ్రీమన్నారాయణునినుండే బ్రహ్మ, రుద్రుడు, ఇంద్రుడు, మరీచి, కశ్యపుడు మొదలైన ప్రజాపతులు, ఏకాదశరుద్రులు, ద్వాదశాదిత్యులు, అష్టవసువులు, సకల వేదాలు ఉద్భవించినాయి.

## 30. నిధిరవ్యయః

- తరగని పెన్నిధి.

- సమస్త ప్రాణికోటులను ప్రళయకాలమునందు తనయందే భద్రపరచుకొనువాడు.

## ఓం నిధయే అవ్యయాయ నమః

## ఓం అవ్యయాయ నిధయే నమః

భగవంతుడు భక్తులకు కొంగు బంగారము. అలమేలు మంగాపతి ఆపదమొక్కులవాడు. ఏడుకొండల వేంకటరమణుడు. భక్తులు అవుసరమునకు దాచుకొన్న నిధి. తరగని పెన్నిధి. **నిధీయతే అస్మిన్ ఇతి నిధిః** – జాగ్రత్తగా, రహస్యముగా దాచిన విలువైన వస్తువును నిధియందురు.

**యస్సదాపద్ధన మివ నిధేయ త్వా న్నిధి స్మృతః**
**సదోపభుజ్యమానో అపి కలయాప్యనుపక్షయాత్**
ఆపద సమయంలో ఉపయోగిస్తుంది అని దాచిపెట్టిన ధనాన్ని 'నిధి' అంటారు. అటువంటి మహానిధివలె ఎల్లకాలము రక్షించువాడు. మామూలుగా దాచిపెట్టే నిధి అయితే వాడుకున్న కొద్దీ తరిగిపోతుంది. కానీ పరమేశ్వరుడు అనబడే ఈ నిధిని ఎంతగా వాడుకున్నప్పటికీ తరగదు సరి కదా పెరుగుతూ ఉంటుంది.

శ్రీ శంకరుల వ్యాఖ్య – కల్పాంత ప్రళయ కాలమున సమస్త భూత కోటులు ఆయనయందే ఐక్యమగును. మరల సృష్టి క్రమమున తిరిగి ఉద్భవించును. ఇట్లు సమస్తమును భద్రపరచుకొన్నవాడు గనుక ఆయన 'నిధి' యనబడెను. ఆయన సృష్టి స్థితి లయ శక్తులకు పరిమితి లేదు గనుక 'అవ్యయ' అని విశేషీకరింపబడెను. కనుక ఆయన అవ్యయమైన నిధి.

పోతన భాగవతము – గజేంద్రుని ప్రార్థన

**ఒకపరి జగముల వెలినిడి**

**యొకపరి లోపలికి గొనుచు నుభయము గనుచున్**

**సకలార్థ సాక్షి యగు న**

**య్యకలంకుని నాత్మమయుని నర్థింతు మదిన్**

## 31. సంభవః

- తనకు తానుగానే (కర్మాది కారణములు, బంధములు లేకుండా) అవతరించువాడు.

- శ్రద్ధా భక్తులతో కోరుకున్నవారికి దర్శనమిచ్చువాడు.

## ఓం సంభవాయ నమః

**నిధివ జ్ఞాతి గూఢోపి రామకృష్ణాది భేదతః**

**సమన్తాద్బహుధా జాత స్సంభవ పరికీర్తితః**

భగవంతుడు నిధివలె గోప్యముగా అనిపించినాగాని, భక్త జనుల కొఱకు రాముడు, కృష్ణుడు వంటి అనేక అవతారములలో సంభవిస్తాడు. ఆయన జన్మకు కర్మ కారణము కాదు. తన ఇచ్చానుసారము, స్వలీలా మాత్రముగ, సకల గుణ ఐశ్వర్య శోభితుడై సంభవించును. కనుక ఆయన సంభవుడు. తన భక్తుడైన ప్రహ్లాదుని రక్షించడం కోసం శ్రీహరి నరసింహావతారంలో స్తంభంనుండి బయటకు వచ్చాడు. శ్రీకృష్ణుని వివాహం చూడలేదని బాధపడిన యశోద కోరిక తీర్చడానికి మరుజన్మలో భగవంతుడు శ్రీవేంకటేశ్వరునిగా జన్మించాడు. యశోద మరల వకుళాదేవిగా జన్మించి తన చేతుల మీదుగా పద్మావతీ శ్రీనివాసుల కల్యాణం జరిపించింది.

**అజో అపి సన్నవ్యయాత్మా భూతానామీశ్వరోపి సన్**

**ప్రకృతిం స్వామధిష్ఠాయ సంభవామ్యాత్మ మాయయా** – గీత 4.6

నేను జన్మ రహితుడను. నిత్యుడను. సమస్త ప్రాణులకును ఈశ్వరుడను. అయినను నా ప్రకృతిని అధీనములో నుంచుకొని, నా యోగమాయచే అవతరించుచుందును.

**పరిత్రాణాయ సాధూనామ్ వినాశాయ చ దుష్కృతామ్**

**ధర్మ సంస్థాపనార్థాయ సంభవామి యుగే యుగే** – గీత 4.8

సత్పురుషులను పరిరక్షించుటకును, దుష్టులను రూపు మాపుటకును, ధర్మమును సుస్థిరమొనర్చుటకును నేను ప్రతి యుగము నందును అవతరించుచుందును.

## 32. భావనః

- (సంభవించిన పిదప) అందరిని, వారిలోని మాలిన్యములను తొలగించి, పునరుజ్జీవింపజేయువాడు.
- కామితార్థములను ప్రసాదించువాడు.

## ఓం భావనాయ నమః

శ్రీ భట్టుల వ్యాఖ్య – భగవంతుడు సర్వము తానైయైనవాడు (సర్వః), పాపహరుడు (శర్వః). శుభకరుడు (శివః). స్థిరుడు (స్థాణుః). అనంత నిధి (నిధిరవ్యయః). భక్త జనోద్ధరణకై అవతరించును (సంభవః). అలా అవతరించిన పరమేశ్వరుడు, జగన్నాధుడు మన పాపములను క్షాళనము చేసి క్రొత్త జీవితమును ప్రసాదించును. శ్రీ భట్టుల ఈ వ్యాఖ్యను నిరుక్తి రచయితా ఇలా వ్యక్తపరచారు – **యో జనిత్వా జనాన్ ఉజ్జీవయతి సః భావనః**.

శ్రీ శంకరుల వ్యాఖ్య – 'భావన' అనగా 'ఇచ్చుట' అనే అర్థంలో శ్రీ శంకరులు వ్యాఖ్యానించారు. వర ప్రదాతయైన భగవంతుడు తనను స్మరించి, చింతించి, ధ్యానించి, కీర్తించి, ఆత్మార్పణము చేయు భక్త కోటులకు సకల కామితార్థములను ప్రసాదించును.

## 33. భర్తా

భరించువాడు. భక్తుల యోగ క్షేమములను వహించువాడు. సకల లోకములకును పతి, గతి, పరమార్థము.

## ఓం భర్త్రే నమః

శ్రీ శంకరుల వ్యాఖ్య – **ప్రపంచస్య అధిష్ఠానత్వేన భరణాత్ భర్తా** – ఎల్ల లోకముకును ప్రభువు, భరించువాడు భర్త.

శ్రీ భట్టుల వ్యాఖ్య – **యః తాన్ పుష్ణాతి ఆత్మ దానాత్ స భర్తా పరికీర్తితః** – తన భక్తులకు తానే అధీనమై పోయి (తనను తానే వారికి ఇచ్చుకొని) వారిని, వారికి ఆధారమైన లోకములను పోషించువాడు భర్త.

తన భక్తులు తననే పొందుదురని గీతలో పరమాత్ముడు పెక్కుమార్లు చెప్పినాడు. ఇది ఆ అనంత నిధిస్వరూపుని గుణ వైభవము.



వికీపీడియాలోని చిత్రం

## 34. ప్రభవః

దివ్యమైన జన్మము (అవతరణము) కలవాడు

## ఓం ప్రభవాయ నమః

**స్య భవః ప్రకృష్ట ఇతి ప్రభవః** – ఆయన జన్మము ఏ విధమైన కర్మ బంధము వల్ల గాని, లోపము వల్ల గాని కలుషితము కాదు. దివ్యము. ఆయనను ధ్యానించి ఆరాధించువాడు సకల కర్మ జన్మ బంధములనుండి విముక్తులగుదురు – **ప్రకర్షేణ భవతి.**

**దేవాది జనవై జాత్యాత్ ప్రకృష్టోత్పత్తి మత్త్వతః**
**అవిద్యా దోషవై దుర్యాత్ ప్రభవః పరికీర్తితః**
దేవతలకు గాని మానవులకు గాని వారి కర్మ ఫలితాన్ని బట్టి ఉత్తర జన్మలు వస్తాయి. వారికి అవిద్యా దోషము కూడా ఉంటుంది. అలాంటి దోషాలు ఏవీ లేక, తమ జన్మ రహస్యము తెలిసినటువంటి వారికి జన్మరాహిత్యము కలుగజేసేటటువంటి జన్మ కలవాడు.

**అవజానంతి మాం మూఢా మానుషీం తనుమాశ్రితమ్**
**పరం భావమజానంతో మమ భూత మహేశ్వరమ్** – గీత 9.11
నా పరమ భావమును ఎఱుగని మూఢులు సర్వప్రాణులకును మహేశ్వరుడను (ప్రభువును) ఐన నన్ను లోక కల్యాణమునకై అవతారములను ఎత్తిన కారణము తెలియక సామాన్య మానవునిగా భావించి తక్కువగా ఊహింతురు.

## 35. ప్రభుః

సర్వాధిపతి. సర్వ శక్తిమంతుడు.

## ఓం ప్రభవే నమః

4వ శ్లోకము. 35వ నామము. ప్రభుః – **సంభవో భావనో భర్తా ప్రభవః ప్రభుః ఈశ్వరః**
32వ శ్లోకము. 300వ నామము. ప్రభుః – **కామహా కామకృత్ కాంతః కామః కామప్రదః ప్రభుః**

శ్రీ శంకరుల వ్యాఖ్య – **సర్వాసు క్రియాసు సామర్థ్య అతిశయవాన్ ప్రభుః** – సకల కార్యములందును అతిశయించిన సామర్థ్యము కలవాడు.

శ్రీ భట్టుల వ్యాఖ్య – శ్రీ భట్టుల వ్యాఖ్యను నిరుక్తి రచయిత ఇలా క్లుప్తంగా చెప్పారు.
**బ్రహ్మాదీనామ్ చ సర్వేషామ్ భోగ మోక్ష సమర్పణే**
**సమర్థః ప్రభుః ఇత్యుక్తః సర్వేష్టా ఫలదో మనుః**
బ్రహ్మాది దేవతలకు కూడ సకల భోగమోక్షములను, ఫలములను ప్రసాదించువాడు ప్రభువు. ఆయన ఈశ్వరులకు ఈశ్వరుడు. దేవదేవుడు. జగత్పతి. ఈ నామ స్మరణ సకల ఇష్టఫలములను ప్రసాదించును. ఓం ప్రభవే నమః.

## 36. ఈశ్వరః

- అన్నింటిపై సకలాధిపత్యము కలవాడు. సకల గుణశక్తియుతుడు.

- మరే విధమైన సహాయము, ప్రమేయము లేకుండా, ఇచ్ఛామాత్రముగా, లీలా మాత్రముగ ఏదయినా చేయగలవాడు.

## ఓం ఈశ్వరాయ నమః

4వ శ్లోకము. 36వ నామము. ఈశ్వరః – **సంభవో భావనో భర్తా ప్రభవః ప్రభురీశ్వరః**

9వ శ్లోకము. 75వ నామము. ఈశ్వరః – **ఈశ్వరో విక్రమీ ధన్వీ మేధావీ విక్రమః క్రమః**

ఈ నామమును 'ఐశ్వర్య' మరియు 'ఇష్ట' అనే రెండు అర్థాలలో వివరించారు.

**నిరుపాధికమ్ ఐశ్వర్యమ్ అస్య ఇతి ఈశ్వరః** – అనంతమైన శక్తి సామర్ధ్యములు కలవాడు గనుక ఈశ్వరుడు.

**ఇష్టే ఇతి ఈశ్వరః** – తన ఇచ్ఛానుసారము వర్తించువాడు ఈశ్వరుడు. ( శ్రీ కైవల్య సారధి నుండి – తాను పరమేశ్వరునిగా పరమపదంలో ఉండేకన్న అవతారాలెత్తినప్పుడు తన శక్తి ఎక్కువగా ఉపయోగిస్తుంది. కనుక అవతారముల యందు ఎక్కువగా ఇష్టము కలవాడు)

**మనుష్యాద్యవతారే అపి బ్రహ్మాదీంశ్చ ప్రయోజనే**
**నియన్తాత్ ఈశ్వరః ప్రోక్తః ప్రాధాన్య ఫలదో మనుః**

తాను ఒక మానవునిగా జన్మించినప్పటికీ, బ్రహ్మాది దేవతలను తనకోసం ఉపయోగించుకోగల శక్తి సామర్ధ్యములు కలవాడు ఈశ్వరుడు.

భగవంతుని అనంత శక్తిసామర్ధ్యములను గూర్చి కృష్ణాశతకములో ఒక చక్కని పద్యము

**అండజ వాహన వినుబ్ర**
**హ్మాండముల బంతులట్లు యాడెడు నీవా**
**కొండల నెత్తితి వందురు**
**కొండిక పని గాక దొడ్డ కొండా కృష్ణా**

సకల బ్రహ్మాండములు భగవంతుని శక్తివలన బంతులవలె ఆడుచున్నవి. ఇక మంధర గిరిని, గోవర్ధన గిరిని ఎత్తుట ఎంతపని? ఇది ఆయనకు కేవలము ఆటకాయ తనమే.

(1) శ్రీ నరసింహన్ కృష్ణమాచారి ఆంగ్ల రచనకు ఇది తెలుగు అనువాదము.

(2) భగవద్గీత శ్లోకముల తాత్పర్యము గీతాప్రెస్, గోరఖపూర్ ప్రచురణనుండి.

## స్వయంభూశ్శంభురాదిత్యః పుష్కరాక్షో మహాస్వనః |
## అనాదినిధనో ధాతా విధాతా ధాతురుత్తమః || (5)

### 37. స్వయంభూః

**స్వయమేవ భవతి ఇతి స్వయంభూః** – స్వయముగా, ఇచ్ఛానుసారము, వేరు ఆధారములు లేకుండ జన్మించువాడు.

### ఓం స్వయంభువే నమః



బాలకృష్ణుని యమునానది దాటిస్తున్న వసుదేవుడు. మధురలోని చిత్రం. వికీపీడియానుండి.

**భవతి స్వేచ్ఛయా యో అసౌ స్వయంభూః పరికీర్తితః**

బ్రహ్మాదులవలె తనయొక్క కర్మఫలము వలన కాకుండా, సంకల్పమాత్రము చేతనే అవతరించువాడు.

శ్రీ రాధాకృష్ణ శాస్త్రి ఉదాహరణ – దేవకీవసుదేవులకు బిడ్డగా జన్మించిన శ్రీకృష్ణుడు సర్వాభరణ భూషణ శోభితుడై, ప్రసన్నహాస వదనుడై, దివ్యాయుధములు ధరించియున్నాడు. తల్లికి ఏ విధమైన ప్రసవ వేదన కలుగలేదు.

**తమద్భుతమ్ బాలకమ్ అంబుజేక్షణమ్ చతుర్భుజమ్ శంఖచక్ర గదాయుధమ్**
**శ్రీవత్స లక్షణమ్ గళ శోభి కౌస్తుభమ్ పీతాంబరమ్ సాంద్ర పయోద సుందరమ్**

ఆ బాలుని జూచి వసుదేవుడిలా ఆనందించాడు

**బాలు బూర్ణేందు రుచిజాలు భక్తలోక**
**పాలు సుగుణాలవాలు గృపావిశాలు**
**జూచి తిలకించి పులకించి చోద్యమంది**
**యుబ్బి చెలరేగి వసుదేవుడుత్సహించె**

అపుడు దేవకీదేవి స్వామిని ఇలా స్తుతించింది.

**ఒంటి నిల్చి పురాణయోగులు యోగమార్గ నిరూఢులై**
**కంటిమందురు గాని నిక్కము గానరీ భవదాకృతిన్**
**గంటి భద్రము గంటి మాంసపు గన్నులు గనబోలదీ**
**తొంటి రూపు దొలంగబెట్టుము తోయజేక్షణ మ్రొక్కెదన్**

## 38. శంభుః

**శమ్ భావయతి ఇతి శంభుః** – శుభములను, సుఖ సంతోషములను ప్రసాదించువాడు.

## ఓం శంభవే నమః

భగవంతుడు సకల శుభ ప్రదాత. ఆ దివ్య సుందర మూర్తిని తలచిన, చూచినంతనే శుభములు వర్షించును. శ్రీరాముని సౌందర్యము రామాయణమున పెక్కుచోట్ల వర్ణింపబడినది. **రూపః ఔదార్యగుణైః పుంసామ్ దృష్టి చిత్త అపహారిణమ్** – ఆ రాముని సుందర రూపము, దాతృగుణము చూపరుల దృష్టిని, చిత్తమును అపహరించును. **చంద్రకాంతాననమ్ రామమ్ అతీవ ప్రియదర్శనమ్** – వెన్నెలవంటి మోము గలవాడు. ఆయన దర్శనము కనులకు పండుగ.

## 39. ఆదిత్యః

- సూర్యమండల మధ్యవర్తియై బంగారువర్ణముతో ప్రకాశించు పురుషుడు.
- ద్వాదశాదిత్యులలో విష్ణువు.

- సమస్తమును ప్రకాశింపజేసి పోషించువాడు.

- అదితియొక్క కుమారుడైన వామనుడు.

## ఓం ఆదిత్యాయ నమః

ఈ నామము రెండుమార్లు వచ్చును.

5వ శ్లోకము. 39వ నామము. ఆదిత్యః – **స్వయంభూః శంభురాదిత్యః పుష్కరాక్షో మహాస్వనః**

60వ శ్లోకము. 568వ నామము. ఆదిత్యః – **ఆదిత్యో జ్యోతిరాదిత్యః సహిష్ణుః గతిసత్తమః**

శ్రీ భట్టుల వ్యాఖ్య – భగవానుడు తన ఇచ్ఛానుసారము వేర్వేరు రూపములు ధరించుటకు ఇది ఒక ఉదాహరణము. సూర్యమండల మధ్యానువర్తియైన హిరణ్మయమూర్తి సాక్షాత్తు శ్రీమన్నారాయణుడే.

**ధ్యేయ స్సదా సవితృమండల మధ్యవర్తీ**
**నారాయణ స్సరసిజాసన సన్నివిష్టః**
**కేయూరవాన్ మకర కుండల కిరీటీ**
**హారీ హిరణ్మయ వపుర్ ధృత శంఖ చక్రః**

తైత్తరీయోపనిషత్తులో కూడా ఇలాగే చెప్పారు – **స యశ్చాయమ్ పురుషే యశ్చాసావాదిత్యే స ఏకః** – మనుష్యుల అంతరాత్మయైనవాడు, సూర్యమండల మధ్యమున ఉన్నవాడు ఒకే దేవుడు.

శ్రీ శంకరుల వ్యాఖ్య – భగవద్గీత విభూతియోగము (10.21)లో దేవదేవుడిలా చెప్పాడు.

**ఆదిత్యానామహం విష్ణుః జ్యోతిషాం రవిరంశుమాన్**
**మరీచిర్మరుతామస్మి నక్షత్రాణా మహం శశీ**

అదితియొక్క ద్వాదశ పుత్రులైన ఆదిత్యులలో విష్ణువును నేను. జ్యోతిర్మయ స్వరూపులలో నేను సూర్యుడను. 49 వాయు దేవతలలోని 'తేజము'ను నేను. నక్షత్రాధిపతియైన చంద్రుడను నేను. (అదితియొక్క 12 పుత్రులను 'ఆదిత్యులు' అని యందురు. వారి పేర్లు వరుసగా ధాత, మిత్ర, ఆర్యమ, శక్ర, వరుణ, అంశ, భగ, వివస్వాన్, పూష, సవిత, త్వష్ట, విష్ణు – అనునవి. వీరిలో విష్ణువు అందరికిని రాజు, పరమ శ్రేష్ఠుడు. కనుక భగవానుడు విష్ణువును తన స్వరూపుగా పేర్కొనెను. గీత - తత్వ వివేచని నుండి)

శ్రీ చిన్మయానంద: వామనావతారమున భగవానుడు అదితికి కుమారునిగా అవతరించెను.కనుక ఆదిత్యుడయ్యెను.

శ్రీ చిన్మయ మరొక వివరణ: భూమిపై సకల జీవరాసులకు ప్రాణాధారము సూర్యుడే. అదే విధముగా సమస్తమును పోషించువాడు భగవంతుడు. ఒక్కడేయగు సూర్యుడు అనేక జలపాత్రలందు అనేక

సూర్యులవలె ప్రతిబింబించును. అలాగే పరమాత్ముడు సకల భూతములందును అంతరాత్మయై ప్రకాశించుచున్నాడు.

## 40. పుష్కరాక్షః

తామరపూవువంటి నేత్రములు గలవాడు. భక్తులను అనుగ్రహించువాడు. పోషించువాడు.

## ఓం పుష్కరాక్షాయ నమః

5వ శ్లోకము. 40వ నామము. పుష్కరాక్షః – **స్వయంభూః శంభురాదిత్యః పుష్కరాక్షో మహాస్వనః**

59వ శ్లోకము. 561వ నామము. పుష్కరాక్షః – **వరుణో వారుణో వృక్షః పుష్కరాక్షో మహామనాః**

**పుష్కరే అక్షిణీ యస్య స పుష్కరాక్షః**

**పోషయతీ భూతాని పుష్కరే అక్షిణీ యస్య స పుష్కరాక్షః**

**అక్షిణీ పుండరీకేవ భక్తానుగ్రహ కారిణీ**

**యస్యాసౌ పుండరీకాక్షః స్వేష్టవర్ణస్తు పావకః**

తన భక్తులను అనుగ్రహించడానికి తామరపూవులను బోలిన కన్నులు గలవాడు. ఈ నామము అష్టాక్షరి. పావనకరము.

శ్రీ చిన్మయానంద: 'మనసు కంటిలో ప్రతిబింబిస్తుంది' అని నానుడి. భగవంతుని సౌందర్యమును ప్రకటించే మరొక సుందర నామమిది. ఆ కమల నేత్రుని కన్నులనుండి ప్రకాశించే పరమానందము, శాంతి ఆయన భక్తుల హృదయములనుండి సకల దుఃఖములను తొలగించును.

59వ శ్లోకంలో మరల ఈ నామము 561వ నామముగా కీర్తింపబడినది. (**వరుణో వారుణో వృక్షః పుష్కరాక్షో మహామనాః**) అప్పుడు మరొక అర్థమును గ్రహించి మనము తరింపవచ్చును.

## 41. మహాస్వనః

గంభీరమగు దివ్యనాదము యొక్క స్వరూపము కలవాడు (వేదగాన నాదము) .

## ఓం మహాస్వనాయ నమః

బృహదారణ్యకోపనిషత్తు (4.4.10)లో ఇలా ఉంది. **అస్య మహతో భూతస్య నిఃశ్వసితమేతద్ యద్ ఋగ్ వేదో యజుర్వేదః సామవేదో అథర్వాంగీరసః ఇతిహాసః పురాణమ్ విద్యా ఉపనిషదః శ్లోకాః సూత్రాణ్యాణు వ్యాఖ్యానాని**

**వ్యాఖ్యానాని.** భగవంతుడు వేదమూర్తి. ఆయన నిశ్వాసములే చతుర్వేదములు, పురాణేతిహాసములు, సకల శాస్త్రములు.

## 42. అనాది నిధనః

**యస్య ఆది నిధనమ్ న అస్తి స అనాది నిధనః** – ఆది (మొదలు, జననము) మరియు నిధనము (తుది, నాశనము) లేనివాడు.

## ఓం అనాది నిధనాయ నమః

('నిధన' పదాన్ని ఎక్కువగా 'ధనరాహిత్యము' అనే అర్థంలో వాడుతారు. కాని ఇదే పదానికి 'వినాశనము' అనే అర్థం కూడా ఉంది.)

**యస్యాదినిధనం నాస్తి అనాది నిధనశ్చ సః**
**అనాదినిధనోపాస్యో నిత్యయౌవన విగ్రహః**
నిత్య యౌవనము కలవాడు. జనన మరణములు లేనివాడు అనాదినిధనుడు.

భగవన్మూర్తి పాంచభౌతికము కాదు. అస్థిమాంసకృత శరీరము కాదు. ప్రకృతి ధర్మములైన పుట్టుట, గిట్టుట వంటి ఆ ఆదిమధ్యాంతరహితునకు వర్తింపవు. **న తస్య ప్రకృతా మూర్తిః మాంస మేదోఽస్థి సంభవా** (వరాహ పురాణము 75.44)

మహాభారతము – శాంతి పర్వము 206.60 – **రూపమ్ వా అతీంద్రియమ్, అంతఃకరణ ప్రత్యక్ష నిర్దేశాత్** – ఆయన రూపము ఇంద్రియములకు అందనిది. కేవలము అంతఃకరణము వల్లనే గోచరము కావచ్చును.
**న భూత సంఘ సంస్థానో దేహో అస్య పరమాత్మనః** – ఆయన దేహము తక్కిన భూతముల దేహమువంటిది కాదు.

**అన్ని రూపులు నీ రూపమైనవాడ**
**ఆది మధ్యాంతములు లేక అలరువాడ**
**భక్తజనుల దీనుల పాలివాడ**
**దీవనలొసంగి కాపాడు దేవదేవ** – గజేంద్రమోక్షము

## 43. ధాతా

- బ్రహ్మాదులను సృష్టించినవాడు. బ్రహ్మను కన్న తండ్రి.
- నామ రూపాత్మకమైన ఈ చరాచర విశ్వమునంతయును ధరించిన మహామహుడు.

## ఓం ధాత్రే నమః

5వ శ్లోకము. 43వ నామము. ధాతా – **అనాదినిధనో ధాతా విధాతా ధాతురుత్తమః**

102వ శ్లోకము. 951వ నామము. ధాతా / అధాతా – '**ఆధారనిలయో ధాతా పుష్పహాసః ప్రజాగరః**' లేదా '**ఆధారనిలయోऽధాతా పుష్పహాసః ప్రజాగరః**'

ఈ నామమునకు మూల ధాతువు 'ధా' – జన్మనిచ్చుట, ధరించుట, ఉంచుట, ఆధారపడుట – అనే అర్థంలో గ్రహించవచ్చును.

**అచిత్సమపి భూతాయాం ప్రకృతౌ చిత్సమష్టికమ్**
**గర్భం వేదాత్మకం ధత్తే యస్తు ధాతేతి చక్షతే**

అచిత్సమష్టియగు ప్రకృతియందు చిత్సమష్టియగు బ్రహ్మ అను గర్భమును ధరించువాడు. చతుర్ముఖ బ్రహ్మను సృష్టించువాడు. అజ్ఞానమనే ప్రకృతిలో జ్ఞానమనే బ్రహ్మను సృష్టించినవాడు ధాత.

శ్రీ భట్టులు మౌలసంహితనుండి చూపిన ఆధారము – **ధాతా క్షేత్రే కర్మ-బీజ-భూతమ్ గర్భమ్ దధాతి** – క్షేత్రము (ప్రకృతి) నందు అండము(జీవము)ను ఉంచి సృష్టికార్యమునకు మూలమైనవాడు ధాత. ఇంతకు ముందు క్షేత్రజ్ఞ నామమునకు వివరించినట్లుగా – కర్మలకు క్షేత్రము అనుకూల స్థానము. జీవుడే కర్మలకు బీజము.

**మమ యోనిర్మహద్బ్రహ్మ తస్మిన్ గర్భమ్ దధామ్యహమ్**
**సంభవః సర్వ భూతానామ్ తతో భవతి భారత** – గీత 14.3

ఓ అర్జున! నా మహద్బ్రహ్మ రూపమైన మూలప్రకృతి సర్వ ప్రాణులకును జన్మస్థానము. దానియందు చేతన సముదాయ రూపమైనబీజమును ఉంచెదను (స్థాపన చేసెదను). ఆ జడ చేతన సంయోగము వలననే సర్వభూతముల ఉత్పత్తి జరుగును.

**సర్వ యోనిషు కౌంతేయ మూర్తయః సంభవంతియాః**
**తాసాం బ్రహ్మ మహద్యోనిః అహం బీజప్రదః పితా** – గీత 14.4

ఓ అర్జున! నానా యోనులందు జన్మించు ప్రాణులను తన గర్భమున ధరించు మూలప్రకృతియే ఆ ప్రాణులకు తల్లి. బీజ స్థాపన చేయు నేను వాటికి తండ్రిని. అనగా సర్వ ప్రాణులకును ప్రకృతియే తల్లి. నేనే జనకుడను.

అంటే ఆయన ప్రధానపురుషేశ్వరుడు గనుక, ప్రకృతి మరియు ఆత్మలు ఆయన అధీనములో ఉంటాయి. ప్రకృతిలో జీవ బీజమును ఉంచి, సృష్టికార్యమునకు కారణమైనవాడు ధాత.

ఇలా చూచినట్లయితే – సృష్టికర్తయైన చతుర్ముఖ బ్రహ్మయే ఈ బీజము అనీ, సర్వాంతర్యామియైన విష్ణువే ఆ బ్రహ్మను కన్నతండ్రి గను 'ధాత' అనీ చెప్పవచ్చును.

(శ్రీ కృష్ణమాచారిగారి అదనపు వ్యాఖ్య: ఈ నామమునకు స్పష్టమైన అర్థము నాకు అవగతము కాలేదు. ముఖ్యముగా 'ధాత', 'విధాత' అనే నామములలో ఉన్న వ్యత్యాసం బోధపడలేదు. వేర్వేరు ముఖ్య ఆధార గ్రంధాలలో వేరువేరుగా ఈ నామానికి వ్యాఖ్యానం చెప్పారు.)

## 44. విధాతా

- బ్రహ్మను కన్నతండ్రి
- విధి విధానములను ఏర్పరచి, తగురీతిలో కర్మఫలములను ఇచ్చేవాడు.

## ఓం విధాత్రే నమః

ఈ నామము రెండుమార్లు వచ్చును.

5వ శ్లోకము. 44వ నామము. విధాతా – **అనాది నిధనో ధాతా విధాతా ధాతురుత్తమః**

51వ శ్లోకము. 485వ నామము. విధాతా – **అవిజ్ఞాతా సహస్రాంశుః విధాతా కృతలక్షణః**

శ్రీ భట్టుల వ్యాఖ్య – సృష్టికర్తకే కర్తయై బ్రహ్మకు జన్మనిచ్చినవాడు విధాత.

**తద్గర్భ పరిణామేస్యా దావిర్భావయతి స్వయమ్**
**ధారణాల్లీలా యస్మాత్ విధాతా అయం ప్రకీర్తితః**

తనను (అనగా బ్రహ్మను) గర్భమున ధరించి, అది పరిపక్వత చెందగానే దానిని స్వయముగా ఆవిర్భవింపజేయువాడు విధాత.

**వాయుర్యమో అగ్ని ర్వరుణ శ్శశాంకః ప్రజాపతిస్త్వం ప్రపితామహశ్చ**
**నమో నమస్తేస్తు సహస్రకృత్వః పునశ్చ భూయో అపి నమో నమస్తే** – గీత 11.39

నీవే వాయుదేవుడవు. యముడవు. అగ్నివి. వరుణుడవు. చంద్రుడవు. ప్రజాపతియైన బ్రహ్మవు. బ్రహ్మకును జనకుడవు. నీకు వేలకొలది నమస్కారములు. ఇంకను నమస్కారములు.

శ్రీ శంకరుల వ్యాఖ్య – **కర్మణా తత్ ఫలమ్ చ కర్తా విధాతా** – భగవానుడు కర్మలను ప్రేరేపించువాడు. కర్మానుగుణముగా ఫలితమునొసగువాడు గనుక విధాత.

శ్రీ చిన్మయ – ( విధి-ఏలుట) విశ్వమునందంతటను విధివిధానములకు అధినాథుడు విధాత.

కఠోపనిషత్తు – ఆయన శాసనము వల్లనే సూర్యుడు ప్రకాశించును. చంద్రుడు విరాజిల్లును. వాయువు వీచును. అగ్ని ప్రజ్వరిల్లును.

ఆయన కర్మ విధాన నిర్ణేత. కర్మ ఫల పగరదాత. విధాత.

## 45. ధాతురుత్తమః

- బ్రహ్మకంటెను ముఖ్యుడు. శ్రేష్టుడు.

- ప్రపంచమునకు మూలమగు సమస్త ధాతువులందు ప్రధానము.

## ఓం ధాతురుత్తమాయ నమః

బ్రహ్మను 'ధాత' అందురు గనుక ఆ బ్రహ్మను సృజించినవాడు ధాతురుత్తముడు.

ప్రపంచమునకు పృథివ్యాది ధాతువులు మూలము. ఆ మూలధాతువులకు మూలమైనవాడు ధాతురుత్తముడు.

(1) శ్రీ నరసింహన్ కృష్ణమాచారి ఆంగ్ల రచనకు ఇది తెలుగు అనువాదము.

(2) భగవద్గీత శ్లోకముల తాత్పర్యము గీతాప్రెస్, గోరఖపూర్ ప్రచురణనుండి.

## అప్రమేయో హృషీకేశః పద్మనాభోऽమరప్రభుః |
## విశ్వకర్మా మనుస్త్వష్టా స్థవిష్ఠస్స్థవిరో ధ్రువః || (6)

### 37. అప్రమేయః

ప్రమాణముల చేత తెలియరానివాడు. సామాన్య హేతుమార్గముల ద్వారా భగవంతుని నిర్వచించుట, వివరించుట, అంచనా వేయుట సాధ్యము కాదు.

### ఓం అప్రమేయాయ నమః

**ప్రమాతుమ్ న యోగ్యః అప్రమేయః** - తన తత్వాన్ని వాస్తవ రూపంలో తెలిసికోవడానికి యోగ్యమైనది ప్రమేయము. అలా కానటువంటిది అప్రమేయము.

**బ్రహ్మదీనాన్ కరణై నో మాతుమపి శక్యతే**
**ద్రష్టుం హ్యపా వప్రమేయః వచసామప్యగోచరః**
బ్రహ్మదులకైననూ ఇంద్రియములచేత చూడడానికి, ఇంత పరిమాణము కలవాడని తెలుసుకోవడానికి వీలుగానివాడు. అవాఙ్మానస గోచరుడు. కనుక ఆయన అప్రమేయుడు.

ఏదైనావిషయం గురించి తెలుసుకోవాలంటే అందుకు కొన్ని ప్రమాణములు అవుసరం.
**ప్రత్యక్ష ప్రమాణములు** – చూచుట, వినుట వంటి ఇంద్రియజ్ఞానము ద్వారా తెలియబడునవి. భగవంతుడు నిరాకారుడు, నిర్గుణుడు గనుక ప్రత్యక్ష ప్రమాణముల ద్వారా ఆయనను ఎవరూ తెలిసికొనజాలరు.
**అనుమాన ప్రమాణములు** – ఒక కారణము చేత మరొకదానిని గ్రహించవచ్చును. నిప్పు ఉంటే పొగ వచ్చునని మనకు తెలుసు గనుక పొగను చూచి అక్కడ నిప్పు ఉందని అనుమానించవచ్చును.

భగవంతుడు నిస్సంగుడు గనుక, వేరెవ్వరూ ఆయనను వేరు ప్రత్యక్ష ప్రమాణంతో తెలియకున్నారు గనుక, భగవంతుని అనుమానప్రమాణం ద్వారా తెలియజాలరు.

**ఉపమా ప్రమాణము** - వేరు వస్తువులతో పోల్చుట – భగవంతుని పోల్చుటకు మరొకటి లేదు. ఆయన అనితరుడు. అద్వితీయుడు, సంపూర్ణుడు. తక్కినవన్నీ భాగములు. కనుక ఉపమా ప్రమాణముల ద్వారా భగవంతుని తెలియుట సాధ్యము కాదు.

**శబ్ద ప్రమాణము, ఆప్త వాక్యము** – తెలిసినవారు చెప్పిన విషయము, ప్రామాణికమైన గ్రంథములలో చెప్పిన విషయము. ముక్తులైనవారు కూడ ఆయన అనంత గుణముల అనుభవమును, అనుభూతిని కొంతవరకు పొందగలరు. భగవంతుని తెలిసినవారే లేనప్పుడు భగవంతుని గురించి చెప్పగలిగినవారెవ్వరు?

భగవంతుని అదీ ఇదీ అని చెప్పలేము. అలాగు, ఇలాగు అని చెప్పలేము. ఇందువల్ల, అందువల్ల అని చెప్పలేము. కనుక ఆయన అప్రమేయుడు.

## 47. హృషీకేశః

- సకలేంద్రియములకు అధిపతి (హృషీక + ఈశ)
- సూర్య, చంద్ర రూపములలో కిరణములు పంచి జగములను ఆనందింపజేయువాడు (హృషీ + కేశ)

## ఓం హృషీకేశాయ నమః

'హృషీకములు' అనగా ఇంద్రియములు – అనే అర్థంలో మొదటి వ్యాఖ్యను చెప్పారు. **'హృషీకాణామ్ ఈశః హృషీకేశః'** – ఆయన సర్వేంద్రియములకు అధినాథుడు. ఆయన అనుగ్రహము వల్లనే మనము కన్నులతో చూడగలము. చెవులతో వినగలము.

హృషీ – హర్షము (సంతోషము) కలిగించునట్టి; కేశ – కిరణములు; మనోహరములు, సంతోషప్రదములు అగు కిరణములతో భాసిల్లు కాంతిమూర్తి హృషీకేశుడు. శ్రీ శంకరులు మహాభారతము శాంతిపర్వము మోక్షధర్మమునుండి ఈ ఉదాహరణ చెప్పారు.

**సూర్యచంద్రమసోః శశవదంశుభిః కేశసంజ్ఞితః**
**బోధయన్ స్వాపయన్ శ్చైవ జగదుత్థిష్ఠతే పృథక్**
**బోధనాత్ స్వాపనాచ్చైవ జగతో హర్షణమ్ భవేత్**
**అగ్నీసోమ కృతైరేభిః కర్మభిః పాండునందన**
**హృషీకేశోఽహమీశానో వరదో లోకభావనః**

సూర్యకిరణములతో జగములను మేల్కొలిపి,మరల చంద్రకిరణములతో నిదురబుచ్చి, లోకములకు ఆనందము కలుగజేయుచున్నాను. ఇట్లు అగ్ని (సూర్యుడు), సోమ కార్యములచే జగములను పోషించువాడను గనుక నేను హృషీకేశుడను.

శ్రీ శంకర భాష్యమును ఆంగ్లములోనికి అనువదించిన శ్రీ టి.ఎస్. కృష్ణమాచారి గారు ఈ గుణానుభవమును, ఇంకొక్క అడుగు ముందుకు వేసి, ఇలా వివరించారు – భగవానుని కేశములు సూర్యచంద్ర కిరణ రూపమున జగములకు హర్షమును కలిగించుచున్నవి గనుక ఆయన హృషీకేశుడు.

## 48. పద్మనాభః

నాభి (బొడ్డు) నందు పద్మము కలవాడు. ఈ పద్మమునుండియే సృష్టికర్తయగు బ్రహ్మ ఉద్భవించెను –
**సర్వజగత్ కారణమ్ పద్మమ్ నాభౌ యస్య స పద్మనాభః**

## ఓం పద్మనాభాయ నమః

ఈ నామము మూడుమార్లు వస్తుంది
6వ శ్లోకము. 48వ నామము. పద్మనాభః – **అప్రమేయో హృషీకేశః పద్మనాభః అమరప్రభుః**
21వ శ్లోకము. 198వ నామము. పద్మనాభః – **హిరణ్యనాభః సుతపాః పద్మనాభః ప్రజాపతిః**
38వ శ్లోకము. 348వ నామము. పద్మనాభః – **పద్మనాభః అరవిందాక్షః పద్మగర్భః శరీరభృత్**

ప్రస్తుత నామమునకు శ్రీ భట్టుల వివరణ – ఆయన బ్రహ్మను కన్నతండ్రి అని ఇంతకు ముందు – ధాతా, విధాతా, ధాతురుత్తమః – నామములలో చెప్పబడిన విషయము ఈ 'పద్మనాభః' నామములో సంగ్రహపరచబడినది. ఎల్ల లోకములకు, చరాచర భూతములకు మూలాధారము ఆయన నాభియే.
**కాలాత్మకం తు యత్పద్మం నాభౌ యస్య స ఉచ్యతే**
**పద్మనాభశ్చాష్టవర్ణో మహాసన్తానదో మనుః**
కాలాత్మకమైన పద్మమును నాభియందు కలవాడు పద్మనాభుడు . ఈ నామాన్ని 'ఓం పద్మనాభాయ నమః' అని అష్టాక్షరీ మహామంత్రముగా జపం చేసినట్లయితే సత్సంతానము కలుగుతుంది.

'పద్మనాభః' నామమునకు శ్రీ రాధాకృష్ణశాస్త్రి మరొక ఇంపైన వివరణ ఇచ్చారు. గర్భమునందు, జనన సమయమునందును బొడ్డుద్వారానే బిడ్డకు తల్లినుండి ఆహారం లభిస్తుంది. అలాగే సమస్త ప్రకృతికి ఆధారమైన భగవంతుని నాభి తామరమొగ్గవలె ఉన్నది. ఆ మొగ్గ వికసించుటయేబ్రహ్మ జననము, కాలగమనము, సృష్టికార్యము అనుకొనవచ్చును.

## 49. అమరప్రభుః

అమరులైన దేవతలకు ప్రభువు – **అమరాణామ్ ప్రభుః**

## ఓం అమరప్రభవే నమః

**సృష్ట్యాదిష్వపి దేవానాం అధికార ప్రదానతః**

**అమరప్రభు రిత్యుక్తో నవార్ణ స్సర్వదో మనుః**

దేవతలకు సృష్టి, స్థితి, లయము మొదలైన అధికారము ఇచ్చినవాడు. 'ఓం అమర ప్రభవే నమః' అని ఈ నామాన్ని నవాక్షరీ మహామంత్రంగా జపించినట్లయితే సకలాభీష్టాలు ఈడేరుతాయి.

ఆ పరమేశ్వరుడే దేవతలను సృజించి, వారికి అమరత్వమునొసగి, వారికి సృష్ట్యాది కార్యక్రమములను అప్పగించెను. శ్రీ భట్టులు రామాయణము ఉత్తరకాండనుండి ఉదాహరించారు.

**మహార్ణవే శయనోప్సు మామ్ త్వమ్ పూర్వమ్ అజీజనః**

**ప్రాజాపత్యమ్ త్వయా కర్మ సర్వమ్ మయి నివేశితమ్**

బ్రహ్మ ఇలా అన్నాడు – మహార్ణమున శయనించియున్న నీవు నన్ను సృజించి, ప్రజాపతి కార్యమును నాకు అప్పగించినావు.

ఇంకా మహాభారతము (169.19)నుండి –

**ఏతౌద్వౌ విబుధశ్రేష్ఠౌ ప్రసాద క్రోధజౌ స్మృతౌ**

**తదాదర్శిత పంథానౌ సృష్టి సంహార కారకౌ**

ఆయన ప్రసాద, క్రోధములనుండి ఈ దేవతోత్తములు (బ్రహ్మ, శివుడు) ఉద్భవించి, సృష్టి సంహార కార్యములను నిర్వర్తించుచున్నారు.

## 50. విశ్వకర్మా

- విశ్వమంతటికిని సంబంధించిన సకల కర్మలును తనయొక్క కర్మలుగా కలవాడు
- విశ్వమును సృజించినవాడు.

## ఓం విశ్వకర్మణే నమః

**విశ్వమ్ కర్మ జగద్ వ్యాపారః యస్య స విశ్వకర్మా** – బ్రహ్మ జననమునకు పూర్వముగాని, తరువాత గాని విశ్వంలో సకల కర్మలు ఆయన కర్మలే (కాని ఆయనను కర్మలు అంటవు). ఆయనే విశ్వమునకు సృజకుడు, నిర్దేశకుడు, నియంత్రణకర్త.

ఇందుకు శృతులనుండి పెక్కు ఆధారాలున్నాయి.

తైత్తరీయారణ్యకము (6) - **సోऽకామాయత బహుస్యామ్ ప్రజాయేయ ఇతి** – ఆయన సంకల్పించెను. నేను అనేకములుగా జన్మించెదను.

**సోऽభిధ్యాయ శరీరాత్ స్వాత్ సిసృక్షుః వివిధాః ప్రజాః** – తన శరీరమునుండి వివిధ జీవరాసులను సృష్టించుటకు బ్రహ్మము సంకల్పించెను.

## 51. మనుః

మననము చేయు మహామహితాత్ముడు – **మాననాత్ మనుః**

## ఓం మనవే నమః

బృహదారణ్యకోపనిషత్తు (3.7.23) – **నా అన్యో అతో అస్తో మన్తా** – ఆయనవంటి సంకల్పశక్తిమూర్తి వేరు లేరు. ఒక పని చేయకుండా, దానిని గూర్చి ఆలోచించుటయే మననము. సంకల్ప లవమాత్రముననే సకల విశ్వమును సృష్టించినవాడు ఆయన. భగవంతుని సంకల్పమే కార్యాచరణము.

## 52. త్వష్టా

- (శిల్పివలె) నానావిధ రూపములను, నామములను తయారు చేసినవాడు.
- బృహత్పదార్థములను విభజించి సూక్ష్మముగా చేసి ప్రళయకాలమున తనయందు ఇముడ్చుకొనువాడు.

## ఓం త్వష్ట్రే నమః

'త్వక్ష్' అనే మూలమునకు చెక్కుట, తగ్గించుట అనే అర్థాలున్నాయి. ఇదే ఆధారంగా ఇద్దరు భాష్యకారులు వ్యాఖ్యానించారు. శ్రీ భట్టుల వ్యాఖ్యలో సృష్టికార్యము, శ్రీ శంకరుల వ్యాఖ్యలో లయ కార్యము సూచించబడినాయి.

శ్రీ భట్టులు – సృష్టిలోని మనుష్య, పశు, పక్షి, క్రిమి, కీటకాది సమస్త చరాచర భూతములకును రూపము దిద్దిన మహాశిల్పియే భగవంతుడు. **త్వష్టారమ్ రూపాణి వికుర్వన్తమ్ విపశ్చితమ్.** తైత్తరీయారణ్యకము (3.11)

శ్రీ శంకరులు – (ప్రళయ కాళమున) సమస్తమును సూక్ష్మముగా చేసి తనయందే భద్రపరచుకొనువాడు.

## 53. స్థవిష్ఠః

(బ్రహ్మాండమును తనయందు ఇముడ్చుకొన్న) బృహద్రూపమూర్తి.

## ఓం స్థవిష్ఠాయ నమః

ఈ నామము రెండుమార్లు వస్తుంది.

6వ శ్లోకము. 53వ నామము. స్థవిష్ఠః – **విశ్వకర్మా మనుస్త్వష్టా స్థవిష్ఠస్స్థవిరో ధ్రువః**

47వ శ్లోకము. 437వ నామము.స్థవిష్ఠః – **అనిర్విణ్ణః స్థవిష్ఠో భూర్ధర్మయూపో మహామఖః**

'స్థూల' (చాలా పెద్ద), 'ఇష్ట' అనే మూలములనుండి – మిక్కిలి పెద్దరూపముగా ఉండుటకు ఇచ్ఛగించినవాడు.

శ్రీ భట్టుల వ్యాఖ్య – చతుర్దశ భువనములు, సకల భూతముల ఇంద్రియములు, ఆ ఇంద్రియముల ద్వారా తెలియనగు వస్తు సముదాయము మొదలుగా గల సమస్త బ్రహ్మాండమును తనయందు ఇముడ్చుకొన్నందున ఆయన 'స్థవిష్ఠ' నామమున కీర్తింపబడును. శ్రీ రామానుజులవారి వైకుంఠగద్యములో **"చతుర్దశ భువనాంతరమ్ అండమ్ దశగుణితోత్తరమ్** ..." అని ఈ చతుర్దశ భువనముల వర్ణన చేయబడినది (వైకుంఠ స్థానమును తెలిపే సందర్భంలో)

**బహుభవంశ్చ సూక్ష్మాణాం స్థూలావస్థతయా చ సః**
**నిస్సారవత్త్వాద్య స్థూలః స్థవిష్ఠః పరికీర్తితః**

నామరూపాలు లేనటువంటి అవస్థలో ఉన్న చేతనాచేతములను నామరూపములు కలవిగాచేయ సంకల్పించినవాడై, వాటిని భోక్తలు, భోజ్యములు, భోగస్థానములుగా విస్తరింపజేశాడు.

## 54. స్థవిరః

సనాతనుడు, సదా ఉండెడివాడు

## ఓం స్థవిరాయ నమః

'స్థ' ధాతువునుండి, 'తిష్ఠతి' అనగా నిలచియుండునది – అని ఈ నామమునకు మూలము. కాలముతో సృష్టి ప్రళయ చక్రము తిరుగుచుండవచ్చును. కాని ఆ భగవానుడు మాత్రము కాలాతీతుడు. పురాతనమైనదానికంటెను పూర్వుడు.

**కాలతంత్రతయా దుగ్ధ దధ్యాదిభ్యో విలక్షణః**
**విద్యతే యస్సర్వకాలం స్థవిరః పరికీర్తితః**

కాలానికి అధీనమై పరిణామం చెందే పాలు, పెరుగు వంటివానిలాగా కాకుండా, సర్వకాలములందును ఉండువాడు స్థవిరుడు.

## 55. ధ్రువ

కాలముతో మార్పు చెందక ఒకేతీరున ఉండేవాడు

### ఓం ధ్రువాయ నమః

**స్థిరత్వాత్ ధ్రువః** – 'ధృ' అనే ధాతువునుండి – నిలబడుట, కదలిక లేకుండుట, నిర్వహించుట – అనే అర్థంలో ఈ నామమును వివరించారు.

దీని ముందు నామము 'స్థవిరః' – పురాతనము కంటెను పూర్వుడు.
ఈ నామము 'ధ్రువః' – కాలముతో మార్పు చెందనివాడు.

'స్థవిరః' నామము వల్ల ఆయన ఆద్యులకు ఆద్యుడు, పూర్వులకు పూర్వుడు అని తెలియును. అంతే కాదు. అప్పటినుండి ఇప్పటివరకు, ఇంకముందుకూడ ఆయన మారడు గనుక 'ధ్రువః' అని కీర్తనీయుడు. ఆయనకు కాలము హద్దు కాదు. ఆయనపై కాలప్రభావము ఉండదు.

## స్థవిరోధ్రువః

స్థిరుడై, నిత్యుడై, కాలాతీతుడైనవాడు

### ఓం స్థవిరోధ్రువాయ నమః

స్థవిరః, ధ్రువః – అనే ఈ రెండు నామములలోని సారూప్యతవల్లనేమో – శ్రీ శంకరాచార్యులు తమ భాష్యములో ఈ రెండు నామములను కలిపి, 'స్థవిరోధ్రువః' అని చెప్పారు. స్థిరుడై, నిత్యుడై, కాలాతీతుడైనవాడు స్థవిరోధ్రువుడు. ఇందులో మొదటి పదము (స్థవిరః – అనాదియైనవాడు) విశేషణము. రెండవ పదము (ధ్రువః – చలించనివాడు) విశేష్యము.

ఇక్కడినుండి శ్రీ శంకరుల భాష్యము, శ్రీ భట్టుల భాష్యములలోని నామ క్రమసంఖ్యలో తేడా మొదలవుతున్నది.

(1) శ్రీ నరసింహన్ కృష్ణమాచారి ఆంగ్ల రచనకు ఇది తెలుగు అనువాదము.
(2) భగవద్గీత శ్లోకముల తాత్పర్యము గీతాప్రెస్, గోరఖపూర్ ప్రచురణనుండి.

**అగ్రాహ్యః శాశ్వతః కృష్ణో లోహితాక్షః ప్రతర్దనః |**

**ప్రభూతస్త్రికకుబ్ధామ పవిత్రం మంగళం పరం || (7)**

## 56. అగ్రాహ్యః

తెలియరానివాడు

### ఓం అగ్రాహ్యాయ నమః

శ్రీభట్టుల వ్యాఖ్య - భౌతికముగా భగవంతుని అర్థము చేసికొనుట గాని, నియంత్రించుట గాని, ఆయనను ఏమైనా చేయుటగాని సాధ్యము కాదు. – **నైనమ్ ఊర్ధ్వమ్ న తిర్యంచమ్ న మధ్యే పరిజగ్రభత్** – పైనగాని, క్రిందగాని, మధ్యగాని (in any dimension) ఆయనను తెలిసికొనుట సాధ్యము కాదు.

శ్రీ శంకరుల వ్యాఖ్య – **కర్మేంద్రియైః న గ్రాహ్యత ఇతి అగ్రాహ్యః** – కర్మేంద్రియముల ద్వారా తెలియరానివాడు – **యతో వాచో నివర్తంతే, అప్రాప్య మనసా సహ** (తైత్తరీయోపనిషత్తు) – మనస్సుచేత గాని, మాటలతోగాని ఆయనను తెలియజెప్పుట సాధ్యము కాదు.

శ్రీ చిన్మయానంద – కేనోపనిషత్తులో చెప్పబడినట్లుగా – **యత్ చక్షుషా న పశ్యతి యేన చక్షూంసి పశ్యన్తి తదేవ బ్రహ్మత్వం విద్ధి** – బ్రహ్మమువలన కనులు చూడగలవు. కాని బ్రహ్మమును చూడజాలము. అంటే భగవంతుని కారణంగా మనకు జ్ఞానం లభిస్తుంది. ఆయనే చూసేవాడు. ఆయనే చూపు. కాని చూడబడునది ఆయన కాదు.

ఆయన అప్రమేయుడు (ఆయనను అంచనా వేయలేము). అగ్రాహ్యుడు (ఆయనను తెలిసికొనలేము).

**అన్నమయ్య కీర్తన**

ఇతరులకు నిను నెఱగతరమా

సతత సత్యవ్రతులు సంపూర్ణమోహ విర - హితులెఱుగుదురు నిను నిందిరారమణా || ఇతరులకు ||

నారీకటాక్ష పటునారాచ భయరహిత - శూరులెఱుగుదురు నిను చూచేటిచూపు

ఘోరసంసార సంకుల పరిచ్ఛేదులగు - ధీరులెఱుగుదురు నీదివ్యవిగ్రహము || ఇతరులకు ||

రాగభోగవిదూర రంజితాత్ములు మహా - భాగులెరుగుదురు నిను ప్రణుతించు విధము

ఆగమోక్తప్రకారాభిగమ్యులు మహా - యోగులెఱుగుదురు నీవుండేటి వునికి || ఇతరులకు ||

పరమభాగవత పదపద్మసేవానిజా - భరణు లెఱుగుదురు నీ పలికేటిపలుకు

పరగు నిత్యానంద పరిపూర్ణ మానస - స్థిరు లెఱుగుదురు నిను తిరువేంకటేశ || ఇతరులకు ||

## 57. శాశ్వతః

కాలముతో మార్పు చెందక, ఎల్లప్పుడు ఉండేవాడు.

## ఓం శాశ్వతాయ నమః

**శాశ్వత్ భవతీతి శాశ్వతః** – సృష్ట్యాది కార్యములు అవిచ్ఛిన్నముగా జరుగుతూనే ఉంటాయి. ఆ కార్యములకు మూలాధారము భగవానుడే. ఏదయినా శాశ్వతముగా ఉండాలంటే అది కాలమునుబట్టి మారకూడదు. కాలమునకే కారకుడైన భగవంతుడు శాశ్వతుడు, స్థిరుడు, ధ్రువుడు. ఆయనవల్ల కాలము ముందుకు నడచును. కాలమువల్ల ఆయన మారడు.

## 58. కృష్ణః

- (సృష్ట్యాది లీలా విలాసముల వల్ల) స్వదా సచ్చిదానందమున వినోదించువాడు.
- దట్టమైన నీలవర్ణ దేహము గలవాడు.
- సర్వమును ఆకర్షించువాడు.

## ఓం కృష్ణాయ నమః

ఈ నామము రెండుమార్లు వచ్చును. ఈ రెండు సందర్భాలలోను ప్రధాన భాష్యకారుల వివరణ ఇలా ఉంది.

7వ శ్లోకము. 58వ నామము. కృష్ణః - **అగ్రాహ్యః శాశ్వతః కృష్ణో లోహితాక్షః ప్రతర్దనః**

శ్రీ శంకరులు – నిరతిశయమైన ఆనందము, అప్రమేయమైన అస్తిత్వము – ఈ రెండింటి సమ్మేళనము కృష్ణుడు.

శ్రీ భట్టులు – శాశ్వతము, అవిచ్ఛిన్నము అయిన క్రీడావినోదముచే సదా ఆనందమునకు నెలవైనవాడు కృష్ణుడు.

59వ శ్లోకము. 554వ నామము. కృష్ణః – **వేధాః స్వాంగోఽజితః కృష్ణో దృఢః సంకర్షణోఽచ్యుతః**

శ్రీ శంకరులు – కృష్ణద్వైపాయనుడైన వేదవ్యాసుడు కృష్ణుడు.

శ్రీ భట్టులు – నల్లని వర్ణము కలిగినవాడు కృష్ణుడు.



రుక్మిణీ సత్యభామా సహితం కృష్ణమాశ్రయే. గరుత్మంతుడు కూడా చిత్రంలో ఉన్నాడు – వికీపీడియానుండి.

**ఏకాంతర లీలారసతో నిర్వృతః కృష్ణ ఉచ్యతే** – లీలారసముతో నిరంతరము ఆనందించువాడు కృష్ణుడు.
సచ్చిదానందమూర్తి అనే అర్థానికి ఆధారంగా మహాభారతం ఉద్యోగపర్వంలో ఈ శ్లోకం (5.68.5) చెప్పబడింది.

**కృషిర్ భూ వాచకః శబ్దో ణశ్చ నిర్వృతి వాచకః విష్ణుః**

**తద్భావ యోగాశ్చ కృష్ణో భవతి శాశ్వతః**

'కృషి' అనగా 'భూ'. 'ణ' అనగా నిర్వృతి, ఆనందము. ఈ రెండింటి సమ్మేళనమగుటచేత భగవానుడు 'కృష్ణుడు' అనబడెను. ఇక్కడినుండి శ్రీ శంకరుల భాష్యంలోను, శ్రీ భట్టుల భాష్యంలోను స్వల్పంగా భేదం కనిపిస్తుంది.

'భూ' అనే ధాతువునకు అర్థము 'ఉనికి' (భూ, భవ్) అని శ్రీ శంకరులు చెప్పగా, 'పాత్ర, ఆధారము, భూమి' అని శ్రీ భట్టులు చెప్పారు. కనుక శ్రీ భట్టుల వ్యాఖ్య – శాశ్వతము, అవిచ్ఛిన్నము అయిన సృష్టివంటి లీలావినోదములచే సదా ఆనందమునకు నిలయమైనవాడు కృష్ణుడు. శ్రీ శంకరుల వ్యాఖ్య – నిరతిశయమగు ఆనందము, అప్రమేయమగు ఉనికి, ఈ రెండింటి సమ్మేళనమే కృష్ణభగవానుడు.

('సచ్చిదానంద స్వరూపుడు' అంటే రెండు వ్యాఖ్యలకు సరిపోతుందని నాకు అనిపిస్తుంది – కా.సు. బాబు)

'నీలమేఘ శ్యాముడు' అని మహాభారతం శాంతిపర్వంలోని ఈ శ్లోకం (342.79) ద్వారా చెప్పవచ్చును.

**కృషామి పృథ్వీమ్ పార్థ భూత్వా కర్షాయసో హలః**

**కృష్ణో వర్ణశ్చ మే యస్మాత్ తస్మాత్ కృష్ణో అహమ్ అర్జున**

ఇక్కడ 'కృషామి', 'కర్షణ', 'కృష్ణ' అనే మూడు పదాలు గమనింపదగినవి. ఒక్కొక్క పదమునుండి ఒక్కొక్క అర్థంలో 'కృష్ణ' నామమును వివరింపవచ్చును. పై శ్లోకంలోని మొదటి పాదమునకు అర్థము – భూమి గట్టి పొరచే కప్పబడియున్నప్పుడు నేను (నల్లని) నాగటి మొననై ఆ భూమిని దున్నుదును. 'కృషామి' (దున్నుట) అనే కార్యము చేయుటవల్ల 'కృష్ణ' నామాంకితుడు అగును. అజ్ఞాన మోహములచే కరడుగట్టిన భక్తుల హృదయక్షేత్రములను దున్ని, పాపకర్మలు అనే కలుపుమొక్కలను తొలగించి, జ్ఞానమును పండించి, సచ్చిదానందమోక్షఫలమును ప్రసాదించుటయే ఈ పరమాత్ముని 'కృషామి' కార్యము – అని శ్రీ చిన్మయానంద చక్కగా వివరించారు. ఇక రెండవ పాదమునకు అర్థము – ఓ అర్జునా! నేను నల్లని వర్ణము గలవాడనగుటచేత నన్ను 'కృష్ణ' అనియందురు – ఈ నల్లని వర్ణము 'నాగలి మొన' రంగు కావచ్చును. లేదా కారుమబ్బుల రంగు కావచ్చును. కరుణాజలమును వర్షించు నీలమేఘశ్యాముడు, నందగోపబాలుడు, సీతామనోహరుడు ఆయనే కృష్ణుడు.

శ్రీ చిన్మయానంద – కృష్ణుడు తెలియరానివాడు గనుక చీకటిమాటున దాగినట్లు అనిపించవచ్చును. నిశ్చల, నిరవధికమగు భక్తి వల్లనే ఈ అంధకారమును అధిగమించి, ముక్తిమార్గమున ఆయనను సేవించి తరింపనగును.

'ఆకర్షణ' అనే అర్థంలో కూడా 'కృష్ణ' నామమును వివరించారు. ఆయన గోపీజన ప్రియుడు. భక్తులను అయస్కాంతమువలె ఆకర్షించి, పాపములను తొలగించు కరుణాంతరంగుడు. కృష్ణుడు. నవనీతచోరుడు. పాపహరుడు. జ్ఞానులకు గురువు.

శ్రీ భట్టులు 58వ నామమును పరవాసుదేవ స్వరూపమగు సచ్చిదానందమూర్తిగా కీర్తించి, తరువాత 554వ నామమును నీలమేఘశ్యామునిగా సేవించారు.

---

**పోతన భాగవతంలో కుంతీదేవి కృష్ణుని ఇలా స్తుతించింది.**

శ్రీకృష్ణా! యదుభూషణా! నరసఖా! శృంగార రత్నాకరా!
లోకద్రోహి నరేంద్ర వంశ దహనా! లోకేశ్వరా దేవతా
నీక బ్రాహ్మణ గోగణార్తి హరణా! నిర్వాణ సంధాయకా!
నీకున్ మ్రొక్కెద ద్రుంపవే భవలతల్ నిత్యానుకంపానిధీ!

---

**అన్నమయ్య కీర్తన**

ముద్దుగారే యశోద ముంగిటి ముత్యము వీడు, దిద్దరాని మహిమల దేవకీ సుతుడు

అంత నింత గొల్లెతల అరచేతి మాణికము, పంత మాడే కంసుని పాలి వజ్రము

కాంతుల మూడు లోకాల గరుడ పచ్చ బూస, చెంతల మాలో నున్న చిన్ని కృష్ణుడు

రతికేళి రుక్మిణికి రంగు మోవి పగడము, మితి గోవర్ధనపు గోమేధికము

సతమై శంఖ చక్రాల సందుల వైడూర్యము, గతియై మమ్ము గాచేటి కమలాక్షుడు

కాళింగుని తలలపై గప్పిన పుష్యరాగము, యేలేటి శ్రీ వేంకటాద్రి యింద్రనీలము

పాలజలనిధి లోన బాయని దివ్య రత్నము, బాలునివలె దిరిగీ బద్మ నాభుడు

---

## 59. లోహితాక్షః

**లోహితే అక్షిణి యస్య సః లోహితాక్షః** – తామరపూవులవలె సుందరమగు ఎర్రని కనులు గలవాడు.

## ఓం లోహితాక్షాయ నమః

ఆ శుద్ధసత్త్వమూర్తి సదా సచ్చిదానంద లీలాకేళియందున వినోదించుటవలన ఆయన కనులు సంతోషమున ఎరుపెక్కినవి అని శ్రీ భట్టులు తన్మయమున ఆ పరవాసుదేవుని స్మరించినారు. ఇక్కడ – **సమా వృషభో లోహితాక్షః సూర్యో విపశ్చిత్ మన్సా పునాతు** – అనే సంధ్యావందన మంత్రమును గుర్తు చేసుకొనవచ్చును.

మరో విధముగా – దుర్మార్గులను శిక్షించు కార్యమున ఆయన దుష్టులపై ఆగ్రహించినందున క్రోధముతో ఆయన కన్నులు ఎరుపెక్కెనని చెప్పవచ్చును. **'వినాశాయ దుష్కృతామ్'** ఆయన యుగయుగమున అవతరించును.

## 60. ప్రతర్దనః

(ప్రళయ కాలమున) విపరీతముగ నాశనమొనరించువాడు.

## ఓం ప్రతర్దనాయ నమః

'తర్ది' అనగా నశింపజేయుట. 'ప్ర-తర్ద' అనగా విపరీతముగా నాశనము చేయుట. ఇందుకు శ్రీ భట్టులు కఠోపనిషత్తునుండి ఉదాహరించారు – **యస్య బ్రహ్మ చ క్షత్రమ్ చ ఉభే భవతః ఓదనః** – బ్రాహ్మణులు, క్షత్రియులు (అనగా, సకల ప్రజులు) ఆయనకు ప్రళయకాలమున భోజనమగును.

**యస్య చ బ్రహ్మ క్షత్రఞ్చ హ్యోదనం భవతస్సదా**

**ప్రతర్దన స్స విజ్ఞేయః సంహర్తృత్వప్రదో మనుః**

బ్రహ్మ క్షత్రియాది చతుర్వర్ణములతోను, అనేక జీవరాశులతోను కూడిన సమస్త ప్రపంచమును ఆహారముగా కలవాడు. సంహారకర్త. ఈ నామమును **ఓం ప్రతర్దనాయనమః** అని మంత్రంగా జపించినట్లయితే శత్రు సంహారం జరుగుతుంది

శ్రీ రాధాకృష్ణమూర్తి – ఇక్కడ 'ప్రతర్దనః' నామార్థమును బట్టి, దీని ముందు వచ్చిన 'లోహితాక్షః' నామమునకు 'క్రోధారుణ నేత్రుడు' అనే వివరణ సమంజసంగా అనిపిస్తుంది.

## 61. ప్రభూతః

పరిపూర్ణుడై జన్మించినవాడు. సర్వదా సకలైశ్వర్య సంపన్నుడు,

## ఓం ప్రభూతాయ నమః

'ప్ర-భూత' అనగా సంపూర్ణత్వముతో జన్మించుట. భగవంతుని ఐశ్వర్య సంపన్నత ఒకప్పుడు తక్కువ, మరొకప్పుడు ఎక్కువ కాదు. ప్రళయ కాలమున సకల భువనములు నశించినను ఆయన పరమపదము దివ్య సంపన్నమే. ఆయన జ్ఞాన, బల, ఐశ్వర్య, వీర్య, శక్తి, తేజోగుణములు ఎన్నడైనను కొరవడవు.

**భోగో కరణం నిత్యం నిర్మర్యాదం పరం పదమ్**
**యస్య తేన సమృద్ధత్వాత్ ప్రభూత ఇతి కథ్యతే.**
నిత్యమైన పరమపదముతో సమృద్ధిగా ఉన్నవాడు.
ఆయన వామనునిగా కనుపించినా గాని త్రివిక్రముడే. బాలకృష్ణునిగా మన్ను తిన్న వెన్నదొంగ నోటిలో సకల భువనములు కనిపించాయి. (అంటే, చిన్నప్పుడు కొంచెం శక్తి, పెద్దయిన తరువాత ఎక్కువ శక్తి అనే గుణం ఆయనకు వర్తించదు.) నందనందనునిగా గోవులు కాచినపుడు, కురుక్షేత్రమున విశ్వరూపమును చూపినపుడు కూడా ఆయన పరవాసుదేవుడే.

## 62. త్రికకుబ్ధామ / త్రికకుద్ధామ

- సామాన్య లోకముకంటెను మూడురెట్లు పెద్దదయిన పరమపదము నందుండువాడు.
- మూడు గుణవర్గములకు ఆశ్రయమైనవాడు.
- ఊర్ధ్వ, మధ్య, అధో భాగములు – మూడు భాగములకు ఆధారమైనవాడు.
- జాగ్రత్, స్వప్న, సుషుప్తి – మూడు అవస్థలలో వ్యాపించినవాడు.

## ఓం త్రికకుబ్ధామ్నే నమః

## ఓం త్రికకుద్ధామ్నే నమః

ఈ నామం ('త్రికకుబ్ధామ' లేదా 'త్రికకుద్ధామ') లో మూడు మూలపదాలు మిళితమై ఉన్నాయి.

* త్రి – మూడు
* కకుబ్ – దిశ, మార్గసూచకము, దిక్సూచిలో ఒక భాగం. లేదా – కకుత్ – మూపు (ఎద్దు మూపు లేదా పర్వత శిఖరము)
* ధామ – నివాస స్థానము లేదా ప్రకాశవంతమైన కిరణము.

'కకుబ్', 'కకుత్' అనే పదాలను ఒకదాని బదులు మరొకటి, ఏ అర్థంలోనైనా, వాడుతారు. పై మూడు పదములకు వేర్వేరు అర్థాలను గ్రహించడం ద్వారా ఈ నామమునకు వివిధ వ్యాఖ్యలను చెప్పారు.

'ధామ' అనే పదానికి 'ప్రకాశము' అనే అర్థాన్ని తీసికొన్నట్లయితే, 'త్రికకుత్' ఒక నామముగాను, 'ధామ' వేరొక నామముగాను పరిగణింపవచ్చునని శ్రీ భట్టుల అభిప్రాయము.

అప్పుడు 'త్రికకుత్' నామము భగవానుని శ్రీవరాహావతారముగా కీర్తనీయము. శ్రీ వరాహ మూర్తి మూడు కొమ్ములతో శోభించాడని మహాభారతం మోక్షధర్మము లోని ఈ శ్లోకం (343.63) ద్వారా తెలుస్తున్నది.

**తథైవాऽసమ్ త్రికకుదో వారాహమ్ రూపమ్ ఆస్థితః**

**త్రికకుత్ తేన విఖ్యాతః శరీరస్య పరమాపనాత్**

నేనప్పుడు మూడు కొమ్ములున్న వరాహరూపమును చేకొంటిని. కనుక 'త్రికకుత్' నామమున ప్రసిద్ధినొందితిని. ఆ రూపముననే రాక్షసుని సంహరించితిని.

శ్రీ భట్టులు ఈ విధంగా (రెండు నామములుగా) పరిగణింపవచ్చునని చెప్పినప్పటికీ, వారే ప్రధానముగా 'త్రికకుబ్ధామ' అనే ఏకనామంగా పరిగణించి వ్యాఖ్యానించారు. శ్రీ శంకరులు కూడా అలాగే ఒకే నామంగా 'త్రికకుబ్ధామ'ను వ్యాఖ్యానించారు.

శ్రీ భట్టుల వ్యాఖ్యలలో ఒకటి – త్రి-కకుత్-ధామ – ఈ సామాన్య లోకములన్నింటికంటె మూడురెట్లు పెద్దదయిన పరమపదము నివాసముగా గలవాడు. మరొక వ్యాఖ్య – జ్ఞాన, బల, ఐశ్వర్య, వీర్య, శక్తి, తేజస్సు – అనే ఆరు గుణములను మూడు వర్గములుగా విభజింపవచ్చును. ఈ మూడు గుణవర్గములకు నివాస స్థానము భగవంతుడే గనుక ఆయన త్రి-కకుద్-ధామి.

శ్రీ శంకరుల వ్యాఖ్య – విశ్వంలో ఊర్ధ్వ భాగమున, మధ్య భాగమున, అధోభాగమున – అనగా అంతటా వ్యాపించి ఆధారమైయున్నవాడు.

శ్రీ చిన్మయానంద – జాగ్రత్, స్వప్న, సుషుప్తి అనే మూడు చేతనావస్థలకు మూలమైన చైతన్య స్వరూపుడు.

## 63. పవిత్రమ్

పరమ పావన స్వరూపుడు.

## ఓం పవిత్రాయ నమః

ఇంతవరకు భగవంతుని గుణ, ఐశ్వర్య, స్వరూపములు అంచెలంచెలుగా కీర్తింపబడినవి. ఇప్పుడు వీటన్నింటికీ అంతర్గతమైయున్నదీ, వీని ద్వారా మనము అనుభూతిని ప్రయత్నించదగినదీ అయిన ముఖ్య లక్షణము స్తుతింపబడుచున్నది.

'పూ' అనేధాతువునకు 'పావనము చేయుట' అని అర్థము. పావనము చేయు దేవుడు ఆయనే. పావనమొనర్చు సాధనము ఆయనే. ఆయనను స్తుతించి, ధ్యానించి, కీర్తించుట వల్లనే మనస్సు పరిశుద్ధమవుతుంది.

**గుణస్య విభవానాంచ రూపస్య చ నిరంతరమ్**
**నిరూపకస్య సర్వైశ్చ తన్నిరూప్యం స్వరూపకమ్**
**అనుప్ర విశ్వవసం స పవిత్రమితి స్మృతమ్**

జ్ఞానము, శక్తి మొదలైన గుణములచేత, ఉభయ విభూతి నాయకత్వాది మహిమ చేత, దివ్య మంగళ విగ్రహాదులచేత, క్రమముగా తెలియబడే స్వరూపము గలవాడు. ఇటువంటి రూపముతో, గుణాలతో అన్నింటియందు ప్రవేశించి ఉన్నవాడు. (శ్రీ కైవల్య సారథి)

ఎవని నామస్మరణము చేత సకల ప్రాణులు పరిశద్ధమవుతాయో అతడు పవిత్రుడు.

**హరియను రెండక్షరములు**
**హరియించును పాతకముల నంబుజ నాభా**
**హరి నీ నామ మాహాత్మ్యము**
**హరి హరి పొగడంగ వశమె హరి శ్రీకృష్ణా**

శ్రీ చిన్మయానంద, శ్రీ రాధాకృష్ణశాస్త్రి మరొక విశేష వివరణ ఇచ్చారు. ఇంద్రుని వజ్రాయుధము (పవి)నుండి రక్షించువాడు (త్రాయతే) పవిత్రుడు. **'ఇంద్రియాణామ్ రాజా ఇంద్రః'** – వేదాంత లాక్షణికార్థములలో దీని భావము – ఇంద్రియములకు అధిపతి ఇంద్రుడు. సాధకుని శక్తి సంపదలు అన్నీ ఇంద్రియముల బలమువలన నశించును. శ్రీ మహావిష్ణు ధ్యానమే ఈ (ఇంద్ర) వజ్రాయుధమునుండి సాధకుని రక్షించి కర్తవ్యోన్ముఖుని చేయును.

## 64. మంగళమ్ పరమ్

అన్నింటికంటెను మంగళకరమగు మూర్తి. స్మరణము వల్లనే అన్ని అశుభములను తొలగించి మంగళములను ప్రసాదించువాడు.

**ఓం పరస్మై మంగళాయ నమః**

**ఓం పరాయ మంగళాయ నమః**

**ఓం మంగళాయ పరస్మై నమః**

**సర్వహేయ ప్రత్యనీక మనన్తావస్థ లక్షణమ్**
**వేదాంత పారగం నిత్యముచ్యతే మంగళం పరమ్**

సమస్త దుర్గుణాలకు సహజ శత్రువు, సచ్చిదానందమే రూపముగ గలవాడు, పరమమంగళ ప్రదమైనవాడు అని వేదాలు ఆయనను గురించి చెబుతున్నాయి.

విష్ణుపురాణమునుండి శ్రీ శంకరులు చూపిన ఆధారము
**అశుభాని నిరాచష్టే తనోతి శుభసంతతిమ్**
**స్మృతిమాత్రేణ యత్ పుంసామ్ బ్రహ్మ తన్మంగళమ్ విదుః**

పరమ్ అనగా అత్యున్నతము. అంతకు మించినది లేదు. మంగళకరమైన అన్నింటికంటెను మంగళప్రదమైనది భగవన్నామము. భీష్మపితామహులు ఈ స్తోత్ర పరిచయములో **'పవిత్రాణామ్ పవిత్రమ్ మంగళానామ్ చ మంగళమ్'** అని చెప్పిన విషయాన్ని గుర్తుచేసుకొనదగును. ఇక్కడ 'పవిత్రమ్', 'మంగళమ్ పరమ్' అనే నామములు ప్రక్కప్రక్కనే వచ్చినవి.

(1) శ్రీ నరసింహన్ కృష్ణమాచారి ఆంగ్ల రచనకు ఇది తెలుగు అనువాదము.
(2) భగవద్గీత శ్లోకముల తాత్పర్యము గీతాప్రెస్, గోరఖపూర్ ప్రచురణనుండి.

## ఈశానః ప్రాణదః ప్రాణో జ్యేష్ఠః శ్రేష్ఠః ప్రజాపతిః |
## హిరణ్యగర్భో భూగర్భో మాధవో మధుసూదనః || (8)

### 65. ఈశానః

సర్వమును శాసించువాడు (ఈశ్ – శాసించుట, ఆజ్ఞాపించుట, హక్కు కలిగియుండుట.

### ఓం ఈశానాయ నమః

**సర్వావస్థాసు సర్వేషాం వ్యవస్థాపన శీలతః**
**వస్తూనాం భగవాన్ సాక్షత్ ఈశానః పరికీర్తితః**
సర్వకాల సర్వావస్థలయందు అన్ని పదార్థములను కూడా వాటివాటి హద్దులు మీరకుండా నియమించువాడు ఈశానుడు.

కొన్ని ఆత్మలు బంధితులు. మరి కొన్ని ఆత్మలు విముక్తులు. ఇంకొన్ని ఆత్మలు పరమపద ప్రాప్తినొందినవి. వీటన్నింటికంటెను పరమాత్ముడు వేరు. సర్వదా, సర్వత్ర, సకలాత్మలు భగవానుని శాసనమునకు అధీనులై వర్తించును.

('ఈశ్వరః', 'ఈశానః' అనే ఈ రెండు నామములు 'ఈశ్' అనే మూలమునుండి వచ్చినవి. వ్యాకరణము ప్రకారము 'ఈశానః' నామము ఎలా అన్వయించబడినది? 'ఈశ్వరః', 'ఈశానః' నామముల మధ్య తేడా ఏమిటి? అనే విషయం నాకు అర్థం కాలేదు – అని శ్రీ కృష్ణమాచారిగారు వ్రాశారు).

## 66. ప్రాణదః

- ప్రాణములను ప్రసాదించువాడు – **ప్రాణాన్ దదాతి ఇతి ప్రాణదః**

- ప్రాణములను హరించువాడు – **ప్రాణాన్ ద్యాతి ఇతి ప్రాణదః**

- ప్రాణములను ప్రకాశింపజేయువాడు – **ప్రాణాన్ దీపయతి ఇతి ప్రాణదః**

## ఓం ప్రాణదాయ నమః

ఈ నామము 66, 323, 409, 956వ నామములుగా నాలుగుమార్లు వస్తుంది.

8వ శ్లోకము - 66వ నామము. ప్రాణదః – **ఈశానః ప్రాణదః ప్రాణో జ్యేష్ఠః శ్రేష్ఠః ప్రజాపతిః**

35వ శ్లోకము - 323వ నామము. ప్రాణదః – **అచ్యుతః ప్రథితః ప్రాణః ప్రాణదో వాసవానుజః**

44వ శ్లోకము - 409వ నామము. ప్రాణదః – **వైకుంఠః పురుషః ప్రాణః ప్రాణదః ప్రణవః పృథుః**

102వ శ్లోకము - 956వ నామము. ప్రాణదః – **ఊర్ధ్వగః సత్పథాచారః ప్రాణదః ప్రణవః పణః**

ఇంతకు ముందు నామములో భగవానుడు సమస్తమును శాసించువాడు అని చెప్పడమైనది. అందుకు తార్కాణము ఈ నామము. అన్ని ప్రాణములను ప్రసాదించునది, నిలుపునది, హరించునది ఆయనయే.

శ్రీ భట్టుల వ్యాఖ్య – **అస్య ఐశ్వర్యస్య ప్రథమమ్ విషయమ్ ప్రాణమ్ దదాతి**. ఇక్కడ 'ప్రాణము' అనే శబ్దము 'బలము, శక్తి' అనే అర్థంలో వాడబడింది. తనయొక్క భక్తులకు తనను సేవించుకొనడానికి తగిన బలము, శక్తి ఇచ్చేవాడు ప్రాణదుడు. శ్రీ భట్టులు ప్రత్యేకంగా నిత్యసూరుల భగవత్కైంకర్యమును ఉదాహరించారు. **సూరిభ్యః సదా దర్శన రూప స్వానుభవ పరిచరణానుకూల బలదః**. నిత్య సూరులు, జీవన్ముక్తులు అయిన దివ్యభక్తులకు ఆయన ప్రసాదించిన బలమువల్లనే సదా భగవంతుని స్మరించి, ధ్యానించి, పరవశించు భాగ్యము కలుగుచున్నది. ఇదే వారికి ప్రాణ ప్రదానము అని శ్రీ భట్టులు సూచించారు.

శ్రీ శంకరుల వ్యాఖ్య – సంస్కృత భాషలో 'ద' శబ్దానికి 'ఇచ్చుట', 'నాశనము చేయుట' అనే రెండు అర్థాలున్నాయి. కనుక ప్రాణదాత, ప్రాణహారి అనే రెండు అర్థాలూ సమంజసమని శ్రీ శంకరులు భావించారు. - **ప్రాణాన్ దదాతిశ్చేష్టయతి ఇతి ప్రాణదః**

తైత్తరీయోపనిషత్తు 2.7 – **కోహ్యేవాన్యాత్ కః ప్రాణ్యాత్** – (ఇది లేకుండా) ఎవరు బ్రతుకగలరు? ఎవరు శ్వాసింపగలరు?

శ్రీ కృష్ణదత్త భరద్వాజ – మరొక అర్థంలో కూడా భగవంతుడు ప్రాణదుడు. తన నిజమైన భక్తులకు ఆయన తనను తానే వారికి ప్రసాదించి, వారి ఆనందమునకు కారణమగును. తన భక్తులకు ఆయనే ప్రాణము. **ప్రాణాన్ జీవనమ్ దదాతి భక్తేభ్యః ఆత్మాన్ దర్శయిత్వా ఇతి ప్రాణదః**

ఈ నామమును నాలుగుమార్లు శ్రీ భట్టులు, శ్రీ శంకరులు పునరుక్తి లేకుండా వ్యాఖ్యానించిన విధం గమనింపదగినది.

| నామము | శ్రీ శంకరుల వ్యాఖ్య | శ్రీ భట్టుల వ్యాఖ్య |
|---|---|---|
| 66. **ప్రాణదః** | ప్రాణులకు ప్రాణశక్తిని ఇచ్చేవాడు. కాలుని (మృత్యువు) రూపంలో ప్రాణములను హరించువాడు. | తన భక్తులకు తనను సేవించుకొనడానికి తగిన బలము, శక్తి ఇచ్చేవాడు. (ప్రాణము అనగా బలము) |
| 323. **ప్రాణదః** | సృష్టి సమయంలో సర్వ భూతములకు ప్రాణములను ఇచ్చువాడును, మరియు ప్రళయకాలంలో భూతముల ప్రాణశక్తిని ఖండించువాడు. | కూర్మావతారం పరంగా – క్షీరసాగర మథనం సందర్భంగా దేవతలకు అధిక బలాన్ని ఇచ్చినవాడు (ప్రాణము అనగా బలము) |
| 409. **ప్రాణదః** | దేవతలకు ప్రాణములు ఇచ్చువాడు, రాక్షసుల ప్రాణములను అంతము చేయువాడు. | అందరికీ ప్రాణములను, చైతన్యమును ప్రసాదించేవాడు |
| 956. **ప్రాణదః** | పరీక్షిత్తువంటివారిని బ్రతికించినవాడు. | సాంసారిక భోగాసక్తులై పతనమైనవారికి ఆత్మోజ్జీవన మార్గమును ప్రసాదించేవాడు. |

## 67. ప్రాణః

ప్రాణము, జీవనము, చైతన్యము

## ఓం ప్రాణదాయ నమః

మరల ఈ నామము 322, 408వ నామములుగా వచ్చును.

8వ శ్లోకము. 67వ నామము. ప్రాణః - **ఈశానః ప్రాణదః ప్రాణో జ్యేష్ఠః శ్రేష్ఠః ప్రజాపతిః**

35వ శ్లోకము. 322వ నామము. ప్రాణః – **అచ్యుతః ప్రథితః ప్రాణః ప్రాణదో వాసవానుజః**

44వ శ్లోకము. 408వ నామము. ప్రాణః – **వైకుంఠః పురుషః ప్రాణః ప్రాణదః ప్రణవః పృథుః**

**ఉజ్జీవనస్య హేతుత్వాత్ నరాణాం ప్రాణ ఈరితః** – నరులందరూ జీవించడానికి కారణమైనవాడు. ఇక్కడ నరులు అంటే సకల జీవులు అని అర్థం చేసుకోవాలి.

**ప్రాణితి అనేన ఇతి ప్రాణః** – ప్రాణము కలిగియుండునది ప్రాణి. అనగా జీవులన్నింటి మూల చేతనత్వము ప్రాణమునుండియే కలుగుచున్నది. అన్ని జీవులకు అంతరాత్మయై, భరించి, పోషించునది భగవంతుడే. కనుక భగవంతుడే ప్రాణము.

కేనోపనిషత్తులో భగవంతుడు – **ప్రాణస్య ప్రాణః** – అనగా 'ప్రాణములకు ప్రాణము' అని చెప్పబడినది. వాయువునందు జీవమును నిలుపు గుణము, అన్నమునందు జీవమును నిలుపు గుణము, ఆలోచనయందు జీవమును నిలుపు గుణము, ఆనందమునందు జీవమును నిలుపు గుణము ఆ సచ్చిదానంద పరబ్రహ్మయే.

## 68. జ్యేష్ఠః

- పూర్వుల కంటెను, వారి పూర్వులకంటెను పెద్దవాడు. **వృద్ధతమో జ్యేష్ఠః**
- పొగడదగినవాడు

## ఓం జ్యేష్ఠాయ నమః

**సర్వదానుభవే ప్యైత్రైరదృష్టా పారభూతితః జ్యేష్ఠః** – ముముక్షువులచే నిత్యము అనుభవించబడుతూ కూడ అనంతమైన ఐశ్వర్యము కలవాడు.

వృద్ధులు – బాగా పెద్దవారు. (వృద్ధః)

వృద్ధతరః – వారికంటె పెద్దవాడు. బ్రహ్మ, సకల సృష్టికర్త (జ్యాయన్)

వృద్ధతమః – బ్రహ్మకంటె పెద్దవాడు. బ్రహ్మకు జనకుడు (జ్యేష్ఠః)

## 69. శ్రేష్ఠః

ప్రశంసింపదగిన వారిలోకెల్ల ఉత్తముడు – **ప్రశస్యతమో శ్రేష్ఠః**

## ఓం శ్రేష్ఠాయ నమః

**శ్రేష్ఠశ్చత్రైర్నిత్యం స్తుతత్వాదభిదీయతే** – ప్రీతితో (ముముక్షువులచే) నిత్యము స్తోత్రము చేయబడువాడు.

'శ్రేయ' అనగా వైభవ, కీర్తి పూరితమై ప్రశంసింపనీయమగునది. శ్రేయమగువానిలో ప్రధమోత్తమము శ్రేష్ఠము. అందుకే **'కమలాక్షునర్చించు కరములు కరములు, శ్రీనాథు వర్ణించు జిహ్వ జిహ్వ'** అని ప్రహ్లాదుడు కీర్తించెను. **'ప్రాణేశ! నీ మంజుభాషణములు వినని కర్ణరంధ్రముల కలిమియేల! నీవు భోగింపగాలేని తనులత సౌందర్యమేల'** అని రుక్మిణి పలవరించెను.

**అయమతిశయేన ప్రశస్యతమ ఇతి శ్రేష్ఠః** – అతిశయముచేత (ఆనందంతో) స్తుతింపబడువాడు.

**ముక్తసంగులైన మునులు దిద్రుకులు**
**సర్వభూతహితులు సాధుచిత్తులు**
**అసద్రుశ వ్రతాఢ్యులు గొల్తురెవని దివ్యపదము.**

సకల శాసనకర్తయయైన భగవంతుని మూడు పవిత్ర నామములు వచ్చిన క్రమము ఛాందోగ్యోపనిషత్తులో చెప్పిన క్రమంలోనే ఉండుట గమనించదగిన విషయము – **ప్రాణో వావ జ్యేష్ఠశ్చ శ్రేష్ఠశ్చ**.

## 70. ప్రజాపతిః

- నిత్య సూరులు, పరమపదము పొందినవారు- వారికి ప్రభువు ప్రజాపతి.
- సకల ప్రజలకును ప్రభువు, తండ్రి.

## ఓం ప్రజాపతయే నమః

8వ శ్లోకము. 70వ నామము. ప్రజాపతిః – **ఈశానః ప్రాణదః ప్రాణో జ్యేష్ఠః శ్రేష్ఠః ప్రజాపతిః**

21వ శ్లోకము. 199 వ నామము.ప్రజాపతిః – **హిరణ్యనాభః సుతపాః పద్మనాభః ప్రజాపతిః**

**బద్ధాద్యుత్కృష్టతో యే చ జాయన్తే సూరయః ప్రజాః**
**తేషాం యో నిత్యసూరీణాం పతిస్స్యాత్ ప్రజాపతిః**

బద్ధులు, ముక్తులకన్న కూడా ఉత్కృష్టులు (గొప్పవారు) నిత్య సూరులు. అటువంటి నిత్యసూరులచే నిరంతరము వరింపబడువాడు ప్రజాపతి.

**ప్రకర్షేణ జాయంతే ఇతి ప్రజాః, తేషాం పతిః ప్రజాపతిః**

బద్ధులు – సంసారము అనే బంధములో చిక్కుకున్నవారు; ముక్తులు – సంసార బంధమునుండి విముక్తి పొందినవారు; నిత్యసూరులు – ఎన్నడును సంసారబంధమున పడనివారు. వారి జన్మము దివ్యము. కర్మబద్ధము కాదు. వారిని 'ప్రజ' అని అందురు. అట్టి 'ప్రజ'లకు, అనగా నిత్యసూరులైనవారికి పతియైనవాడు ప్రజాపతి. ఆయన అర్జునునికి సఖుడు. ప్రహ్లాదవరదుడు. అంబరీషుని రక్షకుడు. హనుమంతుని సర్వస్వము.

'ప్రజ' అనగా 'నిత్యసూరులు' అని గాక, 'సామాన్య ప్రజానీకము' అనే భావంలో కూడా ఈ నామాన్ని వ్యాఖ్యానించారు. ప్రజలందరికిని పతి, గతి, తల్లి, తండ్రి, గురువు, దైవము, తోడు, నీడ అయినవాడు గనుక శ్రీకృష్ణుడు ప్రజాపతి.

## 71. హిరణ్యగర్భః

- రమణీయమగు స్థానమున నివసించువాడు (పరంధాముడు).
- సంపూర్ణానంద ప్రదమగు వానిని ప్రసాదించువాడు.

## ఓం హిరణ్యగర్భాయ నమః

8వ శ్లోకము. 71వ నామము. హిరణ్యగర్భః – **హిరణ్యగర్భో భూగర్భో మాధవో మధుసూదనః**

44వ శ్లోకము. 412వ నామము. హిరణ్యగర్భః – **హిరణ్యగర్భః శత్రుఘ్నో వ్యాప్తో వాయురధోక్షజః**

**హిరణ్యం పరమం ధామ హిరణ్యస్య సమావతః**

**హిరణ్యగర్భ స్స ప్రోక్తః తస్మిన్ వసతి యస్సదా**

'హిరణ్యము' అనగా బంగారము. అనగా రమణీయమైన, సరిపడిన, సంతోషకరమైన వస్తుసముదాయమని శ్రీ భట్టుల వ్యాఖ్య. అదేవిధముగా 'గర్భము' అనగా నివాసస్థానము అని శ్రీ భట్టులు వివరించినారు. భగవంతుని నివాసస్థానమైన వైకుంఠము పరమపదము. అతిరమణీయము. పరమాత్మునకు తగు స్థానము పరమపదము. కనుక ఆయన హిరణ్యగర్భుడు.

మరొక విధముగా – పరమానంద ప్రదమగు వస్తువులుగాని, విషయములుగాని ఆయననుండియే జనించును. అంటే వాటిని ఆయన గర్భమున ధరించియుండును గనుక హిరణ్యగర్భుడు.

శ్రీ పెమ్మరాజు రాజారావు రచననుండి: విశ్వరూపమగు హిరణ్యమును గర్భమునందు ధరించినవాడగుటచే హిరణ్యగర్భుడగును. బ్రహ్మాండ స్వరూపమయిన హిరణ్మయాండమునందు వ్యాపించియున్న సృష్టికర్తయగు బ్రహ్మదేవుడు హిరణ్యగర్భుడగును. అట్టివానికి ఆత్మయై యున్నందున శ్రీహరి 'హిరణ్యగర్భః' అని పిలువబడును.

## 72. భూగర్భః

భూమిని (కడుపులో పెట్టుకొని) కాపాడువాడు.

## ఓం భూగర్భాయ నమః

ఆయన భూమాతను సదా పరిరక్షించును. భూమిని తన గర్భమున ధరించినవాడు. **భూ గర్భే యస్య సః భూగర్భః.** విశ్వమంతా ఆయన సృష్టి. ఆ విశ్వమును (భూమిని) గర్భస్థానమున నిలుపుకొని, ఎల్లప్పుడు కరుణతో, ప్రీతితో పరిరక్షించువాడు భూగర్భుడు.

## 73. మాధవః

- మా+ధవః – లక్ష్మి (మా)కి భర్తయైనవాడు.

- మధువిద్య ద్వారా తెలియువాడు.

- మౌనము, ధ్యానము, యోగము ద్వారా తెలిసికొనబడువాడు.

- సకల విద్యా జ్ఞానములకు ప్రభువు. పరమాత్మను గూర్చిన జ్ఞానమును ప్రసాదించువాడు.

- మధువంశము (యాదవ వంశము)నందు జన్మించినవాడు.

- తనకు వేరు ప్రభువు లేనివాడు (అందరకు ఆయనే ప్రభువు)

- మౌనముగానుండి, సాక్షియైనవాడు.

## ఓం మాధవాయ నమః

భక్తులకు అత్యంతప్రియమైన నామములలో ఒకటియైన ఈ నామము శ్రీవిష్ణుసహస్రనామములో మూడుమారులు చెప్పబడినది. (73, 169, 741వ నామములు).

8వ శ్లోకము. 73వ నామము. మాధవః – **హిరణ్యగర్భో భూగర్భో మాధవో మధుసూదనః**

18వ శ్లోకము. 169వ నామము. మాధవః – **వేద్యో వైద్యః సదాయోగీ వీరహా మాధవో మధుః**

78వ శ్లోకము. 741వ నామము. మాధవః – **లోకబంధుః లోకనాథో మాధవో భక్తవత్సలః**

ఈ మూడు సందర్భములలోను మూడు విధములుగా విజ్ఞులు భాష్యమును చెప్పారు.

శ్రీ లక్ష్మీవల్లభుడు మాధవుడు – **శ్రియః శ్రద్ధాది నామ్న్యాశ్చ పతిర్మాధవ ఇత్యుచ్యతే** -

**మాయా ధవః మాధవః** – 'మా' అనగా 'లక్ష్మి' అన్న అర్థములో. ఆయన శ్రీలక్ష్మీవిభుడు. జానకీపతి. రుక్మిణీవల్లభుడు. అలమేలు మంగకు మగడు. సిరులిచ్చు దేవుడు. శ్రీ, హరి సదా కలసియుందురు. వారిది అవినాభావ సంబంధము. అని ఇక్కడి భావము. ఈ విషయాన్ని నొక్కి చెప్పడానికి అన్నట్లుగా శ్రీ భట్టులు ఇక్కడ 'మాధవ' నామము గురించి ఇంక ఎక్కువగా వ్యాఖ్యానించకుండా, లక్ష్మి ('మా') గుణగణములను గురించి విపులంగా వర్ణించారు.

బ్రహ్మపురాణంలో ఇలా ఉంది

**తత్ శక్తిః దుర్జయా భీమా విష్ణుశక్తిః ఇతి స్మృతాః**

**సర్వ భూత హృదాబ్జస్థా నానారూప ధరాపరా**

**ప్రాణాఖ్యా మంత్రమాతా చ విశ్వస్య జననీ ధ్రువా**

ఆమె శక్తి అనంతము, అపరిమితము, అజేయము. ఆమెయే విష్ణువునకు కూడ శక్తి అని చెప్పబడినది. సకల భూతముల హృదయములందు వసించు పరబ్రహ్మ స్వరూపిణి ఆమెయే. ఎన్నో దివ్య రూపములు ధరించి విలసిల్లు ఆ శక్తియే ప్రాణము. సకల మంత్రములకు అధిష్టానమూర్తి. జగన్మాతృక.

**జగత్ చరాచరమ్ ఇదమ్ సర్వమ్ వ్యాప్యమవస్థితా** – ఆ శక్తియే చరాచర జగత్తునందంతటను వ్యాపించియుండును.

శ్రీలక్ష్మీ సహస్రనామములో ఆమెను జ్ఞాన, బల, ఐశ్వర్య, వీర్య, శక్తి, తేజస్సులను షడ్గుణైశ్వర్యములు సంపూర్ణముగా కలిగిన పరమప్రకృతి అని వర్ణించారు. ఆమె భగవంతుని సచ్చిదానంద శక్తి స్వరూపిణి. చంద్రునికి వెన్నెలవలె శ్రీలక్ష్మీశక్తి భగవంతునితో సదా ఏకమైయుండును. ఆమె సకల శక్తి స్వరూపిణి. సర్వమంత్రాత్మిక. సమస్త ఐశ్వర్యవైభవ పరిపూర్ణమూర్తి.

ఆ శక్తియొక్క గుణధర్మములు, భగవంతుని గుణధర్మములు ఒక్కటే. భూమిపైని సకల జీవులకును ప్రాణాధారమగు శక్తి ఆమెయే. ఈ విషయము చెప్పబడిన శ్లోకములివి.

**మహావిభూతేః సంపూర్ణ షడ్గుణ్య వపుషః ప్రభోః**
**భగవద్ వాసుదేవస్య నిత్యైవ ఏషా అనపాయినీ**
**ఏకైవ వర్తతే భిన్న జ్యోత్స్నేవ హిమ దీధితేః**
**సర్వశక్త్యాత్మికా చైవ విశ్వమ్ వ్యాప్య వ్యవస్థితా**
**సర్వైశ్వర్య గుణోపేతా నిత్యమ్ తద్ధర్మ ధర్మిణీ**
**ప్రాణశక్తిః పరాహ్యేషా సర్వేషామ్ ప్రాణినామ్ భువి**

'మా' యొక్క నిజతత్వ రహస్యమును ఇలా చెప్పారు. **శ్రద్ధయా దేవో దేవత్వామ్ అశ్నుతే.** 'మా' (లక్ష్మీ) సమేతుడై యున్నందున మాధవునకు సర్వైశ్వర్యము అబ్బెను.

మధువిద్య ద్వారా తెలిసికొనబడువాడు మాధవుడు. బృహదారణ్యకోపనిషత్తులో యాజ్ఞవల్క్యుడు తన భార్య మైత్రేయికి శాశ్వతమైన ఆనందాన్నిచ్చే బ్రహ్మజ్ఞానమైన మధువిద్యను బోధించాడు. పిపీలికాది బ్రహ్మ పర్యంతము సృష్టియే జగత్తు. తేనెటీగలు అంఖ్యాకంగా చేరి తేనెతుట్టెను నిర్మించినట్లుగా సమస్త భూతాలు చేరి పృథివిని నిర్మించాయి. సమస్త భూతాలకు ఈ భూమియే మధువు. తేనెటీగలకు తేనెతుట్టె ఆశ్రయమైనట్లుగా, భూతాలన్నింటికీ భూమి ఆశ్రయం ఆహారం అవుతున్నది. ఈ పృథివిలో చిన్మాత్రుడు, ప్రకాశమయుడు, అమృతమయుడు అయిన పురుషుడే ఈ ఆధ్యాత్మ శరీరంలోని తేజోమయుడైన, అమరణ ధర్ముడైన పురుషుడు. ... వీటన్నింటిలో ఉన్న ఏకత్వమే బ్రహ్మ – ఇలా సాగుతుంది మధువిద్యా బోధన.

మౌనము, ధ్యానము, యోగముల సమ్మిళితమైన మధువిద్య ద్వారా మాధవుని పొందవచ్చునని మహాభారతము ఉద్యోగపర్వము (68.4)లో ఉన్నది.

**మధువిద్యాఽవబోధత్వాత్ ధవత్వాద్వా శ్రియోఽనిశమ్**
**మౌనాత్ ధ్యానాచ్చ యోగాచ్చ విద్ధి భారత మాధవమ్**

ఇక్కడ 'మ,ధ,వ' అనే అక్షరాలు మౌన, ధ్యాన, యోగములకు సంకేతములు. వానిచే మనస్సును కట్టడి చేసి, పరమాత్మవైపు మళ్ళించిన వానికి మాధవుడు లభించును.

మరో విధముగా – మౌన, ధ్యాన, యోగ గుణ సంపన్నుడని భగవానుని చెప్పవచ్చును. సాక్షియై, మనందరి శారీరిక, మానసిక, జ్ఞాన సంబంధిత కర్మలను గమనించువాడు మాధవుడు. తపము, జపము, ఆరాధనము – అన్నింటికిని గమ్యమము ఆ పరమయోగీశ్వరుడే. ఆయన నాథుడు, రమానాథుడు, జగన్నాథుడు.

సకల విద్యా విజ్ఞానములకు, సకల విభూతులకు అధిపతి మాధవుడు. ఈ భావములో 'మా' అనగా విజ్ఞానము. 'ధవ' అనగా అధినాథుడు. హరివంశములో (3.88.49) ఇందుకు ఆధారం ఉంది.

**మా విద్యాచ హరేః ప్రోక్తా తస్యా ఈశో యతోభవాన్**

**తస్మాత్ మాధవ నామాశి ధవః స్వామీతి శబ్దితః**

శ్రీహరీ! (మా) విజ్ఞానమునకు (ధవ) ప్రభువైనందున నీవు మాధవుడవు.

మధు (యాదవ) కులంలో జన్మించినవాడు మాధవుడు.

**యాదవానామ్ శిరోరత్నమ్ కృష్ణం వందే జగద్గురుమ్**

**జయతు జయతు కృష్ణో వృష్ణివంశ ప్రదీపః**

**మధుకులే జాత్వాత్ మాధవః**

ఆయన సర్వేశ్వరుడు. ఆయనకు వేరు ప్రభువు లేడు. 'ధవ' అనగా ప్రభువు. – **మా ధవః యస్య స మాధవః** – మాధవ నామమునకు ఈ అర్థము తిరుక్కళ్ళమ్ శ్రీ నృసింహ రాఘవాచారిగారి గీతా భాష్యంలో చెప్పారు.

మౌనముగా గమనించువాడు మాధవుడు. (మధువిద్యలో భాగముగా చెప్పబడినది).

మరిన్ని వివరములు 78వ శ్లోకము 741వ నామము వివరణలో ఇవ్వబడినవి.

**లక్ష్మీ అష్టోత్తరశతనామ స్తోత్రము నుండి**

ప్రకృతిం వికృతిం విద్యాం సర్వభూతహితప్రదాం - శ్రద్ధాం విభూతిం సురభిం నమామి పరమాత్మికాం

ధనధాన్యకరీం సిద్ధిం స్త్రైణసౌమ్యాం శుభప్రదాం - నృపవేశ్మగతానందాం వరలక్ష్మీం వసుప్రదాం

**లక్ష్మీ సహస్రనామ స్తోత్రమునుండి**

నిత్యాగతానంద నిత్యానందినీ జనరంజనీ - నిత్యప్రకాశినీ చైవ స్వప్రకాశ స్వరూపిణీ

మహాలక్ష్మీర్మహాకాళీ మహాకన్యా సరస్వతీ - భోగవైభవ సంధాత్రీ భక్తానుగ్రహకారిణీ

**శ్రీ స్తుతిః నుండి**

మానాతీత ప్రథిత విభవాం మంగళం మంగళానాం - వక్షః పీఠీం మధువిజయినో భూషయన్తీం స్వకాంత్యా

ప్రత్యక్షానుశ్రవిక మహిమ ప్రార్థనీనాం ప్రజానాం - శ్రేయోమూర్తిం ప్రియమశరణస్త్వాం శరణ్యాం ప్రపద్యే

## 74. మధుసూదనః

- మధు, కైటభులు అనే రాక్షసులను సంహరించినవాడు.

- బంధ కారణములైన కర్మఫలములను నాశనము చేయువాడు

## ఓం మధుసూదనాయ నమః

**విష్ణుకర్ణోద్భవమ్ చాపి మధు నామ మహాసురమ్**

**తస్యతావద్వధాదేవ దేవ దానవ మానవాః** – మహాభారతము 2.63.13

మధువు అను మహాసురుని చంపినందువలన ఋషులు, దేవతలు, దానవులు, మానవులు ఆయనను మధుసూదనుడు అని చెప్పారు. (మహార్ణవమున విష్ణువు చెవిలోని మలినమునుండి మధు కైటభులు ఉద్భవించారని, వారిని యుక్తితో శ్రీ మహావిష్ణువు తన తొడపై ఉంచి సంహరించాడని పురాణగాధ)

శ్రీ చిన్మయానంద – వేదాంతపరముగా – ఐహిక కర్మఫలములు తాత్కాలికముగా మధురమనిపిస్తాయి. ఈ కర్మకాండల ఫలితములను 'మధు' అని చెబుతారు. ఈ కర్మ ఫలములు జన్మపరంపరకు కారణములు. మోక్షమునకు అవరోధములు. శ్రీహరిని ధ్యానించుటచే ఈ కర్మ బంధములనుండి విముక్తులు కావచ్చును. కనుకనే ఆయన మధుసూదనుడు.

(1) శ్రీ నరసింహన్ కృష్ణమాచారి ఆంగ్ల రచనకు ఇది తెలుగు అనువాదము.

(2) భగవద్గీత శ్లోకముల తాత్పర్యము గీతాప్రెస్, గోరఖపూర్ ప్రచురణనుండి.

### శ్రీ ఆదిలక్ష్మి స్తోత్రము

సుమనస వందిత సుందరి మాధవి చంద్ర సహోదరి హేమమయే
మునిగణ మండిత మోక్షప్రదాయిని మంజుల భాషిణి వేదనుతే
పంకజ వాసిని దేవ సుపూజిత సద్గుణ వర్షిణి శాంతియుతే
జయ జయహే మధుసూదన కామిని ఆదిలక్ష్మి పరిపాలయ మామ్

### శ్రీ విష్ణు షోడశనామ స్తోత్రము

ఔషధే చింతయేద్విష్ణుం, భోజనేచ జనార్దనం
శయనే పద్మనాభంచ, వివాహేచ ప్రజాపతిం
యుద్ధే చక్రధరం దేవం, ప్రవాసేచ త్రివిక్రమం
నారాయణం తనుత్యాగే, శ్రీధరం ప్రియసంగమే
దుస్వప్నే స్మర గోవిందం, సంకటే మధుసూదనం
కాననే నారసింహంచ, పావకే జలశాయినం
జలమధ్యే వరాహంచ, పర్వతే రఘునందనం
గమనే వామనంచైవ, సర్వకాలేషు మాధవం
షోడశైతాని నామాని ప్రాతరుత్థాయ యః పఠేత్
సర్వపాప వినిర్ముక్తో విష్ణులోకే మహీయతే

## ఈశ్వరో విక్రమీ ధన్వీ మేధావీ విక్రమః క్రమః |
## అనుత్తమో దురాధర్షః కృతజ్ఞః కృతిరాత్మవాన్ || (9)

### 75. ఈశ్వరః

సర్వమును శాసించువాడు. సర్వశక్తిమంతుడు. సర్వాధిపతి

### ఓం ఈశ్వరాయ నమః

ఇదే నామము 36వ నామముగా ఇంతకుముందు వచ్చినది.

4వ శ్లోకము. 36వ నామము. ఈశ్వరః – **సంభవో భావనో భర్తా ప్రభవః ప్రభురీశ్వరః**

9వ శ్లోకము. 75వ నామము. ఈశ్వరః – **ఈశ్వరో విక్రమీ ధన్వీ మేధావీ విక్రమః క్రమః**

**ఈశానాద్రమణా చ్చాపి ఈశ్వరః పరికీర్తితః** – తనయొక్క భోగభూమి అయిన పరమపదము అపారముగా ఉన్నప్పటికీ దానిని తన ఇష్టానుసారముగ నియమిస్తూ ఉండేవాడు.

ఈ నామమును 'ఐశ్వర్', 'ఇష్ట' అనే రెండు అర్థాలలో వేర్వేరు భాష్యకర్తలు వ్యాఖ్యానించారు. అందరూ దాదాపు ఈ భావాలనే కొద్దిపాటి తేడాలతో సూచించారు.

ఐశ్వర్య – శక్తి, బలము, అధికారము, సంపద, వైభవము కలిగియుండుట.

ఇష్ట – ఇచ్ఛానుసారము, ఇతరులతో ప్రమేయము లేకుండ వర్తించుట.

శ్రీ శంకరులు

36వ నామము. ఈశ్వరః – అనంతమగు శక్తిగలవాడు.

75వ నామము. ఈశ్వరః – అనంత అధికారము కలవాడు (శాసకుడు)

శ్రీ భట్టులు

36వ నామము. ఈశ్వరః – సర్వశాసనకర్త.

75వ నామము. ఈశ్వరః – ఇచ్ఛానువర్తి. **'యత్ర కామ గమో వశీ'** – ఎక్కడికి కావాలంటే అక్కడికి వెళ్ళగల స్వేచ్ఛా మూర్తి.

శ్రీ చిన్మయానంద

36వ నామము. ఈశ్వరః – ఏది కావాలంటే అది చేయగలవాడు.

75వ నామము. ఈశ్వరః – సర్వ శక్తిమంతుడు. క్రియాశక్తి, ఇచ్ఛాశక్తి, జ్ఞానశక్తి – అన్ని శక్తులకు అధిపతి.

## 76. విక్రమీ

- అత్యధిక శౌర్య బల పరాక్రమములు కలవాడు.
- విశిష్టమగు పాదచిహ్నములు కలవాడు.

## ఓం విక్రమిణే నమః

9వ శ్లోకము. 76వ నామము. విక్రమీ – **ఈశ్వరో విక్రమీ ధన్వీ మేధావీ విక్రమః క్రమః**

97వ శ్లోకము. 909వ నామము. విక్రమీ – **అరౌద్రః కుండలీ చక్రీ విక్రమ్యూర్జితశాసనః**

**'విక్రమః శౌర్యమ్, తద్యోగాత్ విక్రమీ'** – విక్రమము అనగా శౌర్యము. అట్టి శుభగుణ సంపన్నుడైనందున భగవానుడు 'విక్రమీ' యగును. కనుక భగవత్సంకల్పమునకు ప్రతికూలముగా ఏదీ జరుగదని శ్రీ భట్టులు ఈ నామవిశేషమును వివరించారు.

అందుకే శివుని ఆజ్ఞ లేకుండా చీమయినా కుట్టదన్నారు. ఆ రాముడై తోడైయుండగ మనకు తక్కువేమిటని భక్తరామదాసు గానము చేసినాడు. నందకుమారా, నా రథమందు వసింపుమయ్య, అక్షౌహిణిల సైన్యము అవుసరము లేదని అర్జునుడు వేడుకొన్నాడు.

'క్రమ' అనగా 'అడుగు' అన్న అర్థంలో శ్రీ చిన్మయానందగారు మరొక వివరణ ఇచ్చారు. వామనావతారములో మూడు అడుగులతో లోకములను కొలిచిన త్రివిక్రముడు విశిష్టమగు పాదచిహ్నములు కలవాడు. అది బ్రహ్మ కడిగిన పాదము. కామిని పాపము కడిగిన పాదము. బలి తల మోపిన పాదము. తిరువేంకటగిరి స్థిరమని చూపెడు పరమపదము.

**తిరుప్పావై – 24వ పాశురము - చిత్రకవి ఆత్రేయ తెలుగుసేత -**

అల ఇల కొలిచిన చరణాలకు మంగళం

ఆ లంకను గూల్చిన అతి బలునకు మంగళం

శకటాసురు కాలరాచిన యశస్వికి మంగళం

అసుర ద్వయమును అణచిన అడుగులకు మంగళం

## 77. ధన్వీ

ధనుస్సును ధరించినవాడు. ధనురస్య అస్తి ఇతి ధన్వీ.

## ఓం ధన్వినే నమః

విష్ణుదేవుని ధనుస్సు పేరు శార్ఙ్గము. పంచాయుధాలలో ఒకటి. రామావతారమున ఆయన కోదండపాణియై దుష్టసంహారము చేసెను.

**పవనః పవతామస్మి రామః శస్త్రభృతామహమ్**

**ఝుషాణాం మకరశ్చాస్మి స్రోతసామస్మి జాహ్నవీ** - భగవద్గీత 10.31

పవిత్రమొనర్చువానిలో వాయువును నేను. శస్త్రధారులలో శ్రీరామచంద్రుడను నేను. మత్స్యములలో (జలచరములలో) మొసలిని. నదులలో (ప్రవహించువానిలో) గంగానదిని.



శ్రీ సీతారాముల పరివారం - పశ్చిమ గోదావరి జిల్లా జీలకర్రగూడెం ఆలయం ముందరిభాగం శిల్పాలు.

**ఆధ్యాత్మ రామాయణము నుండి**

ఇది యుద్ధమున రావణుని వధించిన శ్రీరాముని వర్ణనము. మనోజ్ఞము. భయహరము. శుభకరము.

**హత్వా యుద్ధే దశాననం త్రిభువనవిషమం వామహస్తేన చాపం**
**భూమౌ విష్టభ్య తిష్ఠన్నితర కరధృతం భ్రామయన్ బాణమేకమ్**
**ఆరక్తోపాంత నేత్రః శరదళితవపుః సూర్యకోటి ప్రకాశో**
**వీరశ్రీ బంధురాంగః త్రిదశపతినుతః పాతు మామ్ వీరరామః**

ముల్లోకములకు కంటకుడైన రావణుని హతమార్చి, ఎడమచేతితో ధనుస్సును నేలకు ఆనించి, కుడిచేతితో ఒక బాణమును త్రిప్పుచు, ఎఱ్ఱబడిన నేత్రములతో, బాణములచే గాయపడిన తనువుతో, కోటిసూర్యుల తేజముతో నొప్పుచు, వీరశ్రీతేజోమూర్తియై, సకల భువనాధిపతులచే స్తుతింపబడుచున్న వీరరాముడు నన్ను రక్షించుగాక.

---

## 78. మేధావీ

అసాధారణ, అపరిమిత మేధా (జ్ఞాపక)శక్తి గలవాడు.

## ఓం మేధావినే నమః

**నిస్సీమ భూమానుగుణ నిత్య సార్వజ్ఞ లక్షణా**
**మేధా యస్యాస్తి స ప్రోక్తః మేధావీతి విచక్షణైః**

అపారమైన తన మహిమకు తగినటువంటి, స్వతస్సిద్ధమైన సర్వజ్ఞత్వము కలవాడు.

శ్రీ శంకరుల భాష్యము - **మేధా బహు గ్రంధ ధారణ సామర్థ్యమ్, స యస్య అస్తి స మేధావీ** – నానావిధ విషయ పరిజ్ఞానము, ధారణాశక్తిని మేధ అటారు. అలాంటి శక్తి కలిగినవాడు గనుక భగవంతుడు మేధావి.

శ్రీ రాధాకృష్ణశాస్త్రి – భగవంతుడు మేధావి అగుటవలన ఆయనకు తెలియనిది లేదు. కనుక ఆయన ఈశ్వరుడు, విక్రమి, ధన్వి అయినాడు.

## 79. విక్రమః

- బ్రహ్మాండమును కొలిచెడు అడుగులు కలవాడు.
- పక్షిరాజైన గరుత్మంతునిపై పాదములుంచి పయనించువాడు.

## ఓం విక్రమాయ నమః

వామనావతారమును తెలుపు మొదటి అర్థము ఇంతకుముందు 76వ నామము (విక్రమీ) గా వివరింపబడినది. మూడు అడుగులతో లోకములను కొలిచిన త్రివిక్రముడు విశిష్టమగు పాదచిహ్నములు కలవాడు. విక్రముడు.

రెండవ అర్థము – **గమనం పక్షిరాజేన యస్య విక్రమ ఉచ్యతే** – పక్షిరాజైన గరుత్మంతుని వాహనముగా చేసుకొని స్వేచ్ఛగా సంచరించువాడు విక్రముడు. 'వి' అనగా ఆకాశమున చరించే విహంగము. అనగా పక్షిరాజైన గరుత్మంతుడని అర్థము. 'క్రమ' అనగా పాదములు. మూడు వేదములు మూర్తీభవించిన రూపమే గరుడుడు. భగవంతుడు వేదవేద్యుడు. లీలామాత్రముగ గరుత్మంతునిపై సంచరించుటను బట్టి విక్రముడగును.

**అన్నమయ్య కీర్తన** (**చిత్రం:** ద్వారకా తిరుమలలో శ్రీ స్వామివారి పాదములు)



బ్రహ్మకడిగిన పాదము, బ్రహ్మము దానె నీ పాదము

చెలగి వసుధ గొలిచిన నీ పాదము, బలితల మోపిన పాదము
తలపక గగనము తన్నిన పాదము, బలరిపు గాచిన పాదము

కామిని పాపము కడిగిన పాదము, పాముతల నిడిన పాదము
ప్రేమపు శ్రీసతి పిసికెడి పాదము, పామిడి తురగపు పాదము

పరమ యోగులకు పరి పరి విధముల, వర మొసగెడి నీ పాదము
తిరు వేంకటగిరి తిరమని చూపిన, పరమ పదము నీ పాదము

## ౮౦. క్రమః

- సమస్తమును క్రమ విధానములో ఉండుటకు హేతువు.
- సకల వస్తు జీవ సముదాయముయొక్క చలించు శక్తికి మూలము.
- అసమాన సంపన్నుడు.

## ఓం క్రమాయ నమః

'క్రమము' అనగా ఒక పద్ధతి ప్రకారము, సుశిక్షితమై, సవ్యముగా ఉండుట. ఇంకా 'విక్రమీ', 'విక్రమః' నామములకు వివరించినట్లుగా 'అడుగు' అనే అర్థం కూడా ఉంది. వైభవైశ్వర్యములు అనే అర్థం కూడా ఉంది. ఈ మూడు అర్థములలోను ఈ పుణ్యనామమును వ్యాఖ్యానించారు.

క్రమ = పద్ధతి.
అఖండ బ్రహ్మాండములో అన్నీ ఒక క్రమంలో చరిస్తాయి. భూమిపై రాత్రి, పగలు సంభవించుట, గ్రహాదులు భ్రమించుట, జీవకోటి చైతన్యవంతమై సంచరించుట – అన్నీ ఈశానుని శాసనమునకు లోబడియే జరుగును.

**క్రమణాత్ క్రమ హేతుత్వాత్ క్రమ ఏవ ఉదాహృతః** – నిత్య విభూతిని కలిగి ఉండుట చేత బలిసి ఉన్నవాడు. లోకాలన్నింటినీ ఆక్రమించటం చేత, సంసార క్రమాన్ని కాపాడడం చేత 'క్రముడు' అని చెప్పబడుతున్నాడు.

క్రమ = కదలిక, చలనము, నడచుట, అడుగు వేయుట.
సమస్త జీవరాశులలోని చైతన్యశక్తి, చలనశక్తి ఆయనవల్లనే కలుగుచున్నది.

క్రమ = సంపత్తు.
పాణిని సూత్రము 1.3.38 – **వృత్తి-సర్గ-తాయనేషు క్రమః** – 'క్రమః' అనగా కొనసాగుట, శక్తివంతమై యుండుట, ప్రవర్ధమానమగుట అని అర్థము. అంటే తరిగిపోనిది, కొరత లేనిది అన్నమాట. 'ప్రవర్ధమానము' అనే భావంలో శ్రీ భట్టులు 'అనంత, అసాధారణ వైభవైశ్వర్య సంపన్నుడు' అని 'క్రమః' నామమును వ్యాఖ్యానించారు.

## 81. అనుత్తమః

**న విద్యమాన ఉత్తమో యస్మాత్ అనుత్తమః** – అంతకంటె ఉత్తమమైనది వేరొకటి లేదు.

## ఓం అనుత్తమాయ నమః

శ్రీ భట్టుల వ్యాఖ్యానమే నిరుక్తములో ఇలా క్లుప్తముగా చెప్పబడినది – **ఉత్తమో నాస్తి యస్మాత్ సః అనుత్తమః ఉదాహృతః** – తనను మించిన గొప్పవాడు లేడు.

**యస్మాత్ పరం నా పరమస్తి కశ్చిత్** – వానిని మించిన పరతత్వము వేరొకటి లేదు.
**పితాసి లోకస్య చరాచరస్య త్వమస్య పూజ్యశ్చ గురుర్గరీయాన్**
**న త్వత్సమోఽస్త్యభ్యధికః కుతోఽన్యో లోకత్రయేఽప్రతిమ ప్రభావ** – గీత 11.43
ఓ అసమ ప్రభావా! ఈ సమస్త చరాచర జగత్తునకును నీవే తండ్రివి. నీవు పూజ్యుడవు. గురుడవు. సర్వశ్రేష్ఠుడవు. ఈ ముల్లోకములయందును నీతో సమానుడే ఎవ్వడును లేడు. ఇంక నీకంటె అధికుడెట్లుండును?

**ధాశరధీ శతకము – భక్త రామదాసు**
భండన భీముడార్తజన బాంధవుడుజ్వల బాణతూణ కో
దండ కళాప్రచండ భుజతాండవ కీర్తికి రామమూర్తికిన్
రెండవ సాటి దైవమిక లేడనుచు గడకట్టి భేరికా
ఢాండ్ఢ డఢాండ ఢాండ నినదంబు లజాండము నిండ మత్తపే
దండమునెక్కి చాటెదను దాశరధీ కరుణాపయోనిధీ

## 82. దురాధర్షః

తననెదిరింపగల శక్తి వేరెవరికిని లేనట్టివాడు. గంభీరుడు.

## ఓం దురాధర్షాయ నమః

**దైత్యాదిభిః ధర్షయితుమ్ న శక్యత ఇతి దురాధర్షః** – సమస్త రాక్షస దైత్య వీర సమూహములు కూడ ఆయనను ఎదిరించి నిలువజాలవు.

**అపాన్నిధివత్ అక్షోభ్యః దురాధర్షః ఇతీరితః** – సముద్రమువలె గంభీరుడు గనుక దురాధర్షుడు.

**శ్రీ భండారు పర్వతాలరావు రచన – ఓం నమో శ్రీ నారసింహాయ నుండి.**

రామాయణం ఉత్తరకాండములోని కథ

బలిచక్రవర్తి దగ్గరకు రావణాసురుడు వెళ్ళాడు. 'ఇక నీకేం భయం లేదు తాతా! నేను నిన్ను ఆ విష్ణువు బారినుండి రక్షిస్తాను' అన్నాడు. బలిచక్రవర్తి నవ్వి, 'ఆ కనపడేదానిని తెచ్చుకొని, ఇటు వేసుకొని కూర్చో, తరువాత తేలికగా మాట్లాడుకోవచ్చును' అన్నాడు. రావణుడు ఎంత ప్రయత్నించినా ఆ వస్తువును కదిలించలేకపోయాడు. అప్పుడు బలి అతనితో 'అదేమిటనుకొంటున్నావు? హిరణ్యకశిపుని చెవికుండలం అది! అంతపెద్ద కుండలాన్ని, నీవు కదిలించలేనంత బరువున్న దాన్ని, హిరణ్యకశిపుడు చెవులకు ధరించాడు. అటువంటివాడిని విష్ణువు తన తొడలపై వేసికొని, చేతివ్రేళ్ళతో పొట్ట చీల్చి చంపాడు' అని చెప్పాడు.

**కరావలంబ స్తోత్రము నుండి**

ప్రహ్లాద మానస సరోజ విహార భృంగ!
గంగాతరంగ ధవళాంగ! రమా స్థితాంగ
శృంగార సంగర కిరీట లసద్వరాంగ!
లక్ష్మీనృసింహ మమదేహి కరావలంబమ్!

---

## 83. కృతజ్ఞః

- నామస్మరణము, శరణాగతి, పూజాది భక్తి కార్యక్రమములచే ప్రసన్నుడై భక్తులను అనుగ్రహించువాడు.
- పత్ర పుష్పాది అల్ప నివేదనలచేతనే సంతుష్టుడై, కామితార్థ మోక్షములను ప్రసాదించువాడు.
- సమస్త ప్రాణుల పుణ్య, అపుణ్య కర్మలనెరిగినవాడు.

## ఓం కృతజ్ఞాయ నమః

ఈ నామము రెండుమార్లు వస్తుంది.

౯వ శ్లోకము. ౮౩వ నామము. కృతజ్ఞః – **అనుత్తమో దురాధర్షః కృతజ్ఞః కృతిరాత్మవాన్**

57వ శ్లోకము. 536వ నామము. కృతజ్ఞః – **మహర్షిః కపిలాచార్యః కృతజ్ఞో మేదినీపతిః**

పూజాది కార్యక్రమములకు కృతజ్ఞుడై స్పందించువాడు – అనే అర్థంలో శ్రీ భట్టులు రెండు ఆధారములను ఉదాహరించారు.

**అపిచేత్సు దురాచారో భజతే మామ్ అనయభాక్**
**సాధురేవ సమన్తవ్యః సమ్యగ్ వ్యవసితోహి సః** – భగవద్గీత 9.30
ఈ శ్లోకానికి శ్రీ రామానుజుల భాష్యమునుండి కొంత భాగము – పరమపాపి యైనా సరే, నిశ్చలమైన నిర్మలమైన భక్తితో నన్ను పూజించినట్లయితే అతడు సాధువు అనియే పరిగణించాలి. – **వైష్ణవః శ్రేష్ఠతర ఏవమన్తవ్యః** – అతడు శ్రీవైష్ణవులలో ఉత్తముడు. గౌరవింపదగినవాడు.
భక్తి శ్రద్ధలతో అర్చించినంత మాత్రమున సకలపాపములను క్షమించి కరుణించువాడు గనుక శ్రీహరి కృతజ్ఞుడని స్తుతింపబడెను.

మహాభారతము 3.58.22 – గోవిందా! నీవే శరణు అని ఆక్రందించిన ద్రౌపదిని గురించి భగవానుడిలా చెప్పాడు
**గోవిందేతి యదాక్రందాత్ కృష్ణ మామ్ దూరవాసిని**
**ఋణమ్ ప్రవృద్ధమివ హృదయాత్ న అపసర్పతి**
గోవిందా! అని దూరమునుండి పలికిన ఆ ద్రౌపది ఆక్రందన నా హృదయంలో సదా ప్రతిధ్వనిస్తూనే ఉంటుంది. అది వడ్డీతో కలిసి పెరిగిన ఋణభారంలా నన్ను వెంటాడుతున్నది.
తన భక్తులకు కష్టం వస్తే తన ఆప్తులైన బంధమిత్రులకు కష్టం వచ్చినట్లుగా చలించి ఆ శరణాగత వత్సలుడు వారి కడగండ్లను కడతేర్చును.

శ్రీ శంకరుల భాష్యము - భక్తితో సమర్పించిన యెడల ఆకు గాని, పండు గాని, పూవుగాని, నీరుగాని ఆ భక్తసులభునకు మహాప్రసాదమగును. ఆయన సంతుష్టుడై వారికి పరమపదమునే ప్రసాదించును. భక్తులు అర్పించునది అల్పము. ఆయన అనుగ్రహము అనంతము – **పత్రపుష్పాద్యల్పమపి ప్రయచ్ఛతామ్ మోక్షమ్ దదాతి.**

**ప్రాణిభిః యత్కృతం కర్మ తద్ జ్ఞాత్వా ఫలదోయతః**
**పత్ర పుష్పాదినా తుష్టః కృతజ్ఞో మోక్షదానతః**
ప్రాణులు చేసిన పాపపుణ్యాలకు తగిన ఫలితము ఇచ్చేవాడు. భక్తులు తనకు సమర్పించిన పత్రము, పుష్పము, ఫలమునకు ఆనందించి వారికి మోక్షమును అనుగ్రహించేవాడు. సుదాముని అటుకులవల్లను, శబరి పండ్లవల్లను, రంతిదేవుని జలము వల్లను, గజేంద్రుని పుష్పమువల్లను, ద్రౌపది అక్షయపాత్రలోని

ఆకువల్లను ఆయన సంతుష్టుడయ్యెను. భగవంతునకు నైవేద్యము సమర్పించుటకు భక్తులు వ్యయప్రయాసలు పడనవసరము లేదు. భక్తియున్నచో భగవానుడు బహుసులభుడు.

మూడవ అర్థము – **ప్రాణినామ్ పుణ్య అపుణ్య ఆత్మకమ్ కర్మకృతమ్ జానాతి ఇతి కృతజ్ఞః** – సమస్త ప్రాణుల పనులు, ఆలోచనలు, ఆశలు, అనుభూతులు, అన్ని పుణ్యములుగాని, పాపములుగాని ఆయనకెఱుకయే. కనుక వారి కర్మలలోని శ్రద్ధ, భక్తి, పవిత్రత, నిష్ఠలకు అనుగుణముగా వారికి తగు కామితార్థములను ప్రసాదించువాడు గనుక ఆయన కృతజ్ఞుడయ్యెను. అని శ్రీ చిన్మయానంద వ్యాఖ్యానించారు.

## 84. కృతిః

తన భక్తుల సత్కార్యములకు కారణమైనవాడు.

## ఓం కృతయే నమః

తన భక్తులు ఆచరించిన సత్కార్యమలకు పరమాత్ముడు సంతుష్టుడై, కృతజ్ఞుడగునని ఇంతకు ముందు నామములో చెప్పడమైనది. ఆ సత్కార్యములకు కారణము కూడా ఆ పరమాత్ముడేనని ఇప్పుడు చెప్పుచున్నారు. నిశ్చల, నిర్మల భక్తియే మనకు చేతనయినది. సత్కార్యములు, సత్ఫలితములు, సకల భవబంధ విముక్తి, మోక్షప్రదానము – అన్నీ ఆయనే చూసుకొంటాడు.

మనమొనరించే సత్కార్యములు ప్రసన్నుడైన పరంధాముని ప్రసాదమే. **తే తచ్చ తేషామ్ సుకృతమ్ అస్మాదేవ ప్రసన్నాత్ ఇతి కృతిః**

## 85. ఆత్మవాన్

సత్కార్యములొనర్చు ఆత్మలకు నిజమైన ప్రభువు.

## ఓం ఆత్మవతే నమః

ఈ మూడు నామములు – **కృతజ్ఞః, కృతిః, ఆత్మవాన్** – వీనిద్వారా మనము గ్రహింపవలసినదేమంటే, పుణ్యకార్యముల ద్వారా ముక్తిని పొందుటలో మన శక్తి, గొప్పతనము ఏమీ లేవు. మన భక్తి, విశ్వాసము, శ్రద్ధ, శరణాగతి వలన ప్రసన్నుడై ఆయన ప్రసాదించు మహాఫలములే ఇవి. భక్తి శ్రద్ధలతో మనమొనరించే అల్ప సమర్పణములచే సంతుష్టుడైన ఆ కృతజ్ఞుడు తన అధీనములోనున్న ఆత్మలను సత్కార్యములవైపు మరల్చును. అలా ఆ ఆత్మలు చేసిన పుణ్యకార్యములను హేతువుగా పరిగణించి, తన కరుణా కటాక్షములచే వారిని అనుగ్రహించి, కామితార్థ మోక్షములను ప్రసాదించును.

శ్రీ రాధాకృష్ణశాస్త్రి మరొక వివరణ – తన కార్యములకు దేని పైనను ఆధారపడని స్వతంత్రుడు సర్వేశ్వరుడు. ఉదాహరణకు పూతన ఇచ్చిన పాలనే త్రాగి ఆమె ప్రాణములను హరించిన చిన్నికృష్ణునికి వేరెవరి సహాయముగాని, ఎటువంటి సాధనముగాని అవుసరము లేదు – **బాలం ముకుందమ్ మనసా స్మరామి.**

(1) శ్రీ నరసింహన్ కృష్ణమాచారి ఆంగ్ల రచనకు ఇది తెలుగు అనువాదము.

(2) భగవద్గీత శ్లోకముల తాత్పర్యము గీతాప్రెస్, గోరఖపూర్ ప్రచురణనుండి.

## సురేశః శరణం శర్మ విశ్వరేతాః ప్రజాభవః |
## అహః సంవత్సరో వ్యాళః ప్రత్యయస్సర్వదర్శనః || (10)

### 86. సురేశః

- సకల దేవతలకును దేవుడు, దేవదేవుడు. (సుర-ఈశః)

- భక్తుల కోర్కెలను తీర్చువారిలో ప్రప్రథముడు.(సు-రా-ఈశః)

### ఓం సురేశాయ నమః

**బ్రహ్మాదీనాం ఫల్గుపద లిప్సూనాం స్త్రిదివౌకసామ్**
**సంవిధాతా సురేశశ్చ ప్రోచ్యతే విబుధోత్తమైః**
స్థిరత్వములో కూడ అల్పమైనదానిని కోరుతున్నారు ఊర్ధ్వలోకవాసులు. అంటే బ్రహ్మాది దేవతలు శాశ్వతం కాదు. కొంతకాలం తరువాత వారికి కూడా క్షయం తప్పదు. అటువంటి బ్రహ్మాదిదేవతలకు ఫలమును ఇచ్చేవాడు సురేశుడు. (డా. క్రోవి పార్థసారధి)

**సురాణామ్ ఈశః సురేశః** – భక్తుల కోర్కెలను తీర్చువారు సురులు. (సుష్ఠు రాతి-దదాతి - ఇతి సురః) బ్రహ్మ, రుద్రాది దేవతలను సృజించి, వారికి లోకసృష్ట్యాది కార్యములను ఒసగినవాడు గనుక ఆయన సురేశ్వరుడయ్యెను.

సు-రా-ఈశః – భక్తుల కోర్కెలను తీర్చువారిలో ప్రథముడు. సు-శోభనమ్, రాతి-దదాతి, ఈశః – ప్రభువు లేదా ఉత్తముడు. భక్తుల పరమార్ధమగు మోక్షమును ప్రసాదించువాడు శ్రీమన్నారాయణుడే.

## 87. శరణమ్

- తనను శరణుజొచ్చినవారిని రక్షించువాడు. ఆర్తత్రాణ పరాయణుడు.

- ముక్తుల నివాసస్థానము.

## ఓం శరణాయ నమః

**యదుపాసాద్భయం దుఃఖం పాపం బంధో న బాధతే**

**ప్రతిష్ఠా చ సుఖం జ్ఞానం భేవచ్ఛరణమిత్యపి**

ఎవరిని ఉపాసించడంవలన కష్టాలు, భయము, పాపము, సంసార బంధనాలు తొలగిపోతాయో, ఎవరిని ధ్యానించడంవలన ప్రతిష్ట, సుఖము, జ్ఞానము కలుగుతాయో అటువంటి పరమేశ్వరుడు శ్రీమన్నారాయణుడు.

**సకృదేవ ప్రపన్నాయ, తవాస్మీతి యాచతే, అభయం సర్వ భూతేభ్యః దదామి ఏతద్వ్రతం మమ** – ఒక్కమారు ఎవ్వడైనను 'నీవాడను, రక్షింపుము' అని వేడుకొన్నంతనే, వానికి సర్వభూతములనుండి అభయమును ప్రసాదింతును. ఇది నా వ్రతము. – అని శ్రీరామచంద్రుడు పలికియున్నాడు.

**ఆర్తానాం ఆర్తిహంతారం భీతానాం భయనాశనమ్**

**ద్విషతాం కాలదండం తం రామచంద్రం నమామ్యహమ్**

ఆర్తులై శరణుజొచ్చినవారికి రక్షకుడు శ్రీరామచంద్రుడే. మకరిబారి పడి ఆక్రందించిన గజేంద్రుని బ్రోచినవాడు ఆ చక్రధారి. ద్రౌపదీమాన సంరక్షకుడు శ్రీకృష్ణుడు. ఆపదలందు చిక్కుకొని మ్రొక్కుకొను భక్తులను కాచెడివాడు ఏడుకొండల వెంకటరమణుడు.

అమరకోశము ప్రకారము – **శరణమ్ వద రక్షిత్రోర్గృహ రక్షణయోరపి** – శరణమనగా 'రక్షణ', 'గృహము' అని రెండు అర్థాలున్నాయి. మోక్షకాములైన భక్తుల పరమపద నివాసము భగవంతుడే – **నివసిష్యసి మయ్యేవ అత ఊర్ధ్వ న సంశయః** – నాయందు మనసు లగ్నము చేసిన భక్తుడు నాయందే నివసించునని భగవానుడు గీతయందు సెలవిచ్చెను.

శ్రీ చిన్మయ – ప్రళయకాలమునందు సకల భూతములకును నివాసము ఆ భగవానుడే.

గజేంద్రుని మొర (పోతన భాగవతము)

**లావొక్కింతయు లేదు, ధైర్యము విలోలంబయ్యె, బ్రాణంబులున్**

**ఠావుల్ దప్పెను, మూర్ఛవచ్చె, దనువున్ డస్సెన్, శ్రమంబయ్యెడిన్**

**నీవే తప్ప నితః పరంబెఱుగ, మన్నింపందగున్ దీనునిన్**

**రావే ఈశ్వర! కావవే వరద! సంరక్షించు భద్రత్మకా!**

శ్రీకృష్ణశతకము

**బలమెవ్వ కరిబ్రోవను**

**బలమెవ్వడు పాండుసుతుల భార్యను గావన్**

**బలమెవ్వడు సుగ్రీవుకు**

**బలమెవ్వడు నాకు నీవె బలమౌ కృష్ణా**

## 88. శర్మ

సచ్చిదానంద స్వరూపుడు. మోక్షగాముల పరమపదము.

## ఓం శర్మణే నమః

అమరకోశములో 'ప్రీతి', 'సుఖము' అనే పదాలకు సమానార్థపదముగా 'శర్మ' పదము కూడ ఉన్నది. **శృణతి దుఃఖమ్ ఇతి శర్మ**. దుఃఖములను నశింపజేయునది శర్మ – అని శ్రీ లింగాయసూరిగారు తమ అమరకోశ వ్యాఖ్యానములో చెప్పారు. శ్రీ శంకరులు, శ్రీ భట్టులు కూడ 'ఆనందము' అనే భావంలో ఈ నామమునకు వ్యాఖ్యానం చెప్పారు.

శ్రీ శంకరులు – **పరమానంద రూపత్వాత్ శర్మ.**

శ్రీ భట్టులు – **సుఖమ్ పరమ్ ప్రాప్యమ్ ఇతి శర్మ.**

(బహుశా 'శ్రీ' అనే మూలంనుండి 'శర్మ' పదము ఉత్పన్నమై ఉండవచ్చునని Sir William Monier నిఘంటువులో ఉన్నది.)

## 89. విశ్వరేతాః

రేతస్సు అనగా బీజము. విశ్వమంతటికి బీజము, మూలకారణము.

**విశ్వస్య కార్యమ్ అస్య విశ్వరేతా.**

**విశ్వస్య కారణాత్ విశ్వరేతా.**

## ఓం విశ్వరేతసే నమః

**విశ్వం రేతో భగవతో విశ్వరేతా హరిస్మృతః**

**జ్ఞానేంద్రియాదికం విశ్వం పరిచర్యార్థమేవ హి**

**యః ప్రజానాం కరోతీతి విశ్వరేతాశ్చ సః స్మృతః**

తనచేత నిర్మించబడిన సంసారము కలవాడు. మానవులంతా తనను గురించి తెలిసికోవడానికి, తనకు పరిచర్యలు చేయడానికి వారికి ఇంద్రియాలతో కూడిన శరీరము ఇచ్చినవాడు.

సంసార మహావృక్షమునకు భగవంతుడే బీజమని ఈ నామమునకు అర్థము. తరువాత 118, 151 నామములలో 'విశ్వయోని' అనగా గర్భస్థానము కూడా భగవంతుడే అని చెప్పబడినది. ఈ రెండు నామములను పరిశీలించినట్లయితే సమస్తమునకు జన్మకారణము, జన్మ స్థానము కూడ భగవంతుడేనని అవగతమవుతుంది. కనుక ఈ సృష్టియొక్క పరమార్థము భగవత్సేవ మాత్రమే కాని వేరొకటి కాదు అని శ్రీ భట్టులు వివరించారు. విష్ణుతత్వంలో ఇలా ఉన్నది.

**విచిత్ర దేహ సంపత్తిః ఈశ్వరాయ నివేదితుమ్**

**పూర్వమేవ కృత బ్రహ్మన్! హస్త పాదాది సంయుతా**

బ్రహ్మదేవా! కాళ్ళు, చేతులు వంటి అవయవములతో కూడిన ఈ శరీర సంపద ఈశ్వరార్చన కొఱకు నాచే సృజింపబడినది.

**పోతన భాగవతము – ప్రహ్లాదుడు ఇలా ఇన్నాడు.**

కమలాక్షునర్చించు కరములు కరములు – శ్రీనాథు వర్ణించు జిహ్వ జిహ్వ
సురరక్షకుని జూచు చూడ్కులు చూడ్కులు – శేషశాయికి మ్రొక్కు శిరము శిరము
విష్ణునాకర్ణించు వీనులు వీనులు – మధువైరి దవిలిన మనము మనము
భగవంతు వలగొను పదములు పదములు – పురుషోత్తముని మీది బుద్ధి బుద్ధి
దేవదేవుని చింతించు దినము దినము
చక్రహస్తుని బ్రకటించు చదువు చదువు
కుంభినీధవు జెప్పెడి గురుడు గురుడు
తండ్రి హరిజేరుమనియెడి తండ్రి తండ్రి తండ్రి.

## 90. ప్రజాభవః

సకల భూతముల ఉత్పత్తికి మూలమైనవాడు. జన్మకారకుడు.

## ఓం ప్రజాభవాయ నమః

**తద్దత్తైరేవ కరణైః తస్మిన్నభిముఖాః ప్రజాః**

**సర్వాశ్చైవ  భవన్తీతి ప్రజాభవ ఉదాహృతః**

తాను ప్రసాదించినటువంటి అవయవములు, శరీరము కలిగిన ప్రజలందరినీ తనవారినిగా చేసుకొనేవాడు.

70వ నామము 'ప్రజాపతి'ని పరిశీలించినపుడు 'ప్రజ' అనే పదాన్ని రెండువిధాలుగా అర్థం చేసుకోవచ్చునని చెప్పడమైనది. (1) **ప్రకర్షేణ జాయంతే** – ప్రత్యేకమైన, దివ్యమైన జన్మ కలిగినవారు. కర్మబద్ధులు కానివారు. నిత్యసూరులు. (2) సమస్త ప్రజానీకము. ఈ రెండు అర్థములలోను 'ప్రజాభవ' నామమును స్తుతింపవచ్చును. సమస్త జీవులను సృష్టించినవాడు సర్వేశ్వరుడని చెప్పవచ్చును. మరొక విధముగా తక్కిన దేవతలను, ముక్తులను కూడ సృష్టించిన దేవదేవుడు అని చెప్పవచ్చును.

ఈ రెండు అర్థములను సమన్వయపరుస్తూ శ్రీ రాధాకృష్ణశాస్త్రిగారు చెప్పిన భావం ఆసక్తికరంగా ఉంది – భగవంతుడు ముందుగా బ్రహ్మాది దేవతలను సృష్టించెను. తరువాత ప్రత్యక్షంగా కాని, పరోక్షంగా కాని సకల మానవ జంతుజాలమును సృష్టించెను. (ముందుగా సూక్ష్మ, స్వల్ప చైతన్యముతో కనుపించే జంతువులు ఉద్భవించాయనీ, వానినుండి క్లిష్టమైన ఉన్నత స్థాయి జీవజాలం పరిణమించిందనీ మనం చదువుకొంటాము. ఇందుకు శ్రీ రాధాకృష్ణశాస్త్రిగారి భావం విరుద్ధంగా కనిపిస్తుంది.)

## 91. అహః

- ఎవరినీ, ఎన్నడూ వీడనివాడు.
- పగటివలె ప్రకాశస్వరూపుడై అజ్ఞానమును తొలగించి, మనలను జ్ఞానోన్ముఖులను చేయువాడు.
- తన భక్తులను నాశనము కాకుండ కాపాడువాడు.

## ఓం అహ్నే నమః

**న సన్తి హీనా యస్యేతి అహః స పరికీర్తితః**
**అనాద్య విద్యా విద్రాయాం స్వధీ హేతుతయా హి అహః**
తన భక్తులలో ఒక్కడు కూడా హీనుడు లేనివాడు. (ఆయన భక్తులందరూ ఉత్తములు). అజ్ఞానాంధకారము నుండి బయటపడినవారికి స్వరూపజ్ఞానాన్ని ఇచ్చేవాడు.

**న హీనః అస్య అస్తి ఇతి అహః** – ఆయన ఎవ్వరినీ ఎన్నడూ వదలిపెట్టడు. చెలుడై, చుట్టమై, తల్లియై, తండ్రియై, గురువై, ప్రియుడై, బిడ్డయై, ఆపదమ్రొక్కులవాడై మనలను వెన్నంటి ఉంటాడు.

'అహ' అనగా పగలు. నారాయణుడే మనలను అసత్యమునుండి సత్యమువైపు, చీకటినుండి వెలుగువైపు, మృత్యువునుండి అమృతత్వమువైపు నడిపించువాడు.
'హ' అనే ధాతువుకు 'నాశనము' అనే అర్థం ఉంది. 'అ-హ' అనగా నాశనము కానీయనివాడు. ఆయనను నమ్మినవారికెన్నడును కీడులేదు. **న మే భక్తః ప్రణశ్యతి** – అని పార్థసారథియైన గీతాచార్యుడు బోధించెను.

## 92. సంవత్సరః

- భక్తులనుద్ధరించుటకై (వెలసి)యున్నవాడు.

- కాలస్వరూపుడు.

## ఓం సంవత్సరాయ నమః

ఇదే నామము మరల 423వ నామముగా వచ్చును.

10వ శ్లోకము. 92వ నామము. సంవత్సరః – **అహః సంవత్సరో వ్యాళః ప్రత్యయః సర్వదర్శనః**

45వ శ్లోకము. 423వ నామము. సంవత్సరః – **ఉగ్రః సంవత్సరో దక్షో విశ్రామో విశ్వదక్షిణః**

'వస్' అనగా నివసించుట, జీవించుట అనే భావంనుండి మొదటి అర్థం వస్తుంది. **సముద్ధారణాయ సంవసతి ఇతి సంవత్సరః** – అనగా భక్తులను ఉద్ధరించుటకే, వారి ఆపదలు బాపుటకే, వారికి ముక్తి ప్రసాదించుటకే ఆయన ఆపదమ్రొక్కులవాడై వెలసియున్నాడు.

**ఇత్థం తేషు ప్రబుద్ధేషు వసత్యుద్ధరణాయ యః సంవత్సరః** – తన భక్తులైనవారికి అజ్ఞానపు చీకట్లు తొలగిపోగానే వారికి జ్ఞానజ్యోతిని ప్రసాదించడానికి సర్వకాలములందు ఎదురుచూస్తుంటాడు.

'సంవత్సరము' అనగా ఒక ఏడాది కాలప్రమాణము అని సామాన్యార్థము. భగవానుడు కాలస్వరూపుడు అని భావము.

గీత 10.30 – **కాలః కలయతామహమ్** – గణన చేయువానిలో నేను కాలమును.

గీత 10.33 – **అహమేవాక్షయః కాలః** – నేను నాశనము లేని కాలస్వరూపుడను.

## 93. వ్యాళః

- భక్తుల శరణాగతిని స్వీకరించి అనుగ్రహించువాడు. తన భక్తులకు అభయమిచ్చి వారిని తన అధీనంలో ఉంచుకొనేవాడు.

- (సర్పము, ఏనుగు, పులి వంటివానివలె) పట్టుకొనజాలనివాడు. చిక్కనివాడు.

## ఓం వ్యాళాయ నమః

'ళా' – అనగా స్వీకరించుట – మూలమునుండి మొదటి భావమును శ్రీ భట్టులు చెప్పారు. విభీషణునివంటి భక్తులు శరణనగానే ఆయన వారిని స్వీకరించును. మనము ఆపదలో గాని, సంతోషంలోగాని, కామితార్థులమైగాని, జ్ఞానముకొఱకు గాని, మోక్షము కొఱకు గాని, ఎప్పుడైనా, ఎక్కడైనా ఆ సర్వేశ్వరుని శరణు కోరవచ్చును.

**వ్యాళవత్ భుజంగవత్ గజవత్ గ్రహీతుమ్ అశక్యాత్ వ్యాళః** - వ్యాళమనగా సర్పము, మదించిన ఏనుగు, భీకరమైన పులి అని చెప్పవచ్చును. వీనివలెనే భగవంతుడు మన చేతికి చిక్కడు. ఊహకు దొరకడు. అదుచేయనగడు.

## 94. ప్రత్యయః

ఆధారపడ దగినవాడు. విశ్వసింప దగినవాడు.

## ఓం ప్రత్యయాయ నమః

**ప్రతీయతే అస్మిన్ ఇతి ప్రత్యయః** –నమ్ముకొని కొలువదగినవాడు ఆ కొండలలోని కోనేటిరాయడు. ఆయనను నమ్మినవారికి లోటులేదు.

మహాభారతము – సభాపర్వము 20.7

**యది తే హృదయమ్ వేత్తి యది తే ప్రత్యయో మయి**

**భీమసేనార్జునౌ శీఘ్రమ్ న్యాసభూతౌ ప్రయచ్ఛ మే**

నీ హృదయమున నన్నెరిగిన యెడల, నాపై నమ్మికయున్న యెడల, భీమసేనుని, అర్జునుని తక్షణమే నా సమక్షమున నుంచుము.

శ్రీ పెమ్మరాజు రాజారావు రచననుండి – జ్ఞాన స్వరూపుడని ఈ శబ్దముయొక్క భావము. **ప్రజ్ఞానమ్ బ్రహ్మ** – అని శృతివాక్యము స్మరణీయము. **జ్ఞానాదేతు కైవల్యమ్** –జ్ఞానమువలననే మోక్షము కలుగును.

## 95. సర్వదర్శనః

- తన కటాక్ష పరిపూర్ణ వైభవమును భక్తులకు చూపువాడు.
- సమస్తమును చూచుచుండువాడు.

## ఓం సర్వదర్శనాయ నమః

**మహిమానం సర్వసహం తేషాం దర్శయతీతి సః**

**సర్వదర్శన అఖ్యాతో నవార్ణో లోచనప్రదః**

సర్వాన్నిసహించేటటువంటి తనమహిమను వారికి చూపేవాడు సర్వదర్శనుడు. ఈ నామము నవాక్షరీమంత్రము. దీన్ని జపిస్తే దృష్టి దోషాలు పోతాయి. కళ్ళు లేని వారికి కళ్ళు వస్తాయి.

ఓం సర్వదర్శనాయ నమః.

'సర్వదర్శన' నామము వివరణలో మనం గ్రహింపవలసినదేమంటే, మహాత్ములు పరి పరి విధాలుగా భగవంతుని అనంతగుణానుభవాలను దర్శిస్తారు. అనుభవిస్తారు.

శ్రీ శంకరులు – అంతటినీ చూపువాడు సర్వదర్శనుడు.
శ్రీ భట్టులు – అంతటినీ చూచువాడు సర్వదర్శనుడు.

శ్రీ శంకరులు చెప్పిన శృతి ప్రమాణము – తైత్తరీయారణ్యకము 10.1, 11. **విశ్వతశ్చక్షుర్ విశ్వాక్షమ్** – విశ్వమందంతటను కన్నులుగలవాడు, విశ్వమే కన్నుగా గలవాడు.

శ్రీ చిన్మయానందగారు గీత(13.13) నుండి ఉదాహరించారు.

**సర్వతః పాణిపాదం తత్ సర్వతోऽక్షి శిరోముఖమ్**
**సర్వతః శృతి ముల్లోకే సర్వమావృత్య తిష్ఠతి.**
ఆ పరమాత్ముని చేతులు, పాదములు, నేత్రములు, చెవులు, శిరస్సులు, ముఖములు సర్వత్ర స్థితములైయున్నవి. అతడు సర్వమును ఆవరించియున్నాడు.

ఈ గీతాశ్లోకాన్ని శ్రీ జయదయాల్ గోయందకాగారు గీతా తత్వ వివేచనీవ్యాఖ్యలో ఇలా వ్యాఖ్యానించారు – ఆ జ్ఞేయ తత్వమైన పరమాత్ముని సర్వవ్యాపకత్వము ఈ శ్లోకముద్వారా తెలియుచున్నది. ఆయన కన్నులు (చూపులు) సర్వత్ర వ్యాపించియున్నవి. అతడు చూడని స్థలమే ఉండదు. ఆయనకడ ఏమియును దాచుటకు వీలు లేదు. అతని శిరస్సులు సర్వత్ర వ్యాపించియున్నవి. భక్తులు తమ తమ భగవదర్చనలో భాగముగ ఎచ్చటినుండి పుష్పాదులు సమర్పించినను అవి ఆయన శిరస్సునే అలంకరించును. ఆయన శిరస్సు లేని స్థానమే లేదు. ఆయన ముఖములు సర్వత్ర వ్యాపించియుండును. భక్తులు ఆయనకు ఏ పదార్థమును ఇచ్చినను, ఎచ్చటినుండి నివేదన చేసినను అచటినుండియే అతడా వస్తువును ఆరగించును. .. ... పరమాత్మ అన్ని స్థలములనుండియు వినగలడు. ఎచటనుండియైనను భక్తులు చేయు స్తుతులను, ప్రార్థనలను, అభ్యర్థనలను అతడు చక్కగా ఆలకింపగలడు.

శ్రీ పెమ్మరాజు రాజారావుగారి రచననుండి – హిందూవేదాంత సాహిత్యమున భగవత్ప్రాప్తికి ఆరు ప్రధాన సూత్ర విజ్ఞానములను మహర్షులు వివరించిరి. వీనినే 'షడ్దర్శనములు' అందురు. అవి 1. న్యాయ దర్శనము 2. వైశేషిక దర్శనము 3. సాంఖ్య దర్శనము 4. యోగ దర్శనము 5. పూర్వమీమాంసా దర్శనము 6. ఉత్తరమీమాంసా దర్శనము. ఈ షడ్దర్శనములద్వారా దర్శింపదగినవాడు పరమాత్మయే గనుక 'సర్వదర్శనః' అనబడెను.

(1) శ్రీ నరసింహన్ కృష్ణమాచారి ఆంగ్ల రచనకు ఇది తెలుగు అనువాదము.

(2) భగవద్గీత శ్లోకముల తాత్పర్యము గీతాప్రెస్, గోరఖపూర్ ప్రచురణనుండి.

**శ్రీ సీతారామచంద్రాభ్యాం నమః. శ్రీ సుందర కాండము**

శ్రీ మద్వాల్మీకి రామాయణాంతర్గత 'సుందర కాండము' నందు 35వ సర్గము – సీత కోరికపై హనుమంతుడు శ్రీరాముని శరీర చిహ్నములను, గుణములను వివరించుట. (గీతా ప్రెస్, గోరఖ్ పూర్ వారి ప్రచురణ – అనువాదకులు: డా. ఎమ్. కృష్ణమాచార్యులు, డా. గోలి వేంకటరామయ్య)

**జానంతీ బతదిష్ట్యా మాం వైదేహీ పరిపృచ్ఛసి**
**భర్తుః కమల పత్రాక్షి సంస్థానం లక్ష్మణస్య చ**
కమల పత్రములవంటి కన్నులు గల ఓ సీతాదేవీ!. రామునియొక్క, మఱదియైన లక్ష్మణునియొక్క అవయవ సౌభాగ్యములను నీవు ఎఱుగుదువు. ఐనను నీవు నన్నడుగుట నా అదృష్టము. చాలా సంతోషము.

**యాని రామస్య చిహ్నాని  లక్ష్మణస్య యానిపై**
**లక్షితాని విశాలాక్షి వదతశ్శృణు తాని మే**
ఓ విశాలాక్షీ! శ్రీరాముని చిహ్నములను, లక్ష్మణుని లక్షణములను నాకు తెలిసినంత వరకు వివరించెదను వినుము.

**రామః కమల పత్రాక్షః సర్వసత్వ మనోహరః**
**రూప దాక్షిణ్య సంపన్నః ప్రసూతో జనకాత్మజే**
ఓ జానకీ! శ్రీరాముడు కమలపత్రములవంటి కన్నులు గలవాడు. తన నిరుపమాన కాంతిచే సమస్త ప్రాణులకును ఆనందమును కూర్చువాడు. పుట్టుకతోనే అతడు చక్కని దేహసౌంద్యము, గుణసంపదలు గలవాడు.

**తేజసా ఆదిత్య సంకాశః క్షమయా పృథివీ సమః**
**బృహస్పతి సమో బుద్ధ్యా యశసా వాసవో సమః**
అతడు తేజస్సున సూర్యునివంటివాడు. సహనమున భూదేవితో తుల్యుడు. బుద్ధియందు బృహస్పతి. యశస్సుచే దేవేంద్రుడు.

**రక్షితా జీవలోకస్య స్వజనస్యాభిరక్షితా**
**రక్షితాస్వస్య వృత్తస్య ధర్మస్య చ పరంతపః**
సర్వప్రాణులకును సంరక్షకుడు. విశేషముగా తనను ఆశ్రయించిన (శరణు జొచ్చిన) వారిని పరిరక్షించువాడు. లోకమునకు ఆదర్శప్రాయమైన తన ప్రవర్తన విషయమున జాగృతిగలవాడు. ధర్మరక్షకుడు. శతృవులను రూపుమాపువాడు.

**రామో భామిని లోకస్య చాతుర్వర్ణస్య రక్షితా**
**మర్యాదానాం చ లోకస్య కర్తా కారయితా చ సః**

ఓ సీతా! అతడు నాలుగు వర్ణములవారినీ రక్షించువాడు. లోకమర్యాదలను తాను పాటించుచు ఇతరులచే పాటింపజేయువాడు.

పై నాలుగు శ్లోకములకును శ్రీ వావిలికొలను సుబ్బారావుగారి శ్రీ మదాంధ్రవాల్మీకి రామాయణము (మందరము)నందు తెలుగు అనువాదము.

**రాముండు కమలపత్ర విశాలలోచనుం, డఖి సత్వసుమనోహర గుణుండు**
**రూపదాక్షిణ్య నిరూఢుఁడై జనియించెఁ దేజంబునందు నాదిత్యుఁబోలు**
**నోరుపు గుణమున నుర్వికిఁ దుల్యుండు, బుద్ధి బృహస్పతి పురుడు చూపు**
**సద్యశంబున హరి సకల జీవావళీ, రక్షకుఁడాత్మీయ రక్షకుండు**

**స్వకుల వృత్తి ధర్మ సంరక్షకుఁడు నాల్గు**
**జాతుల నరయుచుండు రీతి చెడక**
**మనుజ హితములైన మర్యాదలందుండి**
**పరుల నట్ల చేయఁ బనుచుచుండు**

**అర్చిష్మానర్చితోऽత్యర్థం బ్రహ్మచర్య వ్రతే స్థితః**
**సాధూనాముపకారజ్ఞః ప్రచారజ్ఞశ్చ కర్మణామ్**

కాంతిమంతుడు. సర్వలోకములకును అత్యంత పూజ్యుడు. బ్రహ్మచర్య వ్రతమును పాటించువాడు. సత్పురుషులొనర్చు ఉపకారములను మరువని వ్యవహారజ్ఞాన సంపన్నుడు. లోకకళ్యాణమునకై కర్మలను ఆచరించువాడు. ఇతరులచే ఆచరింపజేయువాడు.

**రాజవిద్యా వినీతశ్చ బ్రాహ్మణానాముపాసితా**
**శ్రుతవాన్ శీలసంపన్నో వినీతశ్చ పరంతపః**

రాజవిద్యా కుశలుడు. బ్రాహ్మణులను ఆదరించువాడు. సర్వవిద్యా పారంగతుడు. సదాచార సంపన్నుడు. వినయ శోభితుడు. శత్రుభయంకరుడు.

**యజుర్వేద వినీతశ్చ వేదవిద్భిస్సుపూజితః**
**ధనుర్వేదే చ వేదేషు వేదాంగేషు చ నిష్ఠితః**

రాముడు యజుర్వేదమునందు పారంగతుడు. ధనుర్వేదమునందు, ఋక్సామాధర్వ వేదముల యందును, శిక్షాది వేదాంగముల యందును నిష్ణాతుడు. వేదపండితులచే పూజింపబడుచుండువాడు.

**విపులాంసో మహాబాహుః కంబుగ్రీవః శుభాననః**
**గూఢజత్రుస్సుతామ్రాక్షో రామో దేవి జనైః శ్రుతః**

ఓ సీతాదేవీ! రాముడు విశాలమైన భుజములు, దీర్ఘములైన బాహువులు, శంఖమువంటి కంఠము గలవాడు. శుభప్రదమైన ముఖము గలవాడు. కండరములతో మూసికొని పోయిన సంధియెముకలు గలవాడు. మనోహరములైన ఎఱ్ఱని కన్నులు గలవాడు. లోక విఖ్యాతుడు.

**దుందుభిస్వన నిర్ఘోషః స్నిగ్ధవర్ణః ప్రతాపవాన్**
**సమస్సమ విభక్తాంగో వర్ణం శ్యామం సమాశ్రితః**

అతడు దుందుభి ధ్వని వలె గంభీరమైన కంఠస్వరము గలవాడు. నిగనిగలాడు శరీరచ్ఛాయ గలవాడు. ప్రతాపశాలి. ఎక్కువ తక్కువలు లేకుండా పరిపుష్టములైన చక్కని అవయవములు గలవాడు. మేఘశ్యామవర్ణ శోభితుడు.

**త్రిస్థిర స్త్రిప్రలంబశ్చ త్రిసమస్త్రిషు చోన్నతః**
**త్రితామ్రస్త్రిషు చ స్నిగ్ధో గంభీరస్త్రిషు నిత్యశః**

వక్షస్థలము, మణికట్టు, పిడికిలి – ఈ మూడు స్థానములు దృఢముగా గలవాడు (ఇవి రాజ లక్షణములు). దీర్ఘములైన కనుబొమలు, బాహువులు, ముష్కములు గలవాడు (ఇవి సంపన్నుల లక్షణములు). తల వెంట్రుకలు, ముష్కములు, మోకాళ్ళు – ఈ మూడును సమప్రమాణమున గలవాడు (ఇవి రాజ లక్షణములు). ఉన్నతమైన నాభి, పొట్ట (కుక్షి), వక్షస్థలము గలవాడు (ఇవియు రాజలక్షణములు). ఎఱ్ఱని నేత్రాంతములు, నఖములు, అఱచేతులు, అఱికాళ్ళు గలవాడు. (ఇవి సుఖపురుషుని లక్షణములు). నునుపైన పాదరేఖలు, కేశములు, లింగమణియు గలవాడు (ఇవి భాగ్యవంతుని లక్షణములు). ఆయన కంఠస్వరము, నడక, నాభి గంభీరములైనవి (ఇవి ప్రశంసాపాత్రుని లక్షణములు)

**త్రివలీవాం స్త్ర్యవనతః చతుర్వ్యంగ స్త్రిశీర్షవాన్**
**చతుష్కలశ్చతుర్లేఖః చతుష్కిష్కుశ్చతుస్సమః**

శ్రీరాముని ఉదరముపై లేక కంఠమునందు త్రిరేఖలు గలవు (మూడు ముడుతలు గలవాడు). స్తనములు, స్తనాగ్రములు, పాదరేఖలు నిమ్నముగానుండును. ఆయన కంఠము, లింగము, వీపు, పిక్కలు హ్రస్వములుగా నుండును (ఇవి పూజ్యుని లక్షణములు). శిరస్సుపై మూడు సుడులు గలవాడు (ఇవి మహారాజు లక్షణము). నాలుగు వేదములను సూచించు రేఖలు గలవాడు. అనగా బొటనవ్రేలి మొదటను, నొసటిపైనను, అఱచేతులలోను, అఱికాళ్ళలోని నాలుగేసి రేఖలు గలవు (ఇవి వేదపారంగతుని లక్షణము). లలాట, పాద, పాణి తలములయందు నాలుగు రేఖలు గలవాడు (ఇవి ఆయుర్దాయమును, మహారాజు లక్షణమును సూచించును). అతడు తొంబదియారు అంగుళముల (నాలుగు మూరల) ఎత్తైనవాడు. దేవతాసమానుడు (ఇవి దివ్యపురుషుని లక్షణములు). ఆయన బాహువులు, మోకాళ్ళు, ఊరువులు, పిక్కలు అనునవి (నాల్గును) హెచ్చుతగ్గులు లేకుండా సమముగానుండువాడు.

**చతుర్దశ సమద్వంద్వః చతుర్దంష్ట్రశ్చతుర్గతిః**
**మహోష్ఠ హనునాసశ్చ పంచస్నిగ్ధోఽష్టవంశవాన్**

పదునాలుగు జతలు అనగా కనుబొమలు, నాసికాపుటములు, నేత్రములు, చెవులు, పెదవులు, స్తనాగ్రములు, మోచేతులు, మణికట్టులు, మోకాళ్ళు, ముష్కములు, పిఱుదులు, చేతులు, పాదములు, పిఱుదులపై ఎత్తైన కండరములు సమప్రమాణములో గలవాడు (ఇవి రాజలక్షణములు). అతడు నాలుగు దంష్ట్రలు (సూదివలె మొనదేలిన

దంతములు) కలవాడు. (రెండు పలువరసలలో మధ్యగల నాలుగు దంతములకును ప్రక్కన ఉన్న నాలుగు పండ్లకును 'దంష్ట్రలు' అను పేరు ప్రసిద్ధము). నాలుగు మృగముల (సింహము, పెద్దపులి, ఏనుగు, వృషభము) నడకవంటి నడక గలవాడు. అందమైన పెదవులు, చుబుకము, నాసిక గలవాడు (ఇవి రాజలక్షణములు). ఓ దేవీ! ఆ రాముడు నిగనిగలాడు నేత్రములు, పలువరుస, చర్మము, పాదములు, కేశములు గలవాడు (ఇవి సుఖపురుషుని లక్షణము). జానకీ! ఆయన శరీరము, చేతివ్రేళ్ళు, కాలివ్రేళ్ళు, కరములు, నాసిక, నయనములు, కర్ణములు, ప్రజనము అను అష్టవంశములు తగిన ప్రమాణములో గలవాడు.

**దశపద్మో దశబృహత్ త్రిభిర్వ్యాప్తో ద్విశుక్లవాన్**
**షడున్నతో నవతనుః త్రిభిర్వ్యాప్నోతి రాఘవః**

శ్రీరాముడు పద్మములవంటి ముఖము, నేత్రములు, నోరు, నాలుక, పెదవులు, దవడలు, స్తనములు, గోళ్ళు, హస్తములు, పాదములు గలవాడు. అతడు శ్రేష్ఠమైన శిరస్సు, లలాటము, చెవులు, కంఠము, వక్షము, హృదయము, నోరు, చేతులు, కాళ్ళు, వీపు అను పది అవయవములు గలవాడు. ఆ శ్రీరాముని తేజస్సు, యశస్సు, సంపదలు సర్వలోక ప్రసిద్ధములు. పవిత్రములైన మాతృ, పితృ వంశములు గలవాడు. మరియు స్వచ్ఛములైన దంతములు, నేత్రములు గలవాడు. చంకలు, ఉదరము, వక్షఃస్థలము, నాసిక, భుజములు, లలాటము అను ఉన్నతములైన ఆరు అంగములు గలవాడు. సూక్ష్మములైన వ్రేళ్ళ కణుపులు, వెండ్రుకలు, రోమములు, గోళ్ళు, చర్మము, లింగము, మీసము, దృష్టి, బుద్ధి గలవాడు. పూర్వాహ్ణము, మధ్యాహ్నము, అపరాహ్ణము అను త్రికాలములయందును ధర్మార్థకామములను ఆచరించుచుండువాడు.

**సత్యధర్మ పరశ్శ్రీమాన్ సంగ్రహానుగ్రహేరతః**
**దేశకాల విభాగజ్ఞః సర్వలోక ప్రియంవద**

ఆ శ్రీరాముడు సకలైశ్వర్య సంపన్నుడు. సత్యభాషణమునందును, ధర్మాచరణమునందును నిరతుడు. ధర్మమార్గమున ధనమునార్జించి, పాత్రులకు దానము చేయువాడు. దేశకాలములకు అనువుగా ప్రవర్తించువాడు. అందరితోడను ప్రియముగా మాట్లాడెడివాడు.

**భ్రాతా చ తస్య ద్వైమాత్ర స్సౌమిత్రి రపరాజితః**
**అనురాగేణ రూపేణ గుణైశ్చైవ తథావిధః**
**స సువర్ణచ్ఛవిః శ్రీమాన్ రామశ్శ్యామో మహాయశాః**
**తావు భౌ నరశార్దూలౌ త్వద్దర్శన సముత్సకౌ**

శ్రీరాముని సోదరుడైన లక్ష్మణుడు ఇద్దరు తల్లుల (కౌసల్యా సుమిత్రల) ముద్దుల కొడుకు. అతడు అనురాగము చేతను, రూపగుణముల చేతను పూర్తిగా రామునివంటివాడే. అతడు సాటిలేని వీరుడు. వాసికెక్కిన శ్రీరాముడు మేఘశ్యాముడు. లక్ష్మణుడేమో బంగారువన్నెవాడు. ఆ పురుషశ్రేష్ఠులిరువురు నిన్ను చూడవలెనని కుతూహలపడుచున్నారు.